సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 33

శుక్రవారం 25-4-2025



'తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



ప్రాణాలు కాపాడిన ఉప్ప


పహల్గాం ఉగ్రదాడిలో 'ఉప్ప' కొందరి ప్రాణాలను కాపాడింది. - 15లో



బెంగళూరు చిందు

హోం గ్రౌండ్‌లో ఆర్‌సీబీకి తొలి విజయం. రాణించిన హాజల్‌వుడ్, కోహ్లి. - 17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఈసారి 'లెక్క' వేరు

లెక్కల పుస్తకం మారబోతోంది. 1 నుంచి 9 తరగతుల గణితంలో కొత్త చాప్టర్స్‌తో ఎస్‌సీఈఆర్‌టీ ఇప్పటికే సిలబస్ తయారుచేసింది.

- వివరాలు 2లో

ఐఐటీల్లో సీట్లు పెరుగుతున్నాయ్!

ఐఐటీల్లో సీట్లు పెరగబోతున్నాయి. గరిష్టంగా 500 వరకూ సీట్లు పెంచే చాన్స్ ఉన్నట్టు సంబంధిత అధికార వర్గాలు చెప్పాయి.

- వివరాలు 5లో



వడదెబ్బకు ఏడుగురు బలి

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బతో ఏడుగురు ప్రాణాలు వదిలారు.

- వివరాలు 7లో



ఏడురోజుల లాభాలకు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్ ఏడు రోజుల ర్యాలీ నేపథ్యంలో గురువారం గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.

- వివరాలు 17లో

యుద్ధమేఘాలు!

పాకిస్తాన్‌తో తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు



అది కచ్చితంగా యుద్ధ ప్రకటనే.. సింధు జలాల నిలిపివేతపై పాక్ వ్యాఖ్య

సరిహద్దుల్లో భారీగా మోహరింపులు

భారత్‌కు గగనతలం మూసివేత

రాష్ట్రపతితో అమిత్ షా కీలక భేటీ

అతి త్వరలో 'నిర్ణాయక చర్యలు'?

ప్రధాని హెచ్చరికల సారాంశమూ అదే!

ముష్కరుల్ని వెంటాడి మట్టిలో కలిపేస్తాం

ఊహకందని రీతిలో ప్రతీకారం: మోదీ

పాక్ నుంచి తక్షణం వచ్చేయండి

భారతీయులకు కేంద్రం అడ్వైజరీ

వైమానిక విన్యాసాలు.. యుద్ధనౌకల కదలికలు

- సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాక్ నడుమ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుతున్నాయి. తనకు జీవనాడి వంటి సింధు జలాల ఒప్పందం సస్పెన్షన్‌పై పాక్ గంగవెర్రులెత్తిపోయింది. ఇది తమపై నేరుగా యుద్ధ ప్రకటనేనంటూ గగ్గోలు పెట్టింది. ప్రతీకారంగా నామమాత్రపు సిమ్లా ఒప్పందాన్ని సస్పెండ్ చేసి అక్కసు తీర్చుకుంది. భారత్‌కు తన గగనతలాన్ని మూసేయడమే గాక వాణిజ్య సంబంధాలను పూర్తిగా తెంచుకుంటున్నట్టు ప్రకటించింది. ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధమంటూ బీరాలు

మిగతా 2వ పేజీలో ▶

- మరిన్ని వార్తలు 6లో

పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవు

బీసీసీఐ పునరుద్ఘాటన - 17లో



క్వాలిటీ కంట్రోల్ ఫెయిల్!

అందుకే మేడిగడ్డ బరాజ్ కుంగింది

సికెంట్ పైల్స్ నిర్మాణంలో లోపంతోనే బుంగలు ఏర్పడి బరాజ్ కుంగింది

మరెన్నో బుంగలు ఏర్పడి ఉండొచ్చు.. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగొచ్చు

సైట్ పరిశోధనలు, డిజైన్లు, నిర్మాణం, పర్యవేక్షణ అంతా లోపభూయిష్టం

అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం ఇదే తరహాలో లోపాలు

3 బరాజ్‌లపై అధ్యయనం చేయాలి

ఎన్డీఎస్ఏ తుది నివేదికలో స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో నాణ్యత పర్యవేక్షణ కొరవడటంతోనే 7వ బ్లాక్ కుంగిపోయిందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తేల్చింది. బరాజ్ పునాదుల(ర్యాఫ్ట్) కింద సికెంట్ పైల్స్‌ను నీళ్లను నిలువరించేలా నిర్మించడంలో విఫలమైనట్టు నిర్ధారించింది. దీంతో ఇసుక భారీగా కొట్టుకుపోయి పునాదుల కింద పెద్దపరిమాణంలో బుంగలు ఏర్పడ్డాయని నిర్ధారించింది. బరాజ్‌కి ఎగువన 20–21 పియర్ల మధ్య ఏర్పడిన భారీ గుంత, 17వ పియర్‌కి దిగువన ఏర్పడిన గుంతలే దీనికి సంకేతమని స్పష్టం చేసింది. సికెంట్ పైల్స్(కటాఫ్ వాల్స్) విఫలం కావడంతోనే మేడిగడ్డ బరాజ్ కుంగిందని పేర్కొంది. బరాజ్‌లో ఇలాంటి బుంగలు

మిగతా 2వ పేజీలో ▶

'భూదాన్'పై సీబీఐ విచారణ!



భూకబ్జా, అక్రమాలపై దర్యాప్తునకు సన్నద్ధత తెలియజేయాలని హైకోర్టు ఆదేశం

ఆరోపణలున్న వారంతా కీలక బాధ్యతల్లోని ఉన్నతాధికారులే..

అందుకే నాగారంలోని ఆ సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో పెడుతున్నాం

తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఆ భూములను బదిలీ చేయొద్దు

ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నాం

పిటిషన్ ఉపసంహరణకు రిజిస్ట్రీ అంగీకరించొద్దు

ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు

విచారణ జూన్ 12కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూముల కబ్జా, అక్రమాలపై దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేల్చడానికి సీబీఐ విచారణ జరిపించాలని హైకోర్టు నిర్ణయించింది. దీనికి సన్నద్ధంగా ఉన్నారా? లేరా? అనే దానిపై వైఖరిని తెలియజేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా కీలక స్థానాల్లోని ఉన్నతాధికారులని, వారిపై ఆరోపణలు కూడా అంతే తీవ్రంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. తీర్పు వెలువడే వరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని అధికారులకు స్పష్టం చేసింది. తమ ముందున్న పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అధికారాన్ని రాజ్యాంగం కల్పించిందని, ఆ మేరకు ఆర్టికల్ 226ను వినియోగించుకుని ఈ ఆదేశాలు ఇస్తున్నామని తేల్చిచెప్పింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఆ భూములను విక్రయించడం, బదిలీ చేయడం సహా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ప్రతివాదులకు స్పష్టం చేసింది. అదీగాక, ఆరోపణల తీవ్రత దృష్ట్యా పిటిషన్ ఉపసంహరించుకునే అవకాశాన్ని పిటిషనర్‌కు ఇవ్వడం లేదని పేర్కొంది. ఒకవేళ పిటిషనర్ ఉపసంహరించుకోవాలని భావించినా అనుమతించవద్దని రిజిస్ట్రీని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

భూకబ్జాలో 26 మంది ఉన్నతాధికారులు: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూ కబ్జాలపై

మిగతా 8వ పేజీలో ▶

ప్రపంచానికి మోడల్‌గా తెలంగాణను చూపుతాం



- 'భారత్ సమ్మిట్–2025' నిర్వహణపై మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి సదస్సులో ప్రత్యేకంగా వివరిస్తామని వెల్లడి
- మంత్రి ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష - 8లో

'సీతారామ'కు టీఏసీ క్లియరెన్స్

- అనుమతులు జారీ చేయాలని నిర్ణయం
- అపెక్స్ కౌన్సిల్ అనుమతి లభిస్తే అనుమతులన్నీ లభించినట్టే
- 67.05 టీఎంసీల గోదావరి జలాల వాడకానికి మార్గం సుగమం.. భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సాగు, తాగునీరు - 2లో

సెలవుల సంతోషం.. వీరికి దూరం

- గురువారం నుంచి గురుకులాలు, కేజీబీవీలకు సెలవులు
- తమ తోటి పిల్లలను తల్లిదండ్రులు తీసుకెళ్తుంటే తల్లడిల్లిన విధి వంచితులు
- కంటతడి పెడుతూ బాలసదన్‌లకు వెళ్లిన వైనం
- పలుచోట్ల ఇవే దయనీయ దృశ్యాలు - 18లో

కేసీఆర్‌ను చూడ్డానికి జనం వస్తారు: దానం



- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. 'కేసీఆర్‌ని చూడాలని చాలారోజులుగా ప్రజలు నిరీక్షిస్తున్నారు. కాబట్టి ఆయనను చూసేందుకు జనం భారీగా వస్తారనుకుంటున్నా' అని ఆయన అన్నారు.

- వివరాలు 8లో


ఈసారి లెక్క వేరు

1-9వ తరగతి వరకూ గణితం పుస్తకంలో మార్పులు

ఏఐ మేళవింపుతో పాఠ్యాంశాలు

టీచర్లకు ముందే శిక్షణ.. బోధనలో క్రమశిక్షణ

సాక్షి, హైదరాబాద్: లెక్కల పుస్తకం మారబోతోంది. 2025-26 విద్యా సంవత్సరం నుంచే 1 నుంచి 9 తరగతుల వరకు గణితంలో కొత్త చాప్టర్స్ రాబోతున్నాయి. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ (ఎస్సీఈఆర్టీ) ఇప్పటికే సిలబస్ తయారు చేసింది. తాజా పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశామని అధికారులు తెలిపారు. మార్పులు చేసిన చాప్టర్ల బ్లూ ప్రింట్‌ను అధికారులు అనేక కోణాల్లో పరిశీలించారు. పారిశ్రామిక, విద్యావేత్తలతో చర్చించారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలూ తీసుకున్నారు. అయితే, పాఠ్యాంశాలు కఠినంగా ఉండొద్దని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. ఈ అంశాన్ని పరిగణనలోనికి తీసుకొని స్వల్ప మార్పులు చేశారు. మారిన చాప్టర్లతో పాఠ్యపుస్తకాలు పంపిణీ అవుతాయని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



ఏఐ లాంగ్వేజ్‌కు ప్రాధాన్యం

గణితంలో అనేక చాప్టర్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడిస్తున్నారు. ఇప్పటికీ గణితంలో మూస పద్ధతిలోనే లెక్కలుంటాయి. ఆల్‌జీబ్రా అర్థం కాని విద్యార్థులూ ఉన్నారు. ఇందులో కొన్ని లెక్కలు సూత్రాలతో మిళితమై ఉంటాయి. వాస్తవానికి ఈ తరహా సూత్రాల వాడకం పూర్తిగా మారిపోయింది. ఏఐ ఆధారిత టెక్నాలజీ గణిత శాస్త్ర పునాదిని నిర్దేశిస్తోంది. ఈ కారణంగా లెర్నింగ్ మాడ్యూల్స్‌లో కీలకమైన లెక్కలను ఏఐ పరిధిలోకి తెస్తున్నారు. ఇది విద్యార్థుల ఆసక్తిని పెంచుతుందని అధికారులు చెబుతున్నారు. సూత్రాల స్థానంలో ఏఐ భాష నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక కోడింగ్ ఉండబోతోంది. ప్రాథమిక తరగతుల్లో సాధారణ భాషగా, ఏఐ లెక్కలు ఉంటాయని అధికారులు తెలిపారు. 7 నుంచి 9వ తరగతికి వచ్చే సరికి విద్యార్థి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన క్యాలిక్యులేషన్స్‌ను చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు విద్యార్థి ఏఐ టెక్నాలజీలో వాడే భాషకు సంబంధించిన సైద్ధాంతిక గణిత విభాగాన్ని పరిచయం చేస్తారు. దీనివల్ల ఇంజనీరింగ్‌కు వచ్చే నాటికి విద్యార్థికి ఏఐపై పూర్తి అవగాహన వస్తుందని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

టీచర్లకు శిక్షణ.. క్యూఆర్ కోడ్ తప్పనిసరి

ఏఐపై ముందుగా టీచర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. రాష్ట్రస్థాయిలో కోఆర్డినేటర్లను ఎంపిక చేసి ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ నిపుణులను ఇందులో భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. మారిన సిలబస్‌లో ఏఐ లెక్కల తీరు, వాటిని అర్థం చేసుకునే విధానం, క్యాలిక్యులేషన్‌లో సరైన జవాబు రాబట్టే తీరును ఈ శిక్షణలో బోధిస్తారు. ముఖ్యంగా మేథ్స్ టీచర్లకు ముందుగా శిక్షణ ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్ స్థాయిలో కీలకమైన లాంగ్వేజ్ మాడ్యూల్స్‌ను నేర్పిస్తారు. వీరంతా పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి టీచర్ల వరకూ శిక్షణ ఇవ్వాలని ప్రతిపాదించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యపుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను ప్రవేశ పెడుతున్నారు. పుస్తకాలు ఇతర మార్గాల్లోకి పక్కదారి పట్టకుండా ఈ విధానం అనుసరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పుస్తకం పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

మాల్ పంచాయతీకి ఆత్మనిర్భర్ అవార్డు

ప్రదానం చేసిన ప్రధాని మోదీ



ప్రధాని మోదీ నుంచి అవార్డు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి రాజు

యాచారం: రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు గురువారం ప్రధాని నరేంద్ర మోదీ నుంచి జాతీయ అవార్డు అందుకున్నారు. బిహార్ రాష్ట్రంలోని మధుబన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మాల్ పంచాయతీకి రూ.కోటి పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పీజీ వైద్య కోర్సులకు సెల్ఫ్ డిక్లరేషన్

వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి కొత్త పోస్ట్-గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సులు ప్రారంభించేందుకు చేసుకున్న దరఖాస్తులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఫారాలను సమర్పించాలని జాతీయ వైద్య కమిషన్ ఆదేశించింది. ఇప్పటికే ఉన్న కళాశాలల్లో పీజీ/యూజీ సీట్ల సంఖ్యను పెంచడానికి దరఖాస్తు చేసినవారు కూడా.. సెల్ఫ్-డిక్లరేషన్ ఫారమ్‌ను సమర్పించాలని స్పష్టం చేసింది. ఈనెల 23న పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డ్ (పీజీఎంఈబీ) జారీ చేసిన పబ్లిక్ నోటీసు ప్రకారం, ఈ ఫారాన్ని.. ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో ఇచ్చిన లింక్ ద్వారా మే 9 సాయంత్రం 6 గంటలలోపు సమర్పించాల్సి ఉంటుంది. రూ.100 స్టాంప్ పేపర్‌పై నోటరీ ద్వారా ధ్రువీకరించిన అండర్‌టేకింగ్ లేదా అఫిడవిట్‌ను కూడా జత చేయాలి. ఈ సూచనలను అన్ని వైద్య కళాశాలలు కచ్చితంగా పాటించాలని ఎన్ఎంసీ కార్యదర్శి డాక్టర్ రాఘవ్ లాంగర్ కోరారు.

నల్లబ్యాడ్జీలతో నమాజ్‌కు వెళ్లండి: ఎంపీ అసదుద్దీన్



సాక్షి, హైదరాబాద్: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా యావత్ ముస్లింలందరూ శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో జుమ్మా నమాజ్ (ప్రార్థనలు) చేయడానికి వెళ్లాలని ఏఐఎంఐఎం అధి నేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు. గురువారం సోషల్ మీడియా ద్వారా వీడియో సందేశం విడుదల చేశారు. 'పహల్గాంలో ఉగ్రవాదులు అనేకమందిని బలిగొన్నారు. అనేక మందిని గాయపరిచారు. వారంతా ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నారు. ఈ ఉగ్రవాదం..దారుణదాడికి వ్యతిరేకంగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా ను. జుమ్మా నమాజ్ చేయడానికి వెళ్లేటప్పుడు మీ చేతులకు నల్ల బ్యాడ్జెట్ కట్టుకొని వెళ్లండి. తద్వారా మనం కలిసి ఒక సందేశాన్ని ఇవ్వగలం. మనదేశ శాంతి, ఏకత్వాన్ని బలహీనపరచడానికి విదేశీ శక్తులను అనుమతించేది లేదు. మన సోదరులను లక్ష్యంగా చేసుకొని విదేశీ శక్తులు దాడి చేశాయి. శత్రువుల ఉచ్చులో చిక్కుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను'అని పేర్కొన్నారు.

ఉగ్రదాడి దారుణం: పీఎస్‌యూ

సాక్షి, హైదరాబాద్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా.. శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'సీతారామ'కు టీఏసీ క్లియరెన్స్

అనుమతులు జారీ చేయాలని నిర్ణయం

- అపెక్స్ కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే.. అనుమతులన్నీ లభించినట్టే
- 67.05 టీఎంసీల గోదావరి జలాల వాడకానికి మార్గం సుగమం
- భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సాగు, తాగునీరు



సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులు జారీ చేయాలని కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) చెందిన టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) నిర్ణయం తీసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన 158వ టీఏసీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం జరిగింది. దీంతో త్వరలో టీఏసీ అనుమతులు జారీ కానున్నాయి. టీఏసీ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ ముఖేష్‌కుమార్ సిన్హా, రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, కొత్తగూడెం ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సుబ్రమణ్యం, అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం ఎస్ఈ ఎస్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతులన్నీ లభించినట్టే...

సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఇప్పటికే సీడబ్ల్యూసీలోని డైరెక్టరేట్లన్నీ క్లియరెన్స్ ఇచ్చాయి. డీపీఆర్‌ల పరిశీలన కోసం కేంద్ర జలశక్తి శాఖ గతంలో జారీచేసిన 'ఫ్లో చార్ట్'ప్రకారం గోదావరి బోర్డుకు పంపించారు. ఆ డీపీఆర్‌ను బోర్డు పరిశీలించి, ఏపీ అభ్యంతరాలు/అభిప్రాయాలు జతచేసి, టీఏసీ క్లియరెన్స్ కోసం సీడబ్ల్యూసీకి పంపించింది. గత ఫిబ్రవరి 11న జరిగిన 157వ టీఏసీ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులపై చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ కుంగిపోవటానికి డిజైన్ల లోపం కూడా ఒక కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) తుది నివేదిక ఇచ్చిన నేపథ్యంలో 'సీతారామ'ప్రాజెక్టు డిజైన్లను సీడబ్ల్యూసీతో పునఃపరిశీలన చేయించాలని ఆ సమావేశంలో టీఏసీ నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల జారీ ప్రక్రియ పురోగతిలో ఉందని తాజా సమావేశంలో రాష్ట్ర అధికారులు టీఏసీకి వివరించారు. ప్రాజెక్టు కింద ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. బరాజ్ డిజైన్లు సైతం సవ్యంగానే ఉన్నట్టు సీడబ్ల్యూసీ ధ్రువీకరించడంతో ప్రాజెక్టుకి అనుమతి కోసం సిఫారసు చేయాలని టీఏసీ నిర్ణయం తీసుకుంది. టీఏసీ క్లియరెన్స్ వచ్చాక, అపెక్స్ కౌన్సిల్ అనుమతి రావాల్సి ఉంటుంది. అది లభిస్తే ప్రాజెక్టుకు అన్ని అనుమతులు లభించినట్టు అవుతుంది. అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగితే అనుమతులు లాంఛనమే.

మంత్రి ఉత్తమ్ చొరవ అభినందనీయం

సీతారామ ప్రాజెక్టుకు టీఏసీ అనుమతుల సాధన కోసం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇటీవల ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీని కలిసి సత్వరం అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు అనుమతుల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంతో కృషిచేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రశంసించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగు, తాగు నీరందించే సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు 67 టీఎంసీలను కేటాయిస్తూ కేంద్రం అధికారికంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయని ఆనందం వ్యక్తంచేశారు. టీఏసీ అనుమతులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

67.05 టీఎంసీల గోదావరి జలాలపై హక్కు

గత ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 18వ తేదీన రూ.7,926.14 కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టుకు పరిపాలన అనుమతులు ఇవ్వగా, 2018 ఆగస్టులో రూ.13,057 కోట్లకు అంచనాలను సవరించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా 67.05 టీఎంసీల గోదావరి జలాలను తరలించి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 7.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 757 మెగావాట్ల మోటార్ల సామర్థ్యంతో 11 పంప్‌హౌజ్‌లు, 36.57 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో సీతమ్మసాగర్ బరాజ్‌ను నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయితే సాగర్, పాలేరు, వైరా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి కొరత సైతం తీరనుంది. ఇప్పటివరకు రూ.11,320 కోట్ల వ్యయంతో 57 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పథకాన్ని 2026 నాటికి పూర్తిచేసి రబీ పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది.

క్వాలిటీ కంట్రోల్ ఫెయిల్!

▶ మొదటి పేజీ తరువాయి

మరిన్ని ఉండటానికి ఆస్కారముందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగవచ్చని హెచ్చరించింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల సికెంట్ పైల్స్ నిర్మాణంలో సైతం ఇదే తరహా వైఫల్యాలున్నట్టు గుర్తించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యాలపై సుదీర్ఘ అధ్యయనం అనంతరం కమిటీ రూపొందించిన తుది నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మేడిగడ్డ బరాజ్ డిజైన్లు, నిర్మాణాన్ని పరీక్షించాక ఎన్నో లోపాలను గుర్తించినట్టు కమిటీ తెలిపింది. నిర్మాణానికి ముందు నిర్వహించిన సైట్ పరిశోధనలు, మోడల్ స్టడీస్, హైడ్రాలిక్, స్ట్రక్చరల్ అండ్ జియోటెక్నికల్ డిజైన్, నిర్మాణం, నాణ్యత పర్యవేక్షణ, నిర్వహణ, పర్యవేక్షణతోపాటు బరాజ్ రక్షణకి సంబంధించిన అంశాల్లో లోపాలున్నట్టు నిర్ధారించింది.

రెండు నెలల కిందే కేంద్రానికి నివేదిక

నిర్మాణ లోపాలకు తోడుగా బరాజ్ కింద బుంగలు ఏర్పడి ఇసుక కొట్టుకుపోవడం, దిగువ ప్రాంతంలోని అప్రాన్ సీసీ బ్లాకులు కొట్టుకుపోవడంతో 7వ బ్లాక్ కుంగిపోయి బరాజ్ పూర్తిగా నిరుపయోగంగా మారిందని కమిటీ స్పష్టం చేసింది. బరాజ్‌లోని ఇతర బ్లాకుల్లో సైతం ఇలాంటి లోపాలే ఉండవచ్చని అంచనా వేసింది. మేడిగడ్డ తరహాలోనే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణంలో లోపాలుండటం, సమస్యలు ఉత్పన్నం కావడంతో అవి కూడా దుర్బల స్థితిలో ఉన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో మూడు బరాజ్‌లపై అన్ని కోణాల్లో సమగ్ర అధ్యయనం జరపాలని సిఫారసు చేసింది. బరాజ్‌లపై జరిపే పరీక్షలు, పరిశోధనల ఆధారంగా వాటి పునరుద్ధరణకు ప్రణాళికలు, డిజైన్లను రూపొందించి అమలు చేయాలని కోరింది. ఎన్డీఎస్ఏ తుది నివేదికను రెండు నెలల కిందే కేంద్రానికి సమర్పించగా, గురువారం మీడియాకి అందింది.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- ఎలాంటి సైట్ ఇన్వెస్టిగేషన్లు నిర్వహించకుండానే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల లోకేషన్లు మార్చాలని హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకుందని నిపుణుల కమిటీ తప్పుబట్టింది.
- మేడిగడ్డ బరాజ్ డిజైన్ల తయారీ, నిర్మాణం కోసం నిర్వహించిన జియోటెక్నికల్ పరీక్షలు.. పునాదుల కింద భూగర్భంలోని వైవిధ్యాన్ని తెలుసుకోవడానికి ఏ మాత్రం సరిపోవు.
- బరాజ్ 7వ బ్లాక్ కుంగడానికి కారణాలను విశ్లేషించడానికి 22 బోర్ రంధ్రాలు చేసి జియోటెక్నికల్ పరీక్షలను నిర్వహించాలని ఎన్డీఎస్ఏ ప్రతిపాదించగా, కేవలం 9 రంధ్రాలు చేసి పరీక్షలు చేశారు. దీంతో కమిటీకి అవసరమైన సమాచారం ఈ పరీక్షల ద్వారా లభించలేదు.
- ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ మూడు బరాజ్‌లను సందర్శించి చూడగా మూడింటిలోనూ గణనీయమైన రీతిలో నిర్మాణ లోపాలు కనిపించాయి.
- అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి సీపేజీ జరిగింది.
- బరాజ్‌లకి మరింత నష్టం జరగకుండా గత వర్షాకాలానికి ముందు తీసుకోవాల్సిన అత్యవసర చర్యలతోపాటు వైఫల్యాలను నిర్ధారించడానికి జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించాలని కమిటీ సిఫారసు చేయగా, వాటిని తగిన రీతిలో చేయడంలో నీటిపారుదల శాఖ విఫలమైంది.
- అధ్యయన పరీక్షలకు ముందే మేడిగడ్డ బరాజ్ పునాదులకు బోర్‌హోల్ రంధ్రాలు చేసి గ్రౌటింగ్‌తో బుంగలను మూసివేయడంతో వైఫల్యానికి కారణాలు తెలిపే సాక్ష్యాధారాలకు నష్టం జరిగింది.

మేడిగడ్డ 7వ బ్లాక్ తొలగించాలి

మేడిగడ్డ బరాజ్‌లో కుంగిపోయిన 7వ బ్లాక్‌ను పక్కనే ఉన్న ఇతర బ్లాకులకు నష్టం జరగకుండా అత్యంత జాగ్రత్తగా తొలగించాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సిఫారసు చేసింది. సాధ్యం కాని పక్షంలో 7వ బ్లాకు స్థిరంగా ఉండేలా పటిష్టపరచాలని సూచించింది. రెండింటిలో ఏ నిర్ణయం తీసుకున్నా పక్కన ఉన్న ఇతర బ్లాకులకు నష్టం జరగకుండా చూడాలని చెప్పింది.

యుద్ధమేఘాలు

▶ మొదటి పేజీ తరువాయి



గురువారం శ్రీనగర్‌లోని మార్కెట్ ప్రాంతంలో భద్రతా దళాల గస్తీ

పలికింది. ఎడాపెడా క్షిపణి పరీక్షలకు రంగం సిద్ధం చేసుకుంటోంది. సరిహద్దుల వెంబడి సైనిక మోహరింపులను కూడా యుద్ధ ప్రాతిపదికన భారీగా పెంచేస్తోంది. మరోవైపు దాయాది ఎన్నటికీ మర్చిపోలేని రీతిలో 'నిర్ణాయక చర్య'లకు కేంద్రం సిద్ధమవుతున్నట్టు సంకేతాలు వెలువడుతున్నాయి. గురువారం చోటుచేసుకున్న పలు కీలక పరిణా మా లు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్ మధ్యాహ్నం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. తాజా పరిస్థితిని వివరించడంతో పాటు పలు 'ఇతర' అంశాలపైనా చర్చించినట్టు చెబుతున్నారు. ప్రధాని మోదీ కూడా పహల్గాం ముష్కరులకు బహిరంగంగా తీవ్ర హెచ్చరికలు చేశారు. ''ఎక్కడ దాక్కున్నా ప్రపంచపు అంచుల దాకా వెంటాడి మరీ వాళ్లను మట్టిలో కలిపేస్తాం. వారికి దన్నుగా నిలిచిన దుష్టశక్తినీ కఠినంగా శిక్షిస్తాం. కలలోనైనా ఊహించలేని స్థాయిలో ప్రతీకారం తీర్చుకు ని తీరతాం'' అంటూ ప్రతినబూనారు. తర్వాత కా సేపటికే 'ఆక్రమణ్' పేరిట సైన్యం భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించింది. అత్యాధునిక రఫేల్‌తో పాటు సుఖోయ్ తదితర యుద్ధ విమానాలు ఇందులో పాల్గొన్నాయి. మరోవైపు పాక్‌లో ఉన్న భారతీయులు తక్షణం తిరిగి రావాలంటూ కేంద్రం అడ్వైజరీ జారీ చేసింది. పొరుగు దేశాన్ని అంతర్జాతీయ వేదికలపై ఏకాకిని చేయడమే గాక దానిపై తీసుకోబోయే 'కఠిన' చర్యలకు జీ20 తదితర దేశాల మద్దతు కూడగడుతోంది. పహల్గాం ఆటవిక దాడి, అందులో పాక్ ముష్కరులు పాల్గొన్న వైనం తదితరాలను జీ20 సభ్య దేశాల రాయబారులకు విదేశాంగ శాఖ పూసగుచ్చినట్టు వివరించింది. భేటీకి హాజరైన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాల రాయబారులు దాడిని తీవ్రంగా ఖండించాయి. పాక్‌కు కరుడుగట్టిన మద్దతుదారైన చైనా కూడా భేటీలో పాల్గొనడమే గాక భారత్‌కు మద్దతు పలకడం విశేషం. మరోవైపు పహల్గాం దాడి, తదనంతర పరిస్థితులను కాంగ్రెస్ తదితర పార్టీలన్నింటితో కేంద్రం పంచుకుంది. ఉగ్ర తండాలను శాశ్వతంగా నిర్మూలించి తీరాల్సిందేనని పార్టీలన్నీ ముక్త కంఠంతో అభిప్రాయపడ్డాయి. అందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నా అండగా నిలుస్తామని అఖిలపక్ష భేటీలో ప్రకటించాయి. అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణులతో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, దానికి తోడుగా యుద్ధనౌక ఐఎన్ఎస్ సూరత్ పాక్ దిశగా కదులుతున్నట్టు సమాచారం.

రెస్క్యూ ఆపరేషన్‌కు బ్రేక్

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యల నిలుపుదల

- చివరి 50 మీటర్లు అత్యంత ప్రమాదకరంగా ఉండటమే కారణం
- మృతదేహాలు లభించని ఆరుగురి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం
- టెక్నికల్ కమిటీ సమావేశంలో నిర్ణయాలు



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కూలిన ఘటనలో గల్లంతైన కార్మికుల జాడ కోసం నిర్వహిస్తున్న సహాయక చర్యలను ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేయనుంది. ఇన్‌లెట్ వైపు నుంచి 13.93 కి.మీ. సొరంగంలో చివరి వరకు వెళ్లిన కార్మికులపై గత ఫిబ్రవరి 22న పైకప్పు కూలడంతో 8 మంది గల్లంతు కాగా, ఇప్పటి వరకు ఇద్దరి మృతదేహాలను మాత్రమే వెలికితీశారు. రెవెన్యూ శాఖ(విపత్తులు) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ అధ్యక్షతన గురువారం జలసౌధలో సమావేశమైన టెక్నికల్ కమిటీ సహాయక చర్యలపై సమీక్షించింది. చివరి 50 మీటర్ల ప్రాంతం మినహా సొరంగంలోని ఇతర ప్రాంతాల్లో పైకప్పు కూలడంతో పడిన మట్టి, బండరాళ్లు, ఇనుప తుక్కును తొలగించి అన్వేషించినా గల్లంతైన వారి జాడ తెలియరాలేదు. చివరి 50 మీటర్లు అత్యంత ప్రమాదకరంగా ఉందని, ఈ ప్రాంతంలో సహాయక చర్యలను కొనసాగిస్తే మళ్లీ పైకప్పు కూలవచ్చని నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఈ సమావేశంలో చెప్పారు. దీంతో సహాయక చర్యలకు ప్రస్తుతానికి బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించారు. సహాయక చర్యల విషయంలో ఏవిధంగా ముందుకెళ్లాలనే అంశంపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌కు చెందిన నిపుణులతో సబ్ కమిటీ వేసి అధ్యయనం జరిపించాలని నిర్ణయించారు. సైట్ స్పెసిఫిక్ రిపోర్టును తయారు చేయాలని కమిటీని కోరారు. కమిటీ నివేదిక ఆధారంగా సహాయక చర్యల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకోనున్నారు. నివేదిక ఇచ్చేందుకు కనీసం మూడు నెలల సమయం పట్టనుంది.

ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ ఉపసంహరణ

సహాయక చర్యల నుంచి ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ బలగాలను ఉపసంహరించాలని నిర్ణయించారు. దీంతో సైట్‌లో ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, రైల్వే బృందాలు మాత్రమే మిగలనున్నాయి. గల్లంతైన ఆరుగురు కార్మికుల ఆచూకీ తెలియకపోయినా వారి కుటుంబ సభ్యులకు సీఎం సహాయక నిధి కింద రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కూడా నిర్ణయించారు.

డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో...

సొరంగం ఇన్‌లెట్ వైపు నుంచి ఇకపై టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)కి బదులుగా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు జరపాలని టెక్నికల్ కమిటీ నిర్ణయించింది. సొరంగం కూలిన ప్రాంతం నుంచి తవ్వకాలను నిలుపుదల చేసిన మరో ప్రాంతం నుంచి బైపాస్ మార్గంలో సొరంగం తవ్వకాలను జరపాలని సిఫారసు చేసింది. అవుట్‌లెట్ వైపు నుంచి మాత్రం టీబీఎం ద్వారా తవ్వకాలను కొనసాగించడం సురక్షితమని భావిస్తున్నారు. సమావేశంలో అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

తలాక్-ఇ-బిద్దత్ మాత్రమే శిక్షార్హం

బాంబే హైకోర్టు స్పష్టీకరణ



ముంబై: సంప్రదాయ విడాకుల విధానం తలాక్-ఇ-అహ్సన్ చట్టబద్ధమైందేనని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. తలాక్-ఇ-బిద్దత్ లేదా ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ పద్ధతిపై మాత్రమే నిషేధం ఉందని పేర్కొంది. మాజీ భర్త, అత్తమామలపై ఓ మహిళ చేసిన ఫిర్యాదును కొట్టివేసింది. వేధింపులకు సంబంధించి ఎలాంటి కేసులు సైతం లేకున్నా ఇలాంటి ఫిర్యాదులు చేయడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని తేల్చింది. విడాకులకు సంబంధించిన అంశమే అయితే కేవలం భర్తపైనే ఫిర్యాదు చేయాలే తప్ప, అతడి తల్లిదండ్రులను కలపరాదంది. తక్షణం అమలయ్యే లేదా పునరుద్ధరించలేని తలాక్ విధానాలను మాత్రమే ముస్లిం మహిళల(వివాహ హక్కుల పరిరక్షణ)చట్టం రద్దు చేసిందని వివరిస్తూ జస్టిస్ విభా కంకన్‌వాడీ, జస్టిస్ సంజయ్ దేశ్‌ముఖ్‌లతో కూడిన ముంబై హైకోర్టు ఔరంగాబాద్ ధర్మాసనం తీర్పు వివరించింది. ఈ కేసులో ఈమెకు భర్త సాక్షుల సమక్షంలో తలాక్-ఇ-అహ్సన్ విధానంలో చట్టబద్ధంగానే విడాకులు ఇచ్చినట్లు రుజువైందని తెలిపింది.

ఇదండీ సంగతి




నీళ్లతో మనకేం పని!
మనం తాగేది రక్తం కదా!!

రుణం.. కాదిక సులభం!

దబ్బు అవసరం ఉంది.. సులభంగా వ్యక్తిగత రుణం తీసుకోవచ్చనుకుంటే కుదరదిక. రుణాల మంజూరులో ఆర్థిక సంస్థలు కాస్త కఠినంగా వ్యవహరిస్తున్నాయి. వ్యాపారాన్ని, వినియోగదార్ల సంఖ్యను పెంచుకోవడానికి గతంలో ఇబ్బడిముబ్బడిగా రుణాలు ఇచ్చిన సంస్థలు రూట్ మార్చాయి. మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో తాము ఇచ్చిన రుణాలు నిరర్థక ఆస్తులుగా (ఎన్‌పీఏ) మారకూడదని జాగ్రత్త పడుతున్నాయి. ఎన్‌పీఏల రిస్క్ నుంచి బయటపడేందుకు క్రెడిట్ స్కోర్‌ను నిక్కచ్చిగా పాటిస్తున్నాయి. ముప్పు తక్కువగా ఉన్న కస్టమర్లకే లోన్స్ మంజూరు చేస్తున్నాయి. మరికొన్ని రుణ సంస్థలు ఒక మెట్టు దిగినప్పటికీ వాహనాలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ విషయంలో తక్కువ మొత్తం మంజూరు చేయడం లేదా డౌన్‌పేమెంట్ అధికంగా వసూలు చేయడం లాంటివి చేస్తున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ముప్పు తక్కువగా ఉన్న కస్టమర్లకే రుణాల మంజూరు

- క్రెడిట్ హిస్టరీ లేనివారికి దూరంగా పరిశ్రమ
- రుణ మొత్తాన్నీ కుదించిన ఫిన్‌టెక్ కంపెనీలు
- కఠిన నిబంధనలు పాటిస్తున్న సంస్థలు

2024 డిసెంబర్ నాటికి భారత్‌లో రిటైల్ రుణాలు ఇలా..

	మొత్తం రుణాలు	రెండేళ్లలో వృద్ధి	కస్టమర్లు
పరిశ్రమ	రూ.1,26,48,000 కోట్లు	52%	27.8 కోట్లు
ఫిన్‌టెక్	రూ.1,30,000 కోట్లు	145%	2.33 కోట్లు



ఉద్గారాలకు ఇంధనం

సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్‌ఓ2), నైట్రోజన్ ఆక్సైడ్స్, అమోనియా వంటి వాయువుల వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోంది. 2022 లెక్కల ప్రకారం ఇంధన / విద్యుత్ రంగం, పరిశ్రమల నుంచే సల్ఫర్ డయాక్సైడ్ ఉద్గారాలు అధికంగా వస్తున్నాయి. కాగా మీథేన్, అమోనియా ఉద్గారాలు మాత్రం వ్యవసాయ రంగం నుంచి అత్యధికంగా వెలువడుతున్నాయి. రవాణా, ఇంధన / విద్యుత్ రంగం, పరిశ్రమల నుంచి నైట్రోజన్ ఆక్సైడ్స్ వస్తున్నాయి.

ఉద్గారాలు (లక్షల టన్నుల్లో)

రంగం	సల్ఫర్ డయాక్సైడ్	నైట్రోజన్ ఆక్సైడ్స్
ఇంధన/విద్యుత్	75.9	30.4
పరిశ్రమలు	31.5	11.6
భవనాలు	4.24	5.42
షిప్పింగ్	0.34	1.42
రవాణా	0.33	34.2
వ్యవసాయం	0.16	8.76

ఆధారం: అవర్ వరల్డ్ ఇన్ డేటా

కంపెనీల సేఫ్ గేమ్

క్రెడిట్ హిస్టరీ లేనివారు.. అంటే తొలిసారిగా రుణం తీసుకోవాలనుకునే వారిని కంపెనీలు అంత సులభంగా కనికరించడం లేదు. న్యూ టు క్రెడిట్ (ఎన్‌టీసీ) విభాగంలో రెండేళ్లలో లోన్ పొందిన కస్టమర్ల సంఖ్య 54.5% తగ్గిందంటే కంపెనీల సేఫ్ గేమ్‌ను అర్థం చేసుకోవచ్చు. క్రెడిట్ స్కోర్ 730లోపు ఉన్న వినియోగదార్లకు జారీ చేస్తున్న రుణాల సంఖ్య సైతం క్షీణించింది. రెండేళ్లలో వీరి వాటా 42 నుంచి 36 శాతానికి వచ్చింది. అదే సమయంలో 731 మించి క్రెడిట్ స్కోర్ ఉన్న కస్టమర్లు 58 నుంచి 64 శాతానికి చేరారు. అంతేకాదు ఏడాదిలో సగటు వ్యక్తిగత రుణ మొత్తాన్ని 2024 డిసెంబర్ నాటికి 20% తగ్గించి రూ.44,000కు చేర్చడం పరిస్థితికి అద్దం పడుతోంది. 2023 డిసెంబర్ నాటికి ఈ మొత్తం రూ.55,000 ఉండేది.

చిన్న రుణాల్లో ఫిన్‌టెక్ హవా

భారత్‌లో 2024 డిసెంబర్ నాటికి ఫిన్‌టెక్ కంపెనీలు మంజూరు చేసిన రుణాల మొత్తం రూ.1,30,000 కోట్లు. దేశంలోని మొత్తం రుణ పరిశ్రమలో ఫిన్‌టెక్ సంస్థల వాటా కేవలం 1.03 శాతమే. అయినా ఈ కంపెనీలు జారీ చేసిన రుణాలు ఏడాదిలో 32% వృద్ధిని నమోదు చేశాయి. రూ.50,000లోపు విలువ చేసే వ్యక్తిగత రుణాల్లో ఖాతాల సంఖ్య పరంగా ఫిన్‌టెక్ కంపెనీల వాటా ఏకంగా 89 శాతం ఉంది. ఇక ఫిన్‌టెక్‌లు ఇస్తున్న పర్సనల్ లోన్స్‌లో తక్కువ విలువ చేసే (రూ.50 వేల లోపు) ఖాతాలు 92 శాతం నమోదు చేశాయి. ఈ కంపెనీలు యువత లక్ష్యంగా మారుమూల పల్లెలకూ విస్తరించాయనడానికి ఈ అంకెలే నిదర్శనం. ఫిన్‌టెక్ సంస్థలు వినూత్న సాంకేతికతను ఉపయోగించి ఆన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ చెల్లింపులు, వ్యక్తుల నుంచి వ్యక్తులకు (పీర్–టు–పీర్ లెండింగ్) రుణాల వంటి సేవలను ఆఫర్ చేస్తున్నాయి.

క్రెడిట్ స్కోర్ వారీగా ఫిన్‌టెక్ కంపెనీల కస్టమర్ల సంఖ్య శాతాల్లో...



30 ఏళ్ల లోపు వయసు ఉన్న కస్టమర్లు

- మొత్తం పరిశ్రమలో 36%
- ఫిన్‌టెక్ రంగంలో 61%

క్లుప్తంగా...

ఈఏపీ సెట్ దరఖాస్తులు 3.06 లక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశానికి ఆలస్య రుసుముతో దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. ఇప్పటి వరకూ మొత్తం 306796 దరఖాస్తులు అందినట్టు ఈఏపీ సెట్ కో–కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 220049, అగ్రి, ఫార్మాకు 86493, రెండింటికీ 254 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఎస్సీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కార్యదర్శి అలగు వర్షిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ పరిధిలో 239 గురుకుల జూనియర్ కాలేజీలున్నాయని, ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, వొకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని, మే 15వ తేదీ వరకు గడువుందని వెల్లడించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.



జమ్మూకశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి, పొంగులేటి, సీతక్క, కోమటిరెడ్డి, దామోదర, ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి తదితరులు

భాషా శాస్త్రవేత్త బండి రామకృష్ణారెడ్డి కన్నుమూత



నాంపల్లి (హైదరాబాద్)/వెదురుకుప్పం: ప్రముఖ భాషా శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య బండి రామకృష్ణారెడ్డి (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. బుధవారం రాత్రి డీఆర్‌డీఏ సమీపంలోని అపోలో ఆస్పత్రిలో రామకృష్ణారెడ్డి తుదిశ్వాస విడిచినట్లు ఆయన మేనల్లుడు, యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యుడు డాక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి తెలిపారు. ఏపీలోని చిత్తూరు జిల్లా రెంటాలచేను గ్రామంలో జన్మించిన బండి రామకృష్ణారెడ్డి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ హిందీ, పూణేలోని దక్కన్ కాలేజీలో ఎం.ఏ భాషా శాస్త్రం చదివారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు అన్నామలై విశ్వవిద్యాలయం, సీఐఐఎల్ మైసూర్‌లో పనిచేశారు. ఆ తర్వాత కామన్వెల్త్ ఫెలోషిప్‌పై యూకే వెళ్లి ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అండర్సన్ కేస్ గ్రామర్‌పై పీహెచ్‌డీ పట్టా సాధించారు. 1977లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని భాషా శాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా చేరి తర్వాత ప్రొఫెసర్ అయ్యారు. 1990లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి అక్కడే భాషాభివృద్ధి విభాగానికి పీఠాధిపతిగా విధులు నిర్వర్తించారు. తర్వాత అదే విశ్వవిద్యాలయానికి వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గా సేవలందించారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయానికి వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గా సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది.

ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షునిగా జగదీశ్


జగదీశ్


శంకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉపాధ్యాయ పండిత్ పరిషత్తు (ఆర్‌యూపీపీటీఎస్) కొత్త అధ్యక్షునిగా సి.జగదీశ్, ప్రధాన కార్యదర్శిగా ములకనూరి శంకర్ ఎన్నికయ్యారు. సంఘం కార్యవర్గ సమావేశం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సంఘ నేతలు తెలిపారు. భాషా పండితులకు పదోన్నతులు ఇప్పించడమే తమ తక్షణ కర్తవ్యమని కొత్త అధ్యక్షుడు జగదీశ్ తెలిపారు.

మధుమేహుల కోసం 'స్మార్ట్ కుక్కర్'

డయాబెటిస్, ఊబకాయాన్ని దరిచేరనీయదు

- గ్లైసెమిక్ ఇండెక్స్‌కు చెక్ పెట్టే అరుదైన సాంకేతికత
- ఎక్కడి నుంచైనా నియంత్రించే టెక్నాలజీ
- బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ
- ప్రపంచంలోనే పేటెంట్ హక్కు పొందిన తొలి కుక్కర్
- త్వరలో మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు



మధుమేహ బాధితులూ ఇకపై మీరంతా అధికంగా కార్బొహైడ్రేట్స్ ఉండే ఆహారాన్ని నిశ్చింతగా తినేయొచ్చు. ఊబకాయులు సైతం కార్బొహైడ్రేట్స్‌ను ఎంత కావాలంటే అంత లాగించేయొచ్చు. అవును.. మీరు వింటున్నది నిజమే. అదెలా సాధ్యమని ఆశ్చర్యపోకండి. ఆహారంలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ)ను అదుపులో ఉంచే స్మార్ట్ కుక్కర్ సిద్ధమైంది. బాపట్లలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ శాస్త్రవేత్తలు మూడేళ్లపాటు శ్రమించి అభివృద్ధి చేసిన ఈ వినూత్న ఆవిష్కరణ త్వరలోనే మార్కెట్‌లోకి రాబోతోంది. ప్రపంచంలోనే తొలి స్మార్ట్ కుక్కర్‌గా పేటెంట్ సైతం దీనికి లభించింది.

- సాక్షి, అమరావతి

గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) మనం తీసుకునే ఆహారంలో 55% కంటే తక్కువగా ఉంటే రక్తంలో సుగర్ అత్యంత నిదానంగా పెరుగుతాయి. జీఐ 56–70% మధ్య ఉంటే నెమ్మదిగా.. 70% పైబడి ఉంటే వేగంగా పెరుగుతాయి. రక్తంలో చక్కెర పాళ్లు పరిమితికి మించి పెరిగితే క్లోమ గ్రంధి (పాంక్రియాస్)పనితీరు మందగించి ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఇది డయాబెటిస్‌కు దారితీస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్దల్లోనేకాదు.. పిల్లల్లోనూ టైప్–1 డయాబెటిస్

గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిని తగ్గించడమే లక్ష్యంగా..

విపరీతంగా పెరగడానికి కారణమవుతున్న ఆహారంలో గ్లైసెమిక్ ఇండెక్స్‌ను నియంత్రించాలన్న సంకల్పంతో బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ బయో కెమిస్ట్రీ శాస్త్రవేత్త డి.సందీప్‌రాజా నేతృత్వంలో డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, వి.వాసుదేవరావు, ఎల్.ఏడుకొండలుతో కూడిన శాస్త్రవేత్తల బృందం మూడేళ్లపాటు చేసిన పరిశోధన ఎట్టకేలకు ఫలించింది. ఎలాంటి వరి రకమైనా సరే ప్రాసెసింగ్ ట్రీట్‌మెంట్ ద్వారా వాటిలోని జీఐ స్థాయిలను తగ్గించి ఆహారం నెమ్మదిగా జీర్ణమయ్యేలా అభివృద్ధి చేసిన స్మార్ట్ కుక్కర్ ఆహార రంగంలో విప్లవమే.

ప్రాసెసింగ్ ట్రీట్‌మెంట్ ద్వారా జీఐను తగ్గించడమే లక్ష్యంగా ఈ స్మార్ట్ రైస్ కుక్కర్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో బియ్యాన్ని స్టీమింగ్ ప్రక్రియ ద్వారా ఉడికిస్తారు. గంజిని సోలనాయిడ్ వాల్వ్ ద్వారా వేరు చేస్తారు. తర్వాత అన్నం వేగంగా చల్లబడే (ర్యాపిడ్ కూలింగ్) చాంబర్‌లోకి పంపి 1–2 డిగ్రీల సెల్సియస్‌లో ప్రాసెస్ చేస్తారు. శాస్త్రీయంగా చెప్పాలంటే.. బియ్యాన్ని రీట్రో గ్రేడ్ చేయడం (అన్నేలింగ్, హీట్ మాయిశ్చర్ ట్రీట్‌మెంట్ (హెచ్‌ఎంటీ) ద్వారా అన్నంలో ఉండే స్టార్చ్ (పిండి పదార్థం)లో 20 నిమిషాల్లో జీర్ణమయ్యే పదార్థం (ర్యాపిడ్లీ

ఇది ఎలా పనిచేస్తుందంటే..

డైజెస్టబుల్ స్టార్చ్–ఆర్‌డీఎస్)ను 90 నిముషాల్లో నెమ్మదిగా జీర్ణయ్యే పదార్థం (స్లో డైజెస్టబుల్ స్టార్చ్–ఎస్‌డీఎస్)గా మారుస్తుంది. దీంతోపాటు అన్నంలో రెసిస్టెంట్ స్టార్చ్ పెరుగుతుంది. ఇది అసలు జీర్ణమవకుండా డైటరీ ఫైబర్‌లా ప్రవర్తించేలా ఒక రకమైన పిండి పదార్థం . బియ్యాన్ని వండే సమయంలో అదనపు పానీడు తీసేయడంతో కొంత స్టార్చ్ తగ్గిపోతుంది. ఈ స్మార్ట్ కుక్కర్‌లో వండితే 45% ఆర్‌డీఎస్‌ను ఎస్‌డీఎస్‌గా మార్చి ఆర్‌ఎస్‌ను 121% శాతానికి పెంచుతుంది. ఫలితంగా గ్లైసెమిక్ ఇండెక్స్ 22% వరకు తగ్గిపోతుంది. ఇలా వండిన అన్నం సాధారణ అన్నంలాగే ఉంటుంది. సాధారణంగా వండే అన్నానికి ఉన్నట్టుగానే రంగు, రుచి, వాసనలు పాడవకుండా ఉంటుంది.

ప్రపంచంలోనే తొలి డయాబెటిస్ రైస్ కుక్కర్

ఇది పూర్తిగా స్మార్ట్ కంట్రోల్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ఇంటిగ్రేషన్‌తో పనిచేస్తుంది. ఐఓటీ కంట్రోల్ రిమోట్ (మొబైల్ యాప్) ద్వారా ఎంతదూరం నుంచైనా దీనిని నియంత్రించవచ్చు. కేవలం ఒక కమాండ్ ఇస్తే చాలు ఇంట్లో అన్నం నిర్ణయించిన సమాయనికి రెడీ అయి ఉండేలా సెట్ చేసుకోవచ్చు. రైస్ వేరియంట్, బియ్యం–నీరు నిష్పత్తి, వండే ఉష్ణోగ్రత, చల్లదనం, స్టీమింగ్ సమయం వంటి వాటిని మొబైల్ ద్వారానే సెట్ చేసేలా ఏర్పాటు చేశారు. మనం పెట్టే బియ్యం రకం ఆధారంగా దానికి అవసరమైన నీటి నిష్పత్తి, ఉడికే ఉష్ణోగ్రత, ఉడికే సమయం, చల్లబడే ఉష్ణోగ్రత, చల్లబడే కాలం, స్టీమింగ్‌కు అవసరమైన సమయం, వంటి అంశాలను కూడా ప్రత్యేక ఆల్గారిథం ద్వారా స్వయం చాలకంగా నియంత్రిచబడతాయి. 2022లో ప్రారంభమైన ఈ పరిశోధనకు మూడేళ్ల సమయం పట్టింది. ఈ పరిశోధన పూర్తిగా బాపట్లలోనే జరిగింది. ఫ్యాబ్రికేషన్ కోసం కోయంబత్తురులోని ఓ కంపెనీ సహకారం తీసుకున్నారు. ఈ వినూత్నమైన రైస్ కుక్కర్‌కు గత నెలలోనే భారత ప్రభుత్వం నుంచి పేటెంట్ హక్కు(405194-001) లభించింది.

డయాబెటిస్ రోగులకు ఎంతో ఉపయోగం

స్మార్ట్ రైస్ కుక్కర్‌లో వండిన అన్నం తినడం వల్ల రక్తంలోని సుగర్ స్థాయిలను పూర్తిగా నియంత్రించవచ్చు. నిధానంగా జీర్ణమవడం వల్ల మళ్లీ ఆకలి వేయడానికి సమయం పడుతుంది. తక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల శరీర బరువును కంట్రోల్ చేస్తుంది. శరీరంలోని శక్తి పెరగడమే కాకుండా అలసట తగ్గుతుంది. రోజంతా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. త్వరలోనే ఈ స్మార్ట్ రైస్ కుక్కర్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకోసం ఒక కంపెనీతో ఎంవోయూ చేసుకోబోతున్నాం. గతంలో నేను అభివృద్ధి చేసిన ఆఫ్లాటాక్సిన్‌ను కనుగొనే ఒక రాపిడ్ కిట్‌తో పాటు అతి తక్కువ ధరలోనే గ్లైసెమిక్ ఇండెక్స్‌ను తగ్గించేలా తయారు చేసిన కిట్‌కు పేటెంట్ హక్కులు లభించాయి. వరుసగా మూడో ఆవిష్కరణకు పేటెంట్ హక్కు రావడం ఆనందంగా ఉంది.

- డాక్టర్ దోనేపూడి సందీప్ రాజా, బయో కెమిస్ట్రీ శాస్త్రవేత్త, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల

> అల్లాహ్ భూమిలో ఉన్న సమస్తాన్ని మీకు వశపరచాడు.
> మరియు సముద్రంలో పడవ ఆయన అనుమతితోనే నడుస్తుంది.
> తాను అనుమతించే వరకు ఆకాశాన్ని భూమి మీద పడకుండా నిలిపి ఉంచాడు.
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 25 ఏప్రిల్ 2025

ఐక్యత వర్తమాన అవసరం

ప్రపంచమంతా ఒక రకమైన అనిశ్చితిలో రోజులు వెళ్లదీస్తున్న వర్తమానంలో మరో మారణకాండకు పథకం పన్ని, అమలుచేసి కశ్మీర్ సమస్యను మళ్లీ తెరపైకి తేవాలనుకున్న పాకిస్తాన్‌కు మన దేశం నుంచి గట్టి హెచ్చరికే వెళ్లింది. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేయటంతో సహా తీసుకున్న చర్యలు సహజంగానే పాకిస్తాన్‌ను ఇరకాటంలో పడేశాయి. అటారీ సరిహద్దు మూత, దౌత్యసంబంధాలకు పరిమితుల విధింపు, పాకిస్తాన్ పౌరులకు భారత్‌లో ప్రవేశం నిషేధం వంటి నిర్ణయాలు దీనికి అదనం. నిజానికి సింధూ నదీజలాల ఒప్పందం నిలిపివేతను పాకిస్తాన్ ఊహించలేదు. ఎందుకంటే ఇరు దేశాల మధ్యా యుద్ధం వచ్చిన సందర్భాల్లో... ముంబైపై ఉగ్రదాడి జరిగినప్పుడు లేదా పుల్వామాలో మన జవాన్లను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నప్పుడు కూడా మన దేశం ఆ ఒప్పందం నిలిపివేత గురించి మాట్లాడలేదు. సింధూ నదీజలాలపై పాకిస్తాన్ సాగురంగం 80 శాతం వరకూ ఆధారపడి వుంటుంది. పైగా ప్రపంచంలో తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొనే దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. సింధు, జీలమ్, చీనాబ్, రావి, బియాస్, సట్లైజ్ నదులకు సంబంధించిన సమస్త సమాచారమూ కూడా ఈ ఒప్పందంలో ఇమిడివున్న వేళ మన దేశ నిర్ణయం పాకిస్తాన్‌కు శరాఘాతమే అవుతుంది. భారత్ చర్యలకు ప్రతిగా పాకిస్తాన్ సైతం చర్యలు తీసుకున్నా అది పరువు కాపాడుకోవటానికి చేసే ప్రయత్నం మాత్రమే.

ఎలా చూసినా పాకిస్తాన్ ఒక రకంగా ఒంటరి బతుకు బతుకుతోంది. అమెరికాకు అఫ్గాన్ పెను సమస్యగా కనబడినంత కాలమూ అది పాకిస్తాన్ సాయం తీసుకోక తప్పేది కాదు. అందుకోసం పాక్ తరఫున మాట్లాడటం, అది ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదన్న ఆరోపణలొస్తున్నా అమాయకత్వం నటించటం అప్పట్లో అమెరికాకు అలవాటు. ఉగ్రవాదులకు అండదండలందిస్తున్నట్టు ఆధారాలున్నా ఏనాడూ పాక్‌కు ఆర్థిక సాయం ఆగకుండా చూసిన ఘనత అమెరికాది. 2021లో అఫ్గాన్ నుంచి బతుకుజీవుడా అనుకుంటూ నిష్క్రమించాక అమెరికాకు పాకిస్తాన్‌పై మునుపటి ప్రేమ, వాత్సల్యాలు తగ్గుముఖం పట్టాయి. పర్యవసానంగా అప్పు దొరక్క పాక్ ఇబ్బంది పడుతోంది. గల్ఫ్ దేశాలు కూడా గతంలో మాదిరి కాసుల వర్షం కురిపించటం లేదు. చైనా సరేసరి. అదెంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) పాకిస్తాన్‌లో నత్తనడకన సాగటం, నిర్మాణ పనులకు ఎదురవుతున్న ఆటంకాలు చైనాకు ఆగ్రహం కలిగిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా కశ్మీర్ విషయంలో పాక్‌ను సమర్థించటం మొదలెట్టిన తుర్కియే హఠాత్తుగా గత ఏడాది స్వరం మార్చింది. గల్ఫ్ దేశాలు సైతం పాకిస్తాన్ తీరు మారనంత కాలమూ తాము మద్దతునీయటం కష్టమేనని భావిస్తున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా ఇలా ఏకాకిగా మారుతున్న సమయంలో పహల్గామ్‌లో బరితెగించి ఉన్మాదులను ప్రోత్సహించటం వల్ల మరింతగా నష్టపోతానని పాకిస్తాన్ గ్రహించలేకపోయింది. అంతర్జాతీయంగా ఏర్పడిన ఉద్రిక్తతలు చివరకు యుద్ధానికి దారితీయొచ్చని చాలామంది జోస్యం చెబుతుండగా నిజంగా ఆ పరిస్థితే వస్తే భౌగోళికంగా తమ అవసరాల కోసమైనా అమెరికా, చైనాలు తన కోసం అర్రులు చాస్తాయన్న అభిప్రాయం పాకిస్తాన్‌కు ఏదోమూల వున్నట్టు కనబడుతోంది. అందుకే పహల్గామ్ దుస్సాహసానికి పూనుకుంది.

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పహల్గామ్‌కు ప్రతీకారం ఉండి తీరుతుందని ప్రకటిస్తున్నారు. 2016లో ఉరిలో ఉగ్రవాదుల మారణకాండ తర్వాత, 2019లో పుల్వామాలో జవాన్లపై ఉగ్రదాడి అనంతరం మన దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్రశిబిరాలపై సర్జికల్ దాడులను నిర్వహించాయి. అందువల్ల వచ్చిన లాభనష్టాలేమిటన్న మాట అలావుంచి ఉగ్రదాడులు తగ్గివుండొచ్చుగానీ ఆగింది లేదు. పౌరుల్లో ఆత్మస్థైర్యం నింపటానికి ప్రతి చర్యలు అవసరమే. అవి కొనసాగవలసిందే. కానీ అక్కడితో అంతా అయిందనుకోవటంలోనే వుంది సమస్యంతా! ఒకప్పుడు కశ్మీర్‌లో అధికార గణాంకాల ప్రకారం 7,000 మంది ఉగ్రవాదులుండేవారు. కానీ వారి సంఖ్య ప్రస్తుతం 76 మాత్రమేనని గత నెలలో విడుదలైన గణాంకాలు చెబుతున్నాయి. అందులో 59 మంది బయటివారు కాగా, కేవలం 17 మంది మాత్రమే స్థానికులు. ఉగ్రదాడుల్లో మృతుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. కశ్మీర్‌ను గత 35 యేళ్లుగా ఉగ్రవాద భూతం పట్టిపీడిస్తోంది. తొలినాళ్లలో ఏడాదికి ఇంచుమించు వేయిమంది బలయ్యేవారు. 2001 సంవత్సరంలో ఉగ్రవాదులు ఏకంగా 4,011 మందిని పొట్టన బెట్టుకున్నారు. కానీ నిరుడు ఆ సంఖ్య 127.

కొందరు ప్రతీకారేచ్ఛను ప్రదర్శిస్తున్నారు. కానీ ప్రభుత్వం ఒక చర్య తీసుకునే ముందు ఎన్నో బేరీజు వేసుకోవాల్సి వుంటుంది. అది యుద్ధంగా మారిన పక్షంలో... మనవైపు గట్టిగా నిలబడే వారెవరు, వ్యూహాత్మకంగా ఎదురయ్యే సమస్యలేమిటి, దళాల సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యాల్లో మన స్థానం ఏమిటి అనేవి చూసుకోవాలి. ఇదే అదనుగా కొన్ని రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థులపై దాడులు, బెదిరింపులు మొదలయ్యాయి. మొన్నటికి మొన్న పహల్గామ్‌లో కశ్మీరీ పౌరులు ప్రాణాలకు తెగించి అనేకమందిని కాపాడిన వైనం ఇలాంటి వారికి తెలిసి వుండక పోవచ్చు. ఉగ్రవాద బెడద తగ్గటంలో స్థానికులు అందిస్తున్న సహకారమేమిటో వారికి అర్థంకాకపోయి వుండొచ్చు. మన పౌరుల్ని మనమే మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో దూరం చేసుకుంటే ఉగ్రవాదుల అభిమతం నెరవేర్చినట్టే అవుతుంది. నిజానికి వారు కోరుకునేది ఈ విద్వేషాన్నే! ఒకపక్క ఉగ్రవాదం అంతానికి దేశమంతా ఒక్కటై నిలబడాలని ప్రధాని పిలుపునిస్తుంటే తద్భిన్నంగా ప్రవర్తించటం విజ్ఞత అనిపించుకోదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.8.21 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర తె.4.25 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.2.49 నుండి 4.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.14 వరకు.
అమృత ఘడియలు: రా.11.47 నుండి 1.17 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

హైబ్రిడ్ తీవ్రవాదం

సందర్భం



మనోజ్ కె. చన్నన్

ఉగ్రవాద కర్కశ దాడితో పహల్‌గామ్ ప్రశాంతత భగ్నమైంది. కశ్మీర్ లోయలో శాంతి ఇప్పటికీ దైవాధీనమే! శత్రువుల తుపాకులు ఎంత ప్రమాదకరమైనవో... ఉదాసీనత, తప్పుడు అంచనాలు కూడా అంతే ప్రమాదకరమైనవి. పౌరుల మీద కాదు, ఇండియా విశ్వసనీయత మీద జరిగిన దాడి ఇది. అమెరికా ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ దేశంలో పర్యటిస్తున్న సందర్భంలో దెబ్బ తీయడాన్ని ఇంకెలా భావించాలి? ఇదొక కొత్త రకం మిలిటెన్సీ. కశ్మీర్ వినూత్న విపత్తును ఎదుర్కొంటోంది. రమారమి 60 మంది విదేశీ ఉగ్రవాదులు కశ్మీర్ లోయలో మాటు వేసి ఉన్నారని నిఘా వర్గాల అంచనా. వీరిలో సగం మంది టీఆర్ఎఫ్ సంబంధీకులే. ఇది లష్కర్-ఎ-తోయిబాకు ముసుగు సంస్థ. ప్రపంచం కళ్లు గప్పేందుకు, స్థానిక సంస్థగా మభ్యపెట్టే పేరుతో వ్యవహారం నడిపిస్తోంది.

భౌతిక గస్తీ కీలకం

టీఆర్ఎఫ్ తదితర గ్రూపులు హైబ్రిడ్ తీవ్రవాదాన్ని అవలంబిస్తున్నాయి. అందుకే ఇవి మరింత ప్రమాదకరమైనవి. తుపాకుల వంటి మారణాయుధాలలో శిక్షణ పొంది, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి అధీన రేఖ దాటి వచ్చే దుండగులపై ఈ కొత్త తరహా ఉగ్రసంస్థలు ఆధార పడవు. బదులుగా స్థానికులనే 'రాడికలైజ్' చేసి వారిని ఉపయోగించుకుంటాయి. వీరికి పిస్టల్స్ లేదా గ్రనేడ్స్ సమకూరుస్తాయి. వీటితో లక్ష్యాలపై దాడి చేసి వెంటనే జనంలో కలిసిపోతారు. వీరు రెండోసారి మళ్లీ దాడులకు పాల్పడరు. కాబట్టి ఎలాంటి డిజిటల్ ఆధారాలూ ఉండవు. దాడులూ ఎప్పటికప్పుడు కొత్తగా ఉంటాయి. కాబట్టి 'సెక్యూరిటీ గ్రిడ్స్' పని గట్టలేవు. సంప్రదాయ నిఘా, పోలీసు వ్యవస్థలను ముప్పుతిప్పలు పెట్టే రహస్య తీవ్రవాదం ఇది.

నిజానికి వాన్స్ వంటి హైప్రొఫైల్ వ్యక్తులు పర్యటనకు వచ్చినప్పుడు అన్ని సున్నిత ప్రాంతాలపై నిఘా పకడ్బందీగా ఉండాలి. అలా జరగలేదు. ముప్పు అవకాశాల మదింపు, ముందస్తుగా బలగాల మోహరింపు వంటి చర్యలు తీసుకోవడంలో మునుపటి క్రియాశీలత్వం కొరవడింది. ప్రాంతాల వారీగా ముమ్మర గస్తీ నిర్వహించే విధానం సడలి పోయింది. మరీ ముఖ్యంగా 24/7 ఎలక్ట్రానిక్ నిఘా కింద లేని ప్రాంతాల్లో ఈ ఉదాసీనత ఆందోళనకరమైన విషయం. డ్రోన్ సమాచారం, జియో ఫెన్సింగ్ ఏర్పాటు పర్వత మార్గాల భద్రతకు చాలవు. పర్వత ప్రాంతాల్లో భౌతిక గస్తీకి ప్రత్యామ్నాయం లేదు. డ్రోన్లు స్కాన్ చేస్తాయి, కెమెరాలు రికార్డు చేస్తాయి, సమాచార నిఘా వ్యవస్థలు హెచ్చరిస్తాయి. కాదనలేం. కానీ క్షేత్రస్థాయిలో భౌతిక ఉనికి, అంతర్దృష్టికి ఇవి ప్రత్యామ్నాయం కావు.

పహల్‌గామ్ ఉగ్రదాడికి ప్రతిగా సింధూ నదీజలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత ప్రభుత్వం, పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను తగ్గించడానికి పూనుకుంది.



> పర్వత ప్రాంతాల్లో భౌతిక గస్తీకి ప్రత్యామ్నాయం లేదు. డ్రోన్లు స్కాన్ చేస్తాయి, కెమెరాలు రికార్డు చేస్తాయి, సమాచార వ్యవస్థలు హెచ్చరిస్తాయి. కాదనలేం. కానీ క్షేత్రస్థాయిలో భౌతిక ఉనికి, అంతర్దృష్టికి ఇవి ప్రత్యామ్నాయం కావు.

స్థానిక నిఘా వ్యవస్థ

విద్రోహ నిరోధక వ్యవస్థను తక్షణం బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. దుర్ఘటనను ప్రతిఘటించడం కాకుండా ముందుగానే దాన్ని అరికట్టే దిశగా మార్పు రావాలి. ఇందులో భాగంగా శాశ్వత గస్తీ యూనిట్లు, రొటేషనల్ నిఘా బృందాలు ఏర్పాటు చేయాలి. ఈ సందర్భంగా, చురుకైన కౌంటర్ ఇంటెలిజన్స్ గ్రిడ్ (సీఐ గ్రిడ్) చాలా ముఖ్యమైంది. ఉరి, పుల్వామా దాడుల అనంతరం చురుగ్గా పనిచేసి ప్రశంసలు పొందిన ఈ గ్రిడ్ ఇప్పుడు బలహీనపడినట్లు ఉంది. దీనిపై ఎలాంటి రాజకీయ సంకోచాలూ లేకుండా కఠినమైన సమీక్ష జరగాలి.

స్థానికుల సాయంతో నిఘా పెట్టే వ్యవస్థ ఎప్పుడో విచ్ఛిన్నమైంది. దాని పర్యవసనాలు ఎలా ఉంటాయో ఇప్పుడు తెలుస్తోంది. హైబ్రిడ్ టెర్రరిస్టులు సంప్రదాయ ఉగ్రవాద నెట్ వర్క్‌ల నుంచి వచ్చిన వారు కారు. వారి నియామకాలు స్వల్పకాలానికి పరిమితమై ఉంటాయి. తరచూ ఆన్‌లైన్‌లోనే జరిగిపోతుంటాయి. వారికి వన్ టైమ్ ప్రాతిపదికన విద్రోహ లక్ష్యాలు అప్పగిస్తారు. ఉగ్రవాద స్థావరాల్లో తల దాచుకోరు. కోడెడ్ ఫోన్ కాల్స్ చేయరు. కాబట్టి, లోతైన రియల్ టైమ్ నిఘా అవసరమవుతుంది. మొహల్లాలు, స్కూళ్లు, మదర్సాలు, మార్కెట్ల నుంచి గుట్టుగా సమాచారం రాబట్టాలి. టెక్నాలజీకి దాని ప్రాధాన్యం దానికి ఉంటుంది. అయితే, కశ్మీర్ పరోక్ష యుద్ధం (షాడో వార్)లో స్థానికుల నుంచి సమాచారం రాబట్టే నిఘా వ్యవస్థను మరే ఇతర వ్యవస్థా భర్తీ చేయలేదు. స్థానిక ఇన్‌ఫార్మర్ల విశ్వాసం చూరగొనడం, లోప్రొఫైల్ క్షేత్రస్థాయి ఏజెంట్లను ఉపయోగించడం తప్పనిసరి. ఉగ్రవాద వ్యూహాల ముందస్తు గుర్తింపునకు ఈ వ్యూహం వెన్నెముక లాంటిది.

నిర్మొహమాటంగా మాట్లాడుకుందాం. 'అమన్ కీ ఆశా' (శాంతి కోసం ఆశ) నినాదం ప్రస్తుతానికి అటకెక్కుతుంది. కశ్మీర్ లోయలో ఇటీవలి సంవత్సరాల్లో పర్యాటకం అద్భుతంగా పుంజుకుంది. దేశీయ, విదేశీయ పర్యాటకులు కలిసి 2023లో రెండు కోట్లు దాటారు. కశ్మీర్ ప్రజల్లో తిరిగి ఆశలు చిగురించాయి. ఇప్పుడవి చెదిరిపోయాయి. పర్యాటకులు బుకింగ్స్ రద్దు చేసుకుంటున్నారు. హోటళ్లు, హౌస్ బోట్లలో ఖాళీ రూములు దర్శనమిస్తున్నాయి. కశ్మీరీల ఆర్థిక నష్టం భారీగా ఉంటుంది. అయితే, కౌంటర్ – టెర్రర్ కార్యకలాపాలతో సాధారణ ప్రజల్ని దూరం చేసుకోకూడదు. ఉగ్రవాదంపై పోరాటానికీ, వర్గాలను తూలనాడటానికీ మధ్య ఉండే రేఖను దాటకూడదు. కశ్మీరీలు విదేశీ ప్రేరేపిత ఉగ్రవాదం, రాజకీయ అనిశ్చితి... ఈ రెండింటి బాధితులు.

కశ్మీర్‌లో నాయకత్వం అలంకారప్రాయంగా కాకుండా క్రియాశీలం కావాలి. జాతీయ భద్రత బాధ్యతను ఎవరికైతే అప్పగించారో వారు ఫలితాలు చూపెట్టాలి. లేదా వైదొలిగి సమర్థులకు అవకాశం ఇవ్వాలి. ఈ వేసవి తీవ్రత కశ్మీర్‌లో ఎక్కువగానే ఉంటుంది. కర్ఫ్యూలు, సోదాలు, ఉద్రిక్తతలు పునరావృతం కావచ్చు. స్థానికుల పట్టువిడుపులకు, భారత ప్రభుత్వ రాజనీతికి ఇది పరీక్ష లాంటిది. ఒకవంక దేశ సరిహద్దులో శత్రువుతో పోరాడుతూ, మరోవంక దేశం లోపల భారతీయత భావనను పరిరక్షించుకోవాలి. ఇండియా అంతర్గత శాంతిని ఎవరూ తుపాకీతో శాసించలేరని రుజువు చేసుకోవడానికి మనం సుదీర్ఘ ప్రయాణమే చేయాలి.

వ్యాసకర్త భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ (రిటైర్డ్)

ఆ హామీ ఏమైంది?

సందర్భం



కరిష్మా వాస్వానీ

కశ్మీర్‌లో శాంతి ప్రక్రియ తన నాయకత్వంలో సాధారణ స్థితికి చేరుకుందని ప్రధాని నరేంద్ర మోదీ గత కొంతకాలంగా పలు సందర్భాల్లో ప్రకటిస్తూ వచ్చారు. కశ్మీర్‌కు శాంతిని తెస్తానన్నది జమ్ము–కశ్మీర్ విషయంలో మోదీ ఇచ్చిన ప్రధానమైన హామీ. కానీ ప్రముఖ పర్యాటక ప్రదేశమైన పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి, ప్రధాని ఎంత పొరబడ్డారో చూపించింది. పౌరులపై ఇటీవలి కాలంలో జరిగిన అతి పెద్ద ఉగ్రదాడి ఇది. ఇందులో 26 మంది పర్యాటకులు నిస్సహాయంగా ప్రాణాలు కోల్పోయారు. నిజానికి ఈ దాడి ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. దీర్ఘకాల వేదనలను పరిష్కరించనప్పుడు అవి ఏదో ఒక రూపంలో బయటపడతాయి.

తగ్గని ఉగ్రచర్యలు

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కశ్మీర్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని మోదీ, అమిత్ షా ద్వయం పదే పదే ప్రకటిస్తూ వచ్చారు. కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడం ద్వారానే దాని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కానీ అది జరగలేదని తాజా ఉగ్రదాడి తేల్చి చెప్పింది.

పహల్‌గామ్ ఉగ్ర దాడి యావత్ ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. ఈ నేపథ్యంలో తన సౌదీ పర్యటన నుండి అర్ధంతరంగా వెనుదిరిగిన మోదీ యథాప్రకారం కశ్మీర్ లోయలో హింసను ఖండించారు. ఆ ఘటన వెనుక ఉన్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలిపెట్టబోమని హెచ్చరించారు. మరో వైపున పహల్‌గామ్ దాడి ఇటీవలి కాలంలో పౌరులపై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఒకటిగా కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా అభివర్ణించారు. దీనికి ప్రతిస్పందన అన్నట్లుగా, ముస్లింలు అధికంగా ఉన్న కశ్మీర్‌లోని పాఠశాలలు, దుకాణాలను మూసి వేశారు. పహల్‌గామ్ దాడి చెదురుమదురు ఘటన కానే కాదు. లోయలో ఉగ్రవాద చర్యలు ఎన్నడూ తగ్గుముఖం పట్టలేదని సూచిస్తూ ఇటీవల పలు హింసా ఘటనలు జరుగుతూ వచ్చాయి. కానీ అవి పెద్దగా ప్రచారానికి నోచుకోలేదు.

2019లో కశ్మీర్ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. కశ్మీర్‌లో హింసా కాండను అంతం చేయడమే ప్రత్యేక హోదా రద్దుకు కారణం అని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా నొక్కి చెప్పారు. దాని కొనసాగింపుగానే గత ఫిబ్రవరి 24న అమిత్ షా ఒక ప్రకటన చేస్తూ జమ్మూ కశ్మీర్‌లో ఏర్పడిన శాంతిని శాశ్వత శాంతిగా మార్చాలి అన్నారు. అయితే కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌కు తూర్పున 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న పహల్‌గామ్ ఉగ్రదాడి ఆ రాష్ట్రంలో శాశ్వత శాంతి ఇంకా ఏర్పడలేదని స్పష్టంగా చూపించింది.

> కశ్మీర్ ఆర్థిక వ్యవస్థను పెంచడం కోసమే ఆ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని రద్దుచేసిట్లు మోదీ తమ ప్రభుత్వ చర్యను సమర్థించుకున్నారు. కానీ అక్కడ పెట్టుబడులు నేటికీ పరిమితంగానే ఉన్నాయని గ్రహించాలి. అక్కడ శాశ్వత శాంతి నెలకొననే లేదు.

ఈ ఘటనకు తామే కారణమని లష్కర్-ఎ-తోయిబా అనుబంధ సంస్థ ఇప్పటికే ప్రకటించుకుంది. ఈ ప్రకటనలోని నిజానిజాలు వెంటనే తేలకపోయినా, ఈ దాడి భారత, పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తుందని కచ్చితంగా చెప్పవచ్చు. పర్యాటకుల ప్రాణనష్టం పట్ల పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపింది. పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ, పాక్ ప్రభుత్వానికి ఈ దాడితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దాడికి ప్రతిగా పాకిస్తాన్‌తో దశాబ్దాల క్రితం కుదుర్చుకున్న సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత ప్రభుత్వం, ఆ దేశంతో దౌత్య సంబంధాలను తగ్గించడానికి పూనుకుంది.

బలహీనమైన కశ్మీర్

కశ్మీర్ ఆర్థిక వ్యవస్థను పెంచడం కోసమే ఆ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని రద్దుచేసినట్లు మోదీ తమ ప్రభుత్వ చర్యను సమర్థించుకున్నారు. కానీ కశ్మీర్ భూభాగంలో పెట్టుబడులు నేటికీ పరిమితంగానే ఉన్నాయన్నది గ్రహించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, మోదీ పదవీకాలంలో కశ్మీరీలు మరింత బలహీనంగా మారారు. లక్షలాది మంది సైనికులు కాపలా కాస్తున్న ఈ ప్రాంతంలో హిందువులు స్థిర నివాసం ఏర్పర్చుకోవడాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నారు. కశ్మీర్ లోయ జనాభా దామాషాను మార్చే ఈ లక్ష్యాన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. బయటి జనాభా లోయలోకి వస్తే తమ ఉద్యోగాలు, భూయాజమాన్య హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు భీతిల్లుతున్నారు. అదే సమయంలో నిరంతర దర్యాప్తులు, అణచివేత విధానాల మధ్యనే వారు జీవిస్తున్నారు. విమర్శకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయకుండా ఉండటానికి, భారత ప్రభుత్వం కఠినమైన ప్రయాణ నిషేధాలను, ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద ఏకపక్ష నిర్బంధాలను ఉపయోగిస్తోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ గతేడాది కశ్మీర్ ఎన్నికల సందర్భంలో పేర్కొంది.

ఈ ఉగ్రదాడి, చాలా కాలంగా నలుగుతున్న కొన్ని సమస్యలను పరిష్కరించడానికి భారత ప్రభుత్వానికి అవకాశాన్నిస్తోంది. నిజానికి మోదీ మొదటి ఉద్దేశ్యం ఈ ప్రాంతాన్ని మరింతగా దిగ్బంధించడమే. అలా చేస్తే అది పొరపాటవుతుంది. 2019లో భారత ప్రభుత్వం విధించిన అన్ని ఆంక్షలూ... ఇంటర్నెట్ సేవలను దీర్ఘకాలికంగా నిలిపివేయడం, రాజకీయ నేతలను నిర్బంధించడంతో పాటు లాక్‌డౌన్‌ని కఠినంగా అమలు చేయడం వంటివి ప్రజల్లో మరింత ఆగ్రహాన్ని రేపాయి. ఆ చర్యలను క్రమంగా ఎత్తివేశారు, అయినా నష్టం జరిగిపోయింది. మరోపక్క ప్రధాన స్రవంతిలో, సోషల్ మీడియాలో అదుపు లేకుండా ముస్లిం వ్యతిరేక భావన కొనసాగుతోంది. మోదీ దాన్ని చూసీచూడనట్టు వదిలేయాలని భావిస్తే కష్టమే. భారతీయులందరికీ నాయకుడిగా ఆయన వ్యవహరించాలి. సంయమనం పాటించాలని దేశ ప్రజలకు పిలుపునివ్వాలి. ఇప్పటికే ప్రతీకారదాడి అంటూ భావోద్వేగాలతో జనం ఊగిపోతున్నారు. ఆచితూచి వ్యవహరించడమే అంతర్జాతీయంగా ముఖ్యమని గ్రహించాలి.

వ్యాసకర్త ఆసియా వ్యవహారాల నిపుణురాలు

ఇన్ బాక్స్

ప్రజా చైతన్యంతోనే మార్పు


హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడి జరపడంతో ఆ దేశ ప్రజలకు సంఘీభావంగా 1941, జూన్ 22న కలకత్తా కేంద్రంగా 'ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్' ఉద్భవించింది. అది మారుతున్న కాలానికి అనుగుణంగా 'ఇండో సోవియట్ కల్చరల్ సొసైటీ' (ఇస్కస్)గా ఏర్పడి రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని బలోపేతం చేసింది. సోవియట్ యూనియన్ పతనం తర్వాత (1993) అది 'భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం' (ఇస్కఫ్)గా రూపాంతరం చెంది అన్ని దేశాలతో స్నేహ, సాంస్కృతిక సంబంధాల కోసం, ప్రపంచ శాంతి కోసం, క్షీణ సంస్కృతికి వ్యతిరేకంగా విస్తృత కృషి చేస్తోంది.

ఏక ధ్రువ ప్రపంచంలో ప్రస్తుత పరిస్థితులు రోజు రోజుకీ కీలకంగా మారుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి అధికారంలోకి రాగానే చేస్తున్న ప్రకటనలు, తీసుకుంటున్న చర్యలు ప్రపంచంలో ఉద్రిక్తతలు పెంచుతున్నాయి. రాజకీయాలతో సంబంధం లేకుండా అమెరికాలో '50501 గ్రూప్' ఇచ్చిన పిలుపునకు అమెరికాలోని 50 రాష్ట్రాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి 'హాండ్స్ ఆఫ్' అనే నినాదంతో జరిపిన ప్రదర్శనలు చూస్తే ఎంతటి వారైనా ప్రజల అభిప్రాయానికి తలవొగ్గక తప్పదని రుజువు అవుతుంది. ప్రజల చైతన్యంతోనే ఏ మార్పులైనా వస్తాయని ఇస్కఫ్ ప్రగాఢ విశ్వాసం. పురోగమనం శాంతి, పరస్పర గౌరవం, సంభాషణల ద్వారా మాత్రమే వీలు పడుతుంది. యుద్ధాల ద్వారా కాదు! ప్రజా సంస్కృతి, కళల అభివృద్ధి కోసం జరిగే కృషిలో ఇస్కఫ్ ముందు భాగంలో నిలబడుతుంది. సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్రతరమై, సంపద మొత్తం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైన వేళ, మతతత్వం రాజ్యాధికారమై ప్రజాతంత్ర ఉద్యమాలకు, మానవ సంబంధాలకు కొత్త అర్థాలు చెబుతున్న వేళ 'భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం' చేయాల్సిన కృషి ఎంతో ఉంది. మన మీద సాంస్కృతికంగా ముప్పేట దాడి జరుగుతోంది. ఈ తరుణంలో తన చారిత్రక బాధ్యత నిర్వర్తిస్తున్న ఇస్కఫ్‌ను బలపరచాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది.

– కె. రాజశేఖర్, ఇస్కఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి
(ఏప్రిల్ 26, 27 తేదీల్లో ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభలు మదనపల్లిలో జరుగుతున్న సందర్భంగా)

ఇరువురి అజెండా ఒకటవ్వాలి!

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

వామపక్ష తీవ్రవాదమైన నక్సలిజాన్ని 2026 మార్చి నాటికి సమూలంగా అంతం చెయ్యాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా హోం మంత్రి అమిత్ షా ప్రకటించి, ఆ లక్ష్యం నెరవేరేలాగా పోలీసు యంత్రాంగాన్ని నడిపిస్తున్నారు. సాధారణంగా బీజేపీ ప్రతిపాదిత విధానాలను వ్యతిరేకించడమే విధానంగా ఉన్న ప్రతిపక్ష పార్టీలు నక్సలిజంపై యుద్ధం విషయంలో మాత్రం అమిత్ షా కి అనుకూలంగా ఉన్నాయి. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం పినరయి విజయన్‌లు కూడా మావోయిస్టుల ఏరివేతలో తాము భాగస్వాములేనని ప్రకటించారు. దాదాపుగా జాతీయ ఏకాభిప్రాయంతో మావోయిస్టుల ఏరివేత జరుగుతున్నదనేది వాస్తవం. వేల సంఖ్యలో ఉన్న పారామిలిటరీ బలగాలను ఎదుర్కోవటం మావోయిస్టులకు కుదరడం లేదు. ఈ స్థితిలో మావోయిస్టులు తెల్ల జెండా ఎత్తి లొంగిపోకుండా మేము చర్చలకు సిద్ధం అని ప్రకటించారు.

అయితే ఈ చర్చల ప్రకటన కొత్తదేమీ కాదు. నక్సలిజం పుట్టిన తర్వాత చర్చల ప్రస్తావన ఒకసారి కన్నా ఎక్కువ సార్లే వచ్చింది. 2004లో ఆంధ్ర ప్రదేశ్‌లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం చర్చలు జరిపినా అవి విఫలమయ్యాయి. ముందుగా ఆయుధాలు, అడవులను వదిలి బయటకు రావాలని ప్రభుత్వం చర్చలకు నిబంధన పెడితే... రక్షణ బలగాలను ముందుగా ఉపసంహరించుకోండి అంటున్నారు మావోయిస్టులు. చుట్టుముట్టిన ప్రతిసారీ చర్చల ప్రతిపాదన పెట్టి కొత్త స్థావరాలను సృష్టించుకున్నారు మావోయిస్టులు అనేది ప్రభుత్వ వర్గాల వాదన. చర్చల పేరుతో బయటకు రప్పించి తమ ఆనవాళ్ళను తెలుసుకుని దాడులు పెంచుతున్నారనేది మావోయిస్టుల ఆరోపణ.

ఎవరి వాదనలు ఎలా ఉన్నా అడవుల్లో పోరాటం సాగుతున్నది. మావోయిస్టులు, భద్రతా దళాల సభ్యులు నేలకొరుగుతున్నారు. కొత్త తరం మావోయిజం పట్ల ఆకర్షించబడటం లేదు. అడవిబాట పట్టి తమ జీవితాలను వృథా చేసుకునే ఆలోచన నేటి యువతకు లేదు. అయినా కొందరు యువకులు



మావోయిస్టులుగా మారుతున్నారంటే వారి గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న పెత్తందారీ వ్యవస్థలో బలిపశువులు కావటమే. అలాంటి పెద్దలను వ్యక్తిగా వ్యతిరేకించలేక, పోరాడే మార్గం కనబడక నక్సల్స్ సహాయం కోసం అడవుల్లోకి వెళుతున్నారు. తమ వ్యక్తిగత కక్షను నక్సల్స్ ద్వారా తీర్చుకున్న తర్వాత వారికి ఆ ఉద్యమంతో అవసరం లేదు. కానీ అప్పటికే పోలీసులిస్టులోకి ఎక్కి ఉన్న ఆ యువతీయువకులు అడవులు, ఆయుధాలను వదలలేక అక్కడే ఉంటున్నారు. ఇటీవల కాలంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి వస్తున్న మావోయిస్టుల కథలు ఇటువంటివే.

నక్సల్ ఉద్యమం పుట్టిన నాటికి ఉన్న సామాజిక పరిస్థితులు నేడు లేవు. భూమి మీద పెత్తనం బడా భూస్వాముల చేతిలో లేదు. పలు రాష్ట్రాలలో అమలైన భూసంస్కరణలు కేంద్రం, రాష్ట్రాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు చాల వరకు మార్పును తెచ్చాయి. ఆర్థిక సంస్కరణల అమలు తర్వాత ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు వచ్చాయి. జీతాలు పెరిగాయి. యువతలో సైద్ధాంతిక రాద్ధాంతం కన్నా కెరీర్ ముఖ్యం అనే అభిప్రాయం పెరిగింది. అందుకే నక్సల్ ఉద్యమం వైపు కొత్తవారు వెళ్లడం లేదు. ఒకనాటి సైద్ధాంతిక నేతలు వయసుమళ్లి మరణించారు. కొందరు అనారోగ్యంతో చివరి దశకి చేరారు. బయటి సమాజంలో ఉండే అవలక్షణాలు అడవుల్లోని మావోయిస్టుల్లోనూ ఉన్నాయి. శ్రమదోపిడీ, లైంగిక దోపిడీ, కుల అహంకారాలు, అధికారాలు ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు మాజీ మావోయిస్టుల నోటి వెంట వచ్చాయి.

మరోవైపు నవీన ఆయుధాలు, సాంకేతికతను భద్రతా బలగాలు ప్రయోగిస్తున్నాయి. అడవిలో ఏ మూల నక్కిన నక్సలైట్‌నైనా పట్టుకలిగిన సాంకేతికత వచ్చింది. గురిచూసి వారిని చంపేసే డ్రోన్స్ వచ్చాయి. ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాల్లో రహదారులు, ఆసుపత్రులు, పాఠశాలలను నిర్మించారు. కమ్యూనికేషన్ టవర్లు, బ్యాంకులు ఏర్పాటు చేశారు. అభివృద్ధి ఫలాలను గిరిజనులు అనుభవించి, మావోయిస్టులకు మద్దతు తగ్గించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో గిరిజనులు 2024 ఎన్నికల్లో భారీగా ఓటింగ్‌లో పాల్గొనడం అందుకు నిదర్శనం.

అయితే ప్రభుత్వ అభివృద్ధి నమూనాను మావోయిస్టులు తిరస్కరిస్తున్నారు. అటవీ, ఖనిజ సంపదను బడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు, ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ అభివృద్ధి ముసుగులో దోచుకుంటున్నారు అనేది వారి ఆరోపణ. రహదారుల నిర్మాణం, గనుల ఏర్పాటుకు, ముడి సరుకు రవాణాకు తప్పించి ఆ ప్రాంత అభివృద్ధికి పనికి రాదన్నది మావోయిస్టుల మాట. ఎవరి వాదన వారిది. వాస్తవం ఆ రెండింటి మధ్యలో ఎక్కడో ఉంటుంది.

గిరిజనుల జీవితాలు మెరుగవ్వాలంటే వారిని నలిపేస్తున్న ఇరుపక్షాలలోనూ మార్పులు రావాలి. ముందుగా ప్రభుత్వం సమాజంలో ఉన్న ఆర్థిక అవకతవకల తొలగింపునకు కూడా ఒక నిర్దిష్ట ప్రణాళికను ప్రకటించాలి. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఒక స్పష్ట యోజనను ప్రకటించాలి. ఆర్థిక సంస్కరణల తర్వాత దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. అధికారంలో ఉన్నవారి ఆదరణతో పారిశ్రామికవేత్తలు లక్షల కోట్ల సంపద సమకూర్చుకున్నారు. అదే సమయంలో సామాన్య వర్గాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి. అధిక ధరలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అధికార యంత్రాంగం అవినీతి పెరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే నక్సల్స్ ఉద్యమం మళ్లీ బలపడుతుంది. అవినీతి, సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించే విధానాల అమలు మాత్రమే ప్రజలందరినీ ఏకం చేసి, సర్వ అభివృద్ధి అజెండాకి కట్టుబడి ఉండేలా చేస్తాయి. అడవి బాట పట్టినవారిదీ, అధికారంలో ఉన్న వారిదీ ఒకే తరహా అజెండా కాగలిగితే ఘర్షణ వాతావరణం పోయి, సమాజం ప్రశాంతంగా ఉంటుంది.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు
pvg2020@gmail.com

సాగర్‌ను సందర్శించిన కేఆర్‌ఎంబీ చైర్మన్



బుద్ధుని పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న కేఆర్‌ఎంబీ చైర్మన్ అతుల్ జైన్

నాగార్జునసాగర్: పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను గురువారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఎంబీఆర్) చైర్మన్ అతుల్ జైన్ కుటుంబ సమేతంగా సందర్శించారు. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ అతిథిగృహం చేరుకున్న ఆయనకు స్థానిక ఇరిగేషన్ అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించి బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. బుద్ధవనంలో ఈఓ శ్యాం, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర ఆయనకు బుద్ధవనం విశేషాలను వివరించారు. అనంతరం నాగార్జునకొండ మ్యూజియాన్ని, నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్, ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. స్పిల్‌వేతోపాటు కుడి కాలువ గేట్లను పరిశీలించారు. డ్యామ్ అంతర్భాగంలోని గ్యాలరీలను పరిశీలించటంతోపాటు రెస్టిక్ గేట్ల పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డ్యామ్ ఎస్ఈ మల్లికార్జునరావు, ఏఈ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఐఐటీల్లో సీట్లు పెరుగుతున్నాయ్!

ఐఐటీల్లో 500, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీల్లో 900 సీట్లు పెరిగే చాన్స్


కొత్త కోర్సుల్లో సీట్ల పెంపునకు కేంద్రానికి ప్రతిపాదనలు ● కేంద్రం సూత్రప్రాయ ఆమోదం




సాక్షి, హైదరాబాద్: దేశంలోనే ప్రతిష్టాత్మక సంస్థలుగా పేరున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఈసారి సీట్లు పెరగబోతున్నాయి. వీటితోపాటు జాతీయ ఇంజనీరింగ్ కాలేజీ (ఎన్ఐటీ)ల్లో కూడా సీట్లు పెరిగే అవకాశం కన్పిస్తోంది. సీట్ల పెంపుపై ఇప్పటికే ఐఐటీలు, ఎన్ఐటీలు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాయి. డిమాండ్, మారుతున్న అవసరాలకు అనుగుణంగా సీట్ల పెంపు అనివార్యమని పేర్కొన్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శరవేగంగా విస్తరిస్తోందని, ఈ పోటీని తట్టుకోవాలంటే కొన్ని కొత్త కోర్సుల అవసరం ఉందన్నాయి. ఇప్పటికే ఐఐటీలు, ఎన్ఐటీలు అవసరమైన మౌలిక వసతుల దిశగా అడుగులేస్తున్నాయి. కాబట్టి అదనపు సీట్లు అవసరమని కేంద్రాన్ని కోరాయి. ఐఐటీల్లో గరిష్టంగా 500 వరకూ సీట్లు పెంచే ఆలోచన ఉన్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ఇంకో 900 సీట్లు ఇవ్వొచ్చని భావిస్తున్నారు. సూత్రప్రాయంగా కేంద్రం ఆమోదం తెలిపిందని, దీనిపై అధికారిక అనుమతి రావాల్సి ఉందని ఓ సీనియర్ ఐఐటీ అధికారి తెలిపారు.

జోసా కౌన్సెలింగ్ నాటికి..

మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షకు 2.50 లక్షల మందిని ఎంపిక చేశారు. ఇది పూర్తయి, ఫలితాలు వెల్లడించిన వెంటనే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ మొదలుపెడుతుంది. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐల్లో (కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక సంస్థ) సీట్లను భర్తీ చేస్తారు. ఇది మొదలయ్యే నాటికి కొత్త సీట్లపై స్పష్టత వచ్చే వీలుంది. దేశంలో ఉన్న 23 ఐఐటీల్లో ప్రస్తుతం 17,740 బీటెక్ సీట్లున్నాయి. గత ఏడాది కొత్త కోర్సులు ప్రవేశ పెట్టడంతో 355 సీట్లు పెరిగాయి. ఐఐటీ తిరుపతిలో 244 సీట్లుంటే, మరో పది పెంచారు. వరంగల్ ఎన్ఐటీలో 989గా ఉన్న సీట్లను 1049కు పెంచారు. కొత్తగా 60 సీట్లతో సీఎస్ఈ (ఏఐ అండ్ డేటా సైన్స్) కోర్సును ప్రవేశపెట్టారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 40 నుంచి 110 సీట్లకు పెంచారు. ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ సీఎస్ఈలో సీట్లు పెంచారు. ఇక్కడే గత ఏడాది అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (మెటీరియల్స్ ఇంజనీరింగ్) బ్రాంచీని 60 సీట్లతో కొత్తగా ప్రవేశపెట్టారు. ఇందులో ఈసారి మరికొన్ని సీట్లు పెరిగే వీలుంది. ఐఐటీ-గాంధీనగర్, ఐఐటీ-బాంబే, ధార్వాడ్, భిలాయ్, భువనేశ్వర్, జోధ్‌పూర్, పట్నా, గువాహటిలో సీట్ల పెంపు ప్రతిపాదనలు పంపారు.





సీఎస్ఐఆర్-ఏఎంపీఆర్ఐ డైరెక్టర్‌గా డాక్టర్ తల్లాడ భాస్కర్

- భాస్కర్ సూర్యాపేట జిల్లా తూర్పుగూడెం వాసి
- అంతర్జాతీయ శాస్త్రవేత్తగా గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఐసీటీ) పూర్వ విద్యార్థి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ తల్లాడ భాస్కర్.. భోపాల్‌లోని సీఎస్ఐఆర్-అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ ప్రాసెసెస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-ఏఎంపీఆర్ఐ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. సీఎస్ఐఆర్ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నియామకం జరిపారు. డాక్టర్ భాస్కర్ త్వరలో కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రస్తుతం సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (సీఎస్ఐఆర్-ఐఐపీ), డెహ్రాడూన్‌లో చీఫ్ సైంటిస్ట్‌గా, మెటీరియల్ రిసోర్స్ ఎఫిషియెన్సీ డివిజన్ హెడ్‌గా పనిచేస్తున్న డాక్టర్ భాస్కర్ స్వస్థలం సూర్యాపేట జిల్లా తూర్పుగూడెం. హైదరాబాద్‌లోని న్యూ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ, సీఎస్ఐఆర్-ఐఐసీటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తర్వాత జపాన్, స్వీడన్, ఫ్రాన్స్‌లలో పోస్ట్‌డాక్టరల్ పరిశోధనలు చేసి, జపాన్‌లోని ఒకాయామా యూనివర్సిటీలో రీసెర్చ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2007లో సీఎస్ఐఆర్-ఐఐపీలో చేరారు. డాక్టర్ భాస్కర్ అప్లైడ్ కెమిస్ట్రీలో పరిశోధనలు చేశారు. వ్యర్థ ప్లాస్టిక్‌లు, బయోమాస్, లిగ్నిన్‌ను.. ఇంధనాలు, రసాయనాలు, అధునాతన కార్బన్ మెటీరియల్స్‌గా మార్చడంపై దృష్టి సారించారు. 250కి పైగా పీర్-రివ్యూడ్ శాస్త్రీయ పత్రాలు, 45 బుక్ చాప్టర్లు, 4 ఎడిటెడ్ పుస్తకాలు, 17 పేటెంట్లతో ఆయన గుర్తింపు పొందారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ (2022-2024) ప్రకారం ఆయన ఎనర్జీ రంగంలో ప్రపంచంలోని టాప్ 2 శాస్త్రవేత్తలలో ఒకరు. భాస్కర్ నియామకంపై సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

బీటీ పత్తి.. పురుగుమందు ఎడాపెడా

- భారతీయ పత్తి రైతులపై 37% పెరిగిన పురుగు మందుల భారం
- బీటీ పత్తి రాకతో పురుగు మందుల వాడకం తొలుత తగ్గినా.. తర్వాత తడిసిమోపెడు
- అమెరికా వర్సిటీల తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, స్పెషల్ డెస్క్ : జన్యుమార్పిడి (జీఎం) పంటలు మన దేశ సాగులోకి వచ్చిన గత ముప్పయ్యేళ్లలో ముందు ఆశించినట్టు, రసాయనిక పురుగు మందుల వాడకం తగ్గకపోగా పెరిగిందా? అంటే అవుననే చెబుతోంది ఓ తాజా అధ్యయనం. అమెరికాలోని అంతర్జాతీయ పత్తి సలహా సంఘం (ఐసీఏసీ), వాషింగ్టన్‌లోని వర్జ్యా యూనివర్సిటీ, లీ యూనివర్సిటీ పరిశోధకులు ఉమ్మడిగా ఈ అధ్యయనం చేశారు. మన దేశంలో సాగవుతున్న పత్తి విస్తీర్ణంలో 95% బీటీ పత్తి విత్తనాలనే ఇప్పుడు రైతులు వాడుతున్న సంగతి తెలిసిందే. బీటీ పత్తి మొక్క విషపూరితంగా ఉంటుంది కాబట్టి.. పురుగు ఆశించిన వెంటనే చనిపోతుందని, తద్వారా పురుగు మందులు వాడాల్సిన అవసరమే తగ్గిపోతుందని చెబుతూ వచ్చారు. అయితే, వాస్తవానికి ఆచరణలో అందుకు భిన్నంగా జరిగిందని 'జర్నల్ ఆఫ్ అగ్రేరియన్ చేంజ్'లో ఇటీవల ప్రచురితమైన అధ్యయనం తేల్చింది. భారతీయ రైతులు 1990 దశకంలో నాన్‌బీటీ పత్తి రకాలను సాగు చేసినప్పుడు వాడినప్పటికన్నా బీటీ పత్తి వచ్చిన తర్వాత ఎక్కువగా విష రసాయనాలను వాడాల్సి వస్తోందని గత ముప్పయ్యేళ్ల గణాంకాలను విశ్లేషించిన తర్వాత పరిశోధకులు నిర్ధారణకు వచ్చారు.

పెరిగిన ఖర్చులు

బీటీ పత్తిని 2002లో దేశంలోకి ప్రవేశపెట్టిన తొలిదశలో పురుగుమందుల వాడకం, తద్వారా సాగు ఖర్చు తగ్గింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో సంప్రదాయ పత్తి వంగడాలను వదిలి రైతుల్లో 95% మంది బీటీ పత్తి వైపు మళ్లారు. అయితే, బీటీపత్తిపై పెట్టుకున్న ఆశలు కొద్ది ఏళ్లలోనే తారుమారయ్యాయి. పురుగులు బీటీ పత్తికి అలవాటుపడిపోవటంతో 2010 నాటికే పురుగుమందుల వాడకం మళ్లీ పెరిగింది. '2018 నాటికి భారతీయ పత్తి రైతులు బీటీకి ముందుకన్నా 37% ఎక్కువగా పురుగు మందులపై ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది'అని అధ్యయనం తెలిపింది. ఎక్కువ మంది బీటీ పత్తిని ఏకపంటగా విస్తారంగా సాగు చేస్తుండటంతో త్వరలోనే పురుగులు బీటీ విషానికి తట్టుకునే శక్తిని పెంచుకున్నాయి. పురుగు మందుల వాడకం ఉధృతమైంది. ఈ అధ్యయనంలో భాగస్వాములైన సంస్థల్లో వాషింగ్టన్‌లోని అంతర్జాతీయ పత్తి సలహా సంఘం (ఐసీఏసీ) ఒకటి. దీని ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ కేశవ్ క్రాంతి తెలుగు వ్యక్తి కావటం విశేషం. ఆయన గతంలో నాగపూర్‌లోని ఐసీఏఆర్-కేంద్రీయ పత్తి పరిశోధన కేంద్రం (సీఐసీఆర్) సంచాలకుడిగా పనిచేశారు.



రసం పీల్చే పురుగుల విజృంభణ

కాయ తొలిచే పురుగును నియంత్రించే ప్రధాన లక్ష్యంతో బీటీ పత్తి వంగడాలను ప్రవేశపెట్టారు. అయితే, ఆ తర్వాత ఈ పురుగుల ఉధృతి తగ్గినా, అప్పటి వరకు స్వల్పంగా ఉన్న రసం పీల్చే పురుగుల బెడద గతమెన్నడూ ఎరుగనంత తీవ్రమైంది. 2006 నాటికి బీటీ పత్తి సాగు చేయటం దేశవ్యాప్తమైంది. తదనంతర కాలంలో పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఏటేటా పెరుగుతూ వచ్చింది. 2018 నాటికే భారతీయ పత్తి రైతులపై పురుగుమందుల పిచికారీ ఖర్చు భారీగా పెరిగిందని ఈ అధ్యయనం పేర్కొంది.

అమెరికాలో ఏకు మేకైన కలుపు

అమెరికాలో రైతులు గ్లైఫోసేట్ వంటి కలుపు మందులను చల్లినా తట్టుకొని నిలిచేలా జన్యుమార్పిడి చేసిన పంటల (హెచ్‌టీ క్రాప్స్)ను విస్తారంగా సాగు చేస్తున్నారు. సోయా, మొక్కజొన్న తదితర పంటలు ఈ జాబితాలో ఉన్నాయి. అమెరికాలో హెచ్‌టీ. సోయా విస్తీర్ణం 1994 లో 92 లక్షల ఎకరాలుండగా, 2018 నాటికి 11.3 కోట్ల ఎకరాలకు పెరిగింది. ఆ మేరకు గ్లైఫోసేట్ వినియోగం పెరిగింది. గ్లైఫోసేట్ పనితీరు సంక్లిష్ట పద్ధతిలో ఉంటుంది కాబట్టి దీనికి కలుపు మొక్కలు అలవాటు పడి, చనిపోకుండా ఎదురు తిరగవని గ్లైఫోసేట్ తయారు చేసిన కంపెనీ చెబుతూ వచ్చింది. అయితే, 1998 నాటికే డజన్ల కొద్దీ కలుపు మొక్కలు గ్లైఫోసేట్ చల్లినా చనిపోని పరిస్థితి ఏర్పడింది. దక్షిణ అమెరికాలో జన్యుమార్పిడి పంటలకు ఆదరణ పెరుగుతున్న కొద్దీ రైతులు హెచ్‌టీ సోయా సాగు విస్తీర్ణాన్ని పెంచారు. కెనడాలోనూ హెచ్‌టీ మొక్కజొన్న, షుగర్ బీట్, ఆవ పంటల సాగు విస్తీర్ణం తామరతంపరగా విస్తరించింది. 'ఈ (జన్యుమార్పిడి పంటల) సాంకేతికత చెప్పినట్టు రసాయనిక పురుగుమందుల వినియోగం తొలుత తగ్గినా, తదనంతరం అంతకుముందుకన్నా పెరిగిపోయింది. ఏదో ఒకే రకం పంటనే పొలం అంతటా సాగు చేసే పారిశ్రామిక సాంద్ర వ్యవసాయ పద్ధతి వల్ల రసాయనిక పురుగుమందులతో పాటు ఎరువుల వాడకం కూడా పెరిగిపోయింది. శక్తివంతమైన రసాయనిక ఎరువులు, పురుగుమందుల కంపెనీల ఒత్తిళ్ల ప్రభావం వల్ల ఆయా దేశాల ప్రభుత్వాలు శిలాజ ఇంధనాల వాడకాన్ని పెంపొందించే జన్యుమార్పిడి పంటలను గట్టిగా ప్రోత్సహిస్తున్నాయి..' అని ఈ అధ్యయనం విశ్లేషించింది. భారత్‌లోనూ గ్లైఫోసేట్‌ను తట్టుకునే హెచ్‌టీ బీటీ పత్తి వంగడాన్ని అనేక లక్షల ఎకరాల్లో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, గత కొన్ని సంవత్సరాలుగా అనధికారికంగా సాగు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లోనూ పెరిగిన గ్లైఫోసేట్ వాడకం



తెలంగాణ, ఏపీలోకూడా హెర్బిసైడ్ టాలరెంట్ పత్తి విత్తనాల ఉపయోగం వల్ల గ్లైఫోసేట్ వాడకం పెరిగింది. ఆ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కలుపు మందును రెండు, మూడు సంవత్సరాలు 60 రోజుల పాటు నిషేధించాయి. తెలంగాణలో పత్తి విస్తీర్ణం పెరిగింది. గులాబీ పురుగులు మరింత ఉధృతం కావటంతో ప్రమాదకర రసాయనాల వాడకం ఎక్కువైంది. సాగు ఖర్చు పెరిగింది.

– డా. దొంతి నరసింహారెడ్డి, విధాన విశ్లేషకుడు, పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా, హైదరాబాద్

పాకిస్తాన్ పౌరులకు అన్ని వీసాలూ రద్దు

న్యూఢిల్లీ: పాకిస్తాన్ పౌరులకు ఇచ్చిన వీసాలు రద్దు చేస్తూ భారత ప్రభుత్వంగురువారం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల వీసాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఈ నెల 27 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టంచేసింది. అలాగే ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న భారత పౌరులు సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తిరిగిరావాలని ఆదేశించింది. పాక్ పౌరులకు వీసా సేవలను వెంటనే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. పాక్ పౌరులకు ఇచ్చిన సాధారణ వీసాలు ఈ నెల 27 దాకా, మెడికల్ వీసాలు ఈ నెల 29 దాకా మాత్రమే చెల్లుబాటు అవుతాయని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. వీసాల గడువు ముగియక ముందే పాక్ పౌరులు వారి స్వదేశానికి వెళ్లిపోవాలని తేల్చిచెప్పింది. భారత పౌరులెవరూ పాక్‌లో పర్యటించవద్దని సూచించింది. ఇప్పటికే అక్కడ ఉన్నవారు త్వరగా వెనక్కి రావాలని పేర్కొంది. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కేబినెట్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయాలకు కొనసాగింపుగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు విదేశాంగ శాఖ వివరించింది.

సరిహద్దులో రిట్రీట్ ఈవెంట్లు నిలిపివేత

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. భారత్–పాకిస్తాన్ సరిహద్దులో మూడుచోట్ల రిట్రీట్ ఈవెంట్లు రద్దు చేస్తున్నట్లు గురువారం వెల్లడించింది. పంజాబ్‌లోని అట్టారీ, హుస్సైనీవాలా, సాడ్కీలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం లేదని పేర్కొంది. సరిహద్దులో ఇండియన్ గార్డు కమాండర్ పాక్ గార్డు కమాండర్‌తో నిత్యం కరచాలనం చేయడం దశాబ్దాలుగా ఒక ఆనవాయితీగా వస్తోంది. దీన్నే రిట్రీట్ ఈవెంట్ అంటారు. సీమాంతర ఉగ్రవాదాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్న సంగతి ప్రపంచానికి తెలియజేయడానికే రిట్రీట్‌ను రద్దు చేస్తున్నట్లు బీఎస్ఎఫ్ స్పష్టం చేసింది. రెచ్చగొట్టే చర్యలతో శాంతి నెలకొనడం అసాధ్యమని పేర్కొంది. సరిహద్దులో రిట్రీట్ ఈవెంట్లు రద్దు చేసినప్పటికీ ఇతర కార్యక్రమాలు యథాతథంగా కొనసాగుతాయని, సామాన్య ప్రజలకు తిలకించవచ్చని బీఎస్ఎఫ్ అధికారులు సూచించారు.

దారి తప్పి.. పాక్ రేంజర్లకు పట్టుబడ్డ భారత జవాన్

న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాను ఒకరు పొరపాటున పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లగా అక్కడి రేంజర్లు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్‌లోని ఫెరోజ్‌పూర్‌లో బుధవారం ఘటన చోటుచేసుకుంది. 182వ బెటాలియన్‌కు చెందిన కాని స్టేబుల్ పీకే సింగ్ సరిహద్దులు దాటి వెళ్లి, పాక్ జవాన్లకు దొరికిపోయారని బీఎస్ఎఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన యూనిఫాంలోనే ఉన్నారని, వెంట సర్వీస్ రైఫిల్ కూడా ఉందని వివరించింది. కొందరు రైతులతోపాటు వెళ్తూ విశ్రాంతి తీసుకునేందుకు ముందున్న చెట్టు కిందికి వెళ్లగా దొరికిపోయారని పేర్కొంది. ఆయన్ను విడిపించుకునేందుకు పాక్ రేంజర్లతో ఫ్లాగ్ సమావేశం జరిగిందని వెల్లడించింది.

పాక్‌ను సమర్థించిన అస్సాం ఎమ్మెల్యే అరెస్ట్

గౌహతి: పహల్గాం ఉగ్రదాడి విషయంలో పాకిస్తాన్‌ను సమర్థిస్తూ మాట్లాడిన ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాంను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. పాక్ అనుకూల వ్యాఖ్యలున్న ఎమ్మెల్యే వీడియోను తాను చూశానన్నారు. దేశ ద్రోహం ఆరోపణల కింద కేసు నమోదు చేసి, నగావ్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నట్లు డీజీపీ తెలిపారన్నారు. అమీనుల్ ఇస్లాంను కోర్టులో హాజరు పర్చి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం: అమెరికా

వాషింగ్టన్: అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు తమతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్న మొట్టమొదటి దేశం భారత్ అని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ తెలిపారు. భారత్ వస్తువులపై విధించిన 26 శాతం టారిఫ్‌ల అమలు నిలిపివేత గడువు జూలై 8వ తేదీతో ముగియనుందని మంత్రి వివరించారు. అయితే, మిగతా దేశాలతో పాటు భారత్‌పైనా 10% టారిఫ్‌లు ప్రస్తుతం అమలవుతున్నాయని బెస్సెంట్ వివరించారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశలో ఉన్నాయన్నారు. త్వరలోనే ఒక ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశముందని చెప్పారు.

133 మంది విద్యార్థుల వీసా రద్దును నిలిపేసిన అమెరికా కోర్టు

వాషింగ్టన్: అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థులకు ఊరట లభించింది. 133 మంది అంతర్జాతీయ విద్యార్థులకు సెవిస్ (స్టూడెంట్ ఎక్స్చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) వీసాలను పునరుద్ధరించాలని జార్జియాలోని అమెరికా ఫెడరల్ జడ్జి ఆదేశించారు. వీరిలో ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే ఉండటం గమనార్హం. వీరిలో చాలా మందికి నేర చరిత్ర లేదు. కేవలం చిన్న చిన్న ఉల్లంఘనలు పాల్పడిన విద్యార్థులకు సైతం సెవిస్ రికార్డులను రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ముష్కర మూకలను మట్టిలో కలిపేస్తాం

ఉగ్రవాదులను, వారికి మద్దతిస్తున్న వారిని కలలో కూడా ఊహించలేని విధంగా శిక్షిస్తాం

- ఎక్కడ దాక్కున్నా సరే వెతికి మరీ పట్టుకొస్తాం
- ఉగ్రవాద శేషాన్ని సమూలంగా అంతం చేసే సమయం వచ్చింది
- ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరికలు



మధుబని: పహల్గాంలో పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులు భూమండలంలో ఎక్కడ దాక్కున్నా సరే వెతికి మరీ పట్టుకొని శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న దుష్ట శక్తులకు తగిన శిక్ష విధించక తప్పదని హెచ్చరించారు. గురువారం బిహార్‌లోని మధుబనిలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. రూ.13,500 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, నమో భారత్ ర్యాపిడ్ రైలుతో పాటు మరికొన్ని రైళ్లను ప్రారంభించారు. జాతీయ పంచాయత్ అవార్డులు ప్రదానం చేశారు. పహల్గాం మృతులకు సంతాప సూచకంగా బహిరంగ సభలో తొలుత మౌనం పాటించారు. అనంతరం మోదీ కొద్దిసేపు ఆంగ్ల భాషలో మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాద దాడి వెనుక ఉన్న ముష్కరులందరినీ కచ్చితంగా శిక్షిస్తామని ప్రతిన బూనారు. ఇలాంటి దాడులు మన నైతిక స్థైర్యాన్ని ఏమాత్రం దెబ్బతీయలేవని అన్నారు. శత్రువులు కేవలం నిరాయుధ పర్యాటకులనే కాదు, మనదేశాన్ని లక్ష్యంగా చేసుకొనే సాహసానికి ఒడిగట్టారని చెప్పారు. వారిని మట్టిలో కలిపేస్తామని స్పష్టంచేశారు. దేశంలో మిగిలిన ఉన్న ఉగ్రవాద శేషాన్ని తుదముట్టించే సమయం వచ్చిందన్నారు. ఆయన ఇంకా ఏం చెప్పారంటే...

కుట్రదారుల వెన్నువిరచడం ఖాయం

''మిత్రులారా.. బిహార్ గడ్డపై నుంచి మొత్తం ప్రపంచానికి చెబుతున్నా. ఉగ్రవాదులు, వారికి మద్దతిస్తున్నవారు ఎక్కడ దాగి ఉన్నా సరే గుర్తించి, బంధించి, శిక్షిస్తాం. ప్రపంచం అంచుల దాకా వారిని వేటాడుతాం. కలలో కూడా ఊహించలేని విధంగా శిక్ష విధిస్తాం. ఉగ్రవాదులెవరూ తప్పించుకోలేరు. ముష్కర మూకలను చట్టం ముందు నిలబెట్టడం తథ్యం. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం కుట్రదారుల వెన్ను విరచడం ఖాయం. శిక్ష తప్పనిసరిగా ఉంటుందన్న సంగతి గుర్తుంచుకోవాలి. ఈ విషయంలో మన దేశమంతా ఒకే మాటపై ఉంది. మానవత్వాన్ని విశ్వసించే వారంతా మన వెంటే ఉన్నారు. ఉగ్రవాదుల హేయమైన చర్య మనసున్న ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. వారికి దేశమంతా మద్దతుగా నిలుస్తోంది. ఎవరూ అధైర్యపడాల్సిన పని లేదు. ఈ ప్రతికూల సమయంలో మనకు అండగా నిలిచిన ప్రపంచ దేశాల నేతలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా'' అని ప్రధాని మోదీ అన్నారు.

దేశమంతటా ఒకేలా ఆగ్రహావేశాలు

ఉగ్రవాద దాడిలో ఎంతోమంది నష్టపోయారు. కొందరు తమ కుమారులను పోగొట్టుకున్నారు. మరికొందరు తమ సోదరులను, జీవిత భాగస్వాములను కోల్పోయారు. బాధితులు దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందినవారు ముష్కరుల రాక్షసత్వానికి బలయ్యారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి దాకా దేశమంతటా ఆగ్రహావేశాలు, విచారం ఒకేలా వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి దారుణాలు ఇకపై జరగడానికి వీల్లేదు. వేగవంతమైన అభివృద్ధి కావాలంటే శాంతి, భద్రతలతో కూడిన పరిస్థితులు అత్యంత కీలకం.

నీటి మళ్లింపు.. పాక్‌పై యుద్ధ ప్రకటనే

భారత్‌పై దాయాది ఆక్రోశం.. ప్రతీకార చర్యలు

- సిమ్లా ఒప్పందం సహా ద్వైపాక్షిక ఒప్పందాల నిలిపివేత
- భారత విమానాలకు పాక్ గగనతలం బంద్
- వాఘా సరిహద్దు తక్షణమే మూసివేత
- భారత పౌరులకు ఇచ్చిన వీసాలన్నీ రద్దు
- సింధూ జలాలపై హక్కులు కాపాడుకుంటామని వెల్లడి

ఇస్లామాబాద్: సింధూ నది జలాల ఒప్పందాన్ని లెక్కచేయకుండా నీటి మళ్లింపు కోసం ఎలాంటి చర్యలు చేపట్టినా అది తమపై యుద్ధ ప్రకటనగానే పరిగణిస్తామని పాకిస్తాన్ స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత్ విధించిన ఆంక్షలకు ప్రతీకారంగా పాకిస్తాన్ సైతం భారత్‌పై ఆంక్షలు ప్రకటించింది. భారతదేశ విమానాలు తమ గగనతలం గుండా ప్రయాణించడానికి వీల్లేదని పేర్కొంది. ఇండియాతో అన్ని రకాల వాణిజ్య కార్యకలాపాలు, ద్వైపాక్షిక ఒప్పందాలతోపాటు కీలకమైన సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. వాఘా సరిహద్దును మూసివేస్తున్నట్లు వెల్లడించింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో గురువారం నేషనల్ సెక్యూరిటీ కమిటీ(ఎన్ఎస్సీ) సమావేశం జరిగింది. పలువురు మంత్రులతోపాటు త్రివిధ దళాల అధిపతులు హాజరయ్యారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత ప్రభుత్వం విధించిన ఆంక్షలపై చర్చించారు. భారత్‌పైనా అదే తరహా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఎన్ఎస్సీ భేటీ అనంతరం పాక్ ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్‌తో అమల్లో ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలను నిలిపివేసే హక్కు తమకు ఉందని పేర్కొంది. కేవలం సిమ్లా ఒప్పందమే కాకుండా మిగతా ఒప్పందాలనూ నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది.

పాక్ ప్రభుత్వ నిర్ణయాలు

- ఇండియాతో ద్వైపాక్షిక ఒప్పందాలతోపాటు సిమ్లా ఒప్పందం సైతం నిలిపివేత.
- వాఘా బోర్డర్ పోస్టు తక్షణమే మూసివేత. రాకపోకలు పూర్తిగా రద్దు.
- ఈ సరిహద్దు గుండా బయటకు వెళ్లినవారు 30లోగా తిరిగిరావాలి.
- సార్క్ వీసా మినహాయింపు పథకం(ఎస్వీఈఎస్) కింద భారతీయులకు ఇచ్చిన అన్ని రకాల వీసాలు వెంటనే రద్దు. సిక్కు యాత్రికులకు మాత్రం మినహాయింపు.
- ఎస్వీఈఎస్ పథకం కింద పాకిస్తాన్‌లో ఉన్న భారతీయులు 48 గంటల్లోకి బయటకు వెళ్లిపోవాలి.
- పాక్‌లో ఉన్న భారతీయ త్రివిధ దళాల సభ్యులు ఏప్రిల్ 30 లోగా వెనక్కి వెళ్లిపోవాలి. భారత హైకమిషన్‌లోని ఈ పోస్టులు రద్దు.
- భారత హైకమిషన్‌లో పనిచేస్తున్న భారత సహాయక సిబ్బంది సైతం స్వదేశానికి వెళ్లిపోవాలి.
- ఇండియన్ హైకమిషన్‌లో దౌత్యవేత్తలు, సిబ్బంది సంఖ్య 30కి పరిమితం. ఇది ఈ నెల 30వ తేదీ నుంచి అమల్లోకి.
- పాక్ గగనతలంపై ప్రయాణించేందుకు భారత విమానాలు అనుమతి లేదు. ఈ నిర్ణయం ఇది తక్షణమే అమలు.
- సింధూ నది జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం దారుణం. 24 కోట్ల మంది పాక్ పౌరులకు ఈ జలాలు జీవనాధారం.
- ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఉగ్రవాదం ఏ రూపంలో, ఎక్కడున్నా అంతం చేయాల్సిందే. శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉన్నాం. ఒకవేళ పాక్ సార్వభౌమత్వానికి, భద్రతకు ముప్పు వాటిల్లితే తగిన రీతిలో బదులిస్తాం.
- రాజకీయ ఎజెండా కోసం పాక్‌పై నిందలు వేయడం భారత్ మానుకోవాలి. ఇలాంటి నిందలు శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆగ్నికి ఆజ్యం పోసేలా వ్యవహరించకూడదు.

వైమానిక దాడికి రెడీనా ?

సన్నాహక విన్యాసాలు చేస్తున్న భారత వాయుసేన యుద్ధవిమానాలు

న్యూఢిల్లీ: పహల్గాం దాడికి ప్రతీకారంగా, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాలపై భారత వాయుసేన దాడులు చేయొచ్చనే అంచనాలకు బలం చేకూర్చేలా గురువారం కొత్త పరిణామం సంభవించింది. సెంట్రల్ సెక్టార్‌లో ' ఎక్సర్‌సైజ్ ఆక్రమణ్' పేరిట భారత వాయుసేన అతిపెద్ద వైమానిక విన్యాసాలు మొదలెట్టింది. సమతల మైదాన ప్రాంతాలతోపాటు దుర్భేద్య పర్వతమయ ప్రాంతాల్లో శత్రుమూకలను ఎలా తుదముట్టించాలి? ఎలా సులువుగా తప్పించుకోవాలి అనే అంశాలపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాలు అభ్యాసం చేశాయని రక్షణ రంగంలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. విదేశం నుంచి కొనుగోలు చేసుకున్న అత్యంత అధునాతన రఫేల్ యుద్ధ విమానాలు ముందుండి డ్రిల్ చేయగా వాటిని అనుసరిస్తూ సుఖోయ్–30, ఇతర రకాల యుద్ధవిమానాలు ఈ వైమానిక విన్యాసాల్లో పాల్గొన్నాయి. శత్రుస్థావరాలను ధ్వంసంచేయడం, శత్రువుల దాడుల నుంచి ఒడుపుగా తప్పించుకోవడం, ప్రతిదాడి చేస్తే దీటుగా బదులివ్వడం, సుదూరంలోని లక్ష్యలపై దాడిచేయడం వంటివి మరోసారి అభ్యసనం చేశారు. తూర్పు సెక్టార్‌లోని స్థావరాల్లోని బలగాలు ఈ అభ్యసనంలోని బృందాలకు సాయపడుతున్నాయి. నిజంగా యుద్ధం వస్తే హఠాత్పరిణామాలను ఎదుర్కొనేలా యుద్ధవిమాన పైలెట్లకు దోహదపడేలా ఈ విన్యాసాలకు పథకరచన చేసినట్లు తెలుస్తోంది. భూతలం మీద లక్ష్యాలతోపాటు విద్యుదయస్కాంత సైనిక ఉపకరణాల వినియోగంపైనా మరింత పట్టుచిక్కేలా డ్రిల్ కొనసాగుతున్నట్లు సమాచారం. భారతవాయుసేన పైలట్లలో అత్యంత దూకుడు, నైపుణ్యమున్న 'టాప్ గన్' పైలట్లతో ఈ వైమానిక విన్యాసాలు చేయిస్తున్నారు. దూరంలోని లక్ష్యాలపై బాంబులు జారవిడవడం వంటివి ప్రాక్టీస్ చేస్తున్నారు. సమరంలో సన్నద్ధత, అత్యంత నైపుణ్యం సాధించడంపై జరుపుతున్న ఈ అభ్యాసాన్ని ఐఏఎఫ్‌లోని సీనియర్ ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ విన్యాసాల్లో పాల్గొనేందుకు పంజాబ్‌లోని అంబాలా స్థావరం నుంచి, పశ్చిమబెంగాల్‌లోని హషిమరా స్థావరం నుంచి శత్రు భీకర రఫేల్ యుద్ధవిమానాలు బయల్దేరి వెళ్లాయి.

భద్రతా లోపాలు నిజమే

- స్థానిక అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వలేదు
- అఖిలపక్ష సమావేశంలో అంగీకరించిన కేంద్రం
- సెక్యూరిటీ ప్రొటోకాల్స్ వైఫల్యంపై ప్రశ్నించిన పార్టీలు
- ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయాల్సిందేనని స్పష్టీకరణ
- ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వానికి అండగా ఉంటామని వెల్లడి

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాద దాడికి భద్రతాపరమైన లోపాలే కారణమని కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. బైసారన్‌లోకి పర్యాటకులను అనుమతిస్తున్నట్లు స్థానిక అధికారులు భద్రతా దళాలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాల్సి ఉండగా అలా జరగలేదని పేర్కొంది. సాధారణంగా జూన్‌లో అమర్‌నాథ్ యాత్ర జరిగే దాకా బైసారన్‌లో పర్యాటకుల రాకపోకలపై ఆంక్షలు విధిస్తుంటారు. ఈసారి మాత్రం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే యాత్రికులను అనుమతించారని కేంద్రం వెల్లడించింది. పహల్గాం దాడి నేపథ్యంలో గురువారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. బీజేపీ, కాంగ్రెస్ సహా పలు పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యారు. ఉగ్ర దాడి బాధితులకు తొలుత సంతాపం ప్రకటించారు. దాడి, తదనంతర పరిణామాలపై చర్చించారు. దాడిని నేతలంతా ముక్తకంఠంతో ఖండించారు. దాడి జరిగిన తీరును ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా వివరించారు. అనంతరం విపక్ష నేతలు మాట్లాడుతూ సెక్యూరిటీ ప్రొటోకాల్స్ వైఫల్యంపై ప్రశ్నలు గుప్పించారు. ''భద్రతా దళాలెక్కడ? సీఆర్‌పీఎఫ్ ఎక్కడ?'' అని నిలదీశారు. దేశంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయాల్సిందేనని పార్టీలకు అతీతంగా నేతలంతా అభిప్రాయపడ్డారు. ఈ దిశగా నిర్ణయాత్మక కార్యాచరణ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో ప్రభుత్వానికి తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని చెప్పారు. ఉగ్రవాదాన్ని సమూలంగా అంతం చేసేందుకు జరుగుతున్న పోరాటంలో దేశ ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.

సానుకూల వాతావరణాన్ని దెబ్బతీయడానికే: కేంద్రం

ప్రజలకు భద్రత కల్పించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు అఖిలపక్షానికి ప్రభుత్వం వెల్లడించింది. మన దేశ ఆర్థికవ్యవస్థ పురోగమిస్తుండడం, జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం ఊపందుకుంటున్న నేపథ్యంలో సానుకూల వాతావరణాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడికి దిగినట్లు పేర్కొంది. దాడి గురించి తెలియగానే కేంద్రం సరిగా స్పందించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుపట్టారు. పహల్గాం దాడికి ప్రతిస్పందనగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము అండగా ఉంటామని విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. అఖిలపక్ష భేటీకి ప్రధాని మోదీ ఎందుకు రాలేదని ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్ ప్రశ్నించారు. త్వరలో మోదీ నేతృత్వంలో అఖిలపక్షం నిర్వహించాలని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ కోరారు. దేశమంతా ఐక్యంగా ఉగ్రవాదంపై పోరాటం సాగించాలని అఖిలపక్ష నేతలు చెప్పినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ పోరాటంలో ప్రభుత్వానికి బాసటగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు. అఖిలపక్ష భేటీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, ఎస్.జైశంకర్, జె.పి.నడ్డా, కిరణ్ రిజిజుతోపాటు వివిధ పార్టీల నేతలు సుప్రియా సూలే (ఎన్సీపీ–ఎస్పీ), ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ), అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్), లావు శ్రీకృష్ణదేవరాయలు (టీడీపీ), శ్రీకాంత్ షిండే (శివసేన–షిండే), సుదీప్ బందోపాధ్యాయ, ప్రేమ్‌చంద్ గుప్తా, రాంగోపాల్ యాదవ్ (ఎస్పీ), తిరుచ్చి శివ (డీఎంకే) తదితరులు హాజరయ్యారు.



గురువారం అఖిలపక్ష భేటీలో అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు, ఖర్గే, రాహుల్ తదితరులు

క్షిపణి పరీక్షలకు సిద్ధమైన పాక్

కరాచీ తీరంలో చేపట్టే చాన్స్

ఇస్లామాబాద్: సరిహద్దు వెంట తరచూ కాల్పుల విరమణ ఉల్లంఘనలతో కవ్వింపు చర్యలకు పాల్పడే పాకిస్తాన్ పహల్గాం ఉదంతం తర్వాత సైతం తన బుద్ధిని మార్చుకోలేదు. తాజాగా కరాచీ తీరం వెంట క్షిపణి పరీక్షను చేపట్టబోతున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ మేరకు తూర్పున ఉన్న కరాచీ తీరంలో భూతలం నుంచి భూతలం మీదకు ప్రయోగించి క్షిపణిని పరీక్షించనున్నట్లు ఒక నోటీస్‌ను జారీచేసింది. అరేబియా సముద్రంలో తమ పరిధిలోని సముద్రజలాల మీదుగా ఎలాంటి వైమానిక రాకపోకలు లేకుండా నిషేధం అమల్లోకి తెచ్చింది. ఆ ప్రాంతాన్ని నో–ఫ్లై జోన్‌గా ప్రకటించింది. ఆ పరిధిలో నావికులు సంచరించకూడదని హెచ్చరించింది. దాదాపు 480 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల మిస్సైల్‌ను పరీక్షించనుంది. పాక్ తన ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్(ఈఈజెడ్)ప్రాంతంలో ఏప్రిల్ 25వ తేదీన ఈ క్షిపణి పరీక్ష చేపట్టే అవకాశం ఉందని భారత రక్షణ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పహల్గాం ఉదంతంపై ఆగ్రహంతో భారత్ తమపై ప్రతీకార దాడులకు దిగితే తాము కూడా అందుకు సన్నద్ధంగా ఉన్నామని తెలియజేప్పేందుకే పాకిస్తాన్ ఇలా క్షిపణి పరీక్షలకు దిగిందని యుద్ధరంగ నిపుణులు చెబుతున్నారు.

రాష్ట్రపతితో అమిత్ షా, జై శంకర్ కీలక భేటీ

న్యూఢిల్లీ: కశ్మీర్‌లో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదుల మెరుపుదాడి నేపథ్యంలో క్షీణించిన భారత్, పాక్ సత్సంబంధాలు, జమ్మూకశ్మీర్‌లో తాజా పరిస్థితి తదితరాలపై తాజా వివరాలు అందించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లు గురువారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని భారత్ పక్కనబెట్టడం, సిమ్లా ఒప్పందం నుంచి పాకిస్తాన్ వైదొలగడంతో మారిన పరిణామాలపై రాష్ట్రపతి ముర్ముతో మంత్రులిద్దరూ మాట్లాడారు. రాష్ట్రపతితో అమిత్ షా, జైశంకర్ భేటీ ఫొటోను రాష్ట్రపతి భవన్ కార్యాలయం తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. నేతలిద్దరూ రాష్ట్రపతికి ఉగ్రదాడి సంబంధ అంశాలు, తదనంతర పరిణామాలను వివరించినట్లు తెలుస్తోంది.

రంగంలోకి యుద్ధనౌకలు!

- యుద్ధ విమానాలు, క్షిపణులతో పాక్ వైపు ఐఎన్ఎస్ విక్రాంత్
- దన్నుగా వెంట వెళ్తున్న ఐఎన్ఎస్ సూరత్

సాక్షి, విశాఖపట్నం: ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం కూడా సన్నద్ధమవుతోంది. యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, దానికి తోడుగా యుద్ధనౌక ఐఎన్ఎస్ సూరత్ పాక్ దిశగా కదులుతున్నట్టు సమాచారం. అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణులతో విక్రాంత్ పూర్తి స్థాయిలో 'సిద్ధమైనట్టు' తెలుస్తోంది. సరిహద్దులు, తీర ప్రాంతాల్లో పహారా విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ త్రివిధ దళాలకు కీలక ఆదేశాలు అందినట్టు చెబుతున్నారు. విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళం అధిపతి రాజేష్ పెండార్కర్ సిబ్బందితో గురువారం సాయంత్రం అత్యవసరంగా భేటీ సమావేశం నిర్వహించారు. దేశ ప్రయోజనాల కోసం ఎక్కడ నుంచైనా, ఏ సమయంలోనైనా పోరుకు సిద్ధంగా ఉండాలన్నారు.

క్షిపణిని పరీక్షించిన భారత యుద్ధనౌక

న్యూఢిల్లీ: అరేబియా సముద్ర జలాల్లో క్షిపణిని పరీక్షించబోతున్నామని పాకిస్తాన్ ఓవైపు ప్రకటన చేస్తుండగానే భారత్ తన అమ్ములపొదిలోని మిస్సైల్‌ను పరీక్షించి తన యుద్ధ సన్నద్ధతను చాటింది. పాకిస్తాన్ శుక్రవారం క్షిపణిని పరీక్షించే అవకాశం ఉండగా అంతకుముందు(గురువారం)రోజే భారత్ ఐఎన్ఎస్ సూరత్ యుద్ధనౌక నుంచి క్షిపణిని విజయవంతంగా పరీక్షించడం గమనార్హం. 70 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను తుత్తునియలు చేసే సత్తా ఈ క్షిపణి సొంతం. గగనతల లక్ష్యాలను భూతలం నుంచి ప్రయోగించే రకం మిస్సైల్‌ను గురువారం భారత నావికాదళాలు విజయవంతంగా పరీక్షించాయని ఇండియన్ నేవీ ఒక ప్రకటనలో పేర్కొంది. '' తన జాడ తెలీకుండా ఉండేందుకు అత్యంత తక్కువ ఎత్తులో సముద్రజలాలకు సమీపంగా వెళ్తూ, వేగంగా దూసుకెళ్లి ఖచ్చితత్వంతో లక్ష్యాన్ని క్షిపణి ఛేదించింది. అన్ని పరామితులను సాధించింది. విజయాల్లో మైలురాయిలాంటి ఈ పరీక్ష దేశ సముద్రజలాల భద్రతలో, దేశ రక్షణలో నేవీ అంకితభావాన్ని మరోసారి చాటింది'' అని నేవీ ఆ ప్రకటనలో వెల్లడించింది.

జీ20 దేశాల మద్దతు కూడగడుతున్న భారత్

న్యూఢిల్లీ: ఆటవికంగా దారుణ దాడులకు తెగబడుతున్న ముష్కర మిన్నాగులకు పాలుపోసి పెంచుతున్న పాకిస్తాన్‌ను పహల్గాం ఉదంతం వేళ అంతర్జాతీయ వేదికలపై నిలదీయాలని భారత్ నిర్ణయించుకుంది. అందులోభాగంగా ప్రతిష్టాత్మక జీ20 కూటమి సభ్యదేశాల రాయబారులతో భారత విదేశాంగ శాఖ సమావేశాన్ని ఏర్పాటుచేసింది. దాడి జరిగిన తీరు, విచక్షణారహితంగా కాల్పులు జరపడం, ఉగ్రవాదుల్లో పాక్ జాతీయులూ ఉన్న విషయాలను ఆయా దేశాల దౌత్యవేత్తలకు భారత విదేశాంగ వివరించింది. దాడి నేపథ్యంలో ఇప్పటికే ప్రపంచదేశాల నుంచి భారత్‌కు సానుభూతి, ఆపత్కాలంలో సంపూర్ణ మద్దతు పలుకుతున్న వేళ కీలక జీ20 కూటమిలోని ముఖ్యమైన సభ్యదేశాల దౌత్యవేత్తలతో భారత్ భేటీ ఏర్పాటుచేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పాక్‌కు అన్నిరకాలుగా సహాయసహకారాలు అందించే చైనా సైతం ఈ భేటీలో పాల్గొని భారత్‌కు మద్దతు పలకడం విశేషం. గురువారం ఢిల్లీలో ఈ సమావేశం జరిగింది. చైనాతోపాటు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, మలేసియా దేశాల రాయబారులూ ఈ భేటీలో పాల్గొని దాడిని తీవ్రంగా ఖండించాయని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ చెప్పారు.

పాక్ హై కమిషన్ కార్యాలయంలోకి కేక్

న్యూఢిల్లీ: పహల్గాంలో పాక్ ఉగ్రమూకల పైశాచికత్వంపై దేశమంతటా అట్టుడికి పోతోంది. ఘటనను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండిస్తోంది. అదేవిధంగా, ఢిల్లీలోని పాక్ హై కమిషన్ కార్యాలయం ఎదుట కొందరు నిరసన ప్రదర్శన చేపట్టారు. పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేస్తున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ఆ కార్యాలయం గేట్ వద్దకు ఓ వ్యక్తి కేక్ బాక్స్ పట్టుకుని వచ్చాడు. మీడియా సిబ్బంది వేస్తున్న ప్రశ్నల నుంచి తప్పించుకుంటూ కేక్ బాక్స్‌తో ఆ వ్యక్తి లోపలికి చొచ్చుకెళ్లాడు. ఇందుకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వీడియోపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. 'న్యూఢిల్లీలోని పాక్ హైకమిషన్‌కు ఈ రోజు (ఆర్డరిచ్చిన) కేక్‌లు అందాయి'అంటూ ఈ వీడియోకు క్యాప్షన్ పెట్టారు. ఇంతకీ ఆ బాక్స్‌లో ఏముందంటూ కొందరు ఆసక్తిగా ప్రశ్నలు సంధించారు. వేడుక చేసుకోవడానికి కేక్ తెప్పించి ఉంటారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. జవాను వీరమరణం



జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్‌లో గురువారం చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ ప్రత్యేక విభాగం జవాను ఒకరు అసువులు బాశారు. ఉగ్రవాదుల కదలికలపై విశ్వసనీయ సమాచారం అందుకున్న బలగాలు డుడు–బసంత్‌గఢ్ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా తారసపడిన ఉగ్రమూకలు బలగాలపైకి అకస్మాత్తుగా కాల్పులకు దిగాయి. ఘటనలో హవల్దార్ ఝంటు అలీ షేక్ నేలకొరిగారు. అనంతరం కూడా ఎదురు కాల్పులు కొనసాగాయి. ఈ సందర్భంగా బలగాలు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నాయి. కాగా, గత 24 గంటల్లో చోటుచేసుకున్న మూడో ఎన్‌కౌంటర్ ఇది. బుధవారం బారాముల్లాలోని ఉడి నాలా వద్ద జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదుల హతమవ్వడం తెల్సిందే.

టారిఫ్‌లు అమెరికాకు భస్మాసుర హస్తమే



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వృద్ధి పాలిట భస్మాసుర హస్తంలా తయారయ్యాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) అంటోంది. ఈ టారిఫ్‌ల తోపాటు ప్రపంచ దేశాల్లో ఉద్రిక్తతల వంటివి కూడా ప్రపంచ ఆర్థిక మందగమనానికి దారితీస్తున్నాయని ఐఎమ్ఎఫ్ పేర్కొంది. అందుకే, ఐఎమ్ఎఫ్ ఈ ఏడాది జనవరిలో ఇచ్చిన వృద్ధి అంచనాలన్నింటినీ ఏప్రిల్‌లో తగ్గించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 3.3 శాతం నుంచి ఏకంగా 2.8కి కుదించింది.

దేశం	వృద్ధి రేటు అంచనాలు (శాతంలో)	
	జనవరి	ఏప్రిల్
భారత్	6.5	6.2
చైనా	4.6	4
ప్రపంచ ఆర్థిక వ్యవస్థ	3.3	2.8
అమెరికా	2.7	1.8
యూరోజోన్	1	0.8

క్లుప్తంగా...

జోగుళాంబ ఆలయ అర్చకుడిపై వేటు



అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయ అర్చకుడిపై ఆ శాఖ అధికారులు వేటు వేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఉప ప్రధానార్చకుడు ఆనంద్ శర్మపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆలయ ఈవో పురేందర్ కుమార్ గురువారం తెలిపారు. శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో.. ఉప ప్రధానార్చకుడిగా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ శర్మపై కొద్ది రోజులుగా పలు ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. ఆ ఆరోపణలపై దేవదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం ఆనంద్ శర్మపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంకా విచారణ కొనసాగుతోందని, ఆరోపణల అంశాలను నిర్ణీత సమయంలో వెల్లడిస్తామని తెలిపారు.

మొక్కజొన్న మంటల్లో రైతు మృతి

తిరుమలాయపాలెం: మొక్కజొన్న చేనులో చెత్తకు నిప్పంటించిన రైతు.. అదే మంటల్లో చిక్కుకుని మృతి చెందాడు. వివరాలివి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుకు చెందిన కీలారు వెంకన్న (60) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మొక్కజొన్న పంట కోత కోశాక.. చేనును శుభ్రం చేయడంలో భాగంగా గురువారం చొప్పకు నిప్పంటించాడు. ప్రమాదవశాత్తు రైతు వెంకన్న పంచెకు నిప్పంటుకోవడంతో.. పొట్ట కింద భాగం తీవ్రంగా కాలిపోయింది. పొగతో ఊపిరి కూడా ఆడకపోవడంతో ఆయన చేనులోనే మృతి చెందాడు. ఆ మార్గంలో వెళ్తున్న వారు గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.జగదీశ్ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- బాలుడిపై కుక్కల దాడి
- పేగులు బయటకు వచ్చి ప్రాణాపాయస్థితిలో బాలుడు
- శస్త్ర చికిత్సచేసి ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ వైద్యులు

కరీంనగర్ టౌన్: కుక్కల దాడిలో గాయపడి, ప్రాణాపాయస్థితిలో ఉన్న ఐదేళ్ల బాలుడికి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. గురువారం కరీంనగర్ జీజీహెచ్‌లో ఈ సంఘటన జరిగింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండ్లపల్లికి చెందిన కొండయ్య కుమారుడు మహేందర్(5) ఇంటి బయట ఆడుకుంటుండగా మూడు కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో బాలుడి కడుపులోనుంచి పేగులు బయటకు వచ్చి అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తీసుకొచ్చారు. పీడియాట్రిక్ సర్జన్ గంగాధర్‌రెడ్డి, సూపరింటెండెంట్‌లు బాలుడికి శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు.

మావోలు.. జవాన్లు.. ఆదివాసీలు

ఉద్రిక్తంగా కర్రి గుట్టల పరిసర గ్రామాలు

- ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న గిరిజనం
- చెట్లు, పుట్టల వెంట ఎక్కడ చూసినా భద్రతాదళాలే..
- కర్రి గుట్టల ప్రాంతం మీదుగా 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్



బిక్కుబిక్కుమంటూ కూర్చున్న కర్రి గుట్టల సమీప గ్రామాల ఆదివాసీలు



మట్టిరోడ్డు కోసం తీసుకువచ్చిన రాళ్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రి గుట్టల ప్రాంతం ప్రస్తుతం నివురుగప్పిన నిప్పులా ఉంది. ఇక్కడి పరిస్థితులు తెలుసుకునేందుకు మావోయిస్టుల రాచబాటగా పేరున్న చర్ల–బీజాపూర్ అడవి మార్గంలో 'సాక్షి'గురువారం ప్రయాణించింది. తెలంగాణ చివరి గ్రామమైన పూసుగుప్ప మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించి..అక్కడి నుంచి రాంపురం, బీమారం, చిన్నఊట్ల, పెద్దఊట్ల, కస్తూరిపాడు, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, గల్‌గావ్, నడుంపల్లి, ఊసూరు, ఆవుపల్లి మీదుగా బీజాపూర్‌కు చేరే ప్రయత్నం చేసింది. ఈ మార్గం పూర్తిగా కర్రి గుట్టల పక్క నుంచే ఉంది. అక్కడి పరిస్థితులపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్...

ఖాళీగా గ్రామాలు

ఒకప్పుడు ఈ మార్గంలో కాలిబాటలు ఉండేవి. కొత్తగా ఏర్పాటైన బేస్ క్యాంపుల కోసం మట్టి రోడ్లు వేస్తున్నారు. ఆ రోడ్డు మీదుగా వెళ్తుండగా ముందుగా రాంపురం గ్రామం వచ్చింది. అక్కడ ఇళ్లు తప్ప.. మనుషులెవరూ కనిపించలేదు. ఆ తర్వాత వచ్చిన చిన్నఊట్లపల్లిలో పిల్లల అలికిడి వినిపించింది. ఈ గ్రామానికి పక్కనే ఉన్న పెద్ద ఊట్లపల్లి సమీప కర్రి గుట్టలో జనవరిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10మంది మావోయిస్టులు చనిపోయారు.

కుప్పకూలిన జనతన సర్కార్

చిన్న ఊట్లపల్లి ఊరి చివరకు వెళ్లి కర్రి గుట్టల ఫొటోలు తీస్తుండగా, ఇద్దరు గ్రామస్తులు ఎదురయ్యారు. భద్రతాదళాల దాడులతో ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా అని అడిగితే... 'ఇక్కడి ప్రతీ ఊరి నుంచి ఇద్దరు, ముగ్గురు అజ్ఞాతంలో ఉన్నారు. బాంబుల మోత, కాల్పుల శబ్దం వినిపించినప్పుడల్లా మావారు ఎలా ఉన్నారో అనే ఆందోళన కలుగుతుంది'అని చెప్పారు. మాట్లాడిన ఓ వ్యక్తి గతంలో జనతన సర్కార్ గ్రామ కమిటీలో కీలకంగా వ్యవహరించినట్లు చెప్పుకొచ్చాడు. ఈ ఏడాది జనవరి వరకు గ్రామ పాలనలో జనతన సర్కార్ మాట నడిచేదని.. క్యాంపులు పెరగడంతో జనతన సర్కార్ కుప్పకూలిందన్నాడు.

మాట కలపని మహిళలు

చిన్న ఊట్లపల్లి దాటిన తర్వాత కస్తూరిపాడులోకి వెళ్లగా ఇద్దరు మహిళలు కనిపించారు. ఎంత ప్రయత్నించినా మాట కలిపేందుకు వారు ఇష్టపడలేదు. ఇంతలో అదే గ్రామానికి చెందిన తెలుగు తెలిసిన వ్యక్తి వచ్చి 'ఏం కావాలి'అనడంతో జర్నలిస్టులుగా చెప్పగా మాట కలిపాడు. ఆ తర్వాత ఒక్కొక్కరు ఆ గ్రామవాసులు బయటకు వచ్చి తమ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు.

బయటకు రావొద్దన్నారు

మూడు రోజుల కిందట క్యాంపు నుంచి జవాన్లు వచ్చి 'రేపటి నుంచి అడవిలోకి వెళ్లొద్దు. ఇంటి నుంచి బయటకు రావొద్దు'అని చెప్పారన్నారు. సోమవారం సాయంత్రం నుంచే తమ ఊరి మీదుగా జవాన్లు కర్రి గుట్టల వైపునకు వెళ్లారని, ఇప్పుడు ఊరు చుట్టూ ఉన్న అడవిలో కూంబింగ్ పార్టీలు ఉన్నాయన్నారు. ఊరు దాటి కొంచెం అడవిలోకి వెళ్లి జవాన్లు కనిపిస్తుండటంతో పశువులను కూడా మేతకు పంపొద్దనే సూచనలతో మూడు రోజులుగా ఇంటికే పరిమితం చేశామన్నాడు. అక్కడి వారితో మాట్లాడుతుండగానే గ్రామం మీదుగా హెలికాప్టర్ వెళ్లింది. 'నిన్న బాంబుల శబ్దాలు వినిపించినా ఇవాళ లేవు.. మధ్యమధ్యలో బోర్ వేసినట్లు శబ్దం వస్తోంది.. అది కాల్పుల మోతే కావొచ్చు'అన్నారు.

అనుమతి లేదు

కస్తూరిపాడు దాటుకొని బీజాపూర్ వైపు వెళుతుండగా అడవిలో జవాన్లు నలుగురైదుగురు బృందాలుగా కనిపించారు. ప్రతీ గుంపు దగ్గర 20 లీటర్ల వాటర్ క్యాన్లు ఉన్నాయి. వాళ్లను దాటేసి వెళుతుండగా పూజారి కాంకేర్ వద్ద చెక్‌పోస్టు సిబ్బంది ఆపేశారు. జర్నలిస్టు ఐడీ కార్డులు చూపించినా ముందుకు వెళ్లనివ్వలేదు. 'ఇక్కడ పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నా'యంటూ వెనక్కి పంపారు. అడవిలో ఏర్పాటు చేసిన ప్రతీ బేస్ క్యాంప్‌నకు మూడంచెల భద్రత ఉంది. ప్రతీచోట హెలీప్యాడ్లు ఉన్నాయి. చకచకా క్యాంప్‌ల నిర్మాణం చేస్తున్నారు.

క్యాంపులతో కష్టమే కానీ

తిరుగు ప్రయాణంలో రాంపురం గ్రామస్తులతో మాట్లాడితే 'మా గ్రామంలో క్యాంపు పెట్టొద్దని నెలల తరబడి అడవిలో గుడారాలు వేసుకొని నిరసన చేపట్టాం. అయినా పెట్టారు. ఆరంభంలో వారు మమ్మల్ని అనుమానించేవారు. క్యాంపు పరిసర ప్రాంతాల్లోకి పశువులను మేతకు తీసుకురావొద్దనేవారు. తునికాకు, ఇప్పపూల సేకరణకూ అడ్డుపడ్డారు. స్థానిక పోలీసులకు చెప్పినా ఫలితం లేదు. రోజులు గడుస్తున్నా, కొద్ది ఒకరినొకరు గుర్తు పట్టడం మొదలయ్యాక ఆ ఇబ్బందులు తగ్గుముఖం పట్టాయి'అని చెప్పారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు

- మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న మల్టీజోన్ 1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీలు. వీరి వెనుక లొంగిపోయిన మావోయిస్టులు

వరంగల్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి జనజీవన స్రవంతిలో కలిసేందుకు 14 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయినట్లు మల్టీజోన్–1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు (ఏసీఎం), పార్టీ సభ్యులు ఏడుగురు, మిలీషియా కమాండర్ ఒకరు, మిలీషియా సభ్యులు నలుగురు ఉన్నారన్నారు. వీరిలో ఏరియా కమిటీ సభ్యులపై రూ.4 లక్షలు, నలుగురిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్లు ఐజీ చెప్పారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయం కింద రూ.25వేల చొప్పున అందజేశామన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, ములుగు, భూపాలపల్లి, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల ఎస్పీలు శబరీష్, కిరణ్‌ఖరే, రోహిత్‌రాజ్, ట్రైనీ ఐపీఎస్ అధికారి మన్నన్ భట్టు పాల్గొన్నారు.

తెలంగాణ నుంచి అజ్ఞాతంలో 95 మంది

- ఆ మావోయిస్టులందరూ ఛత్తీస్‌గఢ్‌లోనే..
- కర్రి గుట్టల ఆపరేషన్‌తో తెలంగాణకు సంబంధం లేదు: ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణకు చెందిన 95 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని హైదరాబాద్ మల్టీజోన్–1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి అజ్ఞాతంలో ఉన్న వారంతా వివిధ కేడర్‌లలో ఛత్తీస్‌గఢ్‌లోనే పనిచేస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. 'కర్రి గుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్‌కు తెలంగాణకు ఎలాంటి సంబంధం లేదు. కేంద్ర పారా మిలటరీ బలగాలు అక్కడి ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. ఆ ఆపరేషన్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం మా దగ్గర లేదు'అని స్పష్టం చేశారు. సరెండర్‌లను ప్రోత్సహించాలనేదే తమ లక్ష్యమని, ఈ ఏడాది ఇప్పటి వరకు ములుగు, జేఎస్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్‌ల పరిధిలో 250 మంది వివిధ కేడర్‌లలోని మావోయిస్టులు లొంగిపోయారన్నారు. 'పోరు కన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి', 'ఆపరేషన్ చేయూత'వంటి అనేక ఆదివాసీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై హింసాత్మక నక్సలిజం వదిలి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని ఐజీ స్పష్టం చేశారు.

కర్రిగుట్టల్లోనూ రెండు బేస్ క్యాంపులు!

భద్రతా బలగాల మొదటి ఎత్తుగడ ఇదే..

- కేంద్ర బలగాల మోహరింపు వెనుక ఇదే వ్యూహం
- దండకారణ్యంలో ఉధృతంగా కగార్
- మరో వారం రోజులపాటు కర్రి గుట్టల్లోనే భద్రత బలగాలు
- వెంకటాపూర్‌లో సిద్ధంగా 3 హెలికాప్టర్లు, బుల్లెట్, మైన్ ప్రూఫ్ వాహనాలు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్–మహారాష్ట్ర–తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేతకు 'ఆపరేషన్ కగార్'ఉధృతంగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే దాడుల నుంచి తప్పించుకునేందుకు మావోయిస్టులు కర్రి గుట్టలకు చేరారు. దీంతో భద్రతా బలగాలు ఈ గుట్టలపై గురి పెట్టాయి. 100 కిలోమీటర్ల మేర కర్రిగుట్టలు విస్తరించగా, ఒక్కో క్యాంపులో కనీసం 500 మంది ఉండేలా రెండు బేస్ క్యాంపులను కేంద్ర బలగాలు ఏర్పాటు చేసినట్టు తెలిసింది.

భద్రతా బలగాల అధీనంలో కర్రి గుట్టలు

ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మీదుగా ఐదురోజుల క్రితం కర్రి గుట్టలకు చేరుకున్న భద్రత బలగాలు ఇంకా చొచ్చుకుపోతున్నాయి. సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ పెద్ద సంఖ్యలో గుట్టలను జల్లెడ పడుతున్నాయి. కేంద్ర కమిటీ సభ్యులు మడావి హిడ్మా, బడే దామోదర్ సహా కీలక నేతలు కూడా ఉన్నట్లు భావిస్తున్న బలగాలు కర్రి గుట్టలను క్రమక్రమంగా తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఐజీ కేడర్ గల ఓ ఉన్నతాధికారి, సీఆర్‌పీఎఫ్ డీజీలు వెంకటాపూర్, వాజేడు సరిహద్దుల్లో మకాం వేసి పరిస్థితిని సమీక్ష చేస్తున్నారు. గుట్టలు బాంబుల మోతతో దద్దరిల్లుతుండడాన్ని స్థానికులు కూడా నిర్ధారించారు.

హెలికాప్టర్ ద్వారా బలగాలకు ఆహారం

కర్రి గుట్టలు కేంద్రంగా కూంబింగ్ కొనసాగిస్తూనే.. బాంబ్ డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్‌లు గుట్టల చుట్టూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను గుర్తించి, నిర్వీర్యం చేస్తున్నాయి. తెలంగాణ వైపు.. వెంకటాపురం మండలంలోని రాచపల్లి కలిపాక, మోట్లగూడెం ప్రాంతాల వరకు కూడా బాంబు పేలుడు శబ్దాలు వినిపిస్తుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. డ్రోన్లు, హెలికాప్టర్ల సహాయంతో నిరంతరం గాలింపు చర్యలు కొనసాగిస్తూ, రాత్రి, పగలు తేడా లేకుండా బలగాలు గుట్టలను జల్లెడ పడుతున్నాయి. వెంకటాపురంలో మైన్స్, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను అందుబాటులో పెట్టుకొని హెలికాప్టర్‌ల ద్వారా కూంబింగ్‌లో ఉన్న భద్రతా బలగాలకు ఆహారం, వాటర్ బాటిళ్లు సరఫరా చేస్తున్నారు. మరో వారం రోజులకు పైగా భద్రతా బలగాలు కర్రి గుట్టల్లోనే మకాం వేసి అమీతుమీ తేల్చుకోనున్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది.

కర్రి గుట్టల్లో ఎన్‌కౌంటర్..

- ముగ్గురు మహిళా మావోల మృతి వివరాలు వెల్లడించిన బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్



చర్ల: ఛత్తీస్‌గఢ్– తెలంగాణ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారని బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌రాజ్ వెల్లడించారు. బీజాపూర్ జిల్లా నైరుతి సరిహద్దు (కర్రి గుట్టలు)లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ, పీఎల్‌జీఏ–1వ నంబర్ బెటాలియన్ మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, కోబ్రా, ఎస్‌టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ బృందాలు కూంబింగ్ నిర్వహించాయన్నారు. గురువారం ఎన్‌కౌంటర్ జరగగా, యూనిఫాం ధరించి ఉన్న ముగ్గురు మహిళా మావోయి స్టులు మృతి చెందారని ఐజీ ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరు పీఎల్‌జీఏ 1వ నంబర్ బెటాలియన్ సభ్యులుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందు గుండుసామగ్రిని స్వాధీనం చేసుకున్నామని, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందన్నారు.

వడదెబ్బకు మరో ఏడుగురు బలి

- రాష్ట్రంలో కొనసాగుతున్న ఎండ తీవ్రత

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఎండలు మండిపోతుండటంతో వడదెబ్బ మరణాలు పెరిగిపోతున్నాయి. సామాన్య ప్రజలతోపాటు ఎంతో కఠిన శిక్షణ తీసుకునే సాయుధ పోలీస్ బలగాలు కూడా ఎండ తీవ్రతను తట్టుకోలేకపోతున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బతో 8 మంది మరణించగా, గురువారం మరో ఏడుగురు బలయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో వడదెబ్బతో గురువారం ఇద్దరు మృతి చెందారు. మండలంలోని గాంధీనగరం గ్రామానికి చెందిన తాటి లక్ష్మణుడు (60) మామిడితోటలో కాపలా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎండల తీవ్రతకు వడదెబ్బ బారిన పడి మరణించాడు. సత్తుపల్లి రాజీవ్‌నగర్‌కు చెందిన నిమ్మగడ్డ తులశమ్మ (64) సైతం వడదెబ్బతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి కాలనీకి చెందిన సోఫిబేగ్ (25) వడదెబ్బతో మృతిచెందాడు. అదే జిల్లా ముధోల్ మండలం మచ్కల్ గ్రామానికి చెందిన మేకల కాపరి షెల్కే లింగురాం (58) వడదెబ్బతో చనిపోయాడు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి గంగారాం (65) వడదెబ్బతో గురువారం ఉదయం మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రానికి చెందిన కాసాని సత్యం (75) మూడు రోజుల క్రితం ఎండలతో అస్వస్థతకు గురయ్యాడు. ఇంటి వద్దనే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. జనగామ జిల్లాకేంద్రంలోని గుండ్లగడ్డ ప్రాంతానికి చెందిన కార్మికుడు అలిసెరి ప్రసాద్ (63) గురువారం వడదెబ్బకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాయుధ పోలీసులకూ వడదెబ్బ

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రిగుట్టల్లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొంటున్న సాయుధ పోలీసుల్లో 15 మంది గురువారం వడదెబ్బకు గురైనట్లు తెలిసింది. దీంతో వారిని హుటాహుటిన ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కొడుకు అందంగా పుట్టాడని వేధింపులు

- ఇంట్లో అద్దంపై సూసైడ్ నోట్ రాసి వివాహిత ఆత్మహత్య
- భర్త, అత్తమామల వేధింపులు భరించలేకపోతున్నానని వెల్లడి

జగిత్యాల క్రైం: 'అమ్మా, నాన్నా.. నా కొడుకును మీరే పెంచండి. భర్త, అత్తమామల వేధింపులు భరించలేకపోతున్నా. నా భర్త మారతాడని అనుకున్న. నా ఆశ నిరాశే అయ్యింది. కొడుకు అందంగా పుట్టాడన్న అనుమానంతో నిత్యం వేధిస్తున్నాడు. కట్నం వేధింపులు కూడా ఎక్కువయ్యా యి'.. అని సూసైడ్ నోట్ రాసి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన ప్రసన్నలక్ష్మి (26)ని రెండేళ్ల క్రితం వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామానికి చెందిన తిరుపతికి ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో రూ.55 లక్షల కట్నం ఇస్తామని ఒప్పుకుని.. రూ.10 లక్షలు ముట్టజెప్పారు. దంపతులిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ప్రసన్నలక్ష్మికి బాబు జన్మించాడు. అప్పటి నుంచి ఆమె ఇంటివద్దే ఉంటోంది. ప్రసన్నలక్ష్మి, తిరుపతి ఇద్దరూ చామన ఛాయలో ఉండగా.. బాబు తెల్లగా, అందంగా పుట్టాడన్న అనుమానం తిరుపతి మనసులో మొలకెత్తింది. అప్పటి నుంచి తరచూ ప్రసన్నలక్ష్మిని వేధిస్తున్నాడు. మిగతా కట్నం డబ్బు కావాలని ఒత్తిడి పెంచాడు. భర్త తిరుపతి, అత్త, మామ, ఆడబిడ్డలు వేధిస్తుండటంతో ఐదురోజుల క్రితం ప్రసన్నలక్ష్మి బెంగళూరు నుంచి జగిత్యాలలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఇంట్లో ఉన్న అద్దంపై 'అమ్మా నాన్న నాకు బతకాలని లేదు. నా కొడుకు జాగ్రత్త. ప్లీజ్ వాళ్లకు మాత్రం నా బాబును ఇవ్వకండి'అని రాసి ఫ్యాన్‌కు ఉరేసుకుని బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ప్రసన్నలక్ష్మి భర్త, అత్త మామలపై చర్యలు తీసుకోవాలని గురువారం ఉదయం ఆమె బంధువులు ఆందోళనకు దిగారు. డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ వేణుగోపాల్ మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతురాలి తండ్రి ఉప్పునీటి గంగాధర్ ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలు, ఆడబిడ్డలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆదివాసీ ప్రాంతాల్లో సైనిక చర్యలు నిలిపివేయాలి

- రాష్ట్రపతికి తెలంగాణ పీస్ అండ్ డైలాగ్ కమిటీ విజ్ఞప్తి


సాక్షి, హైదరాబాద్: ఆదివాసీ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సైనిక చర్యలను నిలిపివేయాలని తెలంగాణ పీస్ అండ్ డైలాగ్ కమిటీ రాష్ట్రపతి ద్రౌపదీముర్ముకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రొఫెసర్ హరగోపాల్ బృందం గురువారం ప్రత్యేకంగా లేఖ రాసింది. బస్తర్ (ఛత్తీస్‌గఢ్), గడ్చిరోలి (మహారాష్ట్ర), జార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో సైనిక చర్యలు, మావోయిస్టులతో జరుగుతున్న ఎదురుకాల్పుల వల్ల ఆదివాసీ ప్రజానీకంపై తీవ్ర ప్రభావం పడుతోందని, అమాయక పౌరులు, పిల్లలు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హింసను తక్షణమే నిలిపివేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో వెంటనే శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం హింసకు వ్యతిరేకంగా శాంతి మార్గాన్ని అవలంబించాలని లేఖలో కోరారు. సైనిక చర్యలు రాజ్యాంగ విరుద్ధమని, ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నాయని వారు ఆక్షేపించారు.

కట్టుకున్న భార్యలను కడతేర్చారు..

వివాహేతర సంబంధాన్ని నిలదీసిందని ఒకరు.. • మగ పిల్లాడిని కనలేదని మరొకరు..

కలకాలం కాపురం చేస్తామని చేసిన బాసలు మరిచిన ఆ ఇద్దరు భర్తలూ భార్యల పట్ల అమానవీయంగా ప్రవర్తించారు. తన వివాహేతర సంబంధాన్ని నిలదీసిందని కోపం పెంచుకున్న ఓ భర్త అదనుచూసి సహచరిని అంతం చేయగా, ఆడపిల్లలను కనిందన్న కోపంతో భార్యను హత్య చేశాడు మరో భర్త.

నమ్మించి మెడ కోశాడు..



కీర్తి

గుడిహత్నూర్: కలహాల కాపురంతో విసిగిపోయిన భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. సహించలేకపోయిన భర్త ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు. నాలుగు రోజులు అత్తింటి వారితో మర్యాదగా వ్యవహరిస్తూ నమ్మించాడు. గురువారం కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్‌కు చెందిన లట్‌పటే మారుతికి ఇదే గ్రామానికి చెందిన కీర్తి (28)తో 2012లో వివాహం జరిగింది. మారుతి ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై కీర్తి పలుమార్లు భర్తను నిలదీసింది. అయినా తీరు మార్చుకోకపోవడంతో ఇటీవల కీర్తి తన ముగ్గురు పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో కక్ష పెంచుకున్న మారుతి తన భార్యను అంతమొందించాలని పథకం వేశాడు. ఈ క్రమంలో గత నాలుగు రోజులుగా అత్తగారింటికి వచ్చి వారితో మర్యాదగా ప్రవర్తించాడు. గురువారం ఉదయం కీర్తి తాగునీటి కోసం ఇంటి సమీపంలోని నల్లా వద్దకు వెళ్లగా, మారుతి వెంట తెచ్చుకున్న కత్తితో కీర్తి మెడపై దాడి చేసి పారిపోయాడు. రిమ్స్‌కు తరలించేలోపే ఆమె మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమేష్, ఎస్సై మహేందర్ తెలిపారు.

ఆడపిల్లలు పుట్టారని హతమార్చాడు..

కాగజ్‌నగర్ రూరల్: మొదటి భార్యకు మగ సంతానం జన్మించలేదని రెండో పెళ్లి చేసుకున్నాడు ఓ భర్త. ఆమెకూ ఇద్దరు ఆడపిల్లలు జన్మించడంతో ఆగ్రహం పెంచుకున్నాడు. రెండో భార్యతో గొడవ పడి తలపై దాడి చేసి చంపాడు. ఈ సంఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంజిరి గ్రామానికి చెందిన డోకే జయరాంకు ఆసిఫాబాద్‌కు చెందిన భీంబాయితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఓ కూతురు పుట్టగా, మగసంతానం లేదని జయరాం కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్‌పూర్‌కు చెందిన పోషక్కను (40) 2010లో రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే ఆమెకు కూడా ఇద్దరూ కూతుళ్లే రవళి (12), గౌతమి (6) పుట్టారు. దీంతో మగపిల్లలు లేరని జయరాం తరచూ ఇద్దరు భార్యలతో గొడవ పడేవాడు. బుధవారం రాత్రి కూడా రెండో భార్య పోషక్కతో గొడవ జరిగింది. ఆవేశానికి గురైన జయరాం పలుగుతో ఆమె తలపై బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో పోషక్క అక్కడికక్కడే మృతిచెందింది. ఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ ఇన్‌చార్జి సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్సై సందీప్ పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

జాతీయ స్థాయిలో రజతోత్సవ సభ ప్రభావం

బీఆర్ఎస్ నేతల స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే విధంగా జరగనుందని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో చలో వరంగల్ పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్‌గౌడ్, కిశోర్‌గౌడ్, ఫియాజ్, కేసీఆర్ సేవాదళ్ అధ్యక్షుడు అమీర్‌అలీ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

రజతోత్సవ సభతో రాష్ట్రానికి దిశ, దశ

మాజీ ఎంపీ వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ రాష్ట్రానికి దిశ, దశ చూపుతుందని, గత సభలకు దీటుగా ఉంటుందని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఆయన గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు పి.శశిధర్ రెడ్డి, పల్లె రవికుమార్, పట్నం మాణిక్యం, కల్యాణ్‌రావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ సందేశం కోసం యావత్ తెలంగాణ ఎదురు చూస్తోందన్నారు. రజతోత్సవ సభ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని, ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయని వివరించారు. రవాణా, పార్కింగ్ ఏర్పాట్లలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. సభా స్థలి.. పార్కింగ్ మధ్య దూరం పెద్దగా లేదని, నేరుగా సభా స్థలికి చేరుకోవచ్చునని వివరించారు. గత అనుభవాల నేపథ్యంలో ఏర్పాట్లలో మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

అక్రమ వలసదారులను వెంటనే తరిమేయాలి

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: వీసా ముగిసినా ఇంకా ఇక్కడే నివసిస్తున్న హైదరాబాద్ పాతబస్తీలోని అక్రమ వలసదారులు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీలను పోలీసు యంత్రాంగం వెంటనే తరిమేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్ ఉన్నాయని అనేక సందర్భాల్లో ఎన్ఐఏ, ఐబీ హెచ్చరికలు జారీచేసినందున వెంటనే వాటిని ఏరిపారేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారంఆయన మీడియాతో మాట్లాడుతూ, అక్రమ వలసదారులు, స్లీపర్ సెల్స్‌ను ఏరివేసేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలన్నారు. బీఆర్ఎస్‌తో ఎంఐఎం కొంతకాలం దోస్తానా చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్‌తో కలిసి నడుస్తుండటంతో పోలీసులు నిస్సహాయ స్థితిలో ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలుగా బీఆర్ఎస్ విఫలమైందని, అన్ని నిర్ణయాలు, ఆలోచనల్లో ఘోరంగా ఫెయిలైన ఆ పార్టీకి రజతోత్సవాలు జరుపుకునే అర్హత లేదన్నారు.

మే మూడో వారంలో కాళేశ్వరం కమిషన్ నివేదిక

వచ్చే నెలలో కేసీఆర్, హరీశ్, ఈటల క్రాస్‌ఎగ్జామినేషన్?

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ మే మూడో వారంలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఇప్పటికే విచారణ ప్రక్రియ తుది దశకి చేరుకోవడంతో నివేదికకు తుది రూపు ఇచ్చే పనిలో కమిషన్ బిజీగా ఉంది. దాదాపు 400 పేజీలతో ఇప్పటికే ముసాయిదా నివేదికను సిద్ధం చేసినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను వచ్చే నెల రెండో వారంలో క్రాస్‌ఎగ్జామినేషన్‌కి పిలిపించే అవకాశం ఉంది. ఇప్పటికే కమిషన్‌కు అవసరమైన సాక్ష్యాధారాలు లభించడంతో వీరిని విచారించాలా? వద్దా? అనే అంశంపై కమిషన్ త్వరలో నిర్ణయం తీసుకోనుంది. బరాజ్‌ల నిర్మాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తుది నివేదిక సైతం కమిషన్‌కు అందింది. ఇక ఎన్డీఎస్ఏ తుది నివేదికను కమిషన్ తెప్పించుకుంటోంది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్న ఆరోపణలపై తమిళనాడు మాజీ సీఎం జయలలితపై జరిగిన విచారణ నివేదికలను సైతం కమిషన్ అధ్యయనం చేస్తోంది.

కాంగ్రెస్‌లోకి పాలకుర్తి బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో.. పాలకుర్తికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పానుగోటి సోమేశ్వర్ రావు ఆధ్వర్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రపంచానికి మోడల్‌గా తెలంగాణను చూపుతాం

- ‘భారత్ సమ్మిట్–2025’ నిర్వహణపై మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి సదస్సులో ప్రత్యేకంగా వివరిస్తామని వెల్లడి
- మంత్రి ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష



భారత్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను ప్రపంచానికి ఒక మోడల్‌గా చూపేందుకు రెండు రోజుల భారత్ సమ్మిట్–2025 అంతర్జాతీయ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ఓ గొప్ప కార్యక్రమంగా నిర్వహించనుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా శుక్ర, శనివారాల్లో సదస్సును నిర్వహించనున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి భట్టి గురువారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన అహింస, సత్యం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై చర్చించేందుకు సుమారు 100 దేశాలకు చెందిన ప్రభుత్వాధినేతలు, ఎంపీలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలు, థింక్ ట్యాంకర్స్ మొత్తంగా 450 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అమెరికా, రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతున్న వేళ భారత్ ఎటు వైపు మొగ్గు చూపకుండా అలీన విధానాన్ని ఎంచుకొని ముందుకెళ్లిందని భట్టి గుర్తుచేశారు. దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీగా కాంగ్రెస్ నిలబడిందని.. అలీన విధానాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ముందుకు తీసుకువెళ్లాయని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ దేశాల ప్రతినిధులను వివిధ అంశాలపై చర్చించేందుకు ఆహ్వానించిందని వివరించారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధి, వనరులు, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించేందుకు ప్రత్యేక స్లాట్ కేటాయించామని తెలిపారు. ప్రపంచ పటంలో హైదరాబాద్‌ను నిలిపేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ సదస్సుకు ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు రానుండటం తెలంగాణకు గర్వకారణమన్నారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ అభివృద్ధిని, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని ప్రపంచానికి తెలియజేస్తామన్నారు. అనంతరం భారత్ సమ్మిట్ ఏర్పాట్లను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు సమీక్షించారు.

డెలివరింగ్ గ్లోబల్ జస్టిస్ ఇతివృత్తంతో..

భారత జాతీయ కాంగ్రెస్ 140వ వార్షికోత్సవం, అలీనోద్యమానికి ఆధారమైన 1955 నాటి బండుంగ్ సదస్సు జరిగి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డెలివరింగ్ గ్లోబల్ జస్టిస్ ఇతివృత్తంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సు నిర్వహిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ‘న్యాయ్’ఆలోచన ఆధారంగా ఇది రూపొందింది. భారతీయ విలువలతో కూడిన న్యాయమైన, ఉదారవాద ప్రపంచ వ్యవస్థను నిర్మించే లక్ష్యంతో సదస్సు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు తొలిరోజు సదస్సులో స్వాగతోపన్యాసం చేయనుండగా రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక ప్రసంగాలు చేయనున్నారు. అనంతరం ‘హైదరాబాద్ డిక్లరేషన్’ను ప్రకటిస్తారు. సదస్సు ముగింపు సమావేశంలో ప్రియాంక గాంధీ, కె.సి.వేణుగోపాల్ ప్రసంగించనున్నారు.

కేసీఆర్‌ను చూసేందుకు జనం వస్తారు: దానం



బంజారాహిల్స్ (హైదరాబాద్): ఈనెల 27న బీఆర్ఎస్ పార్టీ నిర్వహించబోయే ఆవిర్భావ సభపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రెండు రోజుల క్రితం మీడియాతో మాట్లాడిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ‘సభ సక్సెస్ అవుతుందని అంతా అనుకుంటున్నారు.. మీరేమనుకుంటున్నారు’అని మీడియా అడగగా ‘కేసీఆర్‌ని చూడాలని చాలా రోజుల నుంచి ప్రజలు నిరీక్షిస్తున్నారు. కాబట్టి ఆయనను చూసేందుకు జనం భారీగా వస్తారని భావిస్తున్నాను’అని ఆయన అన్నారు. అనంతరం ఆయన కంచ గచ్చిబౌలి వ్యవహారంపై మాట్లాడుతూ, స్మితా సబర్వాల్ హానెస్ట్ ఆఫీసర్ అని, ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ఆమె ట్వీట్ చేసిందని తాను భావించడం లేదని అన్నారు. కాగా, తన కెరీర్‌లోనే మచ్చలేని సీనియర్ ఐఏఎస్ అధికారిణి శాంతికుమారిని కోర్టు జైలుకు పోతారా అని ప్రశ్నించడం.. ఆమెను అవమానించినట్లుగా తనకు అనిపించిందని తెలిపారు. కంచ గచ్చిబౌలిపై ప్రభుత్వం పునరాలోచనలో ఉందని తెలుస్తోందని, ఇది శుభపరిణామమని దానం అన్నారు.



బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో మాజీ ఎంపీ కవిత, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

గులాబీ జెండా ఒక్కటే శ్రీరామరక్ష

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఎల్కతుర్తి: తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్షగా నిలిచేది ఎప్పటికీ బీఆర్ఎస్ పార్టీ, గులాబీ జెండా ఒక్కటేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపంలో జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, అనేక మోసపూరిత వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలంటే కన్న బిడ్డలు అన్న భావన ఉంటుంది తప్పితే.. వారు ఓటర్లు అనే భావన ఉండదన్నారు. కానీ కాంగ్రెస్, బీజేపీ నేతలకు ప్రజలనుంచి ఓట్లు ఎలా సంపాదించాలన్న ఆలోచన తప్ప తెలంగాణపై ప్రేమ ఉండదన్నారు. ‘కొందరు నాయకులు అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారు. మీరు టీఆర్ఎస్సా, బీఆర్ఎస్సా.. దేనికి రజతోత్సవం చేసుకుంటున్నారు.. అని వెకిలి మాటలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ నాయకుల్లారా ఖబడ్దార్.. తెలంగాణ ప్రజలకు మీనైజమేందో తెలిసిపోయింది. పదహారు నెలల్లో మీ మోసమేందో తెలిసిపోయింది’అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, వొడితెల సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోసాల కూటమిని ప్రజలు క్షమించరు



- మేనిఫెస్టో హామీలను నిలబెట్టుకోకుంటే తోలు తీస్తామని హెచ్చరించే సత్తా వైఎస్సార్ సీపీకే ఉంది
- చంద్రబాబు సర్కారుకు ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరిక
- ప్రజలు నిలదీస్తారనే భయంతో ప్రతి రోజూ డైవర్షన్ రాజకీయాలే

సాక్షి, అమరావతి: ‘ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం.. ప్రజల్లో వ్యతిరేకతను గొంతు పట్టుకుని నులమడం అంత సులభం కాదు..! ఇచ్చిన మాట, మేనిఫెస్టోలో చెప్పిన హామీలను నిలబెట్టుకోకుంటే నీ తోలు తీస్తాం.. అని చెప్పగలిగిన సత్తా వైఎస్సార్ సీపీకి ఉంది..’అని చంద్రబాబు సర్కారును వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలపై గ్రామ గ్రామాన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నిలదీస్తారని చెప్పామని గుర్తు చేశారు. ‘వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో తెగువ ఎలా ఉంటుందనేది రాష్ట్రానికి చాటి చెప్పిన నా అక్కచెల్లెమ్మలకు, నా అన్నదమ్ములకు సెల్యూట్ చేస్తున్నా’అని పార్టీ శ్రేణులను అభినందించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు, తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీ, అనంతపురం జిల్లా కంబదూరు, తిరుపతి రూరల్ మండలం స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. టీడీపీ కూటమి సర్కారు ప్రలోభాలు, బెదిరింపులకు లొంగకుండా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పక్షాన గట్టిగా నిలబడిన ప్రజాప్రతినిధులను అభినందించారు. తొలుత కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారికి వైఎస్ జగన్, నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఏమన్నారంటే..

హామీలకు దిక్కులేని పరిస్థితుల్లో పాలన..

చాలా మంది ఇళ్లల్లో చంద్రబాబు మేనిఫెస్టో ఉంది. మేనిఫెస్టోను ప్రతి ఇంటికి పంపి బాండ్లు కూడా రాసిచ్చారు. మేనిఫెస్టోలో ఇంకా 143 హామీలు ఇచ్చారు. మరి నా అక్క చెల్లెమ్మలు ప్రొద్దుటూరు, కడపలో నిరీక్షిస్తున్నారు. ఉచిత బస్సు ద్వారా విశాఖపట్నం వెళ్లి రావాలని ఎదురు చూస్తున్నారు. దానికి కూడా దిక్కులేని పరిస్థితుల్లో ఇవాళ రాష్ట్రంలో పరిపాలన సాగుతోంది. మరోవైపు వ్యవస్థలన్నీ ఇప్పుడు పూర్తిగా విధ్వంసం అయ్యాయి. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. మట్టి, మైనింగ్, నియోజకవర్గంలో ఏ పరిశ్రమ నడవాలన్నా ఎమ్మెల్యే దగ్గరకు వచ్చి అంతో ఇంతో ముట్టజెప్పాల్సిందే. ఆయన ముఖ్యమంత్రికి ముట్టజెప్పాలి. నాకింత.. నీకింత అని దోచుకుని తింటున్న పరిస్థితి రాష్ట్రమంతా కనిపిస్తోంది. దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రోజుకొక డైవర్షన్ టాపిక్ ఎంచుకుంటున్నారు. ఒక రోజు లడ్డూ, మరోరోజు బోటు.. ఇంకోరోజు ఐపీఎస్ అధికారుల అరెస్టులు అంటాడు. షాక్ కొట్టేలా పెంచిన కరెంట్ బిల్లుల గురించి అడిగితే... ఆయన చేసిన లిక్కర్ స్కాంను ఇంకొకరి మీద రుద్ది అరెస్టు చేస్తాడు.

వైఎస్సార్‌సీపీ అఖండ విజయంతో అధికారంలోకి రావడం తథ్యం..

మంచి చేసిన మనమే ప్రతిపక్షంలో కూర్చొన్నాం. ఇక ఏ మంచీ చేయని, మోసం చేసిన చంద్రబాబునాయుడు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కరలేదు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో పరిస్థితి ఒకేలా ఉంటుంది. ఇంత మోసం చేసిన మనిషిని ప్రజలు సింగిల్ డిజిట్ కూడా రాని పరిస్థితుల్లోకి పరిమితం చేస్తారు. తప్పకుండా ఆరోజు వస్తుంది. మరో మూడేళ్లు గడిచిన తర్వాత.. కచ్చితంగా వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో అధికారంలోకి వస్తుంది.

‘భూదాన్’పై సీబీఐ విచారణ!

▶ మొదటి పేజీ తరువాయి

ఫిబ్రవరి 16న, మార్చి 8న అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేసే చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికే కొందరు అనధికారికంగా భూములను బదిలీ కూడా చేయించుకున్నారని చెప్పారు. 26 మంది ఉన్నతాధికారులు భూకబ్జాలో ఉన్నందున ఈ అంశంపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

అధికారుల నుంచి స్పందన లేదు..: పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. ‘భూదాన్ భూములపై బినామీల పేరిట రిజిస్ట్రేషన్, భూ కబ్జా, మనీలాండరింగ్‌పై విచారణ జరిపించాలని మహేశ్ పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ కుంభకోణంలో ఉన్నారు. కొందరు అధికారులకు అందజేసిన పట్టాదారు పాస్‌బుక్‌లు, మ్యుటేషన్ ప్రొసీడింగ్‌లపై వివరాలు సమర్పించేలా రిజిస్ట్రేషన్, స్టాంపుల కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేయండి. భూకబ్జాలో తెలంగాణతోపాటు ఏపీకి చెందిన సీనియర్ అధికారుల పాత్ర ఉంది. పిటిషనర్‌కు హక్కుగా ఉన్న భూమిని మోసపూరితంగా బదిలీ చేసుకున్నట్లు అధికారులు తప్పుడు డాక్యుమెంట్లు చూపించారు. అధికారులు భూరికార్డులను ఎలా తారుమారు చేశారో, తప్పుడు వారసత్వ పత్రాలు ఎలా తయారయ్యాయో.. పట్టాదార్ పాస్‌బుక్‌లను చట్టవిరుద్ధంగా ఎలా జారీ చేశారో దర్యాప్తు చేయాల్సి ఉంది. ధరణి పోర్టల్‌ను కూడా దుర్వినియోగం చేశారు. తన భూమి కోసం పోరాడుతున్న పిటిషనర్‌కు సాయం చేసే బదులు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. ఇప్పటికే 10కిపైగా లీగల్ నోటీసులు పంపారు. క్షమాపణ చెప్పకపోతే తీవ్ర చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారు. మోసపూరిత పాస్‌బుక్‌లను రద్దు చేయాలి. భూమిని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవాలి. సంబంధిత అధికారులపై విచారణకు ఆదేశించాలి’ అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇది అతి పెద్ద భూ కుంభకోణంలా కనిపిస్తున్నందున ఆ భూములకు సంబంధించి తదుపరి లావాదేవీలన్నింటినీ నిలిపివేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను జూన్ 12కు వాయిదా వేశారు.

కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు ఉంది

- కాంగ్రెస్ తీరుపై డా.కె.లక్ష్మణ్ విమర్శ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మీటింగ్ అనంతరం ఉగ్రదాడిపై ఆ పార్టీ కోడి గుడ్డు మీద ఈకలు పీకుతోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని కూడా ఆ పార్టీ ఓ పొలిటికల్ ఈవెంట్‌గా పరిగణించడాన్ని ఖండిస్తున్నామన్నారు. గురువారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, అసలు పాకిస్తాన్ ఊసే లేకుండా సీడబ్ల్యూసీ సమావేశం జరిగిందంటే కాంగ్రెస్‌కు పాకిస్తాన్ మీద ఎంత ప్రేమ ఉందో స్పష్టమవుతోందన్నారు. అందుకే పాకిస్తాన్‌ను నిందించడానికి కాంగ్రెస్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. ఉగ్రవాద చర్యను సమర్థించే విధంగా రాబర్ట్ వాద్రా చేసిన వ్యాఖ్యలు పౌరసమాజం సిగ్గు పడేలా ఉన్నాయన్నారు. కశ్మీర్ ఉగ్రదాడిపై బీఆర్ఎస్ నోరు మెదపకపోవడం దేనికి సంకేతమని, మజ్లిస్ పార్టీ కోసమే మాట్లాడడం లేదా అని లక్ష్మణ్ నిలదీశారు. ట్విట్టర్ పిట్ట కేటీఆర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్‌కు సహకరించారని ఆరోపించారు. కాగా, పహల్గాం ఉగ్రదాడి మృతులకు గురువారం బీజేపీ కార్యాలయంలో పార్టీ నేతలు కె.లక్ష్మణ్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తివారి, కొల్లి మాధవి సంతాపం తెలిపారు.

తాకట్టులో ఏపీ ఖజానా

- ఏపీఎండీసీని పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు
- బాండ్ల రూపంలో రూ.9 వేల కోట్లు సేకరణలో భారీ అవకతవకలు
- కూటమి ప్రభుత్వంపై మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆగ్రహం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఏపీ మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: దేశంలో ఎప్పుడూ జరగని విధంగా కూటమి ప్రభుత్వం అప్పుల విషయంలో రాజ్యాంగ విరుద్ధమైన విధానాలకు తెగబడిందని ఏపీ మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ నుంచి రూ.9 వేల కోట్లను బాండ్ల రూపంలో సేకరణలో భారీ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆక్షేపించారు. ఇది దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుగ్గన గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఆదాయాలను తాకట్టు పెట్టి, దానిపై అప్పులకు స్కీం

కూటమి ప్రభుత్వం కొత్తగా బడ్జెట్ వెలుపల అందనంత అప్పులు చేయడం ప్రారంభించింది.ఏపీఎండీసీ ద్వారా రూ.9 వేల కోట్లకు బాండ్లు విడుదల చేయడం ద్వారా కొత్తగా అప్పులు చేయాలని స్కీం ప్రారంభించారు. ఏపీఎండీసీ ఆదాయాలను తాకట్టు పెట్టి, దానిపై అప్పులు చేయాలనేదే ఈ స్కీం. ఇటువంటి నిబంధనలు, వెసులుబాట్లు చరిత్రలో ఎప్పుడూ లేవు. ఖజానాలో ఏ కారణంతో అయినా నిల్వ తక్కువగా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులు బాండ్లు కొనుగోలు చేసినవారికి వెళ్లిపోతాయి. షెడ్యూల్ ప్రకారం చెల్లింపులు చేయకపోతే.. గనులను తాకట్టులో ఉంచుకున్న ప్రైవేటు వ్యక్తులు నేరుగా ఖజానాలోకి వెళ్లి డబ్బు తీసుకోవచ్చు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెడితే చాలా అన్యాయం అంటూ గగ్గోలు పెట్టారు. ఇవాళ ఏపీఎండీసీకి చెందిన గనులను మొత్తం తనఖా పెట్టారు. నాడు బెవరేజెస్ కార్పొరేషన్‌పై అప్పులు తెస్తే..భవిష్యత్తు ఆదాయాలను కూడా తాకట్టుపెట్టారంటూ ఆరోపణలు చేశారు. ఇవాళ గనులను తాకట్టుపెట్టడమే కాక... ఏపీఎండీసీ భవిష్యత్తు ఆదాయాలన్నింటినీ తాకట్టు పెట్టారు. గత ప్రభుత్వంలో ఆర్థిక విధ్వంసం జరిగింది. ఇలాగైతే చైనా వంటి దేశాల్లో అధికారులను ఉరి తీస్తారని చంద్రబాబు ఆరోపణలు చేశారు. ఇప్పుడు మీరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించి చేస్తున్న పనులకు అధికారులకు ఎలాంటి శిక్ష పడుతుందో ఆలోచించుకోవాలి. చంద్రబాబు దీన్ని ఎలా సమర్థించుకుంటారు?

ఐఐఎస్‌సీ దేశంలోనే టాప్

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా ర్యాంకులు విడుదల



సాక్షి, అమరావతి: దేశంలో అత్యుత్తమ విద్యా సంస్థగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ, ఇండోర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నిలిచాయి. తాజాగా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా వర్సిటీ ర్యాంకింగ్స్–2025ను ప్రకటించింది. 35 దేశాల నుంచి 853 అగ్రశ్రేణి పరిశోధన విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకోవడం విశేషం. ఆసియా ర్యాంకింగ్స్‌లో చైనా వర్సిటీలు అగ్రస్థానంలో నిలిచాయి. తొలి రెండు స్థానాలతో పాటు టాప్ 10 స్థానాల్లో ఐదు డ్రాగన్ వర్సిటీలే ఉన్నాయి. ఆ తర్వాత సింగపూర్, జపాన్, హాంకాంగ్ తొలి పది స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి. ఉజ్బెకిస్తాన్, బహ్రెయిన్, మంగోలియా, సిరియా వర్సిటీలు తొలిసారిగా ర్యాంకులు పొందాయి. హాంకాంగ్‌లోని ర్యాంక్ పొందిన ఆరు విశ్వవిద్యాలయాలు 2017 తర్వాత మొదటిసారిగా టాప్–50లోకి రావడం విశేషం.

దిగజారిన ర్యాంకులు

గతేడాది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా ర్యాంకింగ్స్‌తో పోలిస్తే ఈ సారి పలు భారత విద్యాసంస్థల ర్యాంకులు దిగజారాయి. ఐఐఎస్‌సీ 38వ ర్యాంకుతో అగ్రస్థానంలో నిలిచినప్పటికీ గతేడాది 32వ ర్యాంకు నుంచి కిందికి పడిపోయింది. మహాత్మా యూనివర్సిటీ 2024లో 134వ స్థానం సాధించగా.. 2025లో 140వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐఐటీ హైదరాబాద్ సైతం 162 నుంచి 200 ర్యాంకుకు వచ్చేసింది. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం గతేడాది 199, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం 189, భారతీయార్ వర్సిటీ 160, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ 188 ర్యాంకుల్లో ఉండగా.. ఈ ఏడాది 201–250 బ్యాండ్‌లోకి వచ్చేశాయి. బిట్స్ పిలానీ, లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీ ర్యాంకులు మెరుగుపడ్డాయి. మొత్తానికి జాబితాలో 14 భారతీయ విశ్వవిద్యాలయాలు తమ స్థానాన్ని మెరుగుపర్చుకోగా 34 వర్సిటీల ర్యాంకులు అధ్వాన్న స్థాయికి దిగజారాయి.

200లోపు ర్యాంకుల్లో భారతీయ విద్యాసంస్థలు

సంస్థ	ర్యాంక్
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్	38
అన్నా విశ్వవిద్యాలయం	111
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇండోర్	131
మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం	140
శూలిని యూనివర్సిటీ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్	146
సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్	149
జామియా మిలియా ఇస్లామియా	161
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గౌహతి	184
కేఐఐటీ విశ్వవిద్యాలయం	184
అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం	188
యూపీఈఎస్	188
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాట్నా	191
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కెలా	191
ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హైదరాబాద్	200

తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వర్సిటీల్లో జేఎన్‌టీయూ అనంతపురం 251–300, కేఎల్‌యూ 301–350, ఆచార్య నాగార్జున (ఏఎన్‌యూ), గీతం, జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్, శ్రీవెంకటేశ్వర (ఎస్వీయూ), విజ్ఞాన్ వర్సిటీలు 601 ప్లస్ బ్యాండ్‌లో ఉన్నాయి. వాస్తవానికి గత ఏడాది కంటే ర్యాంకుల్లో మెరుగుదల లేకపోగా తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఏఎన్‌యూ, ఎస్వీయూల ర్యాంకులు 501–600 బ్యాండ్‌లో ఉంటే.. ఇప్పుడు 601 ప్లస్‌కు చేరుకోవడం గమనార్హం. శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆంధ్రా యూనివర్సిటీ గతేడాది 501–600 బ్యాండ్‌లో ఉండగా.. ఈ ఏడాది ర్యాంకుల్లో ఎక్కడా కనిపించలేదు. ఇక తెలంగాణలోని ఉస్మానియ వర్సిటీ 401–500 బ్యాండ్‌లో నిలకడగా ఉంది.



బాలికను కిడ్నాప్ చేసి..
ఐదేళ్ల బాలికను కిడ్నాప్ చేసిన ఓ ముఠాను చాంద్రాయణగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గురువారం పోలీసులు వివరాలు వెల్లడించారు.
-10లో



అంతా.. ఫ్యాన్సీ ఫ్యాన్సే..
టాలీవుడ్ స్టార్లు తమ వాహనాల నంబర్ల కోసం ఎంతటి ఖర్చుకైనా సై అంటున్నారు. ఇటీవల ఓ ప్రముఖ నటుడు ఓ ఫ్యాన్సీ నంబర్‌ను వేలంలో కొనుగోలు చేశారు.
- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 39, కనిష్ఠంగా 28 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

సిటీలో హై అలర్ట్

- భారత్ సమ్మిట్, మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో..
- నిఘా, భద్రత కట్టుదిట్టం చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: పహల్గాం ఉగ్రదాడుల నేపథ్యంలో రాజధానిలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. త్వరలో రెండు కీలక ఘట్టాలకు నగరం వేదిక కానుండటంతో హైదరాబాద్, సైబరాబాద్ అధికారులు అప్రమత్తమయ్యారు. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు నగర వ్యాప్తంగా నిఘా కట్టుదిట్టం చేశారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని హెచ్ఐసీసీలో ఈ నెల 25, 26 తేదీల్లో భారత్ సమ్మిట్, వచ్చే నెల 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్–2025 పోటీలు జరగనున్నాయి. వీటికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, సెలబ్రెటీలు రానున్నారు. దేశంలోని ఉగ్రవాద ప్రభావిత నగరల్లో హైదరాబాద్ కూడా ఒకటి కావడంతో నిఘా వర్గాలు అప్రమత్తం చేశాయి. భారత్ సమ్మిట్‌కు వంద దేశాల నుంచి దాదాపు 400 మంది, మిస్ వలర్డ్ పోటీలకు 140 దేశాల నుంచి కంటెస్టెంట్స్ హాజరుకానుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను మోహరిస్తున్నారు. ఈ రెండు కార్యక్రమాలూ సైబరాబాద్‌లో జరుగుతున్నప్పటికీ అతిథుల్లో అత్యధికులు హైదరాబాద్‌లోని వివిధ హోటళ్లలో బస చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన ఘట్టాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. నగరంలోని అనుమానిత, సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. భారత్ సమ్మిట్ జరిగే ప్రాంతాలను పోలీసులు గురువారం రాత్రి నుంచి తమ అధీనంలోకి తీసుకున్నారు. హైటెక్ సిటీ సహా విదేశీయులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు పెంచారు.

కోర్టు ముందు షకీల్ హాజరు

పంజగుట్ట: నిర్లక్ష్య డ్రైవింగ్‌తో బారికేడ్లు ధ్వంసం చేసిన కేసులో నిందితుడు రాహెల్‌ను తప్పించేందుకు యత్నించిన అతని తండ్రి బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పంజగుట్ట పోలీసులు న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. 2023లో అప్పటి ప్రగతిభవన్ ముందు బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహెల్ బీఎండబ్ల్యూ కారులో స్నేహితులతో కలిసి బేగంపేట నుంచి పంజగుట్ట వైపు మితిమీరిన వేగంతో వచ్చి బారికేడ్లను ఢీకొట్టాడు. బారికేడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కుమారుడు రాహెల్‌ను కేసు నుంచి తప్పించేందుకు మాజీ ఎమ్మెల్యే షకీల్ పన్నాగం పన్నారని ఆరోపణలు రావడంతో కేసు నమోదు చేశారు. గురువారం పోలీసులు ఆయనను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కాగా.. షకీల్‌కు బెయిల్ మంజూరైనట్లు సమాచారం.



ఉగ్ర దాడి.. గుండె తడి


పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గురువారం నెక్లెస్ రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఏపీసీఆర్) ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదుల దాడి అమానుషమని ఖండించారు. కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. తెలంగాణ ఫర్ పీస్ కలెక్టివ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించాలంటూ హిమాయత్ నగర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. – లక్ష్మీకాపూల్



టూర్.. డర్!

సమ్మర్‌లో కశ్మీర్ వెళ్లేందుకు పర్యాటకుల ప్లాన్

- పహల్గాం ఉగ్రదాడితో భయాందోళన
- భారీగా రద్దయిన వేసవి ప్రయాణాలు
- గత రెండురోజుల్లో తారుమారైన పరిస్థితులు
- ప్రత్యామ్నాయంగా సిమ్లా, కేరళ తదితర ప్రాంతాల ఎంపిక
- నగర పర్యాటక రంగంపై భారీ ప్రభావం





సాక్షి, సిటీబ్యూరో:

కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి పర్యాటక రంగంపై పిడుగుపాటుగా మారింది. నగర నుంచి కశ్మీర్‌కు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న పర్యాటకులు తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. గత రెండు రోజుల్లోనే పదుల సంఖ్యలో బుకింగ్‌లు రద్దయినట్లు నగరానికి చెందిన పలు ట్రావెల్స్ సంస్థలు వెల్లడించాయి. ఇటీవల పిల్లలకు వేసవి సెలవులు ప్రకటించడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు నగర వా సులు సన్నద్ధమవుతున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఊటీ, మనాలి, కొడైకెనాల్, సిమ్లా తదితర ప్రాంతాలతో పాటు ఎక్కువ మంది కశ్మీర్ వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అనూహ్యంగా పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి నేపథ్యంలో పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు.

మూడేళ్లుగా పెరిగిన టూర్లు..
కోవిడ్ అనంతరం పర్యాటకరంగం అనూహ్యంగా విస్తరించింది. హైదరాబాద్ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగింది. దక్షిణమధ్య రైల్వే ఆధ్యాత్మిక టూర్ల కోసం ప్రత్యేకంగా భారత్‌గౌరవ్ రైళ్లను నడుపుతోంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అన్ని ప్రధాన నగరాలకు కనెక్టివిటీ పెరిగింది. సుమారు 70 నగరాలకు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గత మూడేళ్లుగా టూరిస్టులు పెరిగారు. ఏటా లక్షలాది మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్నారు. కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో అక్కడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. జైపూర్, ఉదయ్‌పూర్ వంటి చారిత్రక నగరాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ భారీగా పెరిగింది.

అమర్‌నాథ్ యాత్రపై ప్రభావం..
మరోవైపు జూలైలో జరగనున్న అమర్‌నాథ్ యాత్రపైనా పహల్గాం దాడి ఘటన ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం తమ వద్ద నమోదు చేసుకున్న 70 బుకింగ్‌లు నిలిచిపోయినట్లు అమీర్‌పేట్‌కు చెందిన ఓ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి చూపిన ఎంతోమంది ఇప్పుడు సందిగ్ధంలో పడిపోయారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త వాతావరణం సద్దుమణిగి జూలై వరకు సాధారణ పరిస్థితులు నెలకొంటే మార్పు రావచ్చు. కశ్మీర్ పర్యటనలను రద్దు చేసుకున్న వాళ్లు చాలా మంది సిమ్లా, ఉత్తరాఖండ్, ఊటీ, మనాలీ వంటి ప్రాంతాలను ప్రత్యామ్నాయంగా ఎంపిక చేసుకుంటున్నారు.

10 వేల మందికిపైగా..
కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పర్యాటకుల రాకపోకలు విస్తరించాయి. 'మే మొదటి వారంలోనే హైదరాబాద్ నుంచి కశ్మీర్‌కు వెళ్లేందుకు 5 గ్రూపులు బుక్ అయ్యాయి. ఇప్పుడు వాళ్లంతా తమ టూర్లను రద్దు చేసుకున్నారు. ఇప్పుడు పరిస్థితి అంతా తలకిందులైంది' అని హిమాయత్‌నగర్‌కు చెందిన ట్రావెల్ ఏజెంట్ పవన్ విచారం వ్యక్తం చేశారు. కశ్మీర్ ఉగ్ర ఘటన నేపథ్యంలో ఈ రెండు నెలల్లో తెలుగు రాష్ట్రాల నుంచి కశ్మీర్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్న సుమారు 10 వేల మందికి పైగా పర్యాటకులు టూర్లను రద్దు చేసుకున్నట్లు ట్రావెల్స్ సంస్థలు అంచనా వేశాయి.

ఎందరున్నారో?

నగరంలోని పాకిస్థానీలపై ఆరా



- స్పెషల్ బ్రాంచ్‌లో రిజిస్టరైంది 208 మంది
- వీరిలో లాంగ్ టర్మ్ వీసా ఉన్నవాళ్లు 156 మంది
- కేంద్రం నిర్ణయం నేపథ్యంలో అప్రమత్తం

సాక్షి, సిటీబ్యూరో: పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో కేంద్రం.. దేశంలో ఉన్న పాకిస్థానీల వీసాలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక్కడ ఉన్న పాకిస్థానీలు నిర్ణీత గడువులోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో నగరంలోని స్పెషల్ బ్రాంచ్‌లో (ఎస్బీ) రిజస్టర్ చేసుకున్న పాకిస్థానీల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. వివిధ వీసాలపై భారత్‌కు వచ్చే విదేశీయులు ఇక్కడ కచ్చితంగా రిజిస్టర్ చేయించుకోవాలి. వారి వీసా వివరాలతో పాటు ఎక్కడ ఉంటున్నారు? ఎవరితో ఉంటున్నారు? ఫోన్ నంబర్? చిరునామా? తదితరాలను అందించాల్సి ఉంటుంది. మిగిలిన అన్ని దేశాలకు చెందిన వాళ్లు శంషాబాద్‌లోని మామిడిపల్లిలో ఉన్న ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) వద్ద రిజిస్టర్ చేసుకుంటారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ జాతీయులు మాత్రం ఎస్బీ అధీనంలోని పాక్, బంగ్లా బ్రాంచ్‌ల్లో రిజిస్టర్ చేసుకోవాలి. ప్రస్తుతం ఈ కార్యాలయం పాతబస్తీలోని పురానీ హవేలీలో ఉంది. ఈ విభాగంలో రిజిస్టరై ఉన్న పాకిస్థానీల సంఖ్య 208గా ఉంది. వీరిలో లాంగ్ టర్మ్ వీసా కలిగిన వాళ్లు 156 మంది ఉన్నారు. ఇక్కడి వారిని వివాహం చేసుకున్న పాకిస్థానీలతో పాటు వారి రక్త సంబంధీకులకు ఈ వీసాలు జారీ చేస్తుంటారు. మరో 13 మంది షార్ట్ టర్మ్ వీసా కలిగి ఉన్నారు. విజిట్, బిజినెస్ తదితర కేటగిరీలకు చెందిన వీసాలు షార్ట్‌టర్మ్ కిందికి వస్తాయి. మిగిలినవన్నీ మెడికల్ వీసాలని అధికారులు చెబుతున్నారు. 1992 నుంచి సార్క్ వీసాలు అమలవుతున్నాయి. సార్క్ సభ్యత్వ దేశాలకు చెందిన ప్రముఖులు, ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులు, పార్లమెంటేరియన్లు, సీనియర్ అధికారులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, క్రీడాకారులు సహా 24 రకాల వారికి ప్రత్యేక మినహాయింపులతో కూడిన వీసాలు ఇస్తుంటారు. ప్రస్తుతం సిటీలో ఉన్న పాకిస్థానీల్లో సార్క్ వీసా కలిగిన వాళ్లు లేరు. నగరంలో రిజిస్టర్ అయిన ఈ 208 మంది వివరాలను ఎస్బీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పాక్ రాయబార కార్యాలయం నుంచి వీరికి తక్షణం భారత్ వదలాల్సిందిగా సందేశాలు వెళ్లినట్లు తెలిసింది. కేంద్రం విధించిన గడువు ముగిసిన తర్వాత వీరిలో ఎందరు ఎగ్జిట్ అయ్యారు అనేది ఇమ్మిగ్రేషన్ నుంచి తీసుకోనున్నారు. అప్పటి కీ ఎవరైనా మిగిలిన ఉన్నట్లు తేలితే వారిని పట్టుకుని బలవంతంగా తిప్పి పంపుతారని ఓ అధికారి తెలిపారు.

సూరీడు సుర్రు.. మీటర్ గిర్రు!

గ్రేటర్‌లో 40 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రతలు

- గురువారం 4,170 మెగావాట్లకు చేరిన డిమాండ్
- భారీగా పెరుగుతున్న గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగం

గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం (మెగావాట్లలో)

తేదీ	2024	2025
ఏప్రిల్ 21	3441	3856
ఏప్రిల్ 22	3886	4026
ఏప్రిల్ 23	3745	4136
ఏప్రిల్ 24	3795	4170

సాక్షి, సిటీబ్యూరో: భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 10 గంటలకే సుర్రుమంటున్నాడు. ఎండలు మండిపోతుండటంతో గురువారం పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. కొద్ది రోజులుగా నగరంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతోంది. 2024 మే 6న రికార్డు స్థాయిలో 4,352 మెగావాట్ల డిమాండ్ (90.68 మిలియన్ యూనిట్లు) నమోదు కాగా.. తాజాగా గురువారం 4,170 మెగావాట్లకు చేరింది. ఇది ఇలాగే కొనసాగితే మే ఒకటి నాటికి 4,500 మెగావాట్లకుపైగా డిమాండ్ వచ్చే అవకాశం లేకపోలేదని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు.

ఆన్‌లోనే ఏసీలు, కూలర్లు
గతంతో పోలిస్తే ప్రస్తుతం నగరవాసుల కొనుగోలు శక్తి పెరిగింది. రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఒకప్పుడు ధనవంతుల ఇళ్లలోనే కన్పించే ఏసీలు ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి నివాసాల్లోనూ అనివార్యమయ్యాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం అనేక మంది ఏసీలు, కూలర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తయారీ కంపెనీలతో పాటు వివిధ ప్రైవేటు బ్యాంకులు జీరో పర్సంటేజీ లోన్లు మంజూరు చేస్తుండటంతో ఆర్థికంగా ఉన్నవారే కాదు.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా వీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ ఎలక్ట్రానిక్ యంత్రాలు సాధారణమయ్యాయి. ఫలితంగా గత కొద్ది రోజుల నుంచి నగరంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతోంది.

'నష్ట'మర్ కేర్!

యూపీఐ చెల్లింపులో నగర వాసి పొరపాటు

- కారు డ్రైవర్‌కు బదులుగా ఫాస్ట్‌ట్యాగ్‌కు చెల్లింపు
- ఇంటర్‌నెట్‌లో లభించిన నకిలీ కస్టమర్ కేర్ నంబర్
- రూ.2.28 లక్షలు స్వాహా చేసిన నేరగాళ్లు



సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్‌నెట్‌లో లభించిన ఓ నకిలీ కస్టమర్ కేర్ నంబర్ నగరవాసి రూ.2.28 లక్షలు నష్టపోవడానికి కారణమైంది. తల్లి చనిపోయిన బాధలో ఉన్న బాధితుడు కారు డ్రైవర్‌కు చేయాల్సిన యూపీఐ చెల్లింపు ఫాస్టాగ్‌కు చేయడంతో సమస్య మొదలైంది. రూ.7 వేలు రిఫండ్ కోసం ప్రయత్నించిన ఆయన రూ.2,28,334 కోల్పోవాల్సి వచ్చింది. దీనిపై గురువారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మరో ఖాతాకు నగదు బదిలీ కావడంతో..
నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి (42) తల్లి ఇటీవల కర్ణాటకలో కన్నుమూశారు. ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి హుటాహుటిన ఆయన బయలుదేరారు. రూ.11 వేలు కిరాయికి ట్యాక్సీ మాట్లాడుకుని రూ.4 వేల డీజిల్ పోయించారు. మిగిలిన రూ.7 వేలు గమ్యం చేరిన తర్వాత ఇస్తానని ఒప్పందం చేసుకున్నారు. కర్ణాటక చేరుకున్న తర్వాత యూపీఐ ద్వారా నగర చెల్లించాలని భావించారు. గమ్యస్థానం చేరుకున్నాక కారులో ఉన్న డ్రైవర్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు చెల్లించడానికి బదులు... అక్కడే ఉన్న ఎస్బీఐ ఫాస్టాగ్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేశారు. దీంతో నగదు ఆ ఖాతాకు వెళ్లిపోయాయి.

- ఈ విషయం గుర్తించిన బాధితుడు వెంటనే ఎమ్మిగనూరులోని కెనరా బ్యాంకును సంప్రదించి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన ప్రాసెస్‌ను ప్రారంభించామని చెప్పిన బ్యాంకు సిబ్బంది యూపీఐ అధికారులకూ ఈ విషయం ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో బాధితుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతికారు. అందులో లభించిన ఓ నంబర్ ఎన్‌పీసీఐదే అని భావించి ఫోన్ చేశారు.
- ఇది సైబర్ నేరగాళ్లు పొందుపరిచింది కావడంతో కాల్ వారికి వెళ్లింది. ఎన్‌పీసీఐ ప్రతినిధిగా మాట్లాడిన కేటుగాడు పేమెంట్ రిఫండ్ చేయడానికి ముందు ఫోన్‌పే ద్వారా తాము సూచించిన నంబర్‌కు మరికొంత బదిలీ చేయాలని కోరాడు. ఆ నగదు అందిన వెంటనే దీంతో సహా మొత్తం కొన్ని నిమిషాల్లో రిఫండ్ అవుతుందని నమ్మబలికాడు. బాధితుడు అలా బదిలీ చేయగా... పేమెంట్ ఆన్ హోల్డ్ అయిందంటూ చెప్పిన నేరగాడు మరికొంత బదిలీ చేయమన్నాడు. కెనరా బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ తెరిచి, క్రెడిట్ లిమిట్ పెంచాలని, మరికొంత బదిలీ చేయించుకున్నాడు. ఆపై బాధితుడి నుంచి ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీ తీసుకుని మరికొంత కాజేశాడు.

మోసాన్ని గుర్తించిన బాధితుడు..

- ఇలా మొత్తం రూ.2,28,334 కాజేసిన నేరగాళ్లు ఐదు నిమిషాల్లో రీఫండ్ వస్తుందన్నారు. అలా కాకపోవడంతో బాధితుడు సైబర్ నేరగాళ్లను సంప్రదించగా... రీఫండ్స్ చాలా ఎక్కువ ఉండటంతో సమయం పడుతోందని, రెండు రోజుల్లో నగదు మొత్తం తిరిగి వచ్చేస్తుందని నమ్మించారు. పోలీసులకు సమాచారం ఇవ్వొద్దని సూచించారు. అలా జరగకపోవడంతో పాటు సైబర్ నేరగాళ్ల నుంచి స్పందన లేకపోవడంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించాడు. దీనిపై ఆన్‌లైన్‌లో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నేడే

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- 2 గంటల్లో ఫలితం వెల్లడి
- పకడ్బందీగా బందోబస్తు

టిక్.. టిక్.. టిక్..

సాక్షి, సిటీబ్యూరో: నామినేషన్ల ఘట్టం నుంచి టాక్‌ఆఫ్‌ది టౌన్‌గా మారిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు శుక్రవారం(నేడు) ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, లెక్కింపునకు సంబంధించి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. గురువారం ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, వీడియో రికార్డింగ్, సెక్యూరిటీ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక కౌంటింగ్ టేబుల్స్, సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ఆయనకు వివరించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అభ్యర్థులు ఇద్దరే కావడంతో..
పోటీలో ఉన్నది కేవలం ఇద్దరు అభ్యర్థులే కావడం, పోలింగ్‌లో పాల్గొన్నది 88 మంది మాత్రమే కావడంతో బ్యాలెట్ లెక్కింపు అయినప్పటికీ, రెండు గంటల్లోగా ఫలితం వెలువడనుందని అధికారులు చెప్పారు. ప్రాధాన్యత ఓట్లను కూడా పరిగణనలోకి తీసుకొని లెక్కింపు చేపట్టనున్నారు. అన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లాగే బ్యాలెట్లను బండిల్స్‌గా విభజించడం ఇతరత్రా పనులు చేస్తారు. ప్రాధాన్యత క్రమంలో ఓట్లయినందున ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే సమయం పట్టేది కానీ, ఇద్దరు అభ్యర్థులే అయినందున త్వరితంగానే ఫలితం వెలువడుతుందని చెబుతున్నారు. నెమ్మదిగా చేసినా రెండు గంటల్లో వెలువడే అవకాశం ఉంది.

భారీ బందోబస్తు..
పోలింగ్ జరిగిన బుధవారం నుంచీ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పోలీసుల దిగ్బంధంలో ఉందనే చెప్పాలి. జరిగేది ఒక్క ఎమ్మెల్సీ ఎన్నిక, పోలింగ్‌కు హాజరైంది 88 మంది ఓటర్లు.. అదీ ప్రజాప్రతినిధులే అయినప్పటికీ సాధారణ ఎన్నికలకు ఏమాత్రం తగ్గకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్క ఓటరుకు ముగ్గురు పోలీసుల వంతున విధుల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం సైతం సాధారణ ప్రజలు కనిపించలేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు చెబుతున్నారు.


ఓట్ల కౌంటింగ్‌కు అంతా సిద్ధం

అయినా ఉత్కంఠ..

- పోలింగ్‌కు హాజరైన ఓటర్లు, పార్టీల వారీగా లెక్కల మేరకు ఎంఐఎం గెలుపు లాంఛనమేనని తెలిసినప్పటికీ, ఇంకా పలువురిలో ఉత్కంఠ నెలకొంది. ఫలితాల్లో అనూహ్యంగా లెక్కల్లో ఏవైనా తేడాలు రావచ్చని భావిస్తున్న వారూ ఉన్నారు. బీఆర్ఎస్ ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనలేదు. పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య, వారి పార్టీలను బట్టి ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చెప్పడం కష్టం కానప్పటికీ, అటు ఆయా పార్టీల్లోనూ, ఇటు సాధారణప్రజల్లోనూ కొత్తగా ఏమైనా జరుగుతుందేమోననే ఉత్సుకత నెలకొంది.
- ఓట్ల సంఖ్యాబలాన్ని బట్టి గెలిచే అవకాశాల్లేకపోయినా బీజేపీ పోటీలో దిగడంతోనే ఈ పోలింగ్‌పై అందరి దృష్టి పడింది. పార్టీలకతీతంగా అంతరాత్మ ప్రబోధం మేరకు తీర్పునివ్వమనడం, బీఆర్ఎస్ పోలింగ్‌ను బహిష్కరించడం, తదితర అంశాలతో మరింత వేడి పెరిగింది. పార్టీ ఆదేశాలను ధిక్కరించి బీఆర్ఎస్ వారు కొందరు పోలింగ్‌కు హాజరవుతారనే టాక్ వినిపించింది. ఎంఐఎం నుంచి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ నుంచి గౌతంరావు పోటీ చేయడం తెలిసిందే.

రూ.74.56 లక్షల హవాలా డబ్బు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

గచ్చిబౌలి: నెల రోజుల నుండి నిఘా ఉంచి రూ.74.56 లక్షల హవాలా డబ్బును రాయదుర్గం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన మేరకు.. ఇద్దరు యువకులు యాక్టివాపై డబ్బు తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో రాయదుర్గంలోని విస్పర్ వ్యాలీ జంక్షన్‌లో ఎస్‌ఐ శ్రీనివాస్ వాహనాల తనిఖీలు చేపట్టారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో వాహనంపై ఒక బ్యాగ్ కనిపించింది. తనిఖీ చేయగా ఆ బ్యాగ్‌లో రూ. 74,56,200 నగదు లభించింది. కరీంనగర్‌కు చెందిన బి.సాయికృష్ణ బీటెక్ పూర్తి చేసి చిత్రపురి కాలనీలో నివాసం ఉంటున్నాడు. రాయదుర్గంలో ఉండే రవితో కలిసి బేగంపేట్‌లోని సురేందర్ అగర్వాల్ నుంచి డబ్బు తీసుకొని వస్తున్నారు. రవి డ్రైవింగ్ చేస్తుండగా బ్యాగ్‌తో సాయి కృష్ణ వెనకాల కూర్చున్నాడు. మియాపూర్‌కు వెళ్లి ఫోన్ చేస్తే ఎవరికి ఇచ్చేది చెప్తారని పోలీసులకు తెలిపారు. స్వాధీనం చేసుకొని నగదును ఆదాయపు పన్నుశాఖ అధికారులకు అప్పగించామన్నారు. కొంత కాలంగా బ్లాక్ మనీ అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. ఈ క్రమంలోనే రెండు మూడు సార్లు పట్టుకునేందుకు ప్రయత్నించినా పట్టుబడలేదు. ఎట్టకేలకు భారీ నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఘరానా దొంగ అరెస్టు

- 44 కేసుల్లో నిందితుడు..



వివరాలు వెల్లడిస్తున్న ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్

జీడిమెట్ల: ఇంట్లో ఎవరూలేని సమయంలో కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి నగలు దోచుకెళ్లే గజదొంగను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రూ.11.5లక్షల సొత్తు రికవరీ చేశారు. గురువారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య వివరాలను వెల్లడించారు. అపురూప కాలనీకి చెందిన పింటూ మార్చి 5న కుటుంబ సభ్యులతో కలిసి కలకత్తా వెళ్లాడు. తరువాత వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. సీసీ కెమరాలను పరిశీలించిన పింటూ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులు వేణుగోపాల్(26), సంపత్‌సాయి(20)గా గుర్తించారు. బుధవారం సాయంత్రం వేణుగోపాల్‌ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి రూ.11.5లక్షలు విలువచేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నిందితుడు సంపత్ సాయి పరారీలో ఉన్నాడు. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి వేణుగోపాల్‌ను రిమాండుకు తరలించారు. వేణుగోపాల్ సైబరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే 44కేసుల్లో నిందితుడుగా ఉండగా గతంలో దుండిగల్ పీఎస్ నుండి పీడీయాక్టు ద్వారా సంవత్సరం జైలుశిక్ష అనుభవించాడు.

బాలికను కిడ్నాప్ చేసి విక్రయానికి యత్నం

- చిన్నారిని రక్షించిన పోలీసులు
- ఐదుగురి రిమాండ్



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న డీసీపీ పాటిల్ కాంతిలాల్

చాంద్రాయణగుట్ట: ఐదేళ్ల బాలికను కిడ్నాప్ చేసిన ఓ ముఠాను చాంద్రాయణగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతి లాల్ సుభాష్, చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ మనోజ్ కుమార్‌తో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 20న బార్కాస్ ప్రాంతానికి చెందిన మరియం భాను(5) చాక్లెట్ ఇప్పించాలని మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్తున్న పెద్దనాన్న బాబాసాదితో మారాం చేయడంతో తన వాహనంపై తీసుకెళ్లాడు. బాలికను వైన్స్ బయట ఉంచి మద్యం తీసుకొచ్చే సరికి బాలిక కనిపించలేదు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా మలక్‌పేట్ సలీంనగర్ కాలనీకి చెందిన భార్యాభర్తలు సయ్యద్ జావిద్ పాషా(51), షహిస్తా పర్వీన్(40)ను అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరం అంగీకరించారు. బాలికను కిడ్నాప్ చేసి ఉప్పల్ ప్రాంతానికి చెందిన పర్వీన్ భాను(40)కు రూ.1.30 లక్షలకు విక్రయించారు. పర్వీన్ భాను ఆ చిన్నారిని ఉప్పల్ చిలుకానగర్‌లో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించే సునీతా కుమారి(50), బంజారాహిల్స్‌లోని నోవా ఫర్టిలిటీ సెంటర్‌లో ఏజెంట్‌గా పనిచేసే కప్పల రాజేంద్ర ప్రసాద్(39) వద్ద విక్రయానికి బేరం పెట్టింది. సునీతా కుమారి, రాజేంద్రప్రసాద్ గతంలో ఈస్ట్ ముంబయ్‌లో ఇదే తరహా చిన్నారులను విక్రయిస్తూ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లి వచ్చారు. ఈ ఐదుగురు ముఠాగా ఏర్పడి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. నిందితుల వద్ద నుంచి యాక్టివా ద్విచక్ర వాహనం, ఆటో, రూ.76 వేల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నగలు ఎక్కువ.. అందులో బంగారం తక్కువ

- విక్రయించిన వ్యక్తిపై ఫిర్యాదు..కేసు మోదు

పంజగుట్ట: తక్కువ శాతం ఉన్న బంగారు ఆ భరణాలను ఎక్కువగా ఉన్నట్లు చూపించి విక్రయించిన ఘటనలో ఓ వ్యక్తిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్‌కు చెందిన సురేష్ గుప్త తన తల్లి మరణించడంతో ఆమె నగలను ఓ ప్రైవేట్ బ్యాంకులో తనఖా పెట్టాడు. తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించకపోవడంతో బ్యాంకు సిబ్బంది నగలను వేలం వేస్తామని నోటీసులు పంపారు. దీంతో అతను తెలిసిన వారివద్ద డబ్బు తీసుకుని బ్యాంకు నుండి నగలను విడిపించి అమీర్‌పేట లోని సిద్ది జువెల్లర్స్‌లో విక్రయించేందుకు వెళ్లాడు. మొత్తం ఆభరణాల బరువు 980 గ్రాములు ఉండడంతో దాని విలువ రూ.40 లక్షలు సదరు బంగారు షాపు నిర్వాహకులు ఇచ్చారు. తరువాత బంగారు ఆభరణాలు పరిశీలించగా బరువు 980 గ్రాములు ఉన్నప్పటికీ అందులో అసలైన బంగారు కేవలం 270 గ్రాములే ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ. 20 లక్షలు మాత్రమే ఉంటుందని మిగిలిన 20 లక్షలు నష్టపోయానని ఇటీవల పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సురేష్ గుప్తపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



ఉప్పల్: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఉప్పల్ నల్ల పోచమ్మ టెంపుల్ ప్రాంతంలో ఓ వ్యక్తి (40) అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారని పోలీసులు తెలిపారు.

మంత్రి పీఏలుగా చెప్పకుంటూ మోసం

వేర్వేరు కేసుల్లో ఇద్దరిపై కేసు

నాగోలు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏగా పరిచయం చేసుకుని అధికారులకు, పోలీసులకు ఫోన్ చేసి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్న వ్యక్తిపై నాగోలు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగోలు పోలీసులు తెలిపిన మేరకు.. వరంగల్ జిల్లా పల్లగుట్ట గ్రామానికి చెందిన మచ్చ సురేష్ (30) నాగోలు వెంకటరెడ్డి నగర్‌లో నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను వివిధ సమస్యలపై ఉద్యోగులు ఇతర అధికారులకు ఫోన్ చేసి మంత్రి పీఏనని చెప్పుకున్నాడు. పోలీసులకు ఫోన్ చేసి తమకు అనుకూలంగా వ్యవహించాలని చెప్పేవాడు. అనుమానం వచ్చిన అధికారులు మంత్రి కార్యాలయంలో సమాచారం ఇచ్చారు. దీంతో మంత్రి వద్ద పనిచేసే నరేష్ బుధవారం నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు సురేష్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో వ్యక్తిపై కేసు..

భూపాలపల్లి జిల్లాకు చెందిన బుస్సా వెంకట్ రెడ్డి (34) నాగోలు మమతనగర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతను కూడా అధికారులకు మంత్రి పీఏనంటూ ఫోన్లు చేసేవాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని వెంకట్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

సైబర్ నేరంలో బ్యాంకు ఉద్యోగి అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నాడనే ఆరోపణలపై ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లో బాధితుడిగా మారి, రూ.1.22 కోట్లు కోల్పోయిన సికింద్రాబాద్ వాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైనట్లు అధికారులు గురువారం తెలిపారు. గ్రేటర్ నోయిడాకు చెందిన దీపక్ కుమార్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. టెలిగ్రాం ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లకు సహకరించడానికి అంగీకరించాడు. వాళ్లు ఇచ్చే కమీషన్లకు ఆశపడి బ్యాంకు ఖాతాలు తెరిచి, వాటి వివరాలు అందించాడు. ఇతగాడు ఇచ్చిన బ్యాంకు ఖాతాల ద్వారా రూ.6 కోట్ల లావాదేవీలు జరిగాయని, దేశ వ్యాప్తంగా 23 కేసులు నమోదై ఉన్నాయని అధికారులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రక్తపు మడుగులో ప్రశాంత్ ప్రియదర్శి..

ప్రమాదానికి కారణమైన ఇన్నోవా కారు..

దుండిగల్: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన ఇన్నోవా కారు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన మేరకు.. చర్చి గాగిల్లాపూర్ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ ప్రియదర్శి(35) సూరారంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. కాగా ఎప్పటిలాగే తన ద్విచక్రవాహనంపై గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చర్చి గాగిల్లాపూర్ కమాన్ వద్ద వెనుక నుంచి వచ్చిన ఇన్నోవా కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రియదర్శి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో డ్రా చేసినా డబ్బు రాకుండా చేసి..

డూప్లికేట్ కీతో మెషీన్ తెరిచి డబ్బు స్వాహా

అమీర్‌పేట: ఏటీఎం మిషన్‌లో సరికొత్త మోసం వెలుగు చూసింది. వినియోగదారులు డ్రా చేసే నోట్లు బయటకు రాకుండా ప్యానల్ యాక్సెస్‌లో ఇరుక్కునేలా టేప్ అంటించి వారు బయటకు వెళ్లాక మారు తాళాలతో మిషన్ తెరిచి అందులోని డబ్బును చోరీ చేసి ఉడాయించాడు. ఏటీఎం నుంచి లావాదేవీలు జరిగినట్లు మెసేజ్‌లు వచ్చినప్పటికీ ఏటీఎంలో నుండి డబ్బులు రాలేదు. ఈ నెల 16న ఓ కస్టమర్ తనకు జరిగిన మోసంపై అంబుడ్స్ మెన్‌కు ఫిర్యాదు చేయడంతో బ్యాంకు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ బ్రాంచి హెడ్ ప్రదీప్ దినకర్ రాజు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజ్‌ను పోలీసులకు పరిశీలించగా దొంగ నగదు పంపిణీ స్లాట్‌లో టేప్ అంటించి డబ్బు బయటకు రాకుండా అడ్డుకున్నట్లు గుర్తించారు. మారుతాళం చెవులతో ఏటీఎం ప్యానెల్ యాక్సెస్‌ను తెరిచి అక్కడ ఇరుక్కుని పోయిన డబ్బు కాజేసినట్లు నిర్ధారించారు. ఇలా సుమారు రూ.45 వేలు అపహరించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిలోఫర్ ఉద్యోగినిపై కేసు నమోదు

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో రోగులకు అక్రమంగా మందులను విక్రయిస్తూ పట్టుబడిన నాల్గవ తరగతి ఉద్యోగిని దాయమ్మపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిలోఫర్‌లో నాల్గవ తరగతి ఉద్యోగినిగా శాలిని పనిచేస్తోంది. ఈమె రాత్రి వేళల్లో విధుల్లో ఉంటూనే ఆసుపత్రికి వచ్చే రోగులకు అనధికారికంగా మందులను విక్రయిస్తోంది. ఈ విషయం ఆస్పత్రి అధికారుల దృష్టికి వచ్చింది. బుధవారం రాత్రి నిలోఫర్ ఆసుపత్రికి మందులతో వచ్చిన ఆమెను సెక్యూరిటీ సిబ్బంది అడ్డగించి చేతిలో ఉన్న సంచులను తనిఖీ చేశారు. ఆమె దగ్గర విలువైన మందులతో పాటుగా కరెన్సీ నోట్లు లభించాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన నాంపల్లి శాంతి భద్రతల విభాగం పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడి పేరుతో టోకరా

సనత్‌నగర్: పెట్టుబడి పేరుతో వాట్సప్‌లో వచ్చిన సందేశానికి ఆకర్షితుడైన ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1,07,000 టోకరా వేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిదిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్‌లో నివాసం ఉండే నాగరాజు ఫోన్ వాట్సప్‌కు పెట్టుబడి పేరుతో సందేశం వచ్చింది. ఆ సందేశం నాగరాజును ఆకట్టుకుంది. ఎలా పెట్టుబడి పెట్టాలో వారిని అడగ్గా వారు కొన్ని సూచనలు చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు నమ్మి రూ.1,07,000 పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత వారు చెప్పిన అన్ని పనులు పూర్తి చేశాడు. కానీ పెట్టుబడితో పాటు వారు ఇస్తానన్న కమీషన్ కూడా రాలేదు. దీంతో తాను ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలంటూ నాగరాజు వారిని అడగ్గా ఎటువంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య



స్నేహిత్ (ఫైల్)

అల్వాల్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చాయని విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మచ్చబొల్లారం మధురానగర్ కాలనీకి చెందిన ఆనంద్‌చారి, సుచరిత దంపతులకు ఇద్దరు కుమారులు ఆశ్రిత్, స్నేహిత్ (16). స్నేహిత్ అల్వాల్ హైటెన్షన్ రోడ్డు వద్ద గల ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల వచ్చిన ఇంటర్ ఫలితాలలో స్నేహిత్‌కు 470 మార్కులకు 325 మార్కులు వచ్చాయి. తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులకు చెప్పి బాధపడ్డాడు. స్నేహిత్ తల్లిదండ్రులు ఇంప్రూవ్‌మెంట్ రాయొచ్చని కుమారుడికి భరోసా ఇచ్చినా బాధపడుతూనే ఉన్నాడు. బుధవారం సాయంత్రం స్నానానికి వెళ్లి వస్తానని చెప్పి బాత్‌రూమ్‌లో టవల్‌తో ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం తెల్లవారు జామున మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

రూ.33 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం..

ఇద్దరి నిందితుల రిమాండ్.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: ఇతర రాష్ట్రం నుంచి గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.33 లక్షల విలువ చేసే 94 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. భద్రాది కొత్తగూడెం జిల్లా, సరపాక ప్రాంతానికి చెందిన స్నేహితులు షేక్ మునావర్(24) కారు డ్రైవర్, ఘంటసాల జగదీష్(19) ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. జల్సాల కోసం సులువుగా డబ్బు సంపాదించేందుకు మునావర్ గంజాయి పెడ్లర్‌గా మారాడు. ఒడిశాలోని సుక్మా ప్రాంతానికి చెందిన కొంత మంది గంజాయి విక్రేతలతో పరిచయం పెంచుకున్నాడు. అక్కడ నుంచి గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో గుల్బర్గా ప్రాంతానికి చెందిన దేవా అలియాస్ సచిన్ తనకు గంజాయిని సరఫరా చేయాలని మునావర్‌ను సంప్రదించాడు. దీంతో అతను తన స్నేహితుడు జగదీష్‌తో కలిసి ఒడిశాకు వెళ్లి అక్కడ 94 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. హైదరాబాద్‌లో సచిన్‌కు గంజాయిని అందజేసే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. అక్కడి నుంచి తెలంగాణకు వస్తున్న లారీలో బయలు దేరి దుండిగల్ ఔటర్ రింగ్ వద్ద దిగారు. ఆ తరువాత సర్వీస్ రోడ్డుపై అనుమానస్పదంగా తిరుగుతుండగా అక్కడే ఉన్న ఎస్‌ఓటి పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకోవడంతో గంజాయి తరలింపు విషయం వెలుగులోకి వచ్చింది. రూ.33 లక్షల విలువ చేసే గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని వారిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సచిన్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. సమావేశంలో దుండిగల్ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్‌ఓటి సీఐ శ్యాం సుందర్ రెడ్డి, డిఐ సతీష్ ఉన్నారు.

స్క్రాప్ ఉందని రప్పించి..

- రూ.25 లక్షలు కాజేసి ..
- పథకం ప్రకారం దోపిడీ
- ఏఆర్ కానిస్టేబుల్, మరో ఇద్దరి అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితులు

మొయినాబాద్: స్క్రాప్ బిజినెస్ చేసేవారి నుంచి హవాలా డబ్బును కొట్టేయాలని పథకం పన్నారు. పథకం ప్రకారం స్క్రాప్ ఉందని వ్యాపారులను రప్పించారు. డబ్బులు తెచ్చిన వారిని పథకంలో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ బెదిరించాడు. ఏడుగురు చుట్టుముట్టి డబ్బులు లాక్కుని పారిపోయారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ సంఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కలకలం రేపింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ స్క్రాప్ బిజినెస్ చేస్తాడు. ఇతనికి నబి అనే వ్యక్తి ముంబయ్‌లో కొంత కాలం క్రితం పరిచయమయ్యాడు. ఈ క్రమంలో అతని కుమారుడు మొబిన్ పరిచయమయ్యాడు. అజయ్, మొబిన్ బుధవారం హైదరాబాద్‌లో స్క్రాప్ బిజినెస్ చేసే ఇమ్రాన్, ఉమర్ అనే వ్యాపారులకు ఫోన్ చేశారు. మొయినాబాద్ మండలం కుత్బుద్దీన్‌గూడలో ఓ షెడ్డులో స్క్రాప్ ఉంది. అది తీసుకోవడానికి డబ్బులు తీసుకుని రావాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన వ్యాపారులు రూ.25 లక్షలు నగదు తీసుకుని కుత్బుద్దీన్‌గూడకు వచ్చారు. అజయ్, మొబిన్ వారిని ఫాంహౌస్ లోపల స్క్రాప్ ఉందని లోపలికి పంపుతుండగానే ఐదుగురు వ్యక్తులు వచ్చి వారిని చుట్టుముట్టారు. ఈ డబ్బులు ఎక్కడివి.. ఎక్కడికి తీసుకెళ్తున్నారంటూ వారిని బెదిరించి డబ్బులు లాక్కున్నారు. వెంటనే అజయ్, మొబిన్‌ను సైతం కారులో ఎక్కించుకుని అక్కడి నుంచి పారిపోయారు.

అంతా పథకం ప్రకారమే..

స్క్రాప్ వ్యాపారుల నుంచి హవాలా డబ్బులు కొట్టేయాలనే ఆలోచనతో అజయ్, మొబిన్ పథకం వేశారు. మొబిన్ ఆరు నెలల క్రితం వరకు హైదరాబాద్‌కు చెందిన జుబేర్ వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. జుబేర్‌కు మొయినాబాద్ మండలంలోని కుత్బుద్దీన్‌గూడలో ఫాంహౌస్ ఉంది. ఫాంహౌస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కుత్బుద్దీన్‌గూడకు చెందిన రాంచందర్‌తో విషయం చెప్పాడు. డబ్బులు తీసుకుని వచ్చేవారిని బెదిరించేందుకు పోలీసులెవరైనా ఉంటే బాగుంటుందని చెప్పాడు. సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కుత్బుద్దీన్‌గూడకు చెందిన శేఖర్‌కు విషయం చెప్పాడు. అదే గ్రామానికి చెందిన మసూద్‌ను సైతం సిద్ధం చేశాడు. వీరితోపాటు మొబిన్ తండ్రి నబి, బంధువు ఇమ్రాన్‌ను కలుపుకొని పథకం వేశారు. స్క్రాప్ వ్యాపారులు రూ.కోట్లలో బిజినెస్ చేస్తారని.. వారి వద్ద అంతా హవాలా డబ్బు ఉంటుందని.. డబ్బులు లాక్కున్నా ఎక్కడా ఫిర్యాదు చేయరని అజయ్ చెప్పడంతో అందరూ కలిసి డబ్బులు కొట్టేసే పథకం పన్నారు. దాని ప్రకారమే బుధవారం మధ్యాహ్నం స్క్రాప్ వ్యాపారులు ఇమ్రాన్, ఉమర్‌కు ఫోన్ చేసి రప్పించారు. వారు తెచ్చిన రూ.25 లక్షల నగదును లాక్కుని కారులో పారిపోయారు.

పోలీసులకు ఫిర్యాదు చేయడంతో..

ఈ ఘటనపై బాధితులు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు. ఫాంహౌస్‌లో పనిచేసే రాంచందర్, ఏఆర్ కానిస్టేబుల్ శేఖర్, మరో నిందితుడు మసూద్ కుత్బుద్దీన్‌గూడకు చెందినవారు కావడంతో మొదట వారి వివరాలు సేకరించారు. శేఖర్ ఏఆర్ కానిస్టేబుల్‌గా సైబరాబాద్ కమిషనరేట్‌లో పనిచేస్తున్నాడని తెలుసుకుని పూర్తి వివరాలు రాబట్టారు. ఏమీ తెలియనట్టు ఊళ్లోనే ఉన్న శేఖర్, రాంచందర్, మసూద్‌ను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారులు అజయ్, మొబిన్, అతని తండ్రి నబి, బంధువు ఇమ్రాన్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహిళా జర్నలిస్టులకు ఆరోగ్యంపై అవగాహన



పంజగుట్ట: నిత్యం పనిఒత్తిడిలో, బిజీగా ఉండే మహిళా జర్నలిస్టులు వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రముఖ వైద్యురాలు శ్రీదేవి అన్నారు. ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అమర్ హాస్పటల్స్ సహకారంతో గురువారం మహిళా జర్నలిస్టులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి ఏ వయస్సులో మహిళలకు ఏ రకమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందో తెలిపారు. గాలి, నీరు, ఆహారం అన్ని కలుషితమయ్యాయని విధులు నిర్వహిస్తూనే ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని సీనియర్ జర్నలిస్టులు రచన, వనజ, హసీన, పద్మావతిలు మహిళా జర్నలిస్టులకు సూచించారు.

సత్య సాయిబాబా ఆరాధన మహోత్సవం



ఖైరతాబాద్: సత్య సాయిబాబా ఆరాధన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఖైరతాబాద్ లైబ్రరి చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌తో పాటు వివిధ అనుబంధ కాలేజీల్లో పని చేస్తున్న పార్టుటైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత మూడు రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం దండోర మోగించారు. ఓయూ క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజీ నుంచి వీసీ పాలన భవనం వరకు డప్పు వాయిద్యంతో నినాదాలు చేస్తూ కవాతు చేపట్టారు. పీజీ, పీహెచ్‌డీ, యూజీసీ నెట్ తదితర అర్హలతో పాటు రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఉద్యోగాలకు ఎంపికైన పార్ట్‌టైం అధ్యాపకులపై చిన్న చూపు తగదన్నారు. తక్కువ వేతనంలో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపక ఉద్యోగాల నియామకానికి విడుదల చేసిన జీవో 21లో కనీసం వెయిటేజ్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.సోమేశ్వర్, కార్యదర్శి జానకి రెడ్డి, ఉపాధ్యక్షులు డా. ఎస్వీ రత్నం, డా.సుందర్, డా.యుగేందర్, డా.దుబ్బ రంజిత్, డా.వరలక్ష్మీ, డా.విష్ణు భూపతి, డా.శంకర్, డా.మధు, డా.కర్ణాకర్, డా.కవిత, డా.శ్రీదేవి, డా.సాగరిక తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి కమిటీలు

- మే నెలాఖరు లోగా లబ్ధిదారుల ఎంపిక
- జూన్ 2న రుణపత్రాల పంపిణీ
- ఎదురుచూస్తున్న ఆశావహులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

బంజారాహిల్స్: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియడంతో అర్హుల ఎంపికపై ఆశావహుల్లో ఎదురుచూపులు మొదలయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం కమిటీలు ఏర్పాటుచేసింది. ఈ కమిటీల నేతృత్వంలో వార్డు సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. ఆయా కమిటీల నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సంబంధిత కమిటీలు పంపిస్తాయి. అన్నింటినీ పరిశీలించిన తర్వాత తుది జాబితాను కలెక్టర్ వెల్లడిస్తారు. స్వయం ఉపాధి పథకానికి ఎంపికైన వారికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న రుణపత్రాలు అందజేయాలని నిర్ణయించారు. అయితే కార్పొరేషన్ల వారీగా పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో ఎవరు ఎంపిక అవుతారో, ఎందరు తిరస్కరణకు గురవుతారో కొద్ది రోజుల్లో వెల్లడి కానుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకానికి 3,796 దరఖాస్తులు వచ్చాయి. తాజాగా వార్డు కార్యాలయాల్లో ఇంకా దరఖాస్తులు తీసుకుంటున్నారు.

పథకం అమలు ఇలా..

- ప్రభుత్వం విధి విధానాల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే అవకాశం ఇస్తారు.
- మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు కేటాయిస్తారు. వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు.
- గతంలో స్వయం ఉపాధి పొందని వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
- పథకానికి ఎంపికైన వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఉపాధి అవకాశాలు..

యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలచేస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయం అందించాలన్నది దీని ముఖ్య ఉద్దేశం. ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించగా, అర్హుల డిమాండ్ మేరకు వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి ఇంకా తీసుకుంటున్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా సర్కిళ్లు, బ్యాంకుల వారీగా లక్ష్యాలు నిర్దేశించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్ల లక్ష్యాలను నిర్ణయించనున్నారు. ఇందుకోసం అన్ని సంక్షేమ శాఖల సిబ్బంది, బ్యాంకర్లతో కూడిన బృందం ముఖాముఖి నిర్వహించి మే నెలాఖరు వరకు లబ్ధిదారుల జాబితాను రూపొందించనున్నారు. యూనిట్ల లక్ష్యం కంటే ఆర్జీలు చాలా ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. రూ.50 వేల యూనిట్‌కు బ్యాంక్ రుణంతో సంబంధం లేకుండా వంద శాతం రాయితీ ఉంటుంది. గరిష్టంగా రూ.4 లక్షల యూనిట్ వరకు ఎంచుకోవచ్చు. రూ.లక్ష యూనిట్‌కు 10 శాతం, రూ.2 లక్షలకు 20 శాతం, రూ.3 లక్షలకు 30 శాతం బ్యాంక్ రుణం మంజూరు చేయాలి. మిగతా మొత్తం రాయితీ వర్తిస్తుంది. లబ్ధిదారుల ఎంపికలో నిస్సాహాయులు, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గతంలో స్వయం ఉపాధి పొందని వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరవధిక సమ్మె



మద్దతు తెలుపుతున్న యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ సీతారామారావు

బంజారాహిల్స్: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరుతూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ సీతారామారావు మద్దతు ప్రకటించి కాంట్రాక్ట్ అధ్యాపకుల న్యాయమైన డిమాండ్ క్రమబద్ధీకరణను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం కూడా కొనసాగింది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కే అవినాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.కిషోర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టే లోపు యూజీసీ పే స్కేల్ (బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, 3 శాతం ఇంక్రిమెంట్) ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం సలహాదారులు డాక్టర్ కే నర్సింహులు, కాసం విజయ్, సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ, కోశాధికారి వై.కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు మగ్దూం మొహియుద్దీన్, నాగిళ్ల రామకృష్ణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు పడాల లక్ష్మణ్, సునీల్‌కుమార్, విజయ ఉషశ్రీ, సద్దాంతి అరుణ, నర్సయ్య భట్టు, కురుమేటి దయాకర్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: అక్రమంగా నిర్మించిన అంతస్తులను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది కూల్చివేశారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్ రోడ్‌నెం.11లోని సర్వీ హోటల్ సమీపంలో సుమారు 180 గజాల్లో ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఈ భవనానికి మూడు అంతస్తులకు మాత్రమే అనుమతి ఉన్నట్లు ఫిర్యాదులు అందుకున్న జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం విచారణ చేపట్టింది. నోటీసులు ఇచ్చినా యజమాని దీపక్ స్పందించకపోవడంతో గురువారం అదనంగా నిర్మించిన రెండు ఫ్లోర్లను పాక్షికంగా కూల్చివేశారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

పంజగుట్ట: సోమాజిగూడ డివిజన్ పరిధిలో వర్షపు నీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ వనం సంగీత గురువారం ప్రారంభించారు. రాజీవ్ చౌరస్తా కీర్తిలాల్ జువెలర్స్ నుంచి జయా గార్డెన్ వరకు రూ.14 లక్షలతో వేయనున్న వర్షపు నీటి పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు పనులు ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజపతి శ్రీనివాస్, నందు, సరిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి



అభివాదం చేస్తున్న పిడమర్తి రవి తదితరులు

హిమాయత్‌నగర్: ఉద్యమకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలం కేటయించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధరక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా ఉద్యమ నేత డాక్టర్ బొమ్మెర స్టాలిన్‌ను నియమించి మాట్లాడారు. దేశంలో సిద్ధాంతం లేని ఏకైక ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. బీఆర్ఎస్ పార్టీలో వలస వచ్చిన కార్పొరేట్ శక్తులు తప్పా తెలంగాణ ఉద్యమకారులు ఎవరూ లేరని, కాబట్టి బీఆర్ఎస్ ఉద్యమకారుల పార్టీ అని అనడానికి అర్హత లేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత లేకుండా పార్టీ పదవులు కేటాయించకుండా వజ్రోత్సవ సభ ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఎండీ రహీం, గుడిపల్లి రవి, పద్మశాలి రాజు, భుదాల బాబురావు, బోరెల్లి సురేష్, ఎర్రమళ్ల మొగులయ్య, నక్క మహేష్, వరలక్ష్మి, జోగు గణేష్, రాజేష్, రాజు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేష్ తదితరులు

హిమాయత్‌నగర్: బీసీ రిజర్వేషన్‌లు 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 1000 మందితో ఆమరణ నిరాహార దీక్షా చేపడతమని, మంత్రులు, ఎమ్మెల్యేలను బయట తిరగనివ్వమని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..12 నెలల క్రితం జరగాల్సిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్ గురించి వాయిదా మీద వాయిదా పడుతూ జాప్యం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు జరుపుతామన్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించకపోవడం దారుణం అన్నారు. బీసీ రిజర్వేషన్ల విష య ం పరిష్కారం కాకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు జి.అంజి, మణికంఠ, రాజు నేత, నరసింహ గౌడ్, రవికుమార్, ఎస్.లక్ష్మీనారాయణ, ఫణి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

బంజారాహిల్స్: ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో నగరంలో మద్యం దుకాణాలు మూసివేశారు. అయితే యూసుఫ్‌గూడలో టీ దుకాణం నిర్వహించే రంగు ఉత్తర అనే మహిళ ముందుగానే వైన్‌షాపు నుంచి ఆఫీసర్ ఛాయిస్, ఓల్డ్ ఎడ్మైరల్ మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు అమ్ముతుండగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఆమెను అరెస్టు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ ఆర్టిస్ట్‌పై యూనియన్ నాయకుడి దాడి

బంజారాహిల్స్: తనకు రావాల్సిన జీతం చెల్లించాలని అడిగిన జూనియర్ ఆర్టిస్ట్‌పై యూనియన్ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని యాదగిరినగర్ పెద్ద సమ్మయ్య అపార్ట్‌మెంట్‌లో ఉండే మల్లికార్జున్ (53) జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ ఉదయం ఇందిరానగర్‌లోని జూనియర్ ఆర్టిస్ట్ కార్యాలయానికి క్రమం తప్పకుండా వెళ్లి రిపోర్ట్ చేస్తుంటాడు.

అక్కడి నుంచి వివిధ సినిమా షూటింగ్‌లకు వెళ్తుంటాడు. అదే క్రమంలో బుధవారం ఉదయం 6 గంటలకు యూనియన్ కార్యాలయానికి వెళ్లగా అదే సమయంలో మల్లికార్జున్ వద్దకు వచ్చిన యూనియన్ నేత స్వామిగౌడ్ దుర్భాషలాడుతూ దాడికి దిగాడు. నకిలీ కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరించాడు. నాలుగు నెలలుగా తాను జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నా తనకు రావాల్సిన డబ్బులను కూడా స్వామిగౌడ్ వద్దనే ఉంచుకున్నాడని మల్లికార్జున్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపై తమ్ముడి దాడి

సనత్‌నగర్: కుటుంబ కలహాలతో అన్నపై తమ్ముడు కర్రతో దాడి చేసిన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మోతీనగర్ పీఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉండే రాజారావు (41) ఓక్లహోమా ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తుంటాడు. ఈ నెల 21న అతడి తమ్ముడు సత్యనారాయణ మొదటి అంతస్తులో ఉండే తన ఇంట్లోకి చొరబడి తల్లి పట్ల దురుసుగా ప్రవర్తిస్తుండడంతో ఆ సమయంలో రాజారావు భార్య అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో ఆమెనూ దుర్భాషలాడాడు. ఈ విషయమై రాజారావు తన తమ్ముడు సత్యనారాయణను నిలదీయగా కర్రతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తనపై దాడికి పాల్పడ్డ సత్యనారాయణపై చర్యలు తీసుకోవావాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గృహిణి అదృశ్యం

సనత్‌నగర్: గృహిణి అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన నల్లదాసరపల్లి బాలరాజ్ వ్యాపార నిమిత్తం నగరానికి వచ్చి భార్య మౌనికతో కలిసి ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 21న ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు బాలరాజ్ రోజువారి విధులకు వెళ్లి రాత్రి ఇంటికి రాగా మౌనిక కనిపించలేదు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎల్ఈడీ టెండర్లలో అవకతవకలపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కెవి.గౌడ్

హిమాయత్‌నగర్: రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పరిధిలో ఎల్ఈడీ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుల అలాట్మెంట్ టెండర్లలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ..కోర్టు వివాదాల్లో ఉన్న నవనిర్మాణ్ అసోసియేట్స్ సంస్థకు టెండర్ అలాట్ చేశారని తెలిపారు. టెండర్ ప్రక్రియలో జతపరచిన డాక్యుమెంట్లలో అనేక అంశాలపై సదరు సంస్థ తప్పుదారి పట్టించిందని ఆరోపించారు. రూ.10, 12 కోట్లు కోట్ పేర్కొన్న సంస్థను కాదని రూ.63, రూ.56 లక్షలు కోట్ చేసిన సంస్థల అర్హత గలయిగా ప్రకటించారని తెలిపారు. కాబట్టి ప్రస్తుత టెండర్‌లను రద్దు చేసి తిరిగి పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై హైకోర్టులో కేసు నడుస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ప్రతినిధి వేముల కొండల్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కెవి.గౌడ్, ఉపాధ్యక్షులు చెన్నా శ్రీకాంత్, మహిళా అధ్యక్షురాలు సోని గౌలికార్, హరి కోయల్ కార్ తదితరులు పాల్గొన్నారు.

జైళ్లలో సంస్కరణలు, పునరావాస చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వి.కె.సింగ్

హిమాయత్‌నగర్: జైళ్లలో సంస్కరణలు, పునరావాసం చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జాతీయ కారాగార ఆలోచనాపరుల వేదిక విజ్ఞప్తి చేసింది. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రిజన్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, తెలంగాణ జైళ్ల మాజీ డైరెక్టర్ జనరల్ ఐపీఎస్(రిటైర్డ్) వి.కె. సింగ్ మాట్లాడుతూ..జాతీయ కారాగార ఆలోచనాపరుల వేదిక అయిన ప్రిజన్ వరల్డ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ కారాగార మహాసభలు జరిగాయని తెలిపారు. భారత దేశంలో జైళ్ల సంస్కరణలు, పునరావాసానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు జైలు, కరెక్షనల్ అధికారులు, ప్రస్తుత, రిటైర్డ్ జైళ్ల శాఖల అధిపతులు, సైకో సోషల్ వర్కర్లు, ఎన్జీవోలు, విద్యావేత్తలను ఏకతాటిపైకి తీసుకురావడానికి 60 మందికి పైగా నిపుణుల మద్దతుతో ఈ మహా సభలు జరిగాయన్నారు. జైళ్ల శాఖలో వివిధ రాష్ట్రాల్లో 30 శాతం నుంచి 50 శాతం వరకు ఉన్న ఖాళీలు భర్తీ చేయాలన్నారు. జైళ్లలో సంస్కరణలు, పునరావాసం చేపట్టడానికి కరెక్షనల్ సిబ్బంది కొరతను తీర్చాలన్నారు. జైలు సిబ్బంది, ఖైదీల పేలవమైన పని, జీవన పరిస్థితులు మెరుగుపర్చాలన్నారు. మానసిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. జైళ్లలో మహిళలు, పిల్లలు, బయట కుటుంబ సభ్యుల పరిస్థితులు దాయనీయంగా ఉన్నాయన్నారు. జైలు సిబ్బందికి విద్య, నైపుణ్య శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు లేకపోవడం వంటి అంశాలపై ఇందులో చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎ.నర్సింహ, వినోద లక్ష్మి ఎల్ఎం.చౌదరి, బేరిక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులపై వ్యాసరచన పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్ట్స్ కాలేజీలో గురువారం తెలంగాణ విద్యార్థి ఫోరం (టీవీఎఫ్) ఆధ్వర్యంలో మహనీయులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏప్రిల్‌లో వరుసగా వచ్చే మహనీయులు జయంతిని పురస్కరించుకొని మహాత్మా జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర, వారి ఆశయాలు అనే అంశం పై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు టీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకాడపు మధు తెలిపారు. మహనీయుల స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు తెలియచేసి వారిలో చైతన్యం కోసం ఈ పోటీలను నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, పవన్‌యాదవ్, అనస్‌ఖాన్, హరికృష్ణ, నరేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వీసీకి మోడల్ స్కూల్ టీచర్ల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ లేదా టైం స్కేల్ హోదా కల్పించాలని ఓయూ మోడల్ స్కూల్ టీచర్లు వీసీ ప్రొ.కుమార్ వినతి పత్రం ఇచ్చారు. యూనివర్సిటీ క్యాంపస్ బీఈడీ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న ఓయూ మోడల్ స్కూల్‌లో ఒక్క పర్మనెంట్ టీచర్ కూడా లేరని వీసీకి వివరించినట్లు కాంట్రాక్టు టీచర్లు డా.భిక్షపతి, జహంగిర్ పేర్కొన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన తక్కువ వేతనానికి గత 15 ఏళుల్గా పని చేస్తున్న 14 మంది టీచర్లను రెగ్యులర్ లేదా టైంస్కేల్ ఉద్యోగుల హోదా కల్పించాలని కోరగా వీసీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

టెక్నోస్మానియా ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీలో జాతీయ స్థాయి టక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మాయా–2025 ప్రారంభమైంది. గురువారం కాలేజ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.రమేష్‌కుమార్ అధ్యక్షత వహించగా రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి, కన్వీనర్ డా.శ్రీనునాయక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రెండు రోజుల పాటు జరిగే టెక్నోస్మానియా కార్యక్రమంలో సదస్సులు, పోస్టర్ ప్రజెంటేషన్, ఎగ్జిబిషన్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శిరీష్ హెచ్ సోనావానే, హయవదన, రాజం, డా.అభిలాష్, డా. శ్రీనివాసులు, డా.భాస్కర్, డా.అనిత, డా.పరుశురామ్, డా.సారంబలయ్య, డా.టి జ్యోతి, డా.సునీత, డా.కవిత, డా.పరమేశ్వర్లు, డా.అర్జున్, డా.రేణు, డా.అజిత్, పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలు

పహల్గాం ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు



హిమాయత్‌నగర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

హిమాయత్‌నగర్: ప్రపంచ దేశాలు ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పహల్గాం ఘటనలో మరణించిన వారికి నివాళులర్పిస్తూ, వారి మరణానికి కారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, ఉగ్రవాదుల దిష్టిబొమ్మని హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద దహనం చేశారు. ఏఐఎస్ఎఫ్ నేతలు గ్యార క్రాంతి, గ్యార నరేష్, సామిడి వంశోవర్ధన్‌రెడ్డి, ఎండీ అన్వర్, చైతన్యయాదవ్, అరుణ్, హరీష్, జ్ఞానేశ్వర్, అశ్విన్, వెంకటేష్, ఉదయ్, సాయి పాల్గొన్నారు.

బీజేపీ మౌన జ్యోతి ర్యాలీ..

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం బీజేపీ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్వార్టర్స్ నుండి హిమాయత్‌నగర్ వరకు మౌన జ్యోతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పి.ప్రసాద్, కె.శ్రీధర్, నవీన్, నరహరి, సుధాకర్, మాధవి, మనీలా శాంతి, కవిత, పద్మజ, అభిషేక్ యాదవ్ పాల్గొన్నారు.

టెర్రరిస్టులకు తగిన గుణపాఠం చెప్పాలి..

ఫిలింనగర్: పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ బీసీ సంఘం నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. గురువారం ఫిలింనగర్‌లోని విగ్రహాల చౌరస్తాలో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి బాయిపూలే విగ్రహం వద్ద కాల్పుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టెర్రరిస్టులకు తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు భాస్కర్ గౌడ్, నర్సింహ, ఎం. రాములు, దండు లక్ష్మణ్, రాంచందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కు పాదం మోపాలి..

రహమత్‌నగర్: ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కోరారు. పహల్గాం ఉగ్రదాడిపై ఆయన తీవ్రంగా స్పందించారు. తన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ..ఇస్లాం మతం శాంతికి కోరుకుంటుందని, మారణహోమాన్ని కాదాని పేర్కొన్నారు. టూరిస్టులపై దాడి చేసి హత మార్చడం సరికాదాని వాపోయారు. హంతకులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. బోరబండలో పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేసి పహల్గాం మృతులకు నివాళులర్పించామన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి

లక్డీకాపూల్: పహల్గాంలో టూరిస్టులపై జరిగిన దాడిని ఖండిస్తూ యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కశ్మీర్‌ను తిలకించడానికి వెళ్లిన టూరిస్టులపై అత్యంత దారుణంగా కాల్పులు జరిపి 28 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదాన్ని తుది ముట్టించాలంటూ నినాదించారు. పార్టీలు ఏవైనా, అధికారం ఎవరిదైనా దేశ ప్రజల రక్షణకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీకరప్షన్ ఫౌండర్ రాజేంద్ర, గ్రేటర్ అధ్యక్షుడు కొన్నె దేవేందర్, మహిళా చైర్మన్ డా. ప్రవంతి, రాష్ట్ర మహిళా అధ్యక్ష, కార్యదర్శులు గీతానంద్, స్వప్న, జాతీయ కార్యవర్గసభ్యులు కొమటి రమేష్ బాబు, పరికిపళ్ల గంగాధర్, బత్తిని రాజేష్, నాగేంద్ర, పాశిగంటి వంశీకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో..

ఖైరతాబాద్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఖైరతాబాద్ డివిజన్‌లోని ఓల్డ్‌సీఐబి క్వార్టర్స్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.



ఫిలింనగర్‌లో పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు



యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో..



ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబి క్వార్టర్స్‌లో..

ట్రాఫిక్ పోలీసుల ఉచిత సమ్మర్ క్యాంప్

సాక్షి, సిటీబ్యూరో: నగర ట్రాఫిక్ పోలీసులు ఏడు నుంచి పదో తరగతివిద్యార్థుల కోసం ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. హోండా మోటార్ సైకిల్స్, స్కూటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ క్యాంప్ మే 5 నుంచి 10 వరకు జరుగుతుందని ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ గురువారం తెలిపారు. గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు చిన్నారులకు డ్యాన్స్, మ్యూజిక్, పెయింటింగ్, కార్టూన్, చేతి రాత మెరుగు పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ట్రాఫిక్ అవేర్‌నెస్ అండ్ సేఫ్టీ, సెల్ఫ్ డిఫెన్స్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని, శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని జోయల్ అన్నారు. ఆసక్తి ఉన్నవారు ఇన్‌స్పెక్టర్ జి.హరీష్ (8712660655)నిగానీ, కార్యాలయ సహాయకుడి(9848063345)ని గానీ సంప్రదించాలని సూచించారు. క్యాంప్‌నకు హాజరయ్యే బాలబాలికలకు వారి తల్లిదండ్రులే రవాణా సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి

లక్డీకాపూల్: కశ్మీర్‌లోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రం పహెల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడిని, నరమేధాన్ని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) తీవ్రంగా ఖండించింది. దాడిలో మరణించిన 28 కుటుంబాలకు సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణలు ప్రగాఢ సంతాపం తెలిపారు. గురువారం నాంపల్లిలోని టీజీవో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విచక్షణ, వివేకం లేని ఉగ్ర మూకలను ఉక్కుపాదంతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ దాడి దేశ ప్రతిష్టను, భిన్నత్వంలో ఏకత్వం వారసత్వంతో జీవిస్తున్న ప్రజల సామరస్యత, సహజీవన విలువలకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్యాం, తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.రామారావు, శిరీష, లక్ష్మణ్ గౌడ్, అక్తర్ అలీ, రాఘవేందర్ రాజ్, దేవేందర్, డాక్టర్ ఉమా శ్రీనివాస్, డాక్టర్ నరసింహ, డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆఫ్ డే దుకాణాలు మూసివేత

అబిడ్స్: పెహల్గాం ఉగ్రవాద దాడికి నిరసనగా బేగంబజార్ హోల్‌సేల్ వ్యాపార సంస్థలను శుక్రవారం మధ్యాహ్నం 12 వరకు(ఆఫ్ డే) దుకాణాలు మూసి ఉంచనున్నట్లు ది హైదరాబాద్ జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్ వ్యాస్, జనరల్ సెక్రెటరీ నరేంద్ర కుమార్ బన్సల్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు బేగం బజార్ అజీజ్ ప్లాజా వద్ద వ్యాపారులందరూ సమావేశమై ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపడతామన్నారు.

బీసీసీఐ అండర్–19కు నగర బాలికలు

అరుదైన స్థానం దక్కించుకున్న ఏడుగురు అమ్మాయిలు


పార్వతి

లక్డీకాపూల్ : బీసీసీఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్ 19 ఎలైట్ శిబిరాలకు నగరానికి చెందిన ఏడుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకేసారి నగరానికి చెందిన ఏడుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక కావటం ఇదే మొదటిసారి. ఎంపికైన వారిలో కె.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పీవీ హంసకి, సీపీ పార్వతి, ఈ శృజన ఉన్నారు. త్వరలోనే రాంచీలో జరగనున్న జట్టు–ఏ శిక్షణకు నిధి, సంధ్య, కావ్యశ్రీ, టీమ్ –డీకి డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్–బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బీసీసీఐ అండర్ –19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొననున్నారు. శుక్రవారం నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొననున్నారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

సాంకేతికంగా... 'నిరభ్యంతరం'గా!

- తాత్కాలిక ఎన్‌ఓసీ జారీ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్
- కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర అగ్నిమాపక శాఖ
- మరో నెల రోజుల్లో అందుబాటులోకి ఈ విధానం
- ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండదు: డీజీ


డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ అగ్నిమాపక శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. భవనాల నిర్మాణానికి ముందు జారీ చేసే తాత్కాలిక నిరభ్యంతర పత్రం (ప్రొవిజినల్ ఎన్‌ఓసీ) జారీ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ పర్యవేక్షణలో ఓ ప్రముఖ సంస్థ రూపొందిస్తున్న ఈ సాఫ్ట్‌వేర్ నెల రోజుల్లో అందుబాటులోకి రానుందని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. నిర్ణీత రుసుం చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రొవిజినల్ ఎన్‌ఓసీ పొందవచ్చని పేర్కొన్నారు.

వీరికి ప్రొవిజినల్ ఎన్‌ఓసీ తప్పనిసరి

రాష్ట్రంలో వాణిజ్య, వ్యాపార అవసరాల కోసం నిర్మించే 15 మీటర్ల కంటే ఎత్తైన, నివాస గృహాలుగా నిర్మించే 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తైన భవనాలకు ఈ ప్రొవిజినల్ ఎన్‌ఓసీ తప్పనిసరి. వీటితో పాటు 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉండే పాఠశాలలు, సినిమా హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, మతపరమైన, ప్రజావసరాలకు సంబంధించిన భవనాలకు కూడా ఈ ప్రొవిజినల్ ఎన్‌ఓసీ తీసుకోవడం అనివార్యం. భవన నిర్మాణానికి ముందే దీన్ని పొందాల్సి ఉంటుంది. అగ్నిమాపక శాఖ నుంచి ప్రొవిజినల్ ఎన్‌ఓసీ తీసుకుంటేనే ఇతర విభాగాలు తమ అనుమతుల్ని జారీ చేస్తాయి. ఈ ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసే ముందు ఆయా భవనాలకు సంబంధించిన పూర్తి వివరాలతోపాటు అమలు చేయబోయే ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి.

ఆ వివరాలన్నీ పొందుపరచాలి...

భవన నిర్మాణం ప్రారంభానికి ముందే జారీ అయ్యే ఈ ప్రొవిజినల్ ఎన్‌ఓసీ కోసం దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఆ ఫైల్‌ను, అందులోని ప్రతిపాదిత భద్రత ప్రమాణాలను పరిశీలిస్తారు. అవసరమైతే మార్పులు, చేర్పులు సూచించి, వాటిని జోడించిన తర్వాతే జారీ చేస్తారు. భవనం ఎత్తు, విస్తీర్ణం, ఎందుకు వినియోగిస్తారు? తదితర అంశాల ఆధారంగా భద్రతా ప్రమాణాలు ఉంటాయి. ఆ భవనానికి ఎన్ని ఫైర్ ఎగ్జింగ్విషర్లు, స్ప్రింక్లర్లు ఎన్ని, ఏ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనే విషయాలు నిర్దేశించి ఉంటాయి. భవనం భద్రత ప్రమాణాల నమూనా, వాటికి తగ్గట్టు ఉంటేనే ప్రొవిజినల్ ఎన్‌ఓసీ జారీ అవుతుంది. వాటిని తనిఖీ చేసే అధికారి అవసరాలకు తగ్గట్టు ఉన్నాయా? లేదా? అనేది తేలుస్తారు.

సాఫ్ట్‌వేర్‌తో ఆటోమేటిక్‌గా...

తాజా సాఫ్ట్‌వేర్‌లో ఈ వివరాలన్నీ ముందే పొందుపరిచి ఉంటాయి. దరఖాస్తు చేసే సమయంలో దరఖాస్తుదారుడు భవనం వివరాలు పొందుపరచడంతోపాటు దాని భద్రతా ప్రమాణాల ప్లాన్‌ను ఆటో క్యాడ్ రూపంలో దాఖలు చేస్తాడు. దీన్ని ఆద్యంతం పరిశీలించే సాఫ్ట్‌వేర్ అవసరమైతే తగిన మార్పులు చేర్పుల్ని సూచిస్తుంది. ఈ మేరకు ప్లాన్‌ను మారుస్తూ మరో ఆటో క్యాడ్‌ను అప్‌లోడ్ చేస్తే ప్రొవిజినల్ ఎన్‌ఓసీ జారీ అవుతుంది. 'కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తే మానవ వనరుల జోక్యం తగ్గుతుంది. తర్వాదా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రొవిజినల్ ఎన్‌ఓసీ దరఖాస్తును పరిశీలించి, మార్పులు, చేర్పుల సూచన వస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పని విధానం పారదర్శకంగా మారి ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదు'అని నాగిరెడ్డి పేర్కొన్నారు.

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులకు అరుదైన గౌరవం


'ఐఈఐ యంగ్ ఇంజనీర్ అవార్డు–2025 అందుకుంటున్న డాక్టర్ రాహుల్


'యంగ్ సోషియాలజిస్ట్ అవార్డు–2025 అందుకుంటున్న డాక్టర్ మమ్మద్ ముస్తఫా

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఇద్దరు పూర్వ విద్యార్థులు అత్యుత్తమ జాతీయ స్థాయి అవార్డులు పొందారు. జాతీయ స్థాయిలో యువ ఇంజనీర్‌గా ఒకరు, యువ సోషియాలజిస్ట్‌గా మరొకరు ప్రతిష్టాత్మకమైన అవార్డులు పొందడం విశేషం. వీరిద్దరినీ హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు. హెచ్‌సీయూ పూర్వవిద్యార్థి డాక్టర్ రాహుల్ 2024–25 సంవత్సరానికి మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ రంగంలో ఆయన చేసిన అత్యుత్తమ కృషికి గుర్తింపుగా ఇన్‌స్టిట్యూషన్‌ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) ద్వారా తమిళనాడులోని సేలంలో ఇటీవల జరిగిన 37వ జాతీయ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీర్ల సమావేశంలో 'ఐఈఐ యంగ్ ఇంజనీర్స్ అవార్డు–2025'ను అందుకున్నారు. డాక్టర్ రాహుల్ హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఏ)లో మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మరో హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ ముస్తఫా కె.టి. ప్రతిష్టాత్మకమైన 'యంగ్ సోషియాలజిస్ట్ అవార్డు–2025'అందుకున్నారు. 2022–2025లో ప్రచురించిన ఉత్తమ పరిశోధనా పత్రానికిగాను 'ప్రొఫెసర్ జాకబ్ జాన్ కట్టకాయం యంగ్ సోషియాలజిస్ట్ అవార్డు–2025'ను ఆయన అందుకున్నారు. ఆయన కేరళలోని ఫరూక్ కళాశాల(అటానమస్)ల సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో డాక్టర్‌గా చలామణి

- మెడికల్ కౌన్సిల్ అధికారుల తనిఖీల్లో బయటపడ్డ బాగోతం
- మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు



మియాపూర్: నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలతో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మియాపూర్ సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ అంకుర్ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు మార్చి 19న తనిఖీలు నిర్వహించి అక్కడి డాక్టర్ల సర్టిఫికెట్లను పరిశీలించారు. పీడియాట్రిషన్‌గా విధులు నిర్వహిస్తున్న కలపాల భరత్ కుమార్ సర్టిఫికెట్లు నకిలీవని గుర్తించారు. భరత్ కుమార్ ఉక్రెయిన్‌లో 2016లో ఎంబీబీఎస్(పిడియాట్రిషన్ పీజీ) పూర్తి చేశారు. అయితే ఇక్కడికి వచ్చిన తర్వాత తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు సంబంధించి అర్హత పరీక్ష రాయకుండానే డాక్టర్ బైరం భరత్ కుమార్‌కు సంబంధించిన రిజిస్టర్ నంబర్‌తో తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి వాటితో 2019లో అంకుర్ ఆసుపత్రిలో వైద్యుడిగా చేరాడు. ఆసుపత్రి యాజమాన్యం ఆయన సర్టిఫికెట్లు పరిశీలించకుండానే విధుల్లో తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు కలపాల భరత్ కుమార్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ లాలయ్య మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో గత నెల 25వ తేదీన ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు భరత్ కుమార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పరీక్ష రాశానని, దీనికి సంబంధించి సర్టిఫికెట్ నిమిత్తం ఓ వ్యక్తిని ఆశ్రయించానని, అతడు తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చి తనను మోసం చేశాడని భరత్ కుమార్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. అధికారులు పరిశీలించే వరకు తనకు ఈ విషయం తెలియదని అన్నట్లు సమాచారం.

జీడిమెట్ల పీఎస్ పరిధిలో క్యూఆర్ స్కానర్ బోర్డులు

జీడిమెట్ల: జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కొత్తగా ఆలోచించారు. ఒక్క స్కానర్ ద్వారా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని వివరాలు తెలుసుకునేలా క్యూఆర్ స్కానర్‌తో బోర్డులు ఏర్పాటు చేశారు. పీఎస్ పరిధిలోని ఏడు ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ బోర్డులు పెట్టించారు. ఎవరైనా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే వారికి జీడిమెట్ల పీఎస్ పరిధి మ్యాప్, ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నెంబర్, సెక్టార్లతోపాటు ఎస్సైల ఫోన్ నెంబర్‌లు వచ్చేలా ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తే తాము ఏ పీఎస్ పరిధిలో ఉన్నామో ఈజీగా కనుక్కోవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ క్యాంపస్‌లో డిజైన్ సింక్ పేరిట ప్రదర్శన ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని బీఆర్‌ఎస్ భవన్ సమీపంలో ఉన్న కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వేసవి హరేకృష్ణ కల్చర్ క్యాంపు పేరిట ప్రత్యేక శిబిరాన్ని బంజారాహిల్స్, కోకాపేట్‌లలో నిర్వహించనున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి వంటి అంశాలపై కొనసాగే ఈ శిబిరంపై పూర్తి వివరాలకు 8143655188 ద్వారా సంప్రదించవచ్చు.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఎక్స్–2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని టెక్నోస్మానియా–2025 పేరిట టెక్నాలజీ కాలేజీలో జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మహిళా వర్సిటీలో విద్యార్థినుల ఆందోళన

హాస్టల్ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్


విద్యార్థినులతో మాట్లాడుతున్న వీసీ

సుల్తాన్‌బజార్: కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలోని బాలికల హాస్టల్‌లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురైన విద్యార్థినులు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ కార్యాలయాన్ని ముట్టడించారు. హాస్టల్ సమస్యలు పరిష్కరించడంలో వీసీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ వీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వర్సిటీ ప్రాంగణంలోని బ్రిటీష్ రెసిడెన్సీ వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. సూర్య ధనుంజయ్ హాస్టల్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ లోకపావనితో కలిసి హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ హాస్టల్‌లో దోమలు, పాములు, ఎలుకల సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే చర్యలు చేపట్టామని చెప్పారు. అయితే విద్యార్థినుల విజ్ఞప్తిని తిరస్కరిస్తూ యథావిధిగా పరీక్షలు నిర్వహిస్తామని చెప్పడంతోనే వారు హాస్టల్ సమస్యలను ముందుకు తెచ్చారని అన్నారు.

హైడ్రా కమిషనర్ సుడిగాలి పర్యటన

ప్రజావాణి ఫిర్యాదులపై క్షేత్ర స్థాయి పరిశీలన


గండిపేట చెరువును పరిశీలిస్తున్న రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా 'ప్రజావాణి'ఫిర్యాదులపై కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ మేరకు ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పటాన్‌చెరు ప్రాంతంలో ప్రణీత్ కౌంటీకి ఆనుకుని ఉండే నక్కవాగు నాలా కబ్జాను పరిశీలించారు. బఫర్ జోన్‌తో కలిపి నాలా వెడల్పు 36 మీటర్లు ఉండాలి. కానీ, సగం మేర కబ్జా అయినట్లు గుర్తించారు. నిర్మాణ అనుమతుల మంజూరుకు సంబంధించిన పత్రాలు సమర్పించాలని ప్రణీత్ కౌంటీని రంగనాథ్ ఆదేశించారు. నిబంధనల మేరకు నాలా వెడల్పు లేని పక్షంలో ఆక్రమణలను తొలగించాలని అధికారులకు స్పష్టం చేశారు. మసీదు బండ ప్రాంతంలోని జంగంకుంట తనదిగా చెప్పుకుంటూ కొందరు కబ్జా చేస్తున్నారని, అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డి పేటలో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని ఫిర్యాదులు రావడంతో రంగనాథ్ ఈ రెండు ప్రాంతాలను పరిశీలించారు. హైడ్రా పేరు చెప్పి ఎవరైనా దందాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని రంగనాథ్ సూచించారు. గచ్చిబౌలిలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లే ఔట్‌ను రంగనాథ్ పరిశీలించారు. లే ఔట్‌లో ఉండాల్సిన రహదారులు, పార్కులను కన్వెన్షన్ల పేరిట విక్రయించినట్లు గుర్తించారు. గండిపేట మండలం నెక్నాంపూర్‌లో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించి దారిని మూసేశారంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. నెక్నాంపూర్ సర్వే నం.20లో ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు. అనంతరం గండిపేట చెరువును సందర్శించారు. చెరువులోకి మురుగునీరు వచ్చి కలవకుండా తీసుకోవాల్సిన చర్యల్ని వివరించారు. ఖానాపూర్, నాగులపల్లి నుంచి వచ్చిన మురుగు నీరు బుల్కాపూర్ నాలా ద్వారా గండిపేట చెరువులో కలుస్తుండటంతో దీనిపై దృష్టి పెట్టారు. ఎగువన ఉన్న నివాసాలు, వాణిజ్య సముదాయాలు, రిసార్టుల నుంచి మురుగునీరు వచ్చి గండిపేటలో కలవకుండా చూడాలని స్పష్టం చేశారు. అవసరమైన నిర్మాణాలు చేపట్టి మురుగు నీటిని దారి మళ్లించాలని ఆదేశించారు. రంగనాథ్ పర్యటన మొత్తం మండుటెండలో సాగడం గమనార్హం.

- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాదర్గుల్ గ్రామంలోని 230 ఎకరాల పరిధిలో వేసిన లే ఔట్‌లో కొంత భాగంలో చేసిన కబ్జాను హైడ్రా కమిషన్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు.
- లేఅవుట్ లోనే ఏర్పాటు చేసిన సమావేశంలో విచారణ చేపట్టారు.
- లేఅవుట్ ప్లాన్‌తోపాటు, భూమి కొనుగోలు రికార్డులను తీసుకుని హైడ్రా కార్యాలయానికి రావాలని కమిషనర్ ఆదేశించారు.
- అందరినీ విచారించి, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన హైడ్రా కమిషనర్

జాతీయస్థాయిలో బీసీ ఉద్యమం ఉధృతం

జాజుల శ్రీనివాస్ గౌడ్


పహల్గాం మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

పంజగుట్ట: బీసీ ఉద్యమాన్ని జాతీయస్థాయిలో ఉధృతం చేసేందుకు బీసీ సంక్షేమ సంఘం ప్రణాళిక రూపొందించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు రాష్ట్రంలో ఉద్యోగనియామకాలు చేపట్టవద్దని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పలు బీసీ సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంచే ప్రక్రియను క్రమేణా బలహీనపర్చేందుకు కొంతమంది అగ్రవర్ణాల వారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, బిహార్ రాష్ట్రాల్లో పర్యటించి అఖిలపక్షం నేతలు, బీసీ సంఘాల నాయకుల మద్దతు కూడగడతామన్నారు. మే చివరి వారంలో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో బీసీల యుద్ధభేరి బహిరంగ సభ నిర్వహిస్తామని, 29 రాష్ట్రాల సీఎంలు, ప్రతిపక్ష నాయకులు, మాజీ ముఖ్యమంత్రులు, ఓబీసీ సంఘాల నాయకుల్ని ఆహ్వానిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అసెంబ్లీలో బిల్లు పెట్టామని చేతులు దులుపుకోకుండా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకువచ్చి బిల్లు ఆమోదించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అన్ని ప్రతిపక్షాలను ఢిల్లీకి తీసుకువెళ్లి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని చేర్పించాలని కోరారు. అంతకుముందు పహల్గాం ఘటనలో మృతిచెందిన టూరిస్టులకు రెండు నిమిషాలు సంతాపం ప్రకటించారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, బాలగోని బాలరాజ్ గౌడ్, శ్యామ్ కురుమ, చామకూర రాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు చేయాలి


లైబ్రరీ ఆవిష్కరణలో పిల్లలతో నటుడు తనికెళ్ళ భరణి తదితరులు

శ్రీనగర్‌కాలనీ: పుసక్తం జ్ఞాన భాండాగారమని, దానిని చదివే అలవాటు పిల్లలకు కల్పించాలని నటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. మోతీనగర్ బ్రిగేడ్ సిటాడెల్ కమ్యూనిటీ క్లబ్‌హౌస్‌లో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని కమ్యూనిటీ సభ్యులు సమకూర్చుకున్న లైబ్రరీని శుక్రవారం ప్రముఖ స్టోరి టెల్లర్ రావి రమతో ఆయన ప్రారంభించారు. ఇలాంటి కమ్యూనిటీలకలో లైబ్రరీల ఆవశ్యకత ఎంతైనా ఉందని, పిల్లలు తప్పకుండా లైబ్రరీకి వెళ్లి మన చరిత్ర, జీవనవిధానాలు, జ్ఞాన సంపదను పెంపొందించే పుస్తకాలను చదవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను లైబ్రరీలకు పంపించి పుస్తకాలను చదివించాలని, గత అనుభవాలు, కథలను చెప్పాలని, తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, మానసిక సమస్యలు దరి చేరవని రావి రమ అన్నారు. కార్యక్రమంలో యాంకర్ జయలక్ష్మి, రచయిత అరిపిరాల సత్యప్రసాద్, కవి పినాక నాగేశ్వరరావు, యోగాచార్య ధరణీప్రగడ ప్రకాశ్‌రావు, కమ్యూనిటీ ప్రతినిధులు కూచిపూడి ప్రసాద్, స్వాతి వాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర ముఠాల మూలాలను దెబ్బతీయాలి



సిటీ కోర్టులు : ఉగ్ర ముఠాల మూలాలను పూర్తిగా దెబ్బ తీయాలని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి కిషోర్, ఎన్ వీ రమణగౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది న్యాయవాదులు పాల్గొని క్యాండిళ్లు చేతబూని పహెల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రదాడులకు పాల్పడిన వారిని తుదముట్టించడం ద్వారానే మృతులకు నిజమైన నివాళి అర్పించినట్లు అన్నారు. ఇలాంటి క్రూర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మరణించిన పర్యాటకుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం చేయాలని కోరారు.

మహిళా ప్రయాణికుల భద్రతకు 'ట్యూటెమ్'

- గమ్యస్థానం వరకు సురక్షిత ప్రయాణం
- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి



జవహర్ నగర్ : మహిళలకు సురక్షితమైన రవాణా సదుపాయాన్ని కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. మహిళా ప్రయాణికుల భద్రత కోసం హైదరాబాద్ మెట్రో రైల్, హైదరాబాద్ పోలీస్ సహకారంతో సరికొత్త మొబైల్ యాప్ సిద్ధం చేసినట్లు తెలిపారు. బిట్స్ పిలానీ–హైదరాబాద్ క్యాంపస్, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ బొంబాయి సంయుక్తంగా ఏడీబీ ఆర్థిక సహాయంతో ట్యూటెమ్ (టెక్నాలజీస్ ఫర్ అర్బన్ ట్రాన్సిట్ టు ఎన్హాన్స్ మొబిలిటీ అండ్ సేఫ్ యాక్సెసిబిలిటీ) అనే ఒక కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో మొబైల్ యాప్ రూపంలో ఇది ప్రయాణికులకు అందుబాటులోకి రానుందన్నారు. ఈ మేరకు బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లో గురువారం జరిగిన యూజర్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రోజురోజుకు జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే ఏకైక పరిష్కారమన్నారు. మెట్రోలో పయనించే మహిళలు తమ చిట్టచివరి గమ్యస్థానానికి భద్రంగా చేరడానికి ట్యూటెమ్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇంటి దగ్గర నుంచి గమ్యస్థానాల వరకు రాకపోకలు సాగించే క్రమంలో ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తుందన్నారు.

- ఈ మొబైల్ యాప్‌లో డ్రైవర్ యాప్, యూజర్ యాప్ అని రెండు భాగాలు ఉంటాయని, మహిళా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే అన్ని జాగ్రత్తలు ఇందులో ఉంటాయని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. ప్రయాణికులు మెట్రోస్టేషన్‌కు చేరుకోవడానికి, తిరిగి ఇంటికి బయలుదేరడానికి కాలినడకన, ద్విచక్ర వాహనంపై కానీ కారు లేదా బస్సు లేదా ఆటో తదితర ఎలాంటి ప్రయాణ సదుపాయాలను వినియోగించినా సరే ఈ యాప్ ద్వారా నిఘా ఉంటుందన్నారు. గమ్యస్థానికి చేరే క్రమంలో మహిళలు ఎలాంటి అభద్రతకు గురైనా వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌ను, కుటుంబసభ్యులను, బంధువులను అప్రమత్తం చేసే సదుపాయం ఉంటుందన్నారు.
- సామాజిక, ఆర్థిక సమస్యలకు ఇంజనీరింగ్, సాంకేతిక పరిష్కారం చూపాలన్నదే తమ అభిమతమని, అందుకు తగ్గట్టుగా కొత్త ఆవిష్కరణలకు ముందుంటామని ఎన్వీఎస్ తెలిపారు. బిట్స్ పిలానీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.రామ్ గోపాల్‌రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో హైదరాబాద్‌తోపాటు దేశంలోని ఇతర నగరాలకు కూడా ఈ యాప్‌ను విస్తరించేలా తమ సంస్థ సాంకేతిక నిపుణులు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీబీ ప్రతినిధి కుమారి జోసెఫిన్ ఎక్వినో, బిట్స్ పిలానీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ, ఐఐటీ బొంబాయి కి చెందిన ప్రొఫెసర్ అవిజిత్ మాజీ, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ ప్రశాంత్ సాహు పాల్గొన్నారు.

దండం పెడతా.. ఫోన్ లిఫ్ట్ చేయండి

అధికారుల తీరుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి నిరసన


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: అధికారుల తీరుపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రెండో రోజు కూడా నిరసన తెలియజేశారు. సర్కిల్ కార్యాలయం బయట చెట్టు కిందే కూర్చొని ప్రజా సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. దరఖాస్తులు తీసుకుంటున్న సందర్భంగా అక్కడికి వచ్చిన డిప్యూటీ కమిషనర్‌ను ఉద్దేశించి 'దండం పెడతా.. ఫోన్ లిఫ్ట్ చేయండి'అని పేర్కొన్నారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్నానని, వాటి గురించి మాట్లాడుదామంటే రెండు రోజులుగా మీరు ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ఎలా అని డీసీని నిలదీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు కార్యాలయం కేటాయించే వరకు వివిధ కార్యాలయాల వద్ద, కలెక్టరేట్ వద్ద కూడా నిరసన తెలియజేస్తానన్నారు. పలు సర్వేల్లో పాల్గొన్న ఆశా వర్కర్లకు, అంగన్వాడీలకు డబ్బులు చెల్లించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం సరికాదన్నారు. ప్రజాపాలనలో పలు పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇంతవరకూ ఏ పథకం కింద కూడా లబ్ధి చేకూరలేదని, ఆన్‌లైన్ ఎంట్రీలో నమోదు కాని వారికి కూడా పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సునీతాయాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మురుగేష్, నాయకులు పరశురామిరెడ్డి, వెంకన్న, రాముయాదవ్, ఉపేందర్, సిద్ధిరాములు, చిన్నాయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
13
హైదరాబాద్, శుక్రవారం, 25, ఏప్రిల్, 2025

సిటీ ప్లస్



అంతా.. ఫ్యాన్సీ ఫ్యాన్సే..

వాహనాల ఫ్యాన్సీ నెంబర్ల వేటలో టాలీవుడ్ స్టార్స్ జోరు

గత కొంత కాలంగా టాలీవుడ్ స్టార్లు తమ వాహనాల నెంబర్ల కోసం ఎంతటి ఖర్చుకైనా సై అంటున్నారు. ఇటీవలె ఓ ప్రముఖ టాలీవుడ్ నటుడు తన వాహనం కోసం ఓ ఫ్యాన్సీ నెంబర్‌ను వేలంలో కొనుగోలు చేశారు. ఆయన ఈ నెంబర్ కోసం ఏకంగా రూ.7లక్షలకు పైగా వెచ్చించడం విశేషం. ఆయనొక్కరే కాదు టాలీవుడ్‌కు చెందిన పలువురు సెలబ్రిటీలు తమకు నచ్చిన నెంబర్ల కోసం పోటీపడుతున్నారు. అయితే స్టార్ల ఆరాటం వెనుక అనేక రకాల సెంటిమెంట్లు ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఇటీవల నగరానికి చెందిన కార్పొరేట్ కంపెనీలు సైతం నెంబర్ల వేటలో స్టార్లతో పోటీపడుతుండడం కనిపిస్తోంది.

\- సాక్షి, సిటీబ్యూరో

- ఎన్ని వ్యయప్రయాసల కైనా సై అంటున్న సెలబ్స్
- నెంబర్ల వేటలో కార్పొరేట్ కంపెనీల ప్రముఖులు
- బ్రాండ్ గుర్తింపునకు క్రేజీ నెంబర్లు దోహదం చేస్తాయనే భావన



ఫ్యాన్సీ నెంబర్లపై ఆసక్తి సెలబ్రిటీలతో పాటు.. వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులకూ విస్తరిస్తోంది. ఆకట్టుకునే వాహనంతో పాటు ఆకట్టుకునే నంబర్ కలిగి ఉండడం కూడా ఒక స్టేటస్ సింబల్‌గా మారింది. దీంతో సగటు మధ్య తరగతి వ్యక్తి ఒక కారు కొనేందుకు పెట్టేంత ఖర్చుకంటే రెట్టింపు ధర వెచ్చించి తాము మెచ్చిన నెంబర్ కొనుక్కోవడమే ముఖ్యమని అనుకుంటున్నారు.

మహేష్ నుంచి మాస్ మహారాజ్ దాకా..

సూపర్ స్టార్ మహేష్‌బాబు సైతం నెంబర్ల వేటకు నేను సైతం అంటున్నారట. ఆయన తన వాహనాలైన రేంజ్ రోవర్, మెర్సిడీజ్ జీఎల్‌ఎస్‌ల కోసం టీఎస్ 09 ఇకె 600, టీఎస్ 09 జీఒ 600 లను కొనుగోలు చేశారట. నాగార్జున బీఎండబ్ల్యూ 7 సిరీస్ కోసం ఏపీ 09 బీడబ్ల్యూ 9000ను వేలంలో దక్కించుకున్నారని సమాచారం. నెంబర్‌ను ఆయన పవర్‌ఫుల్ నెంబర్‌గా పరిగణిస్తారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా నెంబర్లపై ప్రత్యేక ఆసక్తిని ప్రదర్శిస్తున్నారట. ఆయన తన రేంజ్‌రోవర్, వోల్వో ఎక్స్‌సీ 90 నెంబర్ టీఎస్07 జీఇ 9999 రూ.10లక్షలు పైనే ఖర్చు చేశారని సమాచారం. సీనియర్ హీరో రవితేజ కూడా తన ఎలక్ట్రిక్ వాహనం బీవైడీ అట్టో 3 నెంబరు టీఎస్ 09 జీబీ 2628 కోసం రూ.17,628 వెచ్చించారని సమాచారం.

కార్పొరేట్ కంపెనీలు సైతం..

హీరో బాలకృష్ణ తర్వాత '0009'నెంబర్‌ను నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ కొనుగోలు చేయడం విశేషం. కంపెనీలు సైతం తమ వాహనాలకు ఫ్యాన్సీ నంబర్లను పొందేందుకు పోటీ పడుతున్నాయనడానికి ఇదో నిదర్శనం. వ్యాపార ప్రతిష్ఠను పెంచడంలో, బ్రాండ్ గుర్తింపును పెంచడంలో వాహనాల నెంబర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తాజాగా ఆర్టీఓ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో 'టీజీ 09 9999' నంబర్‌ను సోనీ ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ సంస్థ రూ.25.5 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ **నంబర్‌ను టయోటా ల్యాండ్ క్రూయిజర్ వాహనానికి కేటాయించా**రట. మెఘా ఇంజినీరింగ్ **అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్** లిమిటెడ్ (ఎంఇఐఎల్) **'టీజీ 09 డీ 0009' నంబర్‌ను** రూ.10.4 లక్షలకు సొంతం **చేసుకుంది.** 'టీజీ 09 సీ 9999' నంబర్‌**ను** రూ.7.19 లక్షలకు శ్రియాన్ కన్‌స్ట్రక్షన్స్ కొనుగోలు చేసిందట. అదే విధంగా పోరస్ అగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ' టీజీ 09 డీ 0006' నంబర్‌ను రూ.3.65 లక్షల**కు** దక్కించుకుందని, వేగశ్రీ గో**ల్డ్ అం**డ్ డైమండ్స్ 'టీజీ 09 డీ 00**05' నం**బర్‌ను రూ.3.45 లక్షలకు **కొనుగోలు** చేసిందని సమాచారం.

జూనియర్ ఎన్‌టీఆర్ సైతం..

సినీ హీరో నందమూరి బాలకృష్ణ రూ.7.75 లక్షలకు అత్యంత డిమాండ్ ఉన్న '0001' రిజిస్ట్రేషన్ నంబర్‌ను దక్కించుకుని వార్తల్లో నిలిచారు. అదే విధంగా టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ సైతం ఫ్యాన్సీ నెంబర్ల వేటలో ముందున్నారట. ఆయన రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన లాంబోర్గినీ ఉరూస్ వాహనం నెంబర్ కోసం భారీగానే వెచ్చించారని విస్వసీయ వర్గాల సమాచారం. టీఎస్ 09 ఎఫ్ఎస్ 9999 కోసం ఏకంగా రూ.17లక్షలు వ్యయం చేశారు. ఎన్టీయార్ **దాదాపుగా తన అన్ని కార్లకూ 9999 నెంబర్‌నే ఎంచుకుంటారట.**

సెంటిమెంట్స్‌తో ఆర్టీఏకి కాసుల పంట..

రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు తమ వాహనాలకు ప్రత్యేక నంబర్లను పొందడం ద్వారా తమ ప్రతిష్ఠను పెంచుకోవాలని చూడడం ఈ ఫ్యాన్సీ నంబర్లకు డిమాండ్ పెరగడానికి కారణమవుతోంది. అలాగే 6, 9 తదితర నంబర్లను సెంటిమెంట్‌గా లక్కీ నెంబర్లుగా భావించడం కూడా మరో కారణం. కంపెనీలు తమ బ్రాండ్‌ను ప్రత్యేకంగా చూపించేందుకు ప్రత్యేక నంబర్లను ఉపయోగిస్తున్నాయి. ఏదైతేనేం.. సదరు సెంటిమెంట్లు, క్రేజ్ మూలంగా గత 2023–24 ఆర్థిక సంవత్సరంలో నగరంలోని ఐదు ఆర్టీఓ కార్యాలయాలు ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రూ.124.20 కోట్లు ఆదాయాన్ని గడించాయి. పోటీ పెరుగుతుండడంతో వీటి ధరలు కూడా భారీగానే పెరుగుతున్నాయి. ఇది గత ఏడాది ఆదాయం రూ.118 కోట్లతో పోలిస్తే సుమారు **5% పెరుగుదల నమోదైందని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.**





ఐస్క్రీమ్ ట్రెండ్స్..

- సిటీలో వినూత్న ఐస్క్రీమ్స్ ఆవిష్కరణ
- ఒకప్పుడు ఫ్లేవర్స్.. ఇప్పుడు ఆర్గానిక్స్ ప్రత్యేకం
- ఒక రూపాయికి గ్రాము ఐస్క్రీమ్ అంటూ ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్క్రీమ్స్ ప్రకటన
- ఆకట్టుకుంటున్న గోంధ్ గమ్, గ్వార్ గమ్ వెరైటీలు
- ఫేవరెట్ ఐస్క్రీమ్స్‌తో సినీ ప్రముఖుల సందడి

సాక్షి, సిటీ బ్యూరో: ఐస్క్రీమ్.. చిన్న పెద్ద అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అమితంగా ఇష్టపడే ఆహారం. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే అర్ధరాత్రి వరకూ ఐస్క్రీమ్ పార్లర్ చుట్టూ చెక్కర్లు కొడతారు నగర వాసులు. దీనికితోడు నగర వేదికగా విభిన్న స్టోర్స్‌లో వినూత్న ఫ్లేవర్లలో ఐస్క్రీమ్స్ అందుబాటులో వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగర వేదికగా వినూత్నంగా ఒక రూపాయికే ఒక గ్రాము ఐస్క్రీమ్ అంటూ ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్క్రీమ్స్ సందడి చేస్తోంది. ఇవి పూర్తిగా ఆర్గానిక్ ఉత్పత్తులు కావడం మరో విశేషం.

గోంధ్ గమ్, గ్వార్ గమ్ వెరైటీలు..

దేశంలోనే మొట్టమొదటి ఏకైక ఆర్గానిక్ క్రీమరీ అయిన ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్క్రీమ్స్ హైదరాబాద్‌లో తన సేవలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బేగంపేటలో నూతన ఔట్‌లెట్‌ను ప్రారంభించింది. పూర్తిగా ఆర్గానిక్ విధానంలో ఐస్క్రీమ్‌ను అందించే ఈ బ్రాండ్ ఏ2 దేశీ ఆవుపాలు, ఆర్గానిక్ యెల్లో బటర్‌తో పాటు సహజ సిద్ధమైన తీపి పదార్థాలైన ధాగా మిశ్రీ,



కోకోనట్ షుగర్, బెల్లం వంటి వాటితో రుచికరమైన మనసుదోచే ట్రీట్ అందిస్తోంది. వినూత్నంగా గోంధ్ గమ్, గ్వార్ గమ్‌తో పేటెంట్ పొందిన ప్రిజర్వేటివ్-రహిత ఫార్ములాతో ఐస్ బర్గ్ సరికొత్త పదార్థాలను నగర వాసులకు పరిచయం చేసింది. ప్రీమియం నట్స్, డీహైడ్రేటెడ్ ఫ్రూట్స్, ఆర్గానిక్ సిరప్‌లతో 40కి పైగా ఆర్గానిక్ టాపింగ్స్‌తో కస్టమర్లకు మధురానుభూతిని అందిస్తోంది. ఔట్ లెట్‌లో డెత్ బై చాక్లెట్ సండేస్, ఆర్టిసానల్ ఐస్క్రీం కేక్స్ వంటి సిగ్నేచర్ ఆఫర్లు మాదాపూర్, బేగంపేట, కేపీహెచ్‌బీలో హైదరాబాదీలను ఆకట్టుకుంటున్నాయి. వంద మందికి పైగా సేంద్రీయ రైతులతో ఐస్‌బర్గ్ భాగస్వామి అయ్యింది. బేగంపేటలో గురువారం నిర్వహించిన ప్రారంభోత్సవంలో సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు సందడి చేశారు. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ మరో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.





29 నుంచి హైలైఫ్ ప్రదర్శన

బంజారాహిల్స్: ఈ నెల 29 నుంచి హెచ్ఐసీసీ నోవోటెల్‌లో ప్రతిష్టాత్మక హైలైఫ్ లగ్జరీ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ బ్రోచర్‌ను పలువురు మోడల్స్ హాజరై ఆవిష్కరించారు. అనంతరం వారు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న దుస్తులు, ఆభరణాలను మోడల్స్ ప్రదర్శించి ర్యాంప్ వాక్ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన డిజైనర్లు రూపొందించిన దుస్తులు, ఆభరణాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తారని తెలిపారు.

ఆర్ట్ గ్యాలరీలో క్వెస్ట్ ఆఫ్ లైట్

మాదాపూర్ : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో గురువారం క్వెస్ట్ ఆఫ్ లైట్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను కళాకారుడు మధకురువా ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో కళాకారిణి ఇషిత వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గ్యాలరీలో మొత్తం 35 చిత్రాలు అందుబాటులో ఉన్నాయని, ఈనెల 28వ తేదీ వరకూ ప్రదర్శన కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.



వజ్రాభరణాలంటే ఇష్టం..

కొండాపూర్‌లో టీబీజడ్ జ్యువెలరీ ప్రారంభోత్సవంలో నటి పాయల్ రాజ్‌పుత్



గచ్చిబౌలి: వజ్రాభరణాలంటే చాలా ఇష్టమని నటి పాయల్ రాజ్‌పుత్ అన్నారు. కొండాపూర్‌లోని ప్రణవ్ వైష్టాయ్ బిజినెస్ పార్క్‌లో టీబీజడ్-ది ఒరిజినల్ జ్యువెలర్ స్టోర్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్‌లో వివిధ రకాల డిజైన్ల భరణాలు ధరించి సందడి చేశారు. అనంతరం పాయల్ రాజ్‌పుత్ మాట్లడుతూ రూ.75 లక్షల విలువైన వజ్రాలు పొదిగిన నక్లెస్‌తో పాటు మొత్తం కోటి రూపాయల విలువైన ఆభరణాలు ధరించానని చెప్పారు. ప్రతి ఆభరణం మన సంస్కృతిని తెలియజేసే విధంగా రూపొందించారన్నారు. టీబీజడ్ మూడో స్టోర్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మార్కెటింగ్ చీఫ్ ఆఫీసర్ రితీష్ గాడే మాట్లాడుతూ ప్రతి ఆభరణం మన వారసత్వానికి ప్రతీకలని, స్టోర్ బంగారంతో పాటు యాంటిక్, టెంపుల్ ఆభరణాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. విస్తృత శ్రేణి మోడళ్లు, వినూత్నమైన డిజైన్లు, ఆకర్షణీయమైన ఆఫర్లతో సమకాలీన ఆభరణాల నుంచి సంప్రదాయ ఆభరణాలను వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. టీబీజడ్ ఒరిజినల్ సర్టిఫైడ్, స్వచ్ఛతను సూచించే హాల్‌మార్క్‌ను కలిగి ఉందన్నారు. దేశంలో వివిధ నగరాల్లో 37 స్టోర్లు ఉన్నాయని తెలిపారు.



నేటి నుంచి హైటెక్స్‌లో ఫుడ్ ఎక్స్‌పో

- 25, 26, 27 తేదీల్లో నిర్వహణ
- దేశ, విదేశాలకు చెందిన ఫుడ్ సంస్థల భాగస్వామ్యం

మాదాపూర్ : స్థానిక హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏప్రిల్ 25, 26, 27 తేదీల్లో ఫుడ్ ఎక్స్‌పో- 2025 బ్రోచర్‌ను గురువారం సంస్థ ప్రతినిధులు విడుదల చేశారు. ఆహార పదార్థాల ఉత్పత్తి, ప్రోసెసింగ్, పంపిణీ కార్యకలాపాలు పరిశ్రమ భారత్‌లో యేటా వృద్ధి చెందుతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను విరివిగా వాడుతున్నారని, దీంతో వాటితో తయారు చేసిన పదార్థాలకు డిమాండ్ ఏర్పడిందన్నారు. దేశ విదేశాలకు చెందిన వందలాది సంస్థలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు శివం ఆరోరా, తిలక్ రాజ్ ఆరోరా, అలోక్‌శర్మ బ్రోచర్ విడుదల చేశారు.



నార్త్ టు సౌత్



నగరానికి క్యూ కడుతున్న నార్త్ ఫుడ్ బ్రాండ్స్

- ఇప్పటికే పాతికకు పైగా ప్రముఖ నార్త్ రెస్టారెంట్స్
- జూబ్లీహిల్స్‌లో లజీజ్ అఫేర్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న సంస్కృతుల సమ్మేళనంలో భాగంగా నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆహార రుచులు ఆదరణ పొందటం విదితమే. ఈ మధ్య కాలంలో నగరం వేదికగా నార్త్ డిషెష్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో నగరంలో నార్త్ రెస్టారెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. ఇందులో భాగంగానే నార్త్ ఇండియన్ ఫుడ్‌కు ప్రసిద్ధి చెందిన లజీజ్ అఫేర్ నగరానికి విచ్చేసింది. డిల్లీ వేదికగా ప్రసిద్ధి చెందిన లజీజ్ అఫేర్ దక్షిణాదిలో మొదటిసారిగా నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45లో ఆవిష్కరించడం ఇక్కడి ఫుడ్ లవర్స్‌కు గుడ్ న్యూస్ అని ఫుడ్ బ్లాగర్స్ చెబుతున్నారు.



గ్లోబల్ వంటకాలకు కేంద్రంగా..

స్మోక్ తందూరి కబాబ్‌లు మొదలు మటన్ షికంపురి కబాబ్, పత్తర్ కా గోష్త్ వంటి వంటకాలు ఉత్తరాది లాజీజ్ అఫైర్ ప్రత్యేకత. వీటితో పాటు షాహి దమ్ కా ఆలూ, భట్టి కా పనీర్, షాదీ కా లాల్ చికెన్, దాల్ లాజీజ్, కేసర్ ఫిర్ని వంటి రుచులను నగరవాసులకు చేరువ చేయడానికి జూబ్లీహిల్స్‌లో లజీజ్ అఫేర్‌ను ప్రారంభించినట్లు ఇన్నాటో హాస్పిటాలిటీ డైరెక్టర్ యాష్ త్రివేది తెలిపారు. ప్రత్యేకించి నార్త్ స్టైల్ హైదరాబాదీ దమ్ బిర్యానీ మరోసారి నగరవాసులకు రుచి చూపించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సుగంధ ద్రవ్యాల సమ్మిళితంతో సాంస్కృతిక వంటకాలు, ఉత్తరాది పాకశాస్త్ర నైపుణ్యాలతో వడ్డించిన పసందైన రుచులు హైదరాబాదీల మనసు దోచేస్తాయన్నారు. అనాది ప్రపంచ స్థాయి వంటకాలకు నగరం వేదికగా నిలుస్తోంది. ఇక్కడి ప్రజలు వినూత్న రుచులను ఆస్వాదించే లక్షణమే ఈ ఆహార వైవిధ్యానికి కారణం. ఈ ప్రయాణంలో లజీజ్ అఫేర్‌కు స్పందన వస్తుండటం తమ ప్రయత్నానికి భరోసా లభించిందని సహ డైరెక్టర్ కుష్ త్రివేది వివరించారు.



పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తున్నాం

- అశాంతి రాజేసే శక్తులపై ఏ చర్యలు తీసుకున్నా సమర్థిస్తాం
- అఖిలపక్ష భేటీలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడిని ప్రపంచంలో ఎవరూ సమర్థించరని.. పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్ర సంస్థపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష భేటీలో కోరామని.. ఈ ఘటనను రాజకీయాలకు అతీతంగా చూడాలని కోరారు. అశాంతిని రాజేసే శక్తులపై కేంద్రం ఏ చర్యలు తీసుకున్నా సమర్థిస్తామని మిథున్‌రెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ మిథున్‌రెడ్డి హాజరయ్యారు. భేటీ అనంతరం ఏపీ భవన్‌లో మీడియా ఆయన మాట్లాడుతూ.. 'టెర్రరిస్టులు, కాశ్మీర్‌లో అశాంతి నెలకొల్పే శక్తులపై ఏ చర్యలు తీసుకున్న మేం సమర్థిస్తామని చెప్పాం. ఉగ్ర సంస్థపై చర్యలు తీసుకోవాలని అన్ని పార్టీలు చెప్పాయి. రాబోయే రోజుల్లో ఏం చర్యలు తీసుకోబోతున్నారో చెప్పాలని కోరాం. పాకిస్తాన్‌పై భారత్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుందో వివరించాలని కోరాం. పాకిస్థాన్ మన దేశంపై తీసుకోబోయే చర్యలను ఎలా తిప్పకొట్టబోతున్నారో చెప్పాలని, అన్ని పార్టీలకు వివరించాలని కోరాం. సరైన సమయంలో వీటికి జవాబు చెబుతామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు' అని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దని వైఎస్సార్‌సీపీ కోరుకుంటోందని మిథున్‌రెడ్డి చెప్పారు. ఇలాంటి ఘటనలకు పాల్పడాలనే ఆలోచన చేసే శక్తులు భయపడే విధంగా దీటైన జవాబు ఉండాలని ఆయన కోరారు.

క్లుప్తంగా...

మే 31 వరకు చర్లపల్లి-విశాఖ ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి-విశాఖ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 12 చర్లపల్లి-విశాఖ (08580/08579) ప్రత్యేక రైలు సర్వీసులు మే 31వ తేదీ వరకు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటికే ప్రకటించిన మరికొన్ని ప్రత్యేక రైళ్లను కూడా.. ప్రయాణికుల రద్దీ మేరకు మే నెలాఖరు వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

పహల్గాం మృతులకు టీజీవో సంతాపం

సాక్షి, హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడిలో మృతుల కుటుంబాలకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సంతాపం తెలిపింది. పర్యాటకులపై ఉగ్రవాదులు సాగించిన నరమేధాన్ని తీవ్రంగా ఖండించింది. ఇది మానవత్వంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని టీజీవో అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, ఏనుగు సత్యనారాయణ తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని టీజీవో భవన్‌లో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు బి.శ్యామ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

'డాక్టరేట్' కేవలం బిరుదు కాదు విశిష్ట గుర్తింపు

'పీతాంబరి గ్రూప్' ఎండీ రవీంద్ర ప్రభుదేశాయ్

థానే: డాక్టరేట్ అన్నది కేవలం పేరుకు పక్కన చేర్చుకునే ఒక పదం కాదని సమయపాలన, ఐక్యత, సమష్టికృషికి లభించిన విశిష్ట గుర్తింపుగా పరిగణించాలని పీతాంబరి గ్రూప్ సంస్థల ఎండీ రవీంద్ర ప్రభుదేశాయ్ అన్నారు. పరిశ్రమలు, సామాజిక సేవా రంగాల్లో ఆయన సాధించిన విజయాలు, చేసిన కృషిని గుర్తిస్తూ తిలక్ మహారాష్ట్ర యూనివర్శిటీ ఆయనకు ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా థానే సివిక్ ఫేవర్స్ కమిటీ గురువారం థానేలోని డాక్టర్ కాశీనాథ్ ఘనేకర్ ఆడిటోరియంలో ఆయన్ను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైంటిస్ట్, పద్మవిభూషణ్ అనిల్ కాకోద్కర్, ఎమ్మెల్యేలు సంజయ్ కేల్కర్, నిరంజన్ దావ్‌ఖరే, చిటలే గ్రూప్ ఎండీ శ్రీకృష్ణ చిటలే, ప్రముఖ వక్త సచ్చిదానంద షెవ్డేతోపాటు వ్యాపార, సామాజిక రంగ ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రవీంద్రకు డాక్టరేట్ ప్రదానంపై శుభాకాంక్షలందజేస్తూ సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌శిందేలు పంపిన సందేశాన్ని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా చదివి వినిపించారు.

శిక్షణ లేదు.. ఉద్యోగాల్లేవు!

రాష్ట్రంలో నిలిచిపోయిన ఉపాధి హామీ మార్కెటింగ్ మిషన్

- గ్రామీణ యువత కోసం డీడీయూజీకేవై కింద పథకం అమలు
- కేంద్ర వాటా 60 శాతం.. రాష్ట్ర వాటా 40 శాతం
- కొంత కాలంగా రాష్ట్ర వాటా చెల్లించకపోవడంతో ఇబ్బందులు
- డీడీయూజీకేవై 2.0 అమలుపై అనుమానాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఉపాధి హామీ మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) త్రిశంకుస్వర్గంలో వేలాడుతోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగే ఈ పథకం అమలు గత కొంతకాలంగా దాదాపు నిలిచిపోయింది. వివిధ రంగాలు, విభాగాల్లో నైపుణ్యాల శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా..ఆచరణలో అంతంత మాత్రంగానే ఉంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈజీఎంఎం కింద గ్రామీణ యువతకు వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించాల్సి ఉంది. ఆరోగ్యం, రిటైల్, ఆతిథ్య, సాఫ్ట్‌వేర్, యానిమేషన్, ఫార్మసీ, ఫ్యాషన్, తదితర రంగాల్లో ఏజెన్సీల ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఆయా రంగాల్లో నైపుణ్యాలున్న సంస్థలు డిజైన్ చేసిన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగాలు కల్పించడం ఈ పథకం ముఖ్యోద్దేశం. కాగా ప్రస్తుతం ఈ లక్ష్యాల సాధన తూతూ మంత్రంగానే మిగిలిపోయిందనే విమర్శలున్నాయి. నిధుల లేమి కారణంగా ఈ పథకం మొక్కుబడిగా సాగుతోంది. కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకం కావడంతో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) కింద కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. కేంద్రం నుంచి క్రమం తప్పకుండా నిధులు వస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా సరిగ్గా విడుదల కాకపోవడంతో పథకం కుంటి నడక నడుస్తోంది.

2019 నుంచి సమస్యే..

ఈ స్కీమ్ కోసం రాష్ట్ర వాటా నిధులు 2019 నుంచే సక్రమంగా విడుదల కావడం లేదని తెలుస్తోంది. ఏడాదిన్నర క్రితం ఓసారి రాష్ట్ర వాటా విడుదల కాకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది. ఈ కారణంగా కేంద్రం నుంచి ఆ తర్వాత రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. అయితే ఆ తర్వాత కేంద్రానికి రాష్ట్రం విజ్ఞప్తులు పంపించడంతో నిధులు విడుదల పునరుద్ధరించారు. అయితే రాష్ట్రవాటా కింద ఏటా రూ.144 కోట్లు సక్రమంగా చెల్లించకపోవడంతో సమస్య ఎదురవుతోందని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15 నెలల్లోనూ ఈ స్కీమ్ కింద నిధులు విడుదల కాలేదని అంటున్నారు.

డీడీయూజీకేవై 2.0కు కేంద్రం సన్నాహాలు

రాష్ట్రంలో ప్రస్తుతం డీడీయూజీకేవై 1.0 స్కీమ్ అమలవుతుండగా (2015 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ దాకా)...దానిని ఈ ఏప్రిల్ దాకా పొడిగించినట్టు అధికారవర్గాల సమాచారం. కాగా వచ్చే జూలై, ఆగస్టు తర్వాత డీడీయూజీకేవై 2.0 స్కీమ్ అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన లక్ష్యాలు, ఇతర వివరాలను రాష్ట్రానికి ఇప్పటికే కేంద్రం అందజేసింది. రాష్ట్ర వాటా విడుదల కాని పక్షంలో..తెలంగాణలో డీడీయూజీకేవై 2.0 పథకం అమలు, తద్వారా ఈజీఎంఎం నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా ఆగిపోవచ్చునని అంటున్నారు.

వ్యవసాయ శాఖలో పదోన్నతుల జోష్

ఏడీ నుంచి డీడీ, డీడీ నుంచి జేడీలుగా త్వరలో పలువురికి పదోన్నతులు!

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ శాఖలో పదోన్నతులకు మార్గం సుగమమైంది. 2016 తరువాత వ్యవసాయ శాఖలో పదోన్నతులు లేవు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పదోన్నతుల కోసం వివిధ స్థాయిల అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం సచివాలయంలో తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ (టాడా) ప్రతినిధులు రాములు, సాల్మన్ నాయక్, తిరుపతి నాయక్‌లు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావుని కలసి రాష్ట్రంలో ఏఓ స్థాయి నుంచి జేడీ స్థాయి వరకు వందలాది మంది పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆయన అర్హులైన వారందరికీ పదోన్నతులు లభిస్తాయని ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు తెలిసింది. కాగా రెండు, మూడు రోజుల్లో అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ హోదాల్లో ఉన్న అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని సమాచారం.

ఏడీ నుంచి డీడీ... డీడీ నుంచి జేడీ

పదోన్నతులకు అర్హత గల సుమారు 42 నుంచి 45 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉందని తెలిసింది. ఇదిలా ఉండగా ఏడీస్థాయి నుంచి డీడీగా పదోన్నతుల విషయంలో కొంత గందరగోళం నెలకొన్నట్లు తెలిసింది. అర్హులు అధికంగా ఉండటం, పోస్టులు తక్కువగా ఉండటంతో ఏం చేయాలనేదానిపై అధికారులు ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం 21 డీడీ పోస్టులు ఖాళీగా ఉండగా, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ)లో మరో 20 డీపీడీ పోస్టులు సృష్టించి తదనుగుణంగా ఏడీలకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే 18 మంది డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు నేడోరేపో ఉత్తర్వులతోపాటు, నియామకాలు జరిపే అవకాశమున్నట్లు తెలిసింది. ఇందులో కూడా తొమ్మిది జేడీ పోస్టులు రెగ్యులర్ ఉండగా, మరో తొమ్మిది ఆత్మ పీడీ పోస్టులను సృష్టించినట్లు సమాచారం. దీనిలో భాగంగానే పలువురు అధికారులకు పదోన్నతులు కల్పించేందుకు కొత్తగా పోస్టులు సృష్టిస్తున్నట్లు వ్యవసాయ శాఖలో ప్రచారం జరుగుతోంది. కాగా వ్యవసాయాధికారి (ఏఓ) నుంచి అర్హులైన వారిని ఏడీలుగా పదోన్నతులు కల్పించే విషయంలో కొంత స్పష్టత కొరవడినట్లు తెలిసింది. ముందుగా 50 మందికి ఈ విడతలో అవకాశం కల్పించే అవకాశం ఉందని సమాచారం. వీరు కాకుండా జేడీ నుంచి అదనపు డైరెక్టర్లుగా పదోన్నతికి అర్హులైన వారు నలుగురు అధికారులు మాత్రమే ఉండడంతో వారికి కూడా అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. సుమారు పదేళ్ల తరువాత పదోన్నతులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల 'టాడా'హర్షం వ్యక్తం చేసింది.

మిగిలింది 35 మార్కెట్ కమిటీలు

- త్వరలో వీటికీ పాలకవర్గాలు

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ మార్కెట్లకు వచ్చే రైతులకు మద్దతు ధర లభించేలా చూడటంతో పాటు వివిధ రకాల పంటలను రైతుల నుంచి సకాలంలో కొనుగోలు చేసి, వినియోగదారులకు విక్రయించడం, మార్కెట్‌లలో రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం వంటి కార్యక్రమాల నిర్వహణలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఆయా మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లుగా, గ్రామాల్లోని ముఖ్య నాయకులను సభ్యులుగా నియమించడం ద్వారా ఆయా మార్కెట్లపై వారికి పట్టు లభిస్తుంది. అధికారంలో ఉన్న పార్టీ మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా వ్యవసాయ మార్కెట్లపై తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవడం పరిపాటి. అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే సూచించిన నాయకులను చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ఎంపిక చేస్తే వ్యవసాయ శాఖ ద్వారా ఉత్తర్వులు వెలువడతాయి. రాష్ట్రంలో 197 మార్కెట్ కమిటీలు ఉండగా, ఇప్పటి వరకు 162 మార్కెట్‌లకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో 2,268 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్థానం కల్పించారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే సూచించిన నాయకులు, రైతు సంఘాల సభ్యులను ఈ కమిటీల్లో నియమిస్తుండగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే లేని చోట నియోజకవర్గ ఇన్‌చార్జి లేదా జిల్లా మంత్రి సూచించిన నాయకులను వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా నియమిస్తున్నారు. కాగా త్వరలోనే మిగతా 35 కమిటీలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.


చెరువులకు చేరిన చేప పిల్లలు అంతంతే...

పంపిణీ చేయాల్సింది 80 కోట్లు.. వదిలింది 29 కోట్లే	29,434 మొత్తం చెరువుల సంఖ్య	14,304 చేప పిల్లలు వదిలిన చెరువుల సంఖ్య	సగంలోనే ఆగిపోయిన పథకం

సాక్షి, హైదరాబాద్: ఉచిత చేప పిల్లల పంపిణీకి ఆది నుంచీ ఆటంకాలు ఎదురయ్యాయి. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 29,434 చెరువులుండగా, 14,304 చెరువుల్లోనే చేప పిల్లలను వదిలారు. వాస్తవానికి 2024-25 సంవత్సరానికి గాను రూ.90 కోట్లు వ్యయం చేసి 80 కోట్ల చేప పిల్లలు వదలాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఆ అంచనాలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఖర్చు చేసే వ్యయం రూ.90 కోట్ల నుంచి రూ. 34 కోట్లకు, వదలాల్సిన చేప పిల్లలు 80 కోట్ల నుంచి 29 కోట్లకు తగ్గిపోయాయి. 2016-17లో 27 కోట్ల ఉచిత చేప పిల్లలు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఈ సంవత్సరమే అత్యల్పంగా పంపిణీ చేశారు. గత బకాయిలు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో చేపల పంపిణీ ఆలస్యం అయ్యింది. కాంట్రాక్టర్లూ సకాలంలో టెండర్లు వేయకపోవడం కూడా మరో కారణం.

ఖమ్మం ఫస్ట్.. పెద్దపల్లి లాస్ట్

ఖమ్మం జిల్లాలో 1,210 చెరువుల్లో 26 లక్షల చేప పిల్లలు పోయగా, పెద్దపల్లి జిల్లాలో 1,120 చెరువుల్లో 1.48 లక్షల చేప పిల్లలు పంపిణీ చేయడంతో చివరిస్థానంలో ఉంది.



కాంట్రాక్టర్లు కుమ్మక్కై...

ఉచిత చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ సిద్ధమైనా..నిధులు సకాలంలో రాకపోవడం, కాంట్రాక్టర్లు కుమ్మక్కవడంతో టెండర్లు దాఖలు చేయలేదు. ధరలు పెంచాలని, గతంలోని బకాయిలు చెల్లించాలని పట్టుబట్టారు. మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు స్పందించలేదు. చివరకు అధికారులు కాంట్రాక్టర్లతో పలు దఫాల్లో చర్చలు జరిపితే గానీ...సెప్టెంబర్ మూడోవారం తర్వాత ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రారంభమైంది.

ఏ ఒక్క సీజన్‌లోనూ లక్ష్యానికి చేరుకోలేదు



తెలంగాణలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో 270 నుంచి 300 కోట్ల చేప పిల్లలు వదలాలి. నిధులు కొరతతో గత ప్రభుత్వం 100 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నా, పూర్తి స్థాయిలో పోయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తోంది. తొమ్మిది సీజన్లలో ఒక్కసారి కూడా చేప పిల్లల పంపిణీ పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని చేరుకోలేదు. ఇదీ మత్స్యశాఖ వైఫల్యమే.

– పిట్టల రవీందర్, ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్


ఈసారి ముందుగానే టెండర్లు పిలవాలి


ఈ ఏడాది ముందుగానే టెండర్లు పిలవాలి. గతంలో కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బకాయిలుంటే ముందుగానే చెల్లించాలి. చేప పిల్లలు వదలడంలో ఎలాంటి అక్రమాలు జరిగినా కాంట్రాక్టర్లను బ్లాక్ చేస్తామని హెచ్చరించాలి. వదిలే మీనాల్లో ఎలాంటి కల్తీ లేకుండా, లెక్కల్లో తేడా లేకుండా చూడాలి.

– సుదర్శన్, తెలంగాణ గంగపుత్ర జేఏసీ చైర్మన్

నగల కోసం దారుణం

గత నెల కుమారుడి హత్య.. ఆచూకీ చెబుతామని తీసుకెళ్లి తల్లినీ హతమార్చిన వైనం


పోచమ్మ



మహేశ్

హవేళీఘనాపూర్ (మెదక్): జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు నగల కోసం తల్లీకుమారుడిని హత్య చేశారు. ఈ ఘటన మెదక్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హవేళీఘనాపూర్ మండలం గంగాపూర్‌కు చెందిన బండి శోభ, చాకలి గోపాల్ జల్సాలకు అలవాటుపడ్డారు. అదే గ్రామానికి చెందిన పోతుల మహేశ్ (37) తన భార్య నగలను బ్యాంకులో తాకట్టు పెట్టిన విషయం తెలుసుకుని వారిద్దరూ ఆ నగలపై కన్నేశారు. మెదక్‌లోని ఓ ప్రైవేటు వ్యక్తి వద్ద అప్పు తీసుకొని, ఆ డబ్బులతో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించిన వెంటనే మహేశ్‌ను హత్య చేయాలని కుట్ర పన్నారు. ఈ క్రమంలో శోభ, గోపాల్ గత నెల 26న మహేశ్‌ను ఏడుపాయల్లోకి తీసుకెళ్లి మద్యం తాగించి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

కొడుకు కనబడకపోవడంతో మహేశ్ తల్లి పోచమ్మ(55) కుమారుడి ఆచూకీ తెలుపాలని గోపాల్, శోభను నిత్యం బతిమిలాడేది. దీంతో మహేశ్ పని చేసుకుంటూ విజయవాడలో ఉంటున్నాడని పోచమ్మను నమ్మించారు. ఈ నెల 4వ తేదీన ఆమెను ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పదములూరు వద్దకు తీసుకెళ్లి హత్య చేసి ఆమె వద్ద ఉన్న నగలను దోచుకున్నారు. అనంతరం మృతదేహాన్ని కృష్ణానది సమీపంలో పడేశారు. విచారణ చేపట్టిన ఏపీ పోలీసులు నిందితులు గంగాపూర్‌కు చెందిన శోభ, గోపాల్‌గా నిర్ధారించి స్వగ్రామానికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మహేశ్‌ను గత నెల 26న ఏడుపాయల అటవీ ప్రాంతంలో హత్య చేశామని ఒప్పుకున్నట్లు తెలిసింది. కాగా, మహేశ్ తప్పిపోయినట్లు అతడి భార్య ఫిర్యాదు చేశారని, పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

విచారణకు హాజరుకావాల్సిందే

'షాదీ డాట్ కామ్' డైరెక్టర్, ఉద్యోగులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నకిలీ ప్రొఫైల్‌తో యువతిని మోసగించిన కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని నిందితులైన షాదీ డాట్ కామ్ డైరెక్టర్, ఉద్యోగులకు హైకోర్టు తేల్చిచెప్పింది. బీఎన్ఎస్ఎస్ 35(3) కింద నోటీసులు జారీ చేసి, దర్యాప్తు చేపట్టాలని పోలీసులను ఆదేశించింది. షాదీ డాట్ కామ్‌లో యానాం ఎమ్మెల్యే ఫొటోతో రాజమండ్రికి చెందిన హర్ష ప్రొఫైల్ పెట్టారు. ఇది చూసి జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ వైద్యురాలు సంప్రదించారు. తన తల్లి కూడా డాక్టర్ అని.. అమెరికాలో ఉందని నమ్మిస్తూ, యువతి వద్ద నుంచి హర్ష రూ.11 లక్షలు వసూలు చేశాడు. డబ్బులు తిరిగివ్వమని అడగగా, యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. మరో రూ.10 లక్షలు కూడా డిమాండ్ చేశాడు. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 25న నమోదు చేసిన ఈ కేసులో చెరుకూరి హర్షతో పాటు షాదీ డాట్ కామ్ డైరెక్టర్ అనుపమ్ మిట్టల్, టీమ్ లీడర్ విఘ్నేష్, మేనేజర్ సతీశ్‌లను పోలీసులు నిందితులుగా చేర్చారు. నిందితులు ఇలాగే మరికొందరిని మోసం చేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. ఇదిలా ఉండగా, ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ అనుపమ్ మిట్టల్, విఘ్నేష్, సతీశ్‌లు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్.తుకారాంజీ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. షాదీ డాట్ కామ్‌లో ప్రొఫైళ్లు మాత్రమే నమోదు చేసుకోవచ్చని, ఇది ఓ డిజిటల్ ప్లాట్‌ఫామ్ మాత్రమేనని చెప్పారు. అందులోని వివరాలు.. వాస్తవాలా? కాదా? అనేది ఎవరికి వారు పరిశీలించుకోవాలన్నారు. ఆ వివరాలతో వెబ్‌సైట్ నిర్వాహకులకు సంబంధం లేదని వెల్లడించారు. ఏపీపీ జితేందర్ వీరమల్ల పిటిషనర్ న్యాయవాది వాదనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. షాదీ డాట్ కామ్‌పై నమ్మకంతోనే అందులోని వ్యక్తులతో సంప్రదింపులు జరుపుతారని, సంబంధంలేదని చెప్పడాన్ని తప్పుబట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసేందుకు నిరాకరిస్తూ, విచారణకు హాజరుకావాల్సిందేనని పిటిషనర్లకు తేల్చిచెప్పారు.

మెట్రోరైల్ ఎండీకి హైకోర్టు నోటీసులు

బెట్టింగ్ యాడ్‌లపై వివరణ ఇవ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మెట్రో రైళ్లలో బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై వివరణ ఇవ్వాలని ఆ ఎండీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. బెట్టింగ్ యాప్‌లతో హైదరాబాద్ మెట్రో రైల్వే డిపార్ట్‌మెంట్ కుదుర్చుకున్న ఒప్పందాలపై దర్యాప్తు చేయించాలని కోరుతూ న్యాయవాది నాగూర్‌బాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. మెట్రో రైలులో, ప్లాట్‌ఫారాలు, స్టేషన్, హోర్డింగ్‌లు తదితర ప్రాంతాల్లో బెట్టింగ్ యాప్‌లపై ప్రకటనలను తక్షణం నిలిపివేసేలా ఆదేశించాలని కోరారు. మెట్రో రైల్వేకు బెట్టింగ్ యాప్ సంస్థలకు మధ్య కుదిరిన లావాదేవీలపై దర్యాప్తు చేపట్టేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఆదేశాలు జారీ చేయాలన్నారు. బెట్టింగ్ యాప్‌లపై ఈడీ ఇప్పటికే కేసు నమోదు చేసి రూ.399 కోట్లు జప్తు చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందాలపై విచారణ జరపాలన్నారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. మెట్రో ఎండీకి నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది.

డీపీడీపీ యాక్ట్‌తో ఆర్టీఐకి పెద్ద దెబ్బ

- ఈ చట్టానికి సంబంధించిన రూల్స్ త్వరలో ఖరారయ్యే అవకాశం
- ఇకపై సమాచారం అడిగితే వ్యక్తిగతమంటూ నిలిపివేసే పరిస్థితి
- సదస్సులో పౌరహక్కుల నేతలు నిఖిల్ డే, అంజలి భరద్వాజ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) యాక్ట్ నిబంధనలు సమాచార హక్కు(ఆర్టీఐ) చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా తయారయ్యాయని పౌర సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. గురువారం సైఫాబాద్‌లోని అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో పౌర సంఘాల నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ నేత నిఖిల్ డే మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకే డీపీడీపీ చట్టాన్ని తీసుకొచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా, ఇందులోని పలు సెక్షన్లు అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు. ఈ చట్టంలోని అంశాలు సమాచార హక్కు చట్టాన్ని పూర్తిగా తొక్కిపెట్టే విధంగా ఉన్నాయని ఆక్షేపించారు. వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదనే సాకుతో ఆర్టీఐ ద్వారా వచ్చే దరఖాస్తులకు ఇకపై జవాబు అందదన్నారు. ఈ పరిస్థితిని గట్టిగా ఎదుర్కోవాలని, సమాచారం ప్రతి పౌరుడి హక్కుగా వివరించారు. నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ ప్రతినిధి అంజలి భరద్వాజ్ మాట్లాడుతూ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకునే విధంగా డీపీడీపీ యాక్ట్ ఉందన్నారు. ప్రజల సమాచారం ఇతరుల చేతుల్లోకి వెళ్లొద్దంటూనే ప్రైవేట్ సంస్థలు, ఇతరాలకు మినహాయింపులు ఇచ్చే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం ఉంచుకుందని చెప్పారు. ఈ చట్టాన్ని ప్రజల సమాచార రక్షణ కంటే, ప్రభుత్వానికి అనుకూలంగా మలుచుకునే కోణమే కనిపిస్తోందని తెలిపారు. ఇప్పటికే పలు అంశాలకు సంబంధించి ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని, గోప్యతలో భాగంగా ఇవ్వలేమని చెబుతున్నారన్నారు. ఈ సమావేశంలో సామాజిక కార్యకర్తలు అమ్రిత జోహ్రి, రక్షితస్వామి, కిరణ్ విస్సా, శ్రీహర్ష.టి తదితరులు పాల్గొన్నారు.

28 వరకు పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు వద్దు

పోలీసులను ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హనుమకొండ జిల్లా సుబేదారి పీఎస్‌లో నమోదైన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఈ నెల 28 వరకు అరెస్టు చేయొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. అయితే, దర్యాప్తు కొనసాగించుకోవచ్చని పోలీసులకు స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని కౌశిక్‌రెడ్డికి సూచించింది. తన భర్తను రూ.50 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారంటూ క్వారీ యజమాని మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు చేయగా, సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కక్షల కారణంగానే కేసు నమోదు చేశారని చెప్పారు. 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉందని, కౌశిక్‌రెడ్డి ఈ సభలో పాల్గొనకుండా అరెస్టు చేయాలని భావిస్తున్నారన్నారు. పోలీసుల తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. క్వారీ యజమానిని గతంలో బెదిరించి డబ్బులు వసూలు చేశారన్నారు. మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గతంలో డబ్బులు వసూలు చేసినప్పుడు కేసు ఎందుకు పెట్టలేదని, పిటిషనర్ బెదిరించిన తర్వాత మూడు రోజులకు రాత్రి 9 గంటల సమయం వరకు ఆగి ఎందుకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. పాడి కౌశిక్‌రెడ్డిపై ఎందుకు కేసులు నమోదవుతున్నాయి.. తన ముందు ఇది నాలుగో కేసని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోలీసులకు, ఫిర్యాదుదారు (డీఫ్యాక్టో కంప్లైనెంట్)కు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

పహల్‌గావ్

ఘోర ఉదంతాలు జరిగినప్పుడు వాటి నుంచి తప్పించుకున్నవారు అందుకు గల కారణాలకు ఆశ్చర్యపోతుంటారు. మంగళవారం పహల్‌గావ్ ఉగ్రదాడిలో ‘ఉప్పు’ వల్ల కొందరు ప్రాణాలు కాపాడుకున్నారు. మధ్యాహ్నం భోజనంలో రెస్టరెంట్ వారు వేసిన ఎక్కువ ఉప్పు వారిని కాపాడింది. గుర్రం ఎక్కడానికి ఇష్టపడని భార్య వల్ల భర్త, కుమారుడితో పాటు ఆమె కూడా బతికిపోయింది. ఇలాంటివే ఎన్నో. వీటిని అదృష్టం అనొచ్చు. మిరాకిల్ అనొచ్చు. మనిషి విశ్వాసాలు బలపడే, బలహీనపడే సందర్భాలు ఇవి.

ప్రాణాలు కాపాడిన ఉప్పు


ప్రతీకాత్మక చిత్రం

ఒకే రోజు.

ఒకే సమయం.

ఒకే స్థలం.

అటు చూస్తే మరణం. ఇటు చూస్తే ప్రాణ భయం.

రక్తపు మడుగులో కొందరు. ప్రాణాలు ఉగ్గబట్టుకొని మరికొందరు.

ఏప్రిల్ 22, 2025, మంగళవారం, మధ్యాహ్నం 2.50 గంటలు.

కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్‌గావ్‌లోని బైసరన్ లోయలో మృత్యుఘోషలు వినిపించాయి. క్షుద్ర ఆలోచనల మనుషులు అక్కడ మారణకాండ రచించారు. ఐదు మంది ఉగ్రవాదులు అధునాతన తుపాకులతో పురుషులను ఎంచి, వారి మతాన్ని అడిగి హతమార్చారు. ఆ క్షణాన అక్కడ ఉన్నవారు జీవితాంతం ఆ ఘటనకు ఉలిక్కిపడుతూనే ఉంటారు. దేశం యావత్తూ ఆ ఘటనను పీడకలగా భావిస్తూనే ఉంటుంది.

అయితే ఇంత పెనువిషాదంలో కొన్ని నిట్టూర్పులు ఉన్నాయి. కొందరు ప్రాణాలు దక్కించుకోగలిగారు. కొందరిని అదృష్టం బయటపడేసింది. కొందరు ఊహించని శక్తుల ఆశీస్సులతో తప్పించుకోగలిగారు. ఒకే స్థలంలో ఉన్న కొందరికి మరణం లభిస్తే కొందరికి ప్రాణం దక్కడం చూస్తే ‘విధి’ అనే మాటో ఏ దైవకృపో అనుకోకతప్పదు.

కేన్సిలేషన్‌తో బతికారు

నాగపూర్‌కు చెందిన నర్సింగ్ ఆఫీసర్ స్వాతి కోల్కర్‌కు ఇంకా వణుకు తగ్గలేదు. ఆమె తన ఆరుమంది కుటుంబ సభ్యులతో బతికిపోయింది. విహారానికి శ్రీనగర్ చేరుకున్న ఆమె కుటుంబం సోమవారం గుల్‌మార్గ్ మంగళవారం పహల్‌గావ్‌కు వెళ్లాలి. అయితే గుల్‌మార్గ్ ట్రిప్ సోమవారం కేన్సిల్ అవడంతో ఆ రోజున పహల్‌గావ్ వెళ్లి చూసి వచ్చారు. అందువల్ల ఘటన జరిగిన రోజు వాళ్లు ఆ చోటులో లేరు. ‘మేం గుల్‌మార్గ్‌లో ఉన్నాం. కాని పహల్‌గావ్‌లో ఉంటే మా గతేం కాను అనే ఆలోచనకే భయం వేసేస్తోంది. ఏ శక్తి మా ట్రిప్‌ను తారుమారు చేసిందో ఊహించలేకపోతున్నాను’ అని ఆకాశం వైపు చూసి దండాలు పెట్టుకుంటోందామె.

ఎక్కని గుర్రం... దక్కిన ప్రాణం

గోవా ఎండలకు దడిచి భార్య, కొడుకులతో శ్రీనగర్ వచ్చిన అక్కడ డిప్యూటి కమిషనర్ శివరామ్ వైగాంకర్ తన భార్యకు కృతజ్ఞతల మీద కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు. మంగళవారం ఆ కుటుంబం పహల్‌గావ్ చేరుకుంది. అయితే పహల్‌గావ్ నుంచి బైసనర్ వ్యాలీ 7 కిలోమీటర్లు. నడక ద్వారాగాని, గుర్రం మీదగాని వెళ్లాలి. శివరామ్ భార్య శిల్ప ‘నేను గుర్రం ఎక్కలేను. లోయలోకి వద్దు’ అంది. వాళ్లు పహల్‌గావ్ రెస్టరెంట్‌లో కూచుని గుర్రం ఎక్కాలా వద్దా అనే చర్చలోనే గంట సేపు గడిపేశారు. అప్పుడే కలకలం రేగింది. లోయలో ఉగ్రవాద దాడి జరిగిందనే వార్త తెలియగానే చస్తూ బతుకుతూ వాళ్లు అక్కడి నుంచి బయల్దేరి వచ్చేశారు. ‘నా భార్య గుర్రం ఎక్కి మేం అక్కడికి చేరుకుని ఉంటే ఇవాళ మా కుటుంబమే లేదు’ అన్నారు శివరామ్.

ఉప్పు దక్కించిన ప్రాణాలు

కేరళ నుంచి మొత్తం 11 మందితో వచ్చిన అల్బీ జార్జ్‌ను అతని మొత్తం కుటుంబాన్ని ఉప్పు కాపాడింది. శని, ఆది, సోమ వారాలు కశ్మీర్‌లో తెగ తిరిగిన వీరి కుటుంబం మంగళవారం ఉదయం శ్రీనగర్ నుంచి పహల్‌గావ్ బయల్దేరింది. అయితే రోజూ మధ్యాహ్నం ఏమీ తినడం లేదు... ఇవాళ మంచి భోజనం చేద్దాం అని అల్బీ జార్జ్ నిర్ణయించడంతో పహల్‌గావ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని ధాబా దగ్గర వారి కారు ఆగింది. అయితే రెస్టరెంట్‌లోని ఫ్రైడ్ రైస్‌లో విపరీతంగా ఉప్పు ఉంది. ‘ఇదెలా తినాలి’ అని జార్జ్ దబాయిస్తే రెస్టరెంట్ యజమాని ‘ఫ్రెష్‌గా చేయిస్తాను’ అని కూచోబెట్టాడు. ఆ వంట లేటయ్యి మూడు వరకూ అక్కడే ఉండిపోయారు. అప్పుడే అన్నివైపుల నుంచి గందరగోళం చోటు చేసుకుంది. వాళ్లు ప్రాణాలు దక్కించుకుని అక్కడి నుంచి పారిపోయి వచ్చేశారు. ఉప్పు ఆరోగ్యానికి మంచిది కాదంటారుగాని ఇక్కడ అది ప్రాణదాత అయ్యింది.

గుర్రం వెనుక దాక్కుని...

జైపూర్‌కు చెందిన దంపతులు కమల్ సోని, మిహిర్ దాడి జరుగుతున్నప్పుడు బైసరన్ లోయలో ఉన్నారు. ఒక్కసారిగా తుపాకీ చప్పుళ్లు వినిపించగానే స్థానికులు గుర్రం వెనుక దాక్కోండి అన్నారు. ‘మేం ఒక గుర్రం వెనుక దాక్కున్నాం. మా కళ్లెదుటే వాళ్లు కాల్చి చంపుతున్నారు. మేం కదల్లేదు. వారికి కనిపించలేదు. అలా మా ప్రాణాలు దక్కాయి. అది మైదానం కావడంవల్ల చాలామందికి అడ్డు దొరక్క ప్రాణాలు పోయాయి. కొందరు పొదల్లో దాక్కుని బతికారు’ అని తెలిపారు వాళ్లు.

భారతీయులకు వేదాంతం ఎక్కువ. ‘రాసి పెట్టి ఉంది’ అంటారు. ఎవరికి ఏది రాసి ఉందో.

కాని మన దేశంపై ఉగ్రవాదాన్ని రాయాలని వచ్చినవారికి మళ్లీ ఇటు చూడాలంటే వణుకు వచ్చే రాత రాయగల శక్తి మనకు ఉంది. ఆ రాతను మనం త్వరలో చదువుతాం.

కూల్ సమ్మర్

ఇలా ఇల్లంతా చల్లగా...

వేసవిలో ఇల్లు చల్లగా ఉండడానికి ఆవు పేడ ఉపయోగపడుతుందా?

కాస్త వెనక్కి వెళితే....‘అవును’ అనే జవాబు వినిపిస్తుంది.

ఒకప్పుడు పల్లెల్లో ఇంట్లో నేల, వాకిళ్లను పేడతో అలికేవారు. గోడలకు పూసేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే అప్పట్లో ఆవు పేడతో అలకడం అనేది ఎకో–ఫ్రెండ్లీ ఆల్టర్నేటివ్. ఆవుపేడ పూసిన గృహాలు వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయి.

ఇది మన దేశ వైవిధ్య వాతావరణానికి సరిపోయే పద్ధతి.

ఈ పాత సంప్రదాయ పద్ధతి మళ్లీ పునర్దర్శనం ఇస్తోంది.

ఢిల్లీ యూనివర్శిటీలో లక్ష్మీబాయి కాలేజి క్లాస్‌రూమ్ గోడకు ప్రిన్సిపాల్ డా.ప్రత్యూష వత్సల ఆవుపేడను పూస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.



మాజీ ప్రొఫెసర్, పర్యావరణ ప్రేమికులు డా.శివసుదర్శన్ మాలిక్ ఇళ్లను చల్లబర్చడానికి ఆవు పేడను ఉపయోగించే పురాతన భారతీయ విధానాన్ని పునరుద్ధరిస్తున్నారు.

ఆవుపేడ, బంకమట్టి, వేప ఆకులు, జిప్సం...

ఇలాంటి వాటితో ‘వేద ప్లాస్టర్’ను సృష్టించారు మాలిక్.



సిమెంట్ ఆధారిత ప్లాస్టర్ మాదిరిగా ఇది వేడిని గ్రహించదు.

ఇళ్లలో ఉష్ణోగ్రతను తగ్గించడానికి సహాయపడుతుంది.

స్థానికంగా లభించే పదార్థాలు, ఆవుపేడతో ‘గోక్రైట్ బ్రిక్స్’ తయారు చేశారు మాలిక్.

‘ఈ ఇటుకలు వేడి ప్రవేశాన్ని 70 శాతం తగ్గించడానికి రూపొందించాం’ అంటున్నారు మాలిక్.

పురాతన జ్ఞానం, సివిల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి వాతావరణ మార్పులకు పరిష్కార మార్గాలు కనుక్కునే ప్రయత్నం చేస్తున్నారు డా.శివసుదర్శన్ మాలిక్.

బ్యూటిప్స్

జిడ్డుగా ఉంటే.. మేలైన ప్యాక్స్

వేసవిలో చర్మం తరచూ జిడ్డు అవుతుంటుంది. ఎండ వేడికి చర్మం మండుతున్నట్టుగా అనిపిస్తుంటుంది. ఈ సమస్య తగ్గడంతో పాటు చర్మానికి తాజాదనం రావాలంటే సహజ సిద్ధమైన ఉత్పాదనలు మేలు చేస్తాయి.

- అలోవెరా జ్యూస్‌కు, కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి శరీరానికి తరచూ మసాజ్ చేస్తూ ఉంటే ఎండ కారణంగా నల్లబడిన చర్మం సహజకాంతికి వస్తుంది. చర్మం మండడం సమస్య కూడా తగ్గుతుంది. దురద, దద్దుర్లు.. ఇతర చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.
- జిడ్డుచర్మం గలవారికి వేసవి మరింత పరీక్ష పెడుతుంది. చమట అధికమై బయటి దుమ్ము, ధూళి చేరి చర్మం మరింత జిడ్డుగా తయారవుతుంది. పాలు, తేనె, నాలుగు చుక్కల నిమ్మరసం కలిపి చర్మం కమిలి, నల్లబడిన చోట రాయాలి. ఆరిన తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి.
- వేప ఆకుల ముద్ద, నారింజ తొనల ముద్ద సమానపాళ్లలో తీసుకోవాలి. దీంట్లో చిటికెడు గంధం పొడి, ముల్తానీమిట్టి, తేనె, నిమ్మరసం, రోజ్‌వాటర్ కలిపి, ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- టీ స్పూన్ నారింజ రసం, ఓట్స్, తేనె, గుడ్డులోని తెల్లసొన లేదా



పెరుగు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, వలయకారంగా మృదువుగా స్క్రబ్ చేయాలి. తర్వాత నీటితో శుభ్రపరుచుకోవాలి.
- బియ్యప్పిండిలో చిటికెడు పసుపు, తేనె, దోస రసం కలిపి పేస్ట్‌లా చేయాలి. ముఖానికి పట్టించి, ఆరాక శుభ్రపరుచుకోవాలి. మేనికి కూడా ఇది మేలైన ప్యాక్.
- ఎండలో బయటికి వెళ్లి వచ్చిన తర్వాత ఐస్ ప్యాక్ లేదా ఐస్ క్యూబ్‌తో ముఖానికి మృదువుగా రబ్ చేయాలి. ఎండవేడికి కమిలిన చర్మానికి ఉపశమనం లభిస్తుంది.

ఫ్యాషన్

లేస్ బ్రైట్‌ఫుల్



వేసవిలో కంఫర్ట్‌గానూ, స్టైలిష్‌గానూ ఉండే ఔట్‌ఫిట్స్ జాబితాలో కూల్‌గా మన మదిని చుట్టేస్తుంది క్రోచెట్ లేస్ డ్రెస్సింగ్ స్టైల్. ఎప్పుడూ ఎవర్‌గ్రీన్ అనిపించుకునే ఈ క్రియేటివ్ వర్క్‌ని ఏ ఫ్యాబ్రిక్‌తోనైనా జత చేస్తే రిచ్ లుక్‌ని మన సొంతం చేస్తుంది. క్యాజువల్ లేదా పార్టీవేర్‌గా ఇట్టే మార్కులు కొట్టేస్తుంది. బ్రైడల్ వేర్‌గా యూనివర్సల్ సింబల్‌ని సొంతం చేసుకున్న ఈ అల్లికల అందం ఈ వేసవికి మగువల ముస్తాబులో రెక్కలకు రంగులు అద్దుకున్న రాయంచలా మరింతగా మెరిసిపోతుంది.

సంప్రదాయ హంగులు

క్రోచెట్ లేస్ అత్యంత సున్నితమైన, క్లిష్టమైన వర్క్. సంప్రదాయ అల్లిక కావడంతో ఈ వర్క్ ఎవర్‌గ్రీన్‌గా అందరి మన్ననలు అందుకుంటుంది. కాటన్, సిల్క్, చందేరీ, నెటెడ్... ఏ ఫ్యాబ్రిక్‌తో అయినా ఇట్టే జత కట్టే క్రోచెట్ లేస్‌లో సంప్రదాయ పద్ధతిలో హ్యాండ్‌మేడ్‌గానూ, అధునాతనంగా మిషనరీపైనా రూపుదిద్దుకుంటుంది.



వెస్ట్రన్ బ్రైడ్స్ ధరించే పొడవాటి తెల్లని గౌన్లతో మనల్ని ఆకట్టుకుంటుంది క్రోచెట్ లేస్. మన సంగీత్, రిసెప్షన్ వంటి వేడుకలలోనూ నవ వధువులు లేస్ డిజైనరీ దుస్తులు ధరించడం చూస్తే కదలాడుతుండే హంసలు కళ్ల ముందు నిలుస్తాయి. క్యాజువల్ వేర్‌గానూ, చీరలు, లెహంగాలు, కుర్తా, దుపట్టా.. వంటి డ్రెస్సులకు క్రోచెట్ లేస్ అందమైన అలంకరణగా విరాజిల్లుతుంది. క్రోచెట్ లేస్‌తో అంచులు, డెకరేటివ్ ప్యాచ్ లేదా మొత్తం దుపట్టా, శారీగానూ ఆకట్టుకుంటుంది.



వెస్ట్రన్ బ్రైడ్స్ ధరించే పొడవాటి తెల్లని గౌన్లతో మనల్ని ఆకట్టుకుంటుంది క్రోచెట్ లేస్. మన సంగీత్, రిసెప్షన్ వంటి వేడుకలలోనూ నవ వధువులు లేస్ డిజైనరీ దుస్తులు ధరించడం చూస్తే కదలాడుతుండే హంసలు కళ్ల ముందు నిలుస్తాయి. క్యాజువల్ వేర్‌గానూ, చీరలు, లెహంగాలు, కుర్తా, దుపట్టా.. వంటి డ్రెస్సులకు క్రోచెట్ లేస్ అందమైన అలంకరణగా విరాజిల్లుతుంది. క్రోచెట్ లేస్‌తో అంచులు, డెకరేటివ్ ప్యాచ్ లేదా మొత్తం దుపట్టా, శారీగానూ ఆకట్టుకుంటుంది.

ఇండో–వెస్ట్రన్‌గానూ..

వెస్ట్రన్ గౌన్స్, టాప్స్, మిడీస్.. ఇండోవెస్ట్రన్ శైలులు క్రోచెట్ లేస్ మోడల్ డ్రెస్సుల ద్వారా మనం చూడచ్చు. కాటన్, సిల్క్‌దారాలతో తయారయ్యే ఈ అల్లికల ఫ్యాబ్రిక్‌లో పువ్వులు, తీగలు, లతల డిజైన్లు కనిపిస్తాయి. లేతరంగులు, ముఖ్యంగా తెలుపులో ఎక్కువగా కనిపించే ఈ డ్రెస్సులు సమ్మర్ స్పెషల్‌గానూ యువతను ఆకట్టుకుంటున్నాయి.

లేస్ ఆభరణాలు

ముచ్చటైన కంఠాభరణాలు, పర్సులు, హ్యాండ్ కఫ్స్, షూ డిజైన్స్‌లోనూ డిజైనర్లు లేస్‌తో క్రియేటివ్ డిజైన్స్‌ను మన ముందుకు తీసుకువస్తున్నారు. నాణ్యతను బట్టి వందల రూపాయల నుంచి డిజైన్‌ను బట్టి వేలల్లోనూ ఈ డిజైన్స్ ధర పలుకుతున్నాయి.



● యంగ్ టాలెంట్

కిల్లక లలితకు ఆటలు ఏం ఇచ్చాయి? ఆత్మవిశ్వాసాన్ని, అంతులేని ఉత్సాహాన్ని ఇచ్చాయి. పుట్టు అంధురాలైన లలిత ఒకవైపు చదువులో రాణిస్తూనే.... మరో వైపు ఆటలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తోంది...

పతకాలే పరవశించేలా...

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం గుళ్లలంక గ్రామానికి చెందిన బోర్జ–సీతమ్మల రెండవ సంతానం కిల్లక లలిత. పుట్టుకతోనే పాప అంధురాలని కొద్దిరోజులకే గుర్తించారు. స్నేహితుల సూచనల మేరకు విశాఖపట్నంలో 'చినజీయర్ స్వామి నేత్ర విద్యాలయం'లో లలితను చేర్పించారు. ప్రస్తుతం బీఏ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఒకవైపు చదువులో రాణిస్తూనే, మరోవైపు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తోంది.

జాతీయ స్థాయిలో సాధించిన పతకాలు ఇలా: ● 2018లో ఢిల్లీలో నిర్వహించిన ఐబీఎస్ఏ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 100 మీటర్లు 400 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్ విభాగంలో 3 సిల్వర్ మెడల్స్ ● 2021లో బెంగళూరులో నిర్వహించిన 19వ జాతీయ పారా అథ్లెటిక్స్ 200 మీటర్ల స్ప్రింట్ విభాగంలో బ్రాంజ్ మెడల్ ● 2021లో బెంగళూరులో నిర్వహించిన మూడవ ఇండియన్ ఓపెన్ నేషనల్ పారా అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల స్ప్రింట్‌లో సిల్వర్ మెడల్ ● 400 మీటర్ల స్ప్రింట్‌లో బ్రాంజ్ మెడల్ ● 2022 సంవత్సరంలో భువనేశ్వర్‌లో నిర్వహించిన పారా నేషనల్ గేమ్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్ల స్ప్రింట్ విభాగంలో రెండు బంగారు పతకాలు ● 2022 బెంగళూరులో నిర్వహించిన నాలుగవ పారా గేమ్స్‌లో 100 మీటర్ల స్ప్రింట్‌లో సిల్వర్ మెడల్ ● 2022లో న్యూఢిల్లీలో నిర్వహించిన బీఐఎస్ఎ నేషనల్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల స్ప్రింట్‌లో సిల్వర్, 400 మీటర్ల స్ప్రింట్‌లో గోల్డ్ మెడల్ ● 2023లో గుజరాత్‌లో నిర్వహించిన 12వ జూనియర్ అండ్ సబ్ జూనియర్ వారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 1500, 400, 100 స్ప్రింట్ విభాగంలో వరుసగా మూడు బంగారు పతకాలు ● 2023లో పుణేలో నిర్వహించిన 21వ నేషనల్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్ల స్ప్రింట్‌లో సిల్వర్ మెడల్, 400 మీటర్ల స్ప్రింట్‌లో బ్రాంజ్ మెడల్ ● 2023 ఇండియా పారా గేమ్స్‌లో 200 మీటర్ల స్ప్రింట్‌లో సిల్వర్ మెడల్, 400 మీటర్ల స్ప్రింట్‌లో గోల్డ్ మెడల్ ● 2024లో గోవాలో పారా నేషనల్ గేమ్స్‌లో 200, 400 మీటర్ల స్ప్రింట్ విభాగంలో రెండు సిల్వర్ మెడల్స్ ● 2024లో బెంగళూరులో నిర్వహించిన నాలుగవ ఓపెన్ నేషనల్స్‌లో 400 మీటర్ల స్ప్రింట్ విభాగంలో బంగారు పతకం, 200 మీటర్ల స్ప్రింట్ విభాగంలో సిల్వర్ మెడల్.

అంతర్జాతీయ స్థాయిలో: 2023లో చైనాలో నిర్వహించిన ఏషియన్ పారా గేమ్స్‌లో 1500 మీటర్ల స్ప్రింట్‌లో సిల్వర్ మెడల్ ● 2023లో మొరోకోలో నిర్వహించిన ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో 1500 మీటర్ల స్ప్రింట్ విభాగంలో ఐదవ స్థానం ● 2023లో బెంగళూరులో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల స్ప్రింట్‌లో సిల్వర్ మెడల్, 1,500 మీటర్ల స్ప్రింట్ విభాగంలో బ్రాంజ్ మెడల్.

– ఆశపు జయంత్ కుమార్, సాక్షి, పార్వతీపురం టౌన్


● జాతీయ పతాకంతో లలిత


● శిక్షణలో...

వారి కల నెరవేరుస్తాను

పారా ఒలింపిక్స్‌లో ఇండియాకు మెడల్ తీసుకురావాలన్నదే నా లక్ష్యం. అందుకోసం ప్రతిరోజు సాధన చేస్తున్నాను. నా కోచ్ రాహుల్ బాలకృష్ణ ఎంతో శ్రమించి నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చారు. నా పైన తల్లిదండ్రులు, గురువులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టి పారా ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకువస్తాను. - కిల్లక లలిత



● హ్యాష్ ట్యాగ్ రియల్ నేమ్... ఆక్టోథార్ప్. ఈ పదాన్ని బెల్ ల్యాబ్స్ ఇంజినీర్‌లు 1960లో సృష్టించారు.

అవును... ఇది నిజమే!



● అలబామా (యునైటెడ్ స్టేట్స్)లోని స్కాట్స్‌బోరోలో 'అన్ క్లెయిమ్డ్ బ్యాగేజీ సెంటర్' ఉంది. ఈ సెంటర్ అన్ని ప్రధాన విమానయాన సంస్థలతో ఒప్పందం చేసుకుంది. వస్తువు పోగొట్టుకున్న యజమాని కోసం 90 రోజులు వెదుకుతారు. ఆ తరువాత మాత్రమే క్లెయిమ్ చేయని బ్యాగులు, వస్తువులను కొనుగోలు చేస్తారు. ఈ సెంటర్ పర్యాటక ప్రాంతంగా కూడా ప్రసిద్ధి చెందింది.



యువర్స్

● ఇన్నోవేషన్

ఆకాశమంత కల



తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటకు చెందిన బాసంగారి లక్ష్మీనరసింహ హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. చిన్నప్పుడు ఒక టీవీ చానల్‌లో 'స్టూ ఆర్ట్ లిటిల్' అనే కార్యక్రమం చూసేవాడు. ఆ కార్యక్రమంలో కనిపించే మినియేచర్ క్రాఫ్ట్‌లను చూసి స్ఫూర్తి పొందాడు. తాను కూడా అలాంటి వాటిని తయారుచేయాలనుకున్నాడు.

తన కల నెరవేర్చుకున్నాడు.

రిమోట్‌తో నడిచే వాహనాలను తయారు చేయాలని పట్టుదలతో ట్రాక్టర్, లారీ, వివిధ మోడల్‌ల బైక్‌లను తయారు చేశాడు. వీటిని తయారు చేస్తున్న సమయంలో వీడియోలను తీసి వాటిని 'క్రియేటివ్ ఫాక్స్' అనే యూ ట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశాడు. ఇప్పటి వరకు దాదాపు 284 వీడియోలను పోస్ట్ చేశాడు. మినీ క్రాఫ్ట్‌లో పాఠాలు చెబుతున్నాడు.

తాను తయారు చేసిన విమానాన్ని ఆకాశంలో చూడాలనేది నరసింహ కల. దీన్ని కార్గో విమానం సీ130 హర్క్యులెస్ మాదిరిగా రూపొందించాడు. సుమారు 6.5కిలోల బరువు ఉంటుంది. ఈ నమూనా తయారీకి డెప్రాన్ షీట్స్, ఆరు చిన్నపాటి టైర్లు, నాలుగు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్‌లు, మోటార్, ఒక బ్యాటరీ, స్టిక్కర్లు, కొంత కలపను ఉపయోగించాడు. ఇప్పటి వరకు నాలుగు సార్లు ట్రయల్ రన్ చేశాడు.

ఇటీవల పొన్నాల శివారులో ప్రయత్నించగా 25 నుంచి 30 మీటర్ల ఎత్తులో కొద్ది దూరం వెళ్లింది. బ్యాటరీతో నడిచే ఈ విమానాన్ని ట్రాన్స్‌మీటర్ ఆధారంగా ఆపరేట్ చేస్తున్నాడు. దాదాపు ఆరు కిలో మీటర్లు ప్రయాణించేలా ప్రయోగాలు చేస్తున్నాడు.

– గజవెల్లి షణ్ముఖ రాజు. సాక్షి, సిద్దిపేట

మరిన్ని ప్రయోగాలు....

సంవత్సరం నుంచి విమానం మినియేచర్ తయారు చేస్తున్నాను. మొదట రూ. 24వేలతో ఈ విమానం తయారు అవుతుంది అనుకున్నా. కాని అంతకంటే ఎక్కువ ఖర్చు అయింది. విమానాన్ని ఆరు కిలో మీటర్ల వరకు ప్రయాణించే విధంగా తయారు చేయాలనుకుంటున్నాను. దీంతో నా యూట్యూబ్ ఛానల్‌కు కూడా గ్రోత్ వస్తుంది. ఇస్రో, డీఆర్‌డీవో (డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) శాస్త్రవేత్తగా కావాలనేది నా లక్ష్యం. ఎవియేషన్స్‌కు సంబంధించిన మరిన్ని ప్రయోగాలు చేయాలనుకుంటున్నాను.

- బాసంగారి లక్ష్మీనరసింహ

● గేమింగ్

తంబీ... జాంబీలొస్తున్నారు!

యాక్షన్–అడ్వెంచర్ వీడియో గేమ్ డేస్ గాన్. 2019లో వచ్చిన 'డేస్ గాన్'కు రీమాస్టర్డ్ వెర్షన్‌గా వస్తోంది. కథ విషయానికి వస్తే మనుషులలో కొందరు భయానకమైన జాంబి జీవులుగా మారుతుంటారు. తన భార్య చనిపోయింది అని భావించిన డీకన్ సెయింట్ జాన్....ఆమె జీవించే ఉందని తెలుసుకొని ఆమె కోసం అన్వేషణ మొదలుపెడతాడు. థర్డ్–పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే గేమ్ ఇది. ఫ్రీకర్స్ అని పిలవబడే నరమాంస భక్షక జీవుల నుండి తమను తాము రక్షించుకోవడానికి తుపాకులు, పదునైన ఆయుధాలను ఉపయోగించవచ్చు. గత గేమ్‌తో పోల్చితే తాజా గేమ్‌లో సరికొత్త గ్రాఫిక్స్, ఆయుధాలు, కొత్త గేమ్ మోడ్స్ కనిపిస్తాయి. ఎర్లీ–యాక్సెస్ మోడ్‌లో ఈ గేమ్‌ను ఆడడానికి అవకాశం లేదు. 'ఇంప్రూవ్‌మెంట్స్‌తో వస్తున్న డేస్ గాన్ రీమాస్టర్డ్ ప్లేయర్స్‌కు నచ్చుతుంది' అంటున్నాడు 'బెండ్ స్టూడియో' క్రియేటివ్ హెడ్ కెవిన్.



ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 4 **మోడ్:** సింగిల్ ప్లేయర్
జానర్: యాక్షన్–అడ్వెంచర్ **ప్లాట్‌ఫామ్స్:** ప్లే స్టేషన్ 4, విండోస్, ప్లే స్టేషన్ 5

● టెక్... టాక్

ఇన్‌ఫినిక్స్ నోట్ 50 ప్రో 4జీ



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
ఓఎస్: ఆండ్రాయిడ్ 15
మెమోరీ: 256 జీబి 8జీబి ర్యామ్/ 256 జీబి 12జీబి ర్యామ్
బ్యాటరీ: 5200 ఎంఏహెచ్
రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1080x2436 పిక్సెల్స్

మోటో ప్యాడ్ 60 ప్రో ట్యాబ్



సైజ్: 12.7 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్
రిజల్యూషన్: 2,944x1,840 పిక్సెల్స్
బ్యాటరీ: 10,200 ఎంఏహెచ్
బరువు: 1.4 కిలోలు
● 13 ఎంపీ మెయిన్ కెమెరా, 8 ఎంపీ ఫ్రంట్–ఫేసింగ్ షూటర్

లాప్‌టాప్ స్టాండ్ విత్ కూలింగ్ ఫ్యాన్



కలర్: సిల్వర్
బ్రాండ్: పోర్ట్రానిక్స్
బరువు: 980 గ్రా.
కూలింగ్ మెథడ్: ఎయిర్
● 360–డిగ్రీ రొటేషన్
● 10 ఆర్‌జీబి లైట్ మోడ్స్

ఓపెన్ ఏఐలో న్యూ ఇమేజ్ లైబ్రరీ

చాట్‌జీపీటి జనరేట్ చేసిన అన్ని చిత్రాలను యాక్సెస్ చేయడాన్ని మరింత సులభతరం చేసే కొత్త ఫీచర్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఓపెన్ ఏఐ తీసుకువచ్చింది. ఓపెన్ ఏఐ ఇప్పుడు కొత్త ఇమేజ్ లైబ్రరీని విడుదల చేస్తోంది. ఇది చాట్‌జీపీటీ జనరేటెడ్ చిత్రాలన్నింటినీ ఒకే చోట చూడడానికి యూజర్‌లను అనుమతిస్తుంది. ఈ ఫీచర్ ఉచిత, ప్లస్, ప్రో చాట్‌జీపీటీ యూజర్‌లకు అందుబాటులో ఉంది.

సాక్షి సినిమా

"పన్నెండేళ్ల నా కెరీర్‌లో ఎనిమిది సినిమాలకు దర్శకత్వం వహించాను. అయితే వేగంగా సినిమాలు చేసి, డబ్బులు సంపాదించుకోవాలనే ఆలోచన, ఆశ నాకు లేదు. నంబర్లు తక్కువ అయినా మంచి సినిమాలు తీయాలన్నదే నా ఆకాంక్ష. అందుకే నిదానంగా చేసుకుంటూ వెళుతున్నాను" అని త్రినాథరావు నక్కిన చెప్పారు. ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా రూపొందిన చిత్రం 'చౌర్య పాఠం'. కార్తీక్ ఘట్టమనేని కథ అందించిన ఈ సినిమా ద్వారా చందు మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన నిఖిల్ గొల్లమారి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై డైరెక్టర్ నక్కిన త్రినాథరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో త్రినాథరావు విలేకరులతో పంచుకున్న విశేషాలు.




చౌర్య పాఠంతో నా కల నెరవేరింది

- త్రినాథరావు నక్కిన

● కార్తీక్ ఘట్టమనేని తండ్రి ఐజీగా చేశారు. ఆయన హయాంలో జరిగిన ఓ చిలిపి దొంగతనం కేసు గురించి కార్తీక్ చెప్పినప్పుడు సరదాగా అనిపించింది. ఈ నేపథ్యంలో సినిమా చేద్దామనే ఆలోచన వచ్చింది. ఆ కేసుని స్ఫూర్తిగా తీసుకొని ఫిక్షన్ యాడ్ చేసి, ఈ కథ రాశాడు కార్తీక్. ఈ సినిమాకి దర్శకుడిగా నిఖిల్ గొల్లమారి పేరుని తనే చెప్పాడు. 'కార్తికేయ' సినిమా షూటింగ్‌లో తన చురుకుదనం, ప్రతిభని గుర్తించాను. దీంతో ఓకే చెప్పాను. తను ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు. క్లైమాక్స్‌ని మాత్రం మూడుసార్లు మార్పించాను. ఆ తర్వాత ఫైనల్ కాపీ చూసుకున్నాక చాలా బాగుందనిపించింది. నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ కథకి రెండింతలు న్యాయం చేశాడు. ఈ చిత్రం దొంగతనం చేయాలనుకునే వారికి ఓ పాఠంలా ఉంటుంది (నవ్వుతూ). ● కొత్తవాళ్లకి ఒక వేదిక సృష్టించి, అవకాశాలు ఇవ్వాలన్నది నా కల. ఎప్పటి నుంచో ఉన్న ఆ కల 'చౌర్య పాఠం'తో నెరవేరింది. నిర్మాతగా మారి డబ్బులు సంపాదించాలనే ఆలోచన లేదు. కేవలం కొత్తవారికి అవకాశం కల్పించాలనే మంచి ఉద్దేశంతోనే నిర్మాతగా మారాను. మేం అనుకున్నదాని కంటే పది శాతం బడ్జెట్ పెరిగింది. మా బ్యానర్ నుంచి వస్తున్న తొలి సినిమా కావడంతో రాజీ పడకుండా మంచి క్వాలిటీతో తీశాం. ● ఇంద్ర రామ్ ఈ కథకి సరిగ్గా సరిపోయాడు. కొత్తవాడు కదా సరిగ్గా చేస్తాడో? లేదో అనుకున్నాం. సెట్స్‌కి వెళ్లాక రెండు రోజులు కంగారు పడినా, ఆ తర్వాత బాగా నటించాడు. అలానే పాయల్ రాధాకృష్ణ తెలుగు నేటివిటీ మిస్ అవ్వకుండా చక్కగా నటించింది. ● ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులు థియేటర్స్‌కి రావడం తగ్గించడానికి చాలా కారణాలున్నాయి. వాళ్లని థియేటర్స్‌కి రప్పించే సినిమాలు తీయడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంది. ప్రస్తుతం హవీష్ హీరోగా నా డైరెక్షన్‌లో చేస్తున్న సినిమా 25 శాతం పూర్తయింది. ఆ తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, 'దిల్' రాజుగారి బ్యానర్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌లో సినిమాలు చేయాల్సి ఉంది.

భైరవుడు వస్తున్నాడు


● రాజశేఖర్ వర్మ

రాజశేఖర్ వర్మ, పూజా కిరణ్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ మూవీ 'కాళాంకి భైరవుడు'. హరి హరన్. వి దర్శకత్వంలో కేఎస్ రావు, శ్రీనివాసరావు. ఆర్ నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రాజశేఖర్, జీవిత విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. త్వరలో రిలీజ్ డేట్ చెబుతాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఆమని, రితికా చక్రవర్తి, నాగ మహేశ్, బలగం జయరాం, భవ్య, మహమద్ బాషా, బిల్లి మురళి ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: పెద్దపల్లి రోహిత్.

యాక్షన్... థ్రిల్


● గోపీచంద్, మీనాక్షీ దినేష్

కొత్త చిత్రాన్ని ప్రారంభించారు గోపీచంద్. ఆయన హీరోగా నూతన దర్శకుడు కుమార్ సాయి ఓ యాక్షన్ థ్రిల్లర్ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ చిత్రంలో మలయాళ నటి మీనాక్షీ దినేష్ హీరోయిన్‌గా నటిస్తారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ''సాహసం' (2013) తర్వాత గోపీచంద్ మళ్లీ ఈ బ్యానర్‌లో చేస్తున్న సినిమా ఇదే. అత్యున్నత నిర్మాణ ప్రమాణాలు, సాంకేతిక విలువలతో ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఈ సినిమాలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అతి త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇక ప్రస్తుతం సంకల్ప్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఓ చిత్రంతో గోపీచంద్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.


ప్రేమంటే...


● ప్రియదర్శి

ప్రియదర్శి, ఆనంది హీరో హీరోయిన్లుగా, సుమ కనకాల మరో కీలక పాత్రలో నటించిన చిత్రం 'ప్రేమంటే ..'. ఈ సినిమాకు 'థ్రిల్–యూ ప్రాప్తిరస్తు' అనేది ఉపశీర్షిక. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో ఎస్‌వీసీఎల్ఎల్‌పీ, రానా స్పిరిట్ మీడియా పతాకాలపై నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఇటీవల ఆరంభమైన ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ముగిసింది. పూర్తి స్థాయి నిర్మాతగా జాన్వీ నారంగ్‌కు ఇదే తొలి చిత్రం. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

సంగీతంలో సరికొత్త ప్రయోగం


● సుధీర్ అత్తవరం


● గోపీ సుందర్

కబీర్ బేడి, భవ్య, శ్రుతి, కొరియోగ్రాఫర్లు సందీప్ సోపార్కర్, గణేశ్ ఆచార్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కొరగజ్జ'. సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహించారు. త్రివిక్రమ సినిమాస్, సక్సెస్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన గోపీ సుందర్ మాట్లాడుతూ– ''కర్ణాటక, కేరళలోని కరావళి (తులునాడు) ప్రాంతంలో, ముంబైలోని కొన్ని ప్రదేశాల్లో పూజించబడే కొరగజ్జ దేవత చుట్టూ ఈ చిత్రకథ సాగుతుంది. ఈ చిత్రంలో సంగీతం పరంగా సరికొత్త ప్రయోగాలు చేశాను. నాటి ఆచారాలను, సంప్రదాయాల్ని అర్థం చేసుకున్న తర్వాత నేనే ట్యూన్స్ చేశాను. 'కొరగజ్జ' కథాంశం కొత్త సంగీతాన్ని అన్వేషించడానికి, కొత్త శైలిని కనిపెట్టడానికి నాకు వీలు కల్పించింది'' అన్నారు.''కాంతార' తర్వాత ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కొరగజ్జ'ని వివిధ భాషల్లో విడుదల చేయనున్నాం. ఈ చిత్రంలో ఆరు పాటలు ఉంటాయి. వీటిని వివిధ శైలి, భాషల్లో స్వరపరిచారు గోపీ సుందర్'' అని సుధీర్ అత్తవర్ తెలిపారు.

నేను పాకిస్తానీ కాదు

- హీరోయిన్ ఇమాన్వీ ఇస్మాయిల్



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి యావత్ భారతదేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఉగ్రదాడిని భారత దేశం ముక్త కంఠంతో ఖండించింది. ఇలాంటి దాడులు జరిగినప్పుడల్లా భారత చిత్రపరిశ్రమలో పాకిస్తానీ నటీనటులు ఉండకూడదని, వారి చిత్రాలపై నిషేధం విధించాలనీ వివాదం నెలకొంటుంది. తాజా దాడి నేపథ్యంలోనూ పాకిస్తాన్ నటీనటులు ఉండకూడదని, వారి చిత్రాలపై నిషేధం విధించాలని సోషల్ మీడియా మాధ్యమాల వేదికగా నెటిజన్లు కామెంట్స్ పోస్ట్ చేస్తున్నారు. కాగా ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ సినిమా 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్)లో హీరోయిన్‌గా నటిస్తున్న ఇమాన్వీపై నిషేధం విధించాలని, ఆమె పాకిస్తానీ నటి అనీ కొందరు నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నటిస్తున్న ఇమాన్వీ ఎస్మాయిల్ పాకిస్తానీ అని, ఆమె తండ్రి పాకిస్తాన్ మిలటరీ ఆఫీసర్ అని గతంలో ప్రచారం జరిగింది. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. దీంతో ప్రభాస్ 'ఫౌజి' సినిమాను నిలిపివేయాలన్న వ్యాఖ్యలు తెరపైకి వచ్చాయి. ఈ వివాదం పై హీరోయిన్ ఇమాన్వీ ఎస్మాయిల్ స్పందించారు.

తాను పాకిస్తాన్ పౌరురాలిని కానని, ఆ దేశం మిలటరీతో తన కుటుంబ సభ్యులకు సంబంధం లేదని వెల్లడిస్తూ, సోషల్ మీడియా మాధ్యమాల వేదికగా ఓ నోట్‌ను షేర్ చేశారు ఇమాన్వీ ఇస్మాయిల్. ఈ నోట్‌లోని సారాంశం ఈ విధంగా...

''పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నా మనసును కలచివేసింది. ఈ దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. మరణించినవారికి నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. అయితే ఈ సందర్భంగా నేను ఒక విషయాన్ని ప్రస్తావించాలనుకుంటున్నాను. ద్వేషాన్ని ప్రేరేపించేలా నా గుర్తింపు గురించి, నా కుటుంబం గురించి తప్పుడు, కల్పిత వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. మా కుటుంబంలో గతంలో కానీ, ఇప్పుడు కానీ పాకిస్తాన్ మిలటరీతో ఏ విధమైన సంబంధాలు ఉన్నవారు ఎవరూ లేరు. ద్వేషాన్ని పెంపొందించేందుకు ఈ అబద్ధపు వార్తలు పుట్టుకొచ్చాయి. కనీస పరిశోధన చేయకుండానే నా గురించి వార్తలు రాయడం నన్ను నిరుత్సాహపరిచింది.

నేను ఇండో అమెరికన్‌ని అని గర్వంగా చెప్పగలను. తెలుగు, హిందీ, గుజరాతీ, ఇంగ్లిష్ భాషలు మాట్లాడగలను. మా అమ్మానాన్నలు ఎప్పుడో అమెరికాకు వలస వెళ్లారు. ఆ తర్వాత అమెరికా పౌరసత్వం తీసుకున్నారు. నేను లాస్ ఏంజిల్స్‌లో పుట్టాను. యూఎస్‌లో నా చదువు పూర్తయిన తర్వాత ఆర్ట్స్‌లో కెరీర్‌ను స్టార్ట్ చేసి, యాక్టర్, కొరియోగ్రాఫర్, డ్యాన్సర్ అయ్యాను. ఈ రంగంలో కొన్ని రోజులు కొనసాగిన అనంతరం భారతీయ చిత్ర పరిశ్రమలో అవకాశాలు అందుకుంటున్నాను. ఈ విషయంలో ఎంతో సంతోషంగా ఉన్నాను. సినిమా అనేది నా జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. భారతీయ మూలాలు ఉన్న వ్యక్తిగా, భారతీయత, భారత సంస్కృతి నా రక్తంలోనే ఉన్నాయి. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నా వంతుగా కృషి చేస్తాను'' అంటూ ఓ లాంగ్ నోట్‌ను ఇమాన్వీ షేర్ చేశారు. ఇదిలా ఉంటే... ఇమాన్వీకి 'ఫౌజి' తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం.

'అబీర్ గులాల్' సినిమాపై నిషేధం



పాకిస్తాన్ నటుడు ఫవాద్ ఖాన్ హీరోగా నటించిన రొమాంటిక్ కామెడీ హిందీ చిత్రం 'అబీర్ గులాల్'. ఈ చిత్రంలో వాణీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. ఆర్తీ ఎస్. బగ్దీ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వివేక్ అగర్వాల్, అవంతిక, రాకేష్ సిప్పి తదితరులు నిర్మించారు. పాకిస్తాన్ నటుడితో సినిమా ఏంటంటూ ఈ మూవీ అనౌన్స్‌మెంట్ సమయంలోనే ఓ చర్చ జరిగింది. ఆ తర్వాత విషయం సద్దుమణిగింది. తాజాగా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి కారణంగా ఈ సినిమా అంశం మరోసారి తెరపైకి వచ్చింది. మే 9న విడుదల కావాల్సిన ఈ సినిమాపై నిషేధం విధించాలని పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో నెటిజన్లు స్పందించారు. పైగా ఉగ్రదాడి జరిగిన మంగళవారమే 'అబీర్ గులాల్' సినిమాను ప్రమోట్ చేసేలా వాణీ కపూర్ ఓ పోస్ట్ చేశారు. ఆ తర్వాత డిలిట్ చేశారు. కానీ ఉగ్రదాడి జరిగిన రోజే పాకిస్తాన్ నటుడితో చేసిన సినిమా ప్రమోషన్ ఏంటని పెద్ద ఎత్తున ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇక పాకిస్తాన్ నటుడు అంటూ వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఫవాద్ ఖాన్ మాత్రం పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. తాజా పరిణామాల నేపథ్యంలో మే 9న విడుదల కావాల్సిన 'అబీర్ గులాల్' సినిమా విడుదలపై భారత ప్రభుత్వం నిషేధం విధించిందన్న వార్తలు జాతీయ మీడియాలో వస్తున్నాయి. అలాగే పాకిస్తాన్ నటీనటులను బాలీవుడ్ పరిశ్రమ ప్రోత్సహించడం కరెక్ట్ కాదని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక 'అబీర్ గులాల్'ను ఇండియాలో రిలీజ్ కానివ్వం అని (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) 'ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయీస్' అధ్యక్షుడు బీఎన్ తివారి ఓ ప్రకటనలో తెలిపారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
25-4-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
315	82
79,801	24,247

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,087	▲	379
డోజోన్స్	39,969	▲	363
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,407	▲	4
డాక్స్	22,065	▲	103
షాంఘై	3,297	▲	1
నికాయ్	35,039	▲	171

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్లు)	96,286
బంగారం (22 క్యారెట్లు)	95,900
వెండి (కేజీ)	97,634

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.45	111.50
€	యూరో	ఎస్‌బీఐ	95.88	98.59
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.64	61.23
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.76	55.95
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.99	67.90
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.80	23.31
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.29	24.07
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.82	12.64

టెక్ మహీంద్రా లాభం జూమ్



- క్యూ4లో రూ. 1,167 కోట్లు
- షేరుకి రూ. 30 డివిడెండ్

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం టెక్ మహీంద్రా గతేడాది (2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 77 శాతం జంప్‌చేసి రూ. 1,167 కోట్లను తాకింది. మార్జిన్లు 3.5 శాతం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 661 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో 79.8 కోట్ల డాలర్ల(రూ. 6,800 కోట్లు) విలువైన ఆర్డర్లు కొత్తగా పొందింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి 42 శాతం అధికంగా 2.7 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 27,000 కోట్లు) విలువైన డాలర్లు సాధించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ మోహిత్ జోషీ తెలియజేశారు. చివరి త్రైమాసిక ఆర్డర్లలో 60 శాతం వృద్ధిని అందుకున్నట్లు వెల్లడించారు. వాటాదారులకు షేరుకి రూ. 30 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 12,871 కోట్ల నుంచి రూ. 13,384 కోట్లకు బలపడింది. పూర్తి ఏడాదికి నికర లాభం 80 శాతం ఎగసి రూ. 4,251 కోట్లను అధిగమించింది. 2023–24లో రూ. 2,358 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 2 శాతం మెరుగై రూ. 52,988 కోట్లను తాకింది. కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య 3,276 తగ్గి 1,48,731కు చేరింది. 2025 మార్చి31కల్లా చేతిలో నగదు, తత్సమాన నిల్వలు 89.6 కోట్ల డాలర్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం వృద్ధితో రూ. 1,446 వద్ద ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభం వీక్



- క్యూ4లో రూ. 2,475 కోట్లు
- షేరుకి రూ. 24 డివిడెండ్

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3 శాతంపైగా క్షీణించి రూ. 2,475 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది (2023–24) ఇదే కాలంలో రూ. 2,561 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 3 శాతం వృద్ధితో రూ. 15,416 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 15,013 కోట్ల అమ్మకాలు సాధించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 24 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇబిటా మార్జిన్లు 0.3 శాతం నీరసించి 23.1 శాతాన్ని తాకాయి. మొత్తం వ్యయాలు 3 శాతం పెరిగి రూ. 12,478 కోట్లకు చేరాయి.

విభాగాలవారీగా..: క్యూ4లో హెచ్‌యూఎల్ ఆదాయంలో గృహ సంరక్షణ నుంచి 2 శాతం అధికంగా రూ. 5,815 కోట్లు సమకూరింది. సౌందర్యం, పోషక విభాగం 7 శాతం ఎగసి రూ. 3,265 కోట్లుగా నమోదైంది. వ్యక్తిగత సంరక్షణ నుంచి 3 శాతం వృద్ధితో రూ. 2,126 కోట్లు లభించింది. ఆహార విభాగం నామమాత్ర క్షీణతతో రూ. 3,896 కోట్లకు పరిమితమైంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 4 శాతం పుంజుకుని రూ. 10,671 కోట్లను తాకింది. ఇక మొత్తం ఆదాయం 2 శాతంపైగా వృద్ధితో రూ. 64,138 కోట్లకు చేరింది.

హెచ్‌యూఎల్ షేరు బీఎస్‌ఈలో 4 శాతం పతనమై రూ. 2,325 వద్ద ముగిసింది.

యాక్సిస్ బ్యాంక్ లాభం ఫ్లాట్



- క్యూ4లో రూ. 7,118 కోట్లు
- షేరుకి రూ. 1 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం నామమాత్ర వెనకడుగుతో రూ. 7,118 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 7,130 కోట్లు ఆర్జించింది. ప్రొవిజన్లు పెరగడం, ట్రేడింగ్ ఆదాయం భారీగా క్షీణించడంపై ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 35,990 కోట్ల నుంచి రూ. 38,022 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం పుంజుకుని రూ. 13,811 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.97 శాతంగా నమోదయ్యాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 1,185 కోట్ల నుంచి రూ. 1,359 కోట్లకు పెరిగాయి. బ్యాంక్ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. రూ. 4,805 కోట్ల తాజా స్లిప్పేజీలలో రిటైల్ విభాగం నుంచి అధికంగా నమోదైనట్లు బ్యాంక్ పేర్కొంది. స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏలు) 1.43 శాతం నుంచి 1.28 శాతానికి బలహీనపడ్డాయి. అయితే నికర ఎన్‌పీఏలు 0.31 శాతం నుంచి 0.33 శాతానికి పెరిగాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం రూ. 24,861 కోట్ల నుంచి రూ. 26,373 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 1,31,810 కోట్ల నుంచి రూ. 1,47,934 కోట్లకు జంప్‌చేసింది.

యాక్సిస్ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 1,207 వద్ద ముగిసింది.

ఏడు రోజుల లాభాలకు బ్రేక్

గరిష్టాల్లో లాభాల స్వీకరణ • మళ్లీ 80వేల దిగువకు సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ఏడు రోజుల ర్యాలీ నేపథ్యంలో గురువారం గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరిచాయి. ఆసియా, యూరప్ మార్కెట్లలోని బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 315 పాయింట్లు క్షీణించి 79,801 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82 పాయింట్లు నష్టపోయి 24,247 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 392 పాయింట్లు పతనమై 79,725 వద్ద నిఫ్టీ 113 పాయింట్లు దిగివచ్చి 24,216 వద్ద వద్ద కనిష్టాన్ని తాకాయి. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై అమెరికాలో 12 రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు ఫెడరల్ రిజర్వ్ చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యల పరిణామాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



- బీఎస్‌ఈలో రంగాల వారీగా సూచీల్లో రియల్టీ 1.39%, ఎఫ్‌ఎంసీజీ ఒకశాతం, ఐటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్స్ అరశాతం నష్టపోయాయి. మరోవైపు కమోడిటీస్, హెల్త్‌కేర్, మెటల్, సర్వీసెస్ రంగాల ఇండెక్సులు లాభపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్‌లు 0.16%, 0.1 శాతం నష్టపోయాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

కంపెనీల లాభాలు ఫర్వాలేదు	నిబంధనలొక్కటే కాపాడలేవు.. మీరూ జాగ్రత్తగా ఉండాలి

ఉక్కు భారతాన్ని నిర్మిద్దాం

- ఉత్పత్తిని మరింతగా పెంచుదాం
- పరిశ్రమకు ప్రధాని మోదీ పిలుపు

ముంబై: సవాళ్లను దీటుగా అధిగమించే, విప్లవాత్మకమైన, ఉక్కులాంటి దృఢమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో పరిశ్రమ కూడా కలిసి రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. నిరాటంకంగా ముడి వస్తువుల సరఫరా ఉండేలా చూసుకునేందుకు అంతర్జాతీయంగా పటిష్టమైన భాగస్వామ్యాలను ఏర్పర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా ఉక్కు ఉత్పత్తిని పెంచేందుకు వినియోగంలో లేని గనుల నుంచి ఇనుప ఖనిజాన్ని వెలికితీయడంపై మరింతగా దృష్టి పెట్టాలని పరిశ్రమకు ఆయన సూచించారు. ఇండియా స్టీల్ 2025 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ఈ విషయాలు తెలిపారు. ఉక్కు పరిశ్రమ ఇప్పుడిప్పుడే ఉదయిస్తున్న రంగంగా ఆయన అభివర్ణించారు. అభివృద్ధికి వెన్నెముక ఈ కమోడిటీ ఉత్పత్తిని మరింతగా పెంచాలని, కొత్త ప్రక్రియలను వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలు చేయడం, ఉత్తమ విధానాలను అమలు చేయడం, బొగ్గు దిగుమతులకు ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలాంటి అంశాలపై దృష్టి పెట్టాలని మోదీ సూచించారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు తయారీ, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్‌కి సంబంధించి



కొత్త ఆవిష్కరణలు చేయాలని, వాటిని పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు.

ముడి వస్తువులు సవాలే..

ఉక్కు రంగానికి నిరాటంకంగా ముడి వస్తువుల సరఫరా పెద్ద సవాలుగానే ఉంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా భాగస్వామ్యాలను బలోపేతం చేసుకుని సరఫరా వ్యవస్థలను పటిష్టపర్చుకోవాలని చెప్పారు. 'ఆందోళనకరమైన అంశాల్లో ముడి వస్తువుల సరఫరా కూడా ఒకటి. మనం ఇప్పటికీ నికెల్, కోకింగ్ కోల్, మ్యాంగనీస్ కోసం దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. కాబట్టి గ్లోబల్ భాగస్వామ్యాలను పటిష్టం చేసుకుంటూ, టెక్నాలజీలను అప్‌గ్రేడ్ చేసుకోవడంపై మరింతగా దృష్టి పెట్టాలి' అని ప్రధాని చెప్పారు. భవిష్యత్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పరిశ్రమ సన్నద్ధంగా ఉండాలని, కొత్త ప్రక్రియలను వినియోగంలోకి తేవాలని సూచించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో 179 మిలియన్ టన్నులుగా ఉన్న ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 2030 నాటికి 300 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన చెప్పారు. అలాగే తలసరి ఉక్కు వినియోగం కూడా 98 కేజీల నుంచి 160 కేజీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 'రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, పైప్‌లైన్లు ఇలా ఎన్నో పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ కూడా ఉక్కు రంగానికి కొత్త అవకాశాలే' అని మోదీ తెలిపారు. మెగా ప్రాజెక్టులు పెరుగుతుండటం వల్ల హై–గ్రేడ్ స్టీల్‌కి డిమాండ్ పెరుగుతుందన్నారు. యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కూడా కల్పించే రంగం కావడంతో ఉక్కు పరిశ్రమ చాలా కీలకమైనదని మోదీ చెప్పారు.

ఈడీ అదుపులో జెన్సోల్ ప్రమోటర్!

కంపెనీ కార్యాలయాల్లో సోదాలు

న్యూఢిల్లీ: జెన్సోల్ కంపెనీ ప్రమోటర్ల నిధుల మళ్లింపు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఢిల్లీ, గురుగ్రామ్, అహ్మదాబాద్‌లోని కంపెనీ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా)లోని నిబంధనల కింద ఈ సోదాలు చేపట్టింది. ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఉన్న కంపెనీ సహ ప్రమోటర్ పునీత్ సింగ్ జగ్గీని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మరో ప్రమోటర్



అన్మోల్ సింగ్ జగ్గీ దుబాయ్‌లో ఉన్నట్టు సమాచారం. ప్రమోటర్లు అన్మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ కంపెనీ ఖాతాల నుంచి నిధులు మళ్లించారంటూ సెబీ దర్యాప్తులో తేలడం తెలిసిందే. ఇరెడా, పీఎఫ్‌సీ నుంచి ఈవీలు, ఈపీసీ కాంట్రాక్టుల కోసం తీసుకున్న రుణాలను ప్రమోటర్లు మళ్లించి ఆస్తులు కొనుగోలు చేసినట్టు సెబీ గుర్తించింది. దీంతో ఈ వ్యవహారంపై ఈడీ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

సాక్షి స్పోర్ట్స్



'నిన్ను చంపేస్తాం'

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గంభీర్‌కు బెదిరింపు లేఖ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతం గంభీర్‌కు పోలీసులు భద్రతను మరింత పెంచారు. అతడిని చంపేస్తామంటూ బెదిరింపు లేఖలు రావడమే అందుకు కారణం. పహల్గావ్‌లో తీవ్రవాదుల దాడి జరిగిన రోజే గంభీర్ మెయిల్ అడ్రస్‌కు రెండు మెయిల్స్ వచ్చాయి. అందులో 'ఐసిస్ కశ్మీర్'గా చెప్పుకున్న వ్యక్తి నుంచి 'నేను నిన్ను చంపేస్తా' అని రాసి ఉంది. 'తనకు వచ్చిన మెయిల్ గురించి గంభీర్ మాకు సమాచారం అందించారు. దీనిపై విచారణ జరుపుతున్నాం. ఆయనకు ఇప్పటికే ఢిల్లీ పోలీసుల నుంచి ప్రత్యేక భద్రత ఉంది. ఇకపై కల్పించే అదనపు భద్రతకు సంబంధించిన సమాచారాన్ని బయటకు చెప్పలేం' అని ఢిల్లీ సెంట్రల్ డీసీపీ హర్షవర్ధన్ వెల్లడించారు. బీజేపీ మాజీ ఎంపీ కూడా అయిన గౌతమ్ గంభీర్‌కు 2022లో కూడా ఇదే తరహాలో చంపేస్తామంటూ బెదిరింపు మెయిల్స్ రావడంతో అతనికి భద్రత కల్పించారు.

చిన్నస్వామిలో బెంగళూరు చిందు

- హోం గ్రౌండ్‌లో తొలి మ్యాచ్ నెగ్గిన ఆర్‌సీబీ
- 11 పరుగులతో రాజస్తాన్ రాయల్స్ ఓటమి
- రాణించిన కోహ్లి, హాజల్‌వుడ్

రాజస్తాన్ విజయానికి చివరి 3 ఓవర్లలో 40 పరుగులు కావాలి... భువనేశ్వర్ వేసిన 18వ ఓవర్లో జురేల్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదడంతో 22 పరుగులు వచ్చాయి. సమీకరణం 12 బంతుల్లో 18 పరుగులకు మారడంతో గెలుపు ఖాయమనిపించింది. అయితే 19వ ఓవర్లో హాజల్‌వుడ్ ఒకటే పరుగు ఇచ్చి 2 వికెట్లు తీయడంతో రాయల్స్ ఆశలు కోల్పోయింది. చివరి ఓవర్లో దయాళ్ 5 పరుగులే ఇచ్చాడు. దాంతో ఈ సీజన్‌లో చిన్నస్వామి మైదానంలో ఆడిన నాలుగో మ్యాచ్‌లో బెంగళూరుకు తొలి గెలుపు దక్కగా ...విజయానికి చేరువగా వచ్చి రాజస్తాన్ వరుసగా ఐదో ఓటమిని మూటగట్టుకుంది.

బెంగళూరు: ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కీలక విజయాన్ని సొంతం చేసుకుంది. గురువారం జరిగిన పోరులో ఆర్‌సీబీ 11 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (42 బంతుల్లో 70; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), దేవదత్ పడిక్కల్ (27 బంతుల్లో 50; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. రెండో వికెట్‌కు వీరిద్దరు 51 బంతుల్లోనే 95 పరుగులు జోడించారు. అనంతరం రాజస్తాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 194 పరుగులే చేసింది. యశస్వి జైస్వాల్ (19 బంతుల్లో 49; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), ధ్రువ్ జురేల్ (34 బంతుల్లో 47; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా ... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోష్ హాజల్‌వుడ్ (4/33) ప్రత్యర్థిని పడగొట్టడంతో కీలక పాత్ర పోషించాడు.

సమష్టి ప్రదర్శన...

బెంగళూరుకు ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (23 బంతుల్లో 26; 4 ఫోర్లు), కోహ్లి శుభారంభం అందించడంతో ఆ జట్టు పవర్‌ప్లే ముగిసే సరికి 59 పరుగులు సాధించింది. హసరంగ తొలి ఓవర్లోనే సాల్ట్‌ను అవుట్ చేసి తొలి వికెట్ అందించాడు. ఆ తర్వాత వచ్చిన పడిక్కల్ మరింత దూకుడుగా ఆడాడు. మరోవైపు కోహ్లి... సందీప్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి 32 బంతుల్లో అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. అనంతరం వరుసగా పరాగ్, దేశ్‌పాండే వేసిన రెండు ఓవర్లలో కోహ్లి, పడిక్కల్ కలిసి 5 భారీ సిక్స్‌లతో మొత్తం 37 పరుగులు రాబట్టారు. ఆ తర్వాత 11 బంతుల వ్యవధిలో 7 పరుగులు మాత్రమే చేసిన జట్టు కోహ్లి, పడిక్కల్, పాటీదార్ (1) వికెట్లు కోల్పోయింది.

జైస్వాల్ దూకుడు...

భారీ ఛేదనలో రాజస్తాన్ ఇన్నింగ్స్ జోరుగా మొదలైంది. తొలి బంతికే సిక్స్ కొట్టిన జైస్వాల్... దయాళ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదడంతో మొత్తం 18 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత హాజల్‌వుడ్ ఓవర్లోనూ అతను వరుసగా మూడు ఫోర్లు బాదాడు. రెండు సిక్స్‌లతో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ (16) ఎక్కువ సేపు నిలవలేదు. అనంతరం హాజల్‌వుడ్ ఓవర్లో వరుసగా 4, 4, 6 కొట్టిన జైస్వాల్ తర్వాతి బంతికి వెనుదిరిగాడు. పవర్‌ప్లేలో రాయల్స్ 72 పరుగులు రాబట్టడం విశేషం. ఆ తర్వాత మరో రెండు ఓవర్లు నితీశ్ రాణా (22 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్), రియాన్ పరాగ్ (10 బంతుల్లో 22; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిని ప్రదర్శించడంతో 49 బంతుల్లోనే స్కోరు 100 పరుగులకు చేరింది. అయితే ఆ తర్వాత ఆర్‌సీబీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో రాయల్స్‌ను నిలువరించడంలో సఫలమైంది.



హాజల్‌వుడ్, కోహ్లి

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	8	6	2	12	1.104
ఢిల్లీ	8	6	2	12	0.657
బెంగళూరు	9	6	3	12	0.482
ముంబై	9	5	4	10	0.673
పంజాబ్	8	5	3	10	0.177
లక్నో	9	5	4	10	-0.054
కోల్‌కతా	8	3	5	6	0.212
రాజస్తాన్	9	2	7	4	-0.625
హైదరాబాద్	8	2	6	4	-1.361
చెన్నై	8	2	6	4	-1.392

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × హైదరాబాద్
వేదిక: చెన్నై
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) హెట్‌మైర్ (బి) హసరంగ 26; కోహ్లి (సి) రాణా (బి) ఆర్చర్ 70; పడిక్కల్ (సి) రాణా (బి) సందీప్ 50; టిమ్ డేవిడ్ (రనౌట్) 23; పాటీదార్ (సి) జురేల్ (బి) సందీప్ 1; జితేశ్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1-61, 2-156, 3-161, 4-163, 5-205. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-33-1, ఫారుఖీ 3-0-30-0, తుషార్ దేశ్‌పాండే 2-0-36-0, సందీప్ శర్మ 4-0-45-2, హసరంగ 4-0-30-1, పరాగ్ 3-0-30-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) షెఫర్డ్ (బి) హాజల్‌వుడ్ 49; వైభవ్ (బి) భువనేశ్వర్ 16; రాణా (సి) భువనేశ్వర్ (బి) కృనాల్ 28; పరాగ్ (సి) జితేశ్ (బి) కృనాల్ 22; జురేల్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 47; హెట్‌మైర్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 11; శుభమ్ దూబే (సి) సాల్ట్ (బి) దయాళ్ 12; ఆర్చర్ (సి) పాటీదార్ (బి) హాజల్‌వుడ్ 0; హసరంగ (రనౌట్) 1; దేశ్‌పాండే (నాటౌట్) 1; ఫారుఖీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 194. వికెట్ల పతనం:** 1-52, 2-72, 3-110, 4-134, 5-162, 6-189, 7-189, 8-189, 9-191. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-50-1, యశ్ దయాళ్ 3-0-33-1, హాజల్‌వుడ్ 4-0-33-4, రొమారియో షెఫర్డ్ 1-0-15-0, సుయాశ్ శర్మ 4-0-31-0, కృనాల్ పాండ్యా 4-0-31-2.

పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవు

బీసీసీఐ పునరుద్ఘాటన



బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ క్రికెట్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లపై ఉన్న నిషేధం ఇక ముందు కూడా కొనసాగుతుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవని ఆయన పునరుద్ఘాటించారు. భారత్, పాక్ మధ్య 2013లో చివరిసారిగా ద్వైపాక్షిక సిరీస్ జరిగింది. అయితే ఆ తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు బాగా దెబ్బ తినడంతో ఆ తర్వాత ఎలాంటి సిరీస్‌ను నిర్వహించలేదు. ఐసీసీ టోర్నీల్లో మాత్రం రెండు జట్లూ తలపడుతూ వస్తున్నాయి. తాజాగా కశ్మీర్‌లోని పహల్గాంలో పాక్ తీవ్రవాదుల చేతుల్లో 26 మంది భారత పర్యాటకులు మరణించిన నేపథ్యంలో క్రికెట్ మ్యాచ్‌లపై మళ్లీ చర్చ మొదలైంది. 'పాక్‌తో క్రికెట్ సిరీస్‌ల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మేం పూర్తిగా కట్టుబడి ఉన్నాం. వారు చెప్పిందే మేం వింటాం. కాబట్టి ఇకపై కూడా పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడే అవకాశం లేదు. ఐసీసీతో ఒప్పందాల కారణంగానే వేర్వేరు టోర్నీల్లో ఆ జట్టుతో తలపడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై అవగాహన ఉన్న ఐసీసీ కూడా ఈ విషయాన్ని గమనిస్తోంది. ఇకపై ఏదైనా ఐసీసీ టోర్నీ వచ్చినప్పుడు తగిన విధంగా స్పందిస్తాం' అని రాజీవ్ శుక్లా వివరించారు. ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్తాన్ ఆతిథ్యం ఇచ్చినా... టీమిండియా అక్కడికి వెళ్లలేదు. తటస్థ వేదిక దుబాయ్‌లోని అన్ని మ్యాచ్‌లు ఆడింది. పాక్‌ను లీగ్ దశలో ఓడించడం సహా టోర్నీ చాంపియన్‌గా నిలిచింది.

భారత్‌లో పీఎస్‌ఎల్ కనిపించదు!

పాక్ బోర్డుకు చెందిన పాకిస్తాన్ ప్రీమియర్ లీగ్ (పీఎస్‌ఎల్) టోర్నీని భారత్‌లో ప్రసారం చేస్తున్న 'ఫ్యాన్ కోడ్' మొబైల్ స్ట్రీమింగ్ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గావ్ ఘటన నేపథ్యంలో భారత్‌లో ఇకపై పీఎస్‌ఎల్ టోర్నీ ప్రసారం చేయమని ప్రకటించింది. భారతీయుల మనోభావాలను గౌరవిస్తూ పీఎస్‌ఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లను ప్రసారం చేయరాదని నిర్ణయం తీసుకున్నట్లు 'ఫ్యాన్ కోడ్' వెల్లడించింది. మరోవైపు పీఎస్‌ఎల్ టోర్నీ కోసం పాకిస్తాన్‌లో ఉండి మ్యాచ్‌ల ప్రసారానికి సంబంధించిన వేర్వేరు సాంకేతిక విభాగాల్లో పని చేస్తున్న భారతీయులను వెనక్కి పంపాలని ఆ దేశ ప్రభుత్వం కూడా నిర్ణయించింది. భారత్‌కు చెందిన దాదాపు రెండు డజన్ల మంది పీఎస్‌ఎల్‌లో ఇంజినీర్లు, ప్రొడక్షన్ మేనేజర్లు, కెమెరామెన్‌లు, ప్లేయర్ ట్రాకింగ్ ఎక్స్‌పర్ట్‌లుగా పని చేస్తున్నారు. రెండు రోజుల్లోగా వీరంతా దేశం వీడాలని పాక్ ప్రభుత్వం ఆదేశించింది.

నల్లగొండ బాలసదన్‌కు ఇద్దరు బాలికలు



నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని కేజీబీవీలో గోగుల మనీష 9వ తరగతి, ఆంబోతు లక్ష్మి–8వ తరగతి చదువుతున్నారు. వారికి తల్లిదండ్రులు లేరు. వారిని తీసుకుపోయేందుకు ఇతరులెవరూ లేకపోవడంతో ఎప్పటిలాగే నల్లగొండలోని బాలసదన్ నిర్వాహకులు వారిని తీసుకెళ్లేందుకు వచ్చారు. బాలసదన్ ఎస్‌వో రాజేశ్వరికి పాఠశాల సిబ్బంది విద్యార్థినులను అప్పగించారు. తమకు అమ్మానాన్నలు లేకపోవడంతో తాము తమ ఇంటికి వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నాకు తల్లిదండ్రులు లేరు.. సంరక్షకులు లేరు: పూజ



నేను చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయా. తెలిసినవారు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో చేర్పించారు. అక్కడే పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేశా. తర్వాత ఆర్మూర్ మండలంలోని పెర్కిట్ కేజీబీవీలో గత సంవత్సరం ఏడో తరగతిలో చేరాను. ప్రస్తుతం పాఠశాలకు సెలవులు వచ్చాయి. నాకు తల్లిదండ్రులతో పాటు, సంరక్షకులు కూడా ఎవరూ లేక పోవడంతో తిరిగి బాలసదన్‌కే వెళ్తున్నా.

సెలవుల సంతోషం.. వీరికి దూరం



- గురువారం నుంచి గురుకులాలు కేజీబీవీలకు సెలవులు
- తమ తోటి పిల్లలను తల్లిదండ్రులు తీసుకెళ్తుంటే తల్లడిల్లిన విధి వంచితులు.. కంటతడి పెడుతూ బాలసదన్‌లకు వెళ్లిన వైనం.
- పలుచోట్ల ఇవే దయనీయ దృశ్యాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

వేసవి సెలవులొస్తున్నాయంటే విద్యార్థుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతుంటుంది. ఆటలు ఆడుకోవచ్చని, అమ్మానాన్నలు, స్నేహితులతో సరదాగా గడపొచ్చని, బంధువుల ఇళ్లకు వెళ్లవచ్చనే ఉద్దేశంతో సెలవుల కోసం ఎదురుచూస్తుంటారు. కానీ అమ్మా నాన్నలు.. ఆదరించే వారు లేని విద్యార్థుల పరిస్థితి వేరు. గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటూ, హాస్టళ్లలో ఉండే వారికి వేసవి సెలవులు సమీపిస్తున్నాయంటే దిగులు మొదలవుతుంది. బుధవారం సాయంత్రం వీరికి ఇదే పరిస్థితి ఎదురయ్యింది. గురువారం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడంతో ఇలాంటి బాలలంతా బాలసదన్‌లకు చేరుకున్నారు.

అమ్మానాన్నలు లేక బంధువులు ఆదరించక..

అమ్మా నాన్నలు చిన్నతనంలోనే వివిధ కారణాలతో చనిపోవడంతో, బంధువులు బాలసదన్‌లో చేర్పించడంతో వారి వయసుకు అనుగుణంగా బాలికలనైతే కేజీబీవీల్లో, బాలురను సంక్షేమ గురుకులాల్లో ప్రభుత్వం చదివిస్తోంది. సెలవుల్లో వీరంతా తాము ఎక్కడ ఏ బాలసదన్‌లో ఉంటున్నారో అక్కడికే వెళ్లిపోవాల్సి ఉంటుంది. మళ్లీ స్కూళ్లు తెరిచాకే వారు హాస్టళ్లకు తిరిగి వచ్చేందుకు వీలవుతుంది. వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం రాష్ట్రంలో అలాంటి విద్యార్థులంతా తమ తమ బాలసదన్‌లకు చేరుకున్నారు.

ఆవేదనలో అనాథ విద్యార్థులు

హాస్టళ్లలో ఉన్న ఇతర పిల్లలను వారి అమ్మానాన్నలు వచ్చి తీసుకెళుతుంటే దీనంగా చూడటం ఈ అనాథ పిల్లల వంతయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని గురుకులాలు, కేజీబీవీల్లో ఇలాంటి దృశ్యాలు కన్పించాయి. తమ కోసం ఎవరూ లేరనే ఆవేదన కొంచెం ఎదిగిన పిల్లల్లో స్పష్టంగా కన్పించింది. అప్పటివరకు స్కూల్లో చదువుకుంటూ, హాస్టళ్లలో తోటి విద్యార్థులతో సరదాగా గడిపిన వీరంతా బిక్క మొహాలు వేయడం ఇతర పిల్లల తలిదండ్రులను కదిలించింది. ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి వారిని ఆవేదనకు గురి చేసింది. తమ పిల్లలు వారికి ఉత్సాహంగా బై బై చెబుతుంటే వారి గుండెలు బరువెక్కాయి. ఈ సందర్భంగా కొందరు అనాథ పిల్లలు కంట తడి పెట్టడంతో తోటి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అక్కడి సిబ్బంది, బాలసదన్‌ల నిర్వాహకులు కూడా కంట తడి పెట్టారు. నిర్మల్ జిల్లాలో భైంసా మండల కేంద్రంలో వేర్వేరు స్కూళ్లలో చదువుతున్న ముగ్గురు పిల్లలకు సెలవులు వచ్చినా.. అమ్మానాన్నలు లేక, తీసుకెళ్లేవారు లేక సెలవుల్లోనూ వేర్వేరు ప్రాంతాల్లో ఉండి కలుసుకోలేని పరిస్థితి కదిలించింది. అయితే తల్లిదండ్రులు లేని కొందరు విద్యార్థులను వారి సంరక్షకులుగా ఉన్న బంధువులు తీసుకెళ్లడం కన్పించింది.



పూజశ్రీ

అక్కా, తమ్ముడు, చెల్లి.. తలోచోట...

నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన ఓ మహిళ తన భర్తతో విడిపోయి కొన్నేళ్లుగా ఒంటరిగా ఉంటోంది. ఆమెకు ఇద్దరు కూతుళ్లతో పాటు ఓ కుమారుడు ఉన్నారు. ఆ మహిళ ఓ వ్యక్తితో సహజీవనం చేస్తుండగా కొద్దిరోజుల క్రితం వీరిద్దరు దొంగతనం కేసులో అరెస్టయ్యారు. దీంతో పిల్లలు దిక్కులేని వారయ్యారు. పెద్దకూతురు స్థానిక కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. మరో కుమార్తె కుబీర్ ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కుమారుడు వివేకానంద ఆవాసంలో 3వ తరగతి చదువుతున్నాడు. అయితే వేసవి సెలవులు వచ్చినా ఇంటికి వెళ్లలేని పరిస్థితి ఈ ముగ్గురు పిల్లలది. ఓ బాలిక నిర్మల్ బాలసదన్‌కు వెళ్లగా, మరో బాలిక కేజీబీవీ సమ్మర్ క్యాంపు ఉండటంతో అక్కడే ఉండిపోయింది. బాలుడు తాను చదువుతున్న వివేకానంద ఆవాసంలోనే ఉంటున్నాడు. ఇలా వీరు ముగ్గురూ సెలవుల్లోనూ వేర్వేరు చోట్లే ఉండాల్సి వచ్చింది.



వర్షిత



శ్రీనివాస బాలాజీ





సింహంతో పోరాటం.. సినిమాల్లో గ్రాఫిక్కులతో అయితే ఈజీనే..

మరి అప్పట్లో రోమన్ సామ్రాజ్యంలో నిజంగానే సింహాలు, పులులతో పోరాడే గ్లాడియేటర్లు ఉండేవారట. అలాంటి సన్నివేశాలు మనం 'గ్లాడియేటర్'సినిమాలోనూ చూశాం. అదంతా నిజమేనా? గ్లాడియేటర్లు నిజంగానే సింహాలతో పోరాడారా? దీనికి సంబంధించి తొలిసారిగా పురావస్తు ఆధారం ఒకటి ఇంగ్లండ్‌లోని యార్క్ నగరంలో లభ్యమైంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని రోమన్లు పాలించేవారు. అక్కడి ఓ సమాధిలో 1800 ఏళ్ల క్రితం నాటి ఓ గ్లాడియేటర్ అస్తిపంజరాన్ని పరిశీలించినప్పుడు అతడి తుంటి ఎముక మీద సింహం పళ్ల గాట్లు, గట్టిగా కొరికినట్లు ఆధారాలు లభించాయని యార్క్ వర్సిటీ పరిశోధకులు తెలిపారు. అతడి వయసు 25–35 ఏళ్ల మధ్య ఉండొచ్చని.. బలిష్టంగా ఉండి.. పలు మానిన గాయాల గుర్తులు కలిగి ఉన్నాడని చెప్పారు. అయితే.. సింహం చేసిన గాయం మానలేదని.. దాని వల్లే అతడు మరణించి ఉంటాడని వారు తెలిపారు.



ఇద్దరు వధువులు.. ఒక వరుడు

వివాహం చేసుకునేందుకు అమ్మాయిలు దొరక్క చాలా మంది యువకులు 'పెళ్లి కాని ప్రసాద్‌లు'గా మిగిలిపోతున్నారు. కొందరు ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకుంటున్నారు. ఒక వైపు పరిస్థితులు ఇలా ఉంటే.. మరో వైపు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ గిరిజన యువకుడు ఇద్దరు యువతులతో ప్రేమాయణం నడిపి, ఇద్దరినీ ఒకే మండపంలో వివాహం చేసుకున్నాడు. జైనూర్ మండలం అడ్డెసరాకు చెందిన ఆత్రం రంభబాయి, భాద్రుషావ్ దంపతుల కుమారుడు ఆత్రం చత్రుషావ్. అదే గ్రామానికి చెందిన సెడ్మకి సోమిత్రబాయి, భీంరావ్‌ల కుమార్తె జంగుబాయి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన గోడం రంభబాయి, యాదోరావ్ కుమార్తె సోన్‌దేవితో చత్రుషావ్‌కు పరిచయం ఏర్పడింది. వీరిద్దరి మధ్య ఏడాదిగా ప్రేమాయణం సాగుతోంది. విషయం తెలుసుకున్న జంగుబాయి రాయిసెంటర్‌ను ఆశ్రయించింది. రాయిసెంటర్ పెద్దలు 15 రోజుల క్రితం మూడు కుటుంబాలతో చర్చించారు. యువతులిద్దరూ చత్రుషావ్‌తో కలిసి ఉండేందుకు ఒప్పుకున్నారు. దీంతో గురువారం బంధువుల సమక్షంలో వరుడి స్వగృహంలో వీరికి వివాహం జరిపించారు. కాగా, ఇటీవల ఇదే జిల్లాలో సిర్పూర్(యూ) మండలం గుంనూర్ (కె)కు చెందిన ఓ యువకుడు కూడా ఇద్దరు యువతులను పెళ్లి చేసుకోవడం తెలిసిందే.

– జైనూర్

క్లుప్తంగా...



డ్వాక్రా సభ్యులే హమాలీలు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): హమాలీల కొరతతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారే హమాలీలుగా మారుతున్నారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట, అన్నారం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్నారు. కాగా, హమాలీల కొరతతో కొనుగోళ్లు సాగక ధాన్యపు రాశులు పేరుకుపోతున్నాయి. దీంతో మహిళా సంఘాల సభ్యులు హమాలీలుగా మారి ధాన్యం తూకాలను ప్రారంభించారు. ఈ విషయం తెలియడంతో డీఆర్‌డీవో సురేందర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. హమాలీలను ఏర్పాటుచేసి కొనుగోలు ప్రక్రియను వారం, పది రోజులలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఏరో స్పేస్ హబ్ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సతీశ్ రెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ ఏరో స్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ సలహాదారుగా డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీశ్ రెడ్డి గురువారం మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏరో స్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తామన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సతీశ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



'రైలింజన్‌లో ఏసీలు బిగించాలి'

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండంలో లోకో పైలట్లు నిరసనకు దిగారు. రైలింజన్‌లో 55 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, దీంతో తమ ఆరోగ్యాలు చెడిపోతున్నాయని, రైల్వే బోర్డు ఉత్తర్వుల ప్రకారం రైలింజన్లలో ఏసీలు బిగించాలని నినాదాలు చేశారు. ఆల్ ఇండియా రైల్వేలోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని క్రూలాబీల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా రామగుండం క్రూలాబీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్ స్టాఫ్ రామగుండం బ్రాంచ్ సెక్రటరీ సీహెచ్.రవి, లోకోపైలట్లు శ్రీకాంత్, లక్ష్మణ్, రంజిత్, సంజీవ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సుల్లో 'ఒకే దేశం- ఒకే సిలబస్'

కీలక సంస్కరణలకు శ్రీకారం



సాక్షి, అమరావతి: వైద్య రంగంలో వైద్యులకు అనుబంధంగా పనిచేసే సాంకేతిక, సహాయ పారామెడికల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకం. ఇంతటి కీలకమైన పారామెడికల్ విద్యలో కీలక సంస్కరణలకు కేంద్ర ఆరోగ్య శాఖ శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం మూస ధోరణిలో నడుస్తున్న పారామెడికల్ కోర్సుల్లో పాత శిక్షణ విధానాలకు స్వస్తి పలికి విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేలా పాఠ్యాంశాల్లో ప్రక్షాళన చేపడుతోంది. ఇందులో భాగంగా 10 పారామెడికల్ కోర్సులకు సామర్థ్య ఆధారిత పాఠ్యాంశాలను నేషనల్ ఎలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ ఆవిష్కరించింది. కొత్త కరిక్యులంలో (కొత్త పాఠ్య ప్రణాళిక) కోర్సుల సారాంశం, అర్హత ప్రమాణాలు, శిక్షణ పద్ధతులు, సంస్థాగత మౌలిక సదుపాయాలు దేశం మొత్తం ఒకే విధంగా ఉండేలా స్పష్టమైన, స్థిరమైన మార్గదర్శకాలను రూపొందించారు. ఈ మార్గదర్శకాలు దేశం మొత్తం 2026 నుంచి అమలులోకి రానున్నాయి. 10 కోర్సుల్లో (ఫిజియోథెరఫీ, సైకాలజీ బిహేవియరల్ హెల్త్, ఆప్టోమెట్రీ, న్యూట్రీషన్ డైటిక్స్, డయాలసిస్ థెరఫీ, రేడియో టెక్నాలజీ, మెడికల్ రేడియాలజీ ఇమేజింగ్ టెక్నాలజీ, అనస్తీషియా ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, ఫిజిషియన్ అసోసియేట్స్) కొత్త కరిక్యులంను ప్రవేశపెడుతున్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన సిలబస్ ఆధారంగా ప్రస్తుతం పారామెడికల్ కోర్సులను నిర్వహిస్తు న్నారు.

ఆరోగ్య బీమా అంతంతే..



భారతీయుల్లో హెల్త్ ఇన్సూరెన్స్‌పై నిర్లక్ష్యం

- అవగాహన ఉన్నవారిలో బీమా తీసుకుంటున్నది 23 శాతమే
- వీరిలోనూ 50 శాతం మంది రూ.5 లక్షల లోపే పాలసీ
- పాలసీ బజార్.కామ్ సర్వేలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య బీమా తీసుకునే విషయంలో భారతీయులు వెనకడుగు వేస్తున్నారు. ఆరోగ్య బీమా గురించి 83 శాతం మందికి అవగాహన ఉన్నా.. 23 శాతం మంది మాత్రమే హెల్త్ పాలసీలు తీసుకున్నారు. ఆరోగ్య బీమా లేని భారతీయుల్లో 75 శాతం కంటే ఎక్కువ మంది అనూహ్యంగా ఎదురయ్యే జీవన, ఆరోగ్య సంక్షోభాల వాస్తవ ఖర్చులపై ముందుచూపు లేక ఇబ్బందులు పడుతున్నారు. టర్మ్ ఇన్సూరెన్స్ వంటివి లేనివారిలో 87 శాతం మంది ఆర్థికంగా పడబోయే భారాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారు. 13 శాతం మంది మాత్రమే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇన్సూరెన్స్ అవసరాలను గుర్తిస్తున్నట్లు 'హౌ ఇండియా బైస్ ఇన్సూరెన్స్ 2.0'పేరిట 'పాలసీ బజార్ డాట్‌కామ్'సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది.

ఈ నివేదికలోని ముఖ్యాంశాలు

- భారతీయులు ఆరోగ్య సంరక్షణ వ్యయాలు, ఆకస్మిక ఖర్చులను భరించేందుకు సిద్ధంగా లేరు.
- దేశ జనాభాలో ఆరోగ్య బీమా లేనివారే అధికం. పాలసీదారుల్లోనూ సుమారు 75 శాతం మంది రూ.10 లక్షల కంటే తక్కువ కవరేజీ ఉన్న వారే. 48 శాతం మంది రూ.5 లక్షలు, అంతకంటే తక్కువ కవరేజీతో సరిపెట్టుకుంటున్నారు. దక్షిణ భారతదేశంలో ఈ సమస్య మరింత అధికంగా ఉంది. ఇక్కడ 66 శాతం పాలసీదారులు రూ 5 లక్షల అంతకంటే తక్కువ కవరేజీ కలిగి ఉన్నారు.
- పాలసీదారుల్లో 51 శాతం మంది క్యాన్సర్, కిడ్నీ మార్పిడి, గుండె జబ్బుల చికిత్సల ఖర్చు రూ.5 లక్షల కంటే తక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. 47.6 శాతం భారతీయులకు టర్మ్ ఇన్సూరెన్స్ ప్రయోజనాల గురించి తెలియదు.
- ఇప్పటికీ బంగారం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బీమా సంబంధిత పొదుపు పథకాలు, రియల్ ఎస్టేట్ వంటి సంప్రదాయ పెట్టుబడులు ఆధిపత్యం వహిస్తున్నాయి.
- బీమా తీసుకోనివారిలో దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక లేకపోవడం ఆందోళనకరంగా మారింది.
- చాలామంది తమ కుటుంబ అవసరాలను అంచనా వేసేటప్పుడు పిల్లల విద్య, వివాహం, రుణ బాధ్యతలు, జీవిత భాగస్వామి పదవీ విరమణ, ఆకస్మిక వైద్య ఖర్చుల వంటివాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు.

అవగాహన పెంచుతున్నాం

ఈ నివేదిక ఆధారంగా ప్రజల్లో ఆరోగ్య బీమాపై అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టాం. అత్యవసర చికిత్సలతో ఆర్థిక సంక్షోభం ఎదురైనపుడు ఆస్తులను అమ్మటం, అప్పు చేయటానికి బదులు ముందుగానే ఇన్సూరెన్స్ తీసుకోవటం మంచిది. అందరికీ ఆర్థిక భద్రత ఏర్పడేలా పాలసీలు, ఇతరత్రా సలహాల ద్వారా కష్టమర్లకు ప్రయోజనం కలిగేలా చూడాల్సి ఉంది.

– సర్బ్‌వీర్ సింగ్, జాయింట్ గ్రూప్ సీఈఓ, పీబీ ఫిన్‌టెక్.

హవాలా వ్యాపారులపై ఈడీ ఆకస్మిక దాడులు



సాక్షి, హైదరాబాద్: హవాలా వ్యాపారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ గతంలో నమోదు చేసిన.. ఫారిన్ సిగరెట్స్ స్మగ్లింగ్, ఫారిన్ కరెన్సీ, గుట్కా, పాన్‌మసాలా ముసుగులో సాగుతున్న హవాలా తరలింపు కేసులపై.. హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా ఆరా తీస్తోంది, ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్‌లో ఆకస్మిక దాడులు జరిపింది. మలక్‌పేట్, బేగంబజార్, సికింద్రాబాద్‌లోని 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ప్రముఖ గుట్కా, పాన్‌మసాలా వ్యాపారి సహా.. 13 మంది హవాలా ఏజెంట్ల ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు చేశారు. హవాలా వ్యాపారుల ఇళ్లలో పెద్ద మొత్తంలో డబ్బు గుర్తించినట్లు తెలిసింది. ఫారిన్ సిగరెట్ల స్మగ్లింగ్‌లో భారీ మొత్తంలో మనీలాండరింగ్ జరుగుతున్నట్టు ఈడీ ఆధారాలు సేకరించింది. సోదాలు శుక్రవారం కూడా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. తనిఖీలు ముగిసిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఈడీ అధికారులు తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఈత వనం.. గీత ఘనం

ఈత కల్లుకు చిరునామా అంతర్గాం
- ఎనిమిదెకరాల్లో దాదాపు 5 వేల చెట్ల పెంపకం
- ఉపాధి పొందుతున్న గీత కార్మికులు


అంతర్గాంలో గీత కార్మికులు పెంచిన ఈత చెట్లు

జగిత్యాల అగ్రికల్చర్: సాధారణంగా గ్రామాల్లో ఈత, తాటి చెట్ల కల్లు అమ్ముకుని గీత కార్మికులు జీవనోపాధి పొందుతుంటారు. కాగా, బీరు, బ్రాందీ, విస్కీ వంటి మద్యం గ్రామాల దరి చేరడంతో.. గీత కార్మికుల ఉపాధికి ఇబ్బందిగా మారింది. దీనికి తోడు, పల్లెల్లో ఈత, తాటి చెట్లు తగ్గుతుండటం.. కల్లు గీసే చెట్లకు రక రకాల తెగుళ్లు, పురుగులు సోకడంతో కల్లు పారడం లేదు, మరికొన్ని చోట్ల కల్లు పారే చెట్లే చనిపోతుండటం, గీత కార్మికుల ఉపాధికి దెబ్బగా మారింది. దీంతో, అయా గ్రామాల్లోని ఈత, తాటి చెట్లను పంచుకుంటే.. ఒక్కొక్క కుటుంబానికి నాలుగైదు ఈత, తాటి చెట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామ గీత కార్మికులు వినూత్న పద్ధతిలో ఈత చెట్లను పెంచుతున్నారు. దానిద్వారా ఒకవైపు ఈత నీర, మరో వైపు ఈత కల్లు గీస్తూ.. మిగతా గ్రామాల గీత కార్మికులకు ఆదర్శంగా నిలిచారు. అంతర్గాం ఈత వనాన్ని గత ప్రభుత్వంలోని మంత్రులతో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ఎక్సైజ్ అధికారులు సందర్శించడం విశేషం.

డ్రిప్ ద్వారా ఈత వనం పెంపకం

అంతర్గాం గీత కార్మికులందరూ ఐకమత్యంతో 100 మంది సభ్యులు దాదాపు 8 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసారు. కానీ ఆ భూమి ఏళ్ల తరబడి వృధాగా పడిఉంది. గ్రామంలోని ఈత, తాటి చెట్లు చాలా వరకు చనిపోయి ఉపాధికి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జితేందర్ రావు నేతృత్వంలో గీత కార్మికులు వివిధ ప్రాంతాల్లోని ఈత వనాలను సందర్శించి, వృధా భూమిలో సంగారెడ్డి నర్సరీ నుండి దాదాపు 5 వేల ఈత మొక్కలను తెచ్చి నాటారు. వీటికి డ్రిప్ ద్వారా నీరు, పేడ వంటి సేంద్రియ ఎరువులను అందించారు. ఏటా ఈత చెట్ల కొమ్మలు భూమి మీదకు రాకుండా, ప్రూనింగ్ చేసారు. ఐదేళ్లలోనే ఈతవనం ఏపుగా పెరిగి, కల్లు గీతకు వచ్చింది.

ఈత కల్లుకు భలే డిమాండ్

ఈత వనంలోని దాదాపు 4 వేల చెట్ల వరకు కల్లు గీతకు రావడంతో, సంఘంలోని సభ్యులు కల్లు గీతకు తలా కొన్ని చెట్లు పంచుకున్నారు. గీత కార్మికులు తమకు కేటాయించిన చెట్ల నుంచి రోజూ కల్లు వచ్చేలా, కొన్ని చెట్లను ఒకరోజు, మరికొన్ని చెట్లను మర్నాడు గీయాలని నిర్ణయించుకున్నారు. రోజూ ఒక్కొక్క చెట్టుకు కనీసం 2 లీటర్ల కల్లు పారేలా చూసుకుంటున్నారు. రోజుకు కనీసం 1000–1500 లీటర్ల కల్లును ఉత్పత్తి చేస్తున్నారు. ఆ కల్లును అక్కడికక్కడే విక్రయిస్తూ మంచి ఉపాధి పొందుతున్నారు. ఈతవనం ఎక్కువగా ఉండటం, ప్రస్తుతం కల్లు కూడా ఎక్కువగా పారుతుండటంతో, జగిత్యాల చుట్టుపక్క గ్రామాల ప్రజలు ఉదయాన్నే కల్లు కోసం అంతర్గాం పరుగెత్తే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు, కల్లు ఉత్పత్తి ఎక్కువై, అమ్మలేని పరిస్థితుల్లో ప్రభుత్వ సహకారంతో పల్లె కల్లు పట్నానికి పంపాలనే ఆలోచనలు సైతం చేస్తున్నారు. కల్లు ద్వారా అదాయం అంతంతే వస్తుండటంతో, గీత కార్మికులు సమావేశమై ఈతనీరాను సైతం అమ్మాలని యోచిస్తున్నారు.

ఈత నీరా వైపు గీతన్నల చూపు

అంతర్గాంలో గీతన్నలు గీసిన కల్లు ద్వారా అయితే లీటర్‌కు రూ.50–రూ.60 వరకు వస్తుంది, ఈత నీరా అయితే లీటర్ రూ.100 వరకు అమ్ముతున్నారు. వేసవిలో చల్లదనానికి ఈతనీరాను తాగుతుంటారు. కొత్త కుండల్లో ఈతనీరాను గీస్తారు. ప్రభుత్వం సైతం అనుమతి ఇవ్వడంతో, నాలుగేళ్ల క్రితం, జిల్లా ఎక్సైజ్ అధికారులు ఈతనీరాను ప్రారంభించారు. పదిహేను లీటర్లకు పైగా ఆర్డర్ ఇస్తే.. ఇంటికి సైతం పంపగలమంటూ గీత కార్మికులు చెబుతున్నారు. ఈత నీరాను తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా ఉపయోగాలు ఉన్నాయంటూ వైద్యులు సైతం స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం సైతం ప్రాధాన్యం ఇస్తుండటంతో, జిల్లా కేంద్రంలో ఉదయం వేళల్లో ఓ స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించాలని కూడా యోచిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లలో ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేయాలని ప్రచారం చేయాలని గీతన్నలు భావిస్తున్నారు.


ఈత చెట్టు నుండి కల్లు తీస్తున్న గీత కార్మికుడు



ఈతకల్లుతో ఉపాధి

ఈత కల్లు ద్వారా ఉపాది పొందుతూనే, మరో వైపు ఈత నీరా అమ్మకాల ద్వారా అదాయం పొందాలనుకుంటున్నాం. కల్లు చాలా గ్రామాల్లో దొరికే అవకాశం ఉన్నందున, అంతర్గాంకు ఈత నీరా బ్రాండ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది కావడంతో, వేసవిలో ఈత కల్లుకు డిమాండ్ ఎక్కువ. ఈత నీరాను ఆడ, మగ, పిల్లలు భేదం లేకుండా ప్రతి ఒక్కరు తాగవచ్చు.

– బాలగౌడ్, గీత కార్మిక సంఘం నేత, జగిత్యాల



ఇతర గ్రామాలకు ఆదర్శం

అంతర్గాం గౌడ కులస్తులను మెప్పించి, ఒప్పించి ఆధునిక పద్ధతిలో ఈతవనం పెంచాం. ఇప్పుడు, గౌడ కులస్తులకు అదాయ వనరుగా మారింది. దీనికితోడు, ఈతవనం ఇతర గ్రామాలకు ఆదర్శంగా మారింది. ఇప్పటికే, రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులతో పాటు పలు గ్రామాల గౌడ కులస్తులు వచ్చి చూసి వెళ్తున్నారు.

– జితేందర్‌రావు, ఈతవనం సృష్టికర్త, అంతర్గాం

వెల్‌డన్ పోలీస్...


ఇండియా జస్టిస్ రిపోర్ట్ - 2025 లో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. డీజీపీ జితేందర్ అందించిన ఆ నివేదికను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఈ ఘనత సాధించినందుకు పోలీసులను అభినందించారు.

టైరు పేలుతుంది.. జాగ్రత్త..!

- వేసవి వేడికి టైర్లపై అదనపు ఘర్షణ
- పాత టైర్లు అధిక ఒత్తిడికి పేలే ప్రమాదం
- దూర ప్రయాణాల్లో ప్రమాదం అధికం
- టైర్లను పరీక్షించాకే ప్రయాణం చేయండి
- పాత టైర్లను మార్చివేయటమే ఉత్తమం



సాక్షి, స్పెషల్ డెస్క్: వేసవికాలం వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. ఒకవైపు పైనుంచి ఎండ.. మరోవైపు రోడ్డు వేడి.. బైకో, కారో తీసుకొని రోడ్డుపైకి వెళ్తే టైర్లు ఉన్నట్టుంది పేలిపోయే ప్రమాదం ఈ సమయంలో అధికంగా ఉంటుంది. పాత టైర్లకైతే ఈ ప్రమాదం మరీ ఎక్కువ. ప్రతి వేసవిలోనూ టైర్లు పేలి రోడ్డు ప్రమాదం జరిగిందన్న వార్తలు చూస్తూనే ఉంటాం. అందుకే ఈ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ప్రయాణాలకు ముందు వాహన టైర్ల పటుత్వం కచ్చితంగా తెలుసుకోవాలి. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు టైర్ల లోపల గాలిపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తాయి. దీంతో టైర్లు వేడెక్కి సమస్యలు సృష్టిస్తుంటాయి.

వేసవిలోనే ఎందుకంటే..

టైర్ల వయస్సు: అరిగిపోయిన పాత టైర్లు అధిక ఉష్ణోగ్రతల సమయంలో ఒత్తిడిని తట్టుకోలేకపోవచ్చు. అవి పగిలిపోయే అవకాశం అధికం.

టైర్ ప్రెజర్: టైర్ పగిలిపోవడానికి అత్యంత సాధారణ కారణాలలో ఒకటి ఒత్తిడి. తక్కువగా గాలి ఉన్నప్పుడు డ్రైవింగ్ చేస్తుంటే టైర్ పైకి కిందికి బౌన్స్ అవుతుంది. దీంతో అదనపు ఘర్షణ ఏర్పడుతుంది. వేసవి వేడితో ఈ అదనపు ఘర్షణ తోడవడం వల్ల టైర్లు బలహీనపపడి పగిలిపోతాయి. ఈ సమస్య వేసవిలో మరీ ఎక్కువ.

అధిక వేగం: టైర్లు పగిలిపోవడానికి మరొక సాధారణ కారణం అధిక వేగంతో ఎక్కువ దూరం ప్రయాణించటం. దీనివల్ల వేడి జనించి టైర్లపై ఒత్తిడి పెరుగుతుంది. వాహనం బరువు, రోడ్డు ఉపరితలం నుంచి వచ్చే వేడితో టైర్లు అధిక ఒత్తిడికి గురై పగిలిపోవచ్చు.

లోపభూయిష్ట టైర్లు: టైర్లు అరిగిపోయాయా, దెబ్బతిన్నాయా? అని నిర్ధారించుకోవాలి. ఎల్లప్పుడూ వాటి నాణ్యతను తనిఖీ చేయాలి. కోతలు, పగుళ్లు, ఉబ్బెత్తులు లేదా దెబ్బతిన్న టైర్లు వేసవిలో అధిక ఒత్తిడి కారణంగా పగిలిపోతాయి.

వాహన బరువు: వాహనం బరువు ఎక్కువ లేకుండా జాగ్రత్తపడాలి. తద్వారా వేసవిలో టైర్లపై ఒత్తిడిని తగ్గించడంతోపాటు ఇంధన సామర్థ్యం మెరుగ్గా ఉంటుంది.

టైర్ పగిలిపోతే: ప్రశాంతంగా ఉండాలి. వాహనంపై నియంత్రణతో ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ భయపడకూడదు. భయాందోళనకు గురైతే వాహనంపై నియంత్రణ కోల్పోవచ్చు.

భారీ బ్రేకింగ్‌ను నివారించాలి: హఠాత్తుగా బ్రేక్ వేయాలనుకున్నప్పటికీ పేలిన టైర్‌పై ఎక్కువగా బ్రేక్ వేస్తే వాహనంపై నియంత్రణ కోల్పోవచ్చు. మంచు మీద డ్రైవింగ్ చేస్తున్నట్టు ఊహించుకొని సున్నితంగా బ్రేక్స్ వాడాలి. ముందు వైపున్న టైర్లు పగిలిపోతే బ్రేక్ అస్సలు ఉపయోగించవద్దు. వెళ్లాల్సిన దిశలో వాహనాన్ని నెమ్మదిగా నడిపించాలి. ట్రాఫిక్‌లో ఉన్నా, ఇతర వాహనదారులు చుట్టూ ఉన్నా సమస్య ఉందని వారికి తెలిసేలా హజార్డ్ లైట్లను ఆన్ చేయాలి.

యాక్సిలరేటర్‌ని ఉపయోగించాలి: బ్రేక్స్‌కు బదులు యాక్సిలరేటర్‌ను ఉపయోగించాలి. స్టీరింగ్‌ను గట్టిగా పట్టుకోవాలి. తద్వారా వాహనాన్ని సరళ రేఖలో నడిపించగలుగుతారు.

సురక్షిత ప్రదేశంలో: వాహనాన్ని సురక్షిత ప్రదేశం వైపు తీసుకెళ్లి ఆపాలి. హజార్డ్ లైట్లను ఉంచడం మర్చిపోవద్దు. రిఫ్లెక్టివ్ వార్నింగ్ ట్రయాంగిల్ పరికరాలు ఉన్నట్టయితే వాహనం ముందు, వెనుక వైపు ఉంచాలి.

తప్పనిసరి జాగ్రత్తలు:
- అరిగిన, కాలం చెల్లిన టైర్లను తక్షణమే మార్చుకోవాలి.
- టైర్లు పరీక్షించి ఎక్కడ లోపం ఉన్నా సరిదిద్దుకోవాలి.

మండుతున్న ఉష్ణోగ్రతలకు జాగ్రత్తలు తప్పనిసరి

- వడదెబ్బ, డీహైడ్రేషన్ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలంటున్న వైద్యులు
- తగినన్ని మంచినీళ్లతోపాటు ఓఆర్ఎస్, కొబ్బరినీరు వంటి పానీయాలు తాగాలని సూచన
- అత్యవసరమైతే తప్ప ఉదయం, మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లొద్దని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వేసవి ఉష్ణోగ్రతలు గత కొన్ని రోజులుగా ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40–42 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. మే నాటికి 46–48 డిగ్రీల వరకు చేరుకోవచ్చని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా సింగరేణి కాలరీస్‌తోపాటు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ వంటి జిల్లాల్లో వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వేసవికి అనుగుణంగా నడుచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వేసవి తీవ్రత..

తెలంగాణ వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాష్ట్రంలో ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–3 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సింగరేణి ప్రాంతంలోని బొగ్గు గనుల సమీపంలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు చేరుకుంటున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, తేమ శాతం తక్కువగా ఉండటం వల్ల వడగాడ్పులు తీవ్రతరం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సింగరేణి కార్మికులతోపాటు రోజువారీ కూలీలు, రైతులు, చిరువ్యాపారులు, నిర్మాణరంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఉష్ణోగ్రతలు అసాధారణ రీతిలో పెరగడం వల్ల వడదెబ్బ, డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఎక్కువ ఉందని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తత అవసరం

ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావడం తగ్గించాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరైతే గొడుగు, టోపీ, సన్‌స్క్రీన్ లేదా తడి గుడ్డ ఉపయోగించడం ద్వారా ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందాలని చెబుతున్నారు. టూవీలర్లపై వెళ్లే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వదులైన, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలంటున్నారు.

డీహైడ్రేషన్‌కు గురికాకుండా ...

వేసవిలో తాగిన నీరు తాగినట్టే చెమట రూపంలో వెళ్లిపోతుంది. రోజుకు 3–4 లీటర్ల నీరు తాగడం శ్రేయస్కరం. దాహం లేకపోయినా గంటకోసారి నీటిని తాగుతూ ఉండాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెమట ఎక్కువగా పట్టినప్పుడు ఓఆర్ఎస్, ఉప్పు–చక్కెర కలిపిన నీరు తాగడం వల్ల ఉపశమనం పొందవచ్చు. కూల్‌డ్రింక్స్, బీర్లు, చికెన్, మాంసం తినడం వేసవిలో వేడిని ఇంకా పెంచుతాయి. రోజుకు 2–3 సార్లు కొబ్బరినీరు తాగితే శరీరంలో ఎలక్ట్రొలైట్స్ సమతౌల్యంగా ఉంటాయి. కాఫీ, టీ, ఆల్కహాల్ శరీరంలో నీటిని తగ్గిస్తాయి కాబట్టి వాటి బదులు హెర్బల్ టీ, తాజా పండ్ల రసాలు తాగడం మేలు.

ఆహారం ముఖ్యం

తేలికైన, నీరు ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. పుచ్చకాయ, దోసకాయ, ఆరెంజ్, కీర దోస వంటివి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. అధిక ఉప్పు, కారం, వేయించిన ఆహారాలకు దూరంగా ఉండాలి. బదులుగా ఉడకబెట్టిన ఆహారం, సూప్‌లు, సలాడ్‌లు తీసుకోవాలి. గుండె జబ్బులు, మధుమేహం ఉన్న వాళ్లు నీటిని అధికంగా సేవిస్తూ ఎండల్లో తిరగడం తగ్గించాల్సి ఉంటుంది.



జాగ్రత్తలతోనే వేసవి నుంచి రక్షణ

వేసవిలో శరీరంలో నీటి శాతం, ఎలక్ట్రొలైట్లు తగ్గిపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. శరీర ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలు దాటినప్పుడు మెదడు వ్యాధులు, అవయవ వైఫల్యం ఏర్పడే అవకాశం ఉంటుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను శరీరం బ్యాలెన్స్ చేసుకొనేలా వ్యవహరించాలి. ఆహార నియమాలు పాటించాలి. అధిక ఎక్సర్‌సైజ్‌లు తగ్గించాలి.

– డాక్టర్ కిరణ్ మాదాల, ప్రొఫెసర్ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్, ఉస్మానియా కళాశాల

సిగ్నల్స్ వద్ద గ్రీన్ షేడ్ నెట్

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గ్రీన్ షేడ్ నెట్ ఏర్పాటు చేశారు. సిగ్నల్స్ వద్ద ఆగే వాహనదారులు ఎండకు ఇబ్బందిపడుతున్నారు. దీంతో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు జంక్షన్‌లలో తగిన వసతులు ఉన్న సిగ్నల్స్ వద్ద వాహనదారులకు ఎండ నుంచి రక్షణ కోసం గ్రీన్ షేడ్ నెట్ ఏర్పాటు చేస్తున్నారు. మొదటగా పట్టణంలోని ఎన్‌జీ కాలేజీ ఎదుట ఉన్న సిగ్నల్స్ వద్ద గురువారం గ్రీన్ షేడ్ నెట్ ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు వచ్చినా వాటికి తగలకుండా రోడ్డుకు రెండు వైపులా ఐరన్ బోర్డు ఏర్పాటు చేశారు.


నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కళాశాల జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్‌షేడ్ నెట్

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



బజ్జో బంగారు తల్లి..

మండుటెండలు.. దానికితోడు ఉక్కపోత.. పనికి వెళ్లిన భార్య ఇంకా రాలేదు.. పాల కోసం బిడ్డ ఎదురుచూస్తోంది. అందుకే ఆ తండ్రి చెట్టుకి ఊయల కట్టాడు. బజ్జో తల్లీ.. అంటూ చిన్నారిని ఊయలలో ఊపుతూ.. లాలిస్తూ కనిపించాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పంట వ్యర్థాలను ఏరుతున్న కూలీలు



వ్యర్థాలను తగలబెడుతున్న దృశ్యం





సహపంక్తి భోజనం చేస్తున్న కూలీలు

మరో ఆశల సాగు..

రబీలో నష్టపోతే ఖరీఫ్.. ఖరీఫ్ ముంచితే రబీ.. ఏటా అన్నదాతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూనే ఉంటారు. ఈ ఏడాది రబీ పంటలు అంతంత మాత్రంగానే చేతికందడంతో ఖరీఫ్‌పై కోటి ఆశలతో సాగుకు సిద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లా కల్లూరు, కోడుమూరు మండలాల్లో పంటల వ్యర్థాలను, కంప చెట్లను తొలగించి పొలాలను రూపు చేసుకునే పనుల్లో రైతన్నలు నిమగ్నమయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా...

డాక్టర్ ప్రభావతి పిటిషన్‌పై విచారణ వాయిదా

మే 7న విచారిస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఆమె పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వ్యక్తిగత కారణాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా విచారణకు హాజరుకాలేకపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ పిటిషన్‌ను మే 7న విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. కొద్దిసేపటి తర్వాత లూథ్రా కోర్టుకు హాజరుకావడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.

ఏఎస్సై కుటుంబానికి రూ.కోటి బీమా పరిహారం

సాక్షి, అమరావతి : ప్రమాదంలో మృతిచెందిన ఏఎస్సై డి.కొండయ్య కుటుంబానికి ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజ్ కింద రూ.కోటి పరిహారాన్ని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అందించారు. బాపట్ల ఏఎస్సైగా పనిచేస్తూ కొండయ్య గత ఏడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ నేపథ్యంలో కొండయ్య సతీమణి పి.పాపారాణికి మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ గుప్తా గురువారం రూ.కోటి చెక్కును అందించారు.

ఏరో స్పేస్ హబ్ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సతీశ్ రెడ్డి

సాక్షి, అమరావవతి: రాష్ట్ర ఏరో స్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ సలహాదారుగా డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీశ్ రెడ్డి గురువారం మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తామన్నారు.

ఎంఎస్‌ఎంఈలు ఎగుమతి అవకాశాలు అందుకోవాలి

ఏపీఎండీసీ చైర్మన్ టి.శివశంకర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలు ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఏపీఎండీసీ చైర్మన్ టి.శివశంకర్ కోరారు. గురువారం ఏపీఎంఎస్‌ఎంఈడీసీ, భారత ఎగుమతి సంస్థల సమాఖ్య సంయుక్తంగా విజయవాడలో రెండు రోజుల రివర్స్ బయ్యర్–సెల్లర్ మీట్‌ను ఏర్పాటు చేశాయి. ఇందులో శివశంకర్ మాట్లాడుతూ దేశీయ ఎగుమతుల్లో ఎంఎస్‌ఎంఈలు ఎంతో కీలకమని, అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడం ద్వారా దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవాలని, దీనికి ఈ సమావేశం వేదికగా ఉపయోగపడుతుందన్నారు. 17 దేశాలకు చెందిన 25కుపైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు, 320కిపైగా ఎంఎస్‌ఎంఈలు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

సత్యసాయి జిల్లాలో సౌర విద్యుత్ ప్లాంట్లు

సాక్షి, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లాలో 2 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. మడకసిర మండలం హరేసముద్రం, బుల్లసముద్రం, ఉప్పర్లపల్లి, ఎర్రభూమనహల్లి, కులుమరి, మానూర్ గ్రామాల్లో ఈ ప్రాజెక్టులను నెలకొల్పేందుకు అవసరమైన భూమి, ఇతర సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించింది. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీచేశారు.

ఏపీ జెన్‌కో ఎండీ డిప్యుటేషన్ పొడిగింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) కె.వి.ఎస్.చక్రధరబాబు డిప్యుటేషన్‌ని మరో ఏడాది పాటు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. అనారోగ్య కారణాలతో ఆయన గత నెల 27 నుంచి ఈ నెల 14 వరకు తొలుత సెలవు పెట్టారు. అనంతరం దానిని ఈ నెల 24 వరకు పొడిగించారు. శుక్రవారం ఆయన తిరిగి విధుల్లో చేరాల్సి ఉంది. ఈ నెల 7వ తేదీతో ఆయన డిప్యుటేషన్ ముగియడంతో తాజాగా దాన్ని కొనసాగిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కూర్చున్నా.. పరిగెడుతున్నా..తింటున్నా..పడుకున్నా..సెల్ చెంతనే ఉండాల్సిందే. ఇది లేని జీవితాన్ని ఊహించడం కష్టసాధ్యంగా మారుతోంది. పిల్లలు పెద్దల ప్రమేయం లేకుండానే గేమ్‌లు ఆడుతున్నారు. తమకు కావాల్సిన ఆటలు డౌన్‌లోడ్ పెట్టుకుంటున్నారు. ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో మంచితోపాటు చెడు మిళితమై ఉండడం తోపాటు అతి వినియోగంతో అనర్థాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



చిన్నారి హల్ సెల్

సోషల్ మీడియాకు బానిసలవుతున్న విద్యార్థులు	పెరిగిన సోషల్ మీడియా వినియోగం	ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది లక్షలు దాటిన సెల్ ఫోన్ యూజర్లు	అతివాడకంతో ఆరోగ్య సమస్యలు తప్పవంటున్న వైద్యులు

పలమనేరు: స్మార్ట్‌ఫోన్ల వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎలాంటే.. ఒక నిమిషం చేతిలో సెల్ లేకుంటే బతకలేమన్నట్టుగా తయారయ్యారు నేటి విద్యార్థులతు, పిల్లలు, యువకులు. డ్రగ్స్‌కు బానిసైనట్టు స్మార్ట్‌ఫోన్ కారాగారంలో నేటి తరం బందీలుగా మారారు. ఇప్పుడు పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా స్మార్ట్ ఫోన్ల వాడకం విద్యార్థుల్లో ఎక్కువైంది. పిల్లాడు అన్నం తినాలంటే మొబైల్, బడికి రెడీ కావాలంటే మొబైల్, బడి నుంచి రాగానే సెల్‌ఫోన్ చేతిలో పెట్టాల్సిందే. పసిబిడ్డలు సైతం ఏడుపు ఆపాలంటే తల్లిపాలు పట్టడం కంటే చేతిలో సెల్ పెట్టగానే సైలెంట్ అవుతున్నారు. మొబైల్ లేకుంటే మనషులకు బుర్ర కూడా పనిచేయడం లేదు. మితిమీరిన సెల్ వాడకం మనిషి జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నా మార్పు రావడం లేదు. ఇప్పటికే చాలా మంది వారికి తెలియకనే మానసిక రోగుల్లా మారారు. ఇంకొందరు అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారిపోవడం తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది.

ఏటా15 శాతం పెరుగుతున్న సెల్ ఫోన్ వినియోగం

గత నాలుగేళ్లుగా సెల్‌ఫోన్ల వాడకం ఏటా 15 శాతం పెరుగుతున్నట్టు ట్రాయ్(టెలీఫోన్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) లెక్కలు చెబుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లను వాడేవారిలో రోజుకు సగటున యువత 4 గంటలు, విద్యార్థులు 2 గంటలు, గృహిణిలు 2 గంటలు, అధికారులు 1.30 నిమిషాలు, పిల్లలు గంటపాటు సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉదాహరణే తీసుకుంటే... 1990లో కీప్యాడ్ ఫోన్ల వాడకం మొదలైంది. తొలుత తిరుపతి, చిత్తూరు, కుప్పం, మదనపల్లెలో రిలయన్స్ మొబైల్ టవర్ల ద్వారా నెట్‌వర్క్‌ను అందిస్తూ సేవలను మొదలు పెట్టారు. ఆపై పలు సెల్ కంపెనీలు మార్కెట్‌లోని వచ్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 8 వేల దాకా సెల్‌ఫోన్ టవర్లున్నాయి. ఉమ్మడి జిల్లా జనాభా 44 లక్షలు కాగా వీరిలో సెల్‌ఫోన్లు (కీప్యాడ్, టచ్ మొబైల్)వాడే వారి సంఖ్య ప్రస్తుతం 10 లక్షలకు చేరింది.

ఇదిగో సాక్ష్యం..

పలమనేరు పట్టణంలో ఇంజినీరింగ్ చదవుతున్న ఓ విద్యార్థిని సెల్‌ఫోన్ అతిగా వాడొద్దని తల్లిదండ్రులు మందలించారు. దీంతో అప్పటికే సెల్‌కు బానిసైన ఆ విద్యార్థి తన గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని పదో తరగతి చదివే బాలికకు సెల్‌ఫోన్ కొన్విలేదని తన చేతిని బ్లేడ్‌తో కోసుకుని ఆస్పత్రి పాలైంది. సెల్ ఇవ్వలేదని ఐదో క్లాస్ చిన్నారి ఇంటి నుంచి పరారయ్యాడు. ఇలాంటి సంఘటనలు జిల్లాల్లో నిత్యకృత్యంగా మారాయి.

ఎక్కువ మంది యూట్యూబ్ వీక్షకులే

స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వారిలో 80 శాతం మంది యూట్యూబ్ చూస్తుండగా, 60 శాతం మంది వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్‌ను వాడుతున్నట్టు గూగుల్ చేసిన సర్వేలో తేలింది. విద్యార్థులు, యువతలో 50 శాతం మంచి ఆన్‌లైన్‌లో గేమ్స్ కోసం సమయాన్ని వెచ్చిస్తున్నారు. మహిళలు పనిపాట చేసుకుంటూ కూడా సీరియళ్లను సెల్‌లోనే చూసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇక చిన్నపిల్లలు సైతం స్మార్ట్‌ఫోన్‌లో కార్టూన్ స్టోరీస్ చూడకుండే ఏడుపు మొదలు పెట్టడం చూస్తూనే ఉన్నాం.

సోషల్ మీడియా వాడకం పరిస్థితి ఇదీ!

ఇటీవల యాన్యువల్ స్టేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ నివేదికలో వెల్లడించిన అంశాలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. సోషల్ మీడియా బానిసలైన వారిలో 14 ఏళ్లలోపు పిల్లలు 79 శాతం, 15 నుంచి 20 ఏళ్ల వయసున్న వారిలో 82 శాతం, మహిళలు 75 శాతం ఉండడం కొస మెరుపు.



అనారోగ్య సమస్యలు తప్పవు



సెల్ చూస్తున్న కారణంగా నిద్రలేమి ప్రధాన సమస్యగా మారుతోంది. దీంతో మనిషి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత దెబ్బతింటోందని(డబ్ల్యూహెచ్ఓ) ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో తెలిపింది. శరీరంలో మెలటోనియన్ నిల్వలు నశించి డిప్రెషన్‌లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నిద్రలేమి కారణంగా అధిక బరువు, లావెక్కడం జరుగుతుంది. పిల్లలకు తలనొప్పి, చూపు మందగించి కంటి అద్దాలను వాడాల్సిందే. అలాగే పలు అనారోగ్య సమస్యలు తప్పవు.

– మమతారాణి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు

జాషువా పిటిషన్‌పై విచారణ 30కి వాయిదా

సాక్షి, అమరావతి: స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి డబ్బు వసూలు చేశారంటూ ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి పి.జాషువా హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఆయన తరఫు సీనియర్ న్యాయవాది తన వాదనలను ముగించారు. దీంతో ఏసీబీ తరఫు న్యాయవాది వాదనల నిమిత్తం విచారణ ఈ నెల 30కి వాయిదా పడింది. అప్పటి వరకు కఠిన చర్యలేవీ తీసుకోకుండా ఏసీబీ అధికారులను నిలువరించాలన్న జాషువా అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. క్వాష్ పిటిషన్‌లో అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని, కావాలంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు జాషువా తరఫు సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ వాదనలు వినిపిస్తూ, కేసు నమోదు విషయంలో ఏసీబీ అధికారులు చట్టనిబంధనలను అనుసరించలేదని పేర్కొన్నారు. ఎలాంటి ప్రాథమిక విచారణ జరపకుండానే కేవలం విజిలెన్స్ నివేదిక ఆధారంగా కేసు పెట్టారని వివరించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లన్నీ కూడా ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడేవేనన్నారు.

మలేరియా హాట్ స్పాట్లపై దృష్టి పెట్టండి

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లోని మలేరియా హాట్ స్పాట్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ఆదేశించారు. ఈ నెల 25న నిర్వహించే ప్రపంచ మలేరియా దినోత్సవం పోస్టర్‌లను గురువారం సచివాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం వంటి గిరిజన ప్రాంతాల్లో గుర్తించిన మలేరియా హాట్ స్పాట్‌లలో మలేరియా కేసుల సంఖ్య ఆధారంగా నివారణ చర్యలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రపంచ మలేరియా నివేదిక 2022 ప్రకారం 2021లో మలేరియాతో 6,19,000 మంది మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1783 మలేరియా కేసులు నమోదుకాగా, మరణాలేవీ నమోదుకాలేదన్నారు. కాగా దేశ వ్యాప్తంగా 15,457 కేసులు నమోదు కాగా, ఒకరు మృతి చెందారని వివరించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, జేడీ డాక్టర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎరువులు, విత్తన లైసెన్సులు

- జూన్ నుంచి పునఃప్రారంభం
- వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: ఎరువులు, విత్తనాల క్రయవిక్రయాల లైసెన్స్ మంజూరు విధానాన్ని జూన్ నుంచి పునఃప్రారంభిస్తున్నట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తన వ్యాపార లైసెన్స్‌ల మంజూరు, సవరణల కోసం ప్రస్తుతం అమలులోవున్న ఈ–ఆఫీస్ విధానం మే వరకు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. ప్రస్తుత లైసెన్స్ వివరాలను వారం లోపు కొత్త విధానంలో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం లాగిన్ ఆధారిత సమాచార నమోదు ప్రక్రియను విత్తన, డీలర్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరించే మండల వ్యవసాయ అధికారులు చేయాలన్నారు. రాష్ట్ర సంయుక్త సంచాలకులు కృపదాస్ మాట్లాడుతూ రెండ్రోజుల పాటు డమ్మీ పద్ధతిలో డేటాను నమోదు చేస్తూ, సాధ్యాసాధ్యాలు, సమస్యలను గుర్తిస్తూ పరిశీలించి పూర్తి స్థాయిలో సమాచారం మే 3 నాటికి అందించాలని సూచించారు.

శ్రీజయజ్యోతి సిమెంట్స్‌కి లైమ్‌స్టోన్ లీజు

నంద్యాల జిల్లా గొర్లగుట్టలో 447.33 ఎకరాలు.. 50 ఏళ్లకు

సాక్షి, అమరావతి: శ్రీజయ జ్యోతి సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం నంద్యాల జిల్లాలోని గొర్లగుట్ట గ్రామంలో లైమ్‌స్టోన్ మైనింగ్ లీజు మంజూరు చేసింది. బేతంచెర్ల మండలంలో 181.030 హెక్టార్ల (447.33 ఎకరాల) విస్తీర్ణంలో మైనింగ్ కార్యకలాపాలకు 50 ఏళ్ల కాల పరిమితితో లీజు మంజూరు చేస్తూ మైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 2020 సెప్టెంబర్‌లో ప్రభుత్వం గొర్లగుట్ట లైమ్‌స్టోన్ బ్లాక్‌లను ఈ–వేలం ద్వారా లీజ్‌కు ఇవ్వడానికి అనుమతినిచ్చింది. ఈ వేలంలో శ్రీజయజ్యోతి సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజేతగా నిలిచింది. లీజు మంజూరు సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ చేయలేదు. ఈ టెండర్ దక్కించుకున్న కంపెనీకి ఇచ్చిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ రద్దయ్యే పరిస్థితి ఉండడంతో తాజాగా లీజు మంజూరు చేస్తున్నట్లు మైనింగ్ శాఖ తెలిపింది.

ఉపాధి కూలీలను.. ఉపాధి శ్రామికులుగా పిలుద్దాం

ఉప ముఖ్యమంత్రి పవన్

సాక్షి, అమరావతి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీలను ఇక మీదట ఉపాధి శ్రామికులుగా పిలుద్దామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మంగళగిరిలో గురువారం జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ‌..ఉపాధి హామీ పథకంలో పని చేసే వారిని కూలీలు అని పిలవడం కాస్త ఇబ్బందిగా ఉంది. ఇక నుంచి ఉపాధి శ్రామికులు లేదా నేస్తాలుగా వారిని పిలుద్దాం.‘ అని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు ఉన్నప్పటికీ, నిబంధనల మేరకు పీఆర్, ఆర్.డి. శాఖల్లోని సిబ్బంది బదిలీలు పారదర్శకంగా జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన దాదాపు 15 విభాగాల్లో వివిధ స్థాయిల్లో ఉత్తమ పనితీరును కనబరిచిన 74 మందికి ప్రతిభా పురస్కారాలను ఉప ముఖ్యమంత్రి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖలో టెండర్లపై తర్జనభర్జన!

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ నిర్వహణ టెండర్‌ల ప్రక్రియ గందరగోళంగా మారింది. ముఖ్యంగా శానిటేషన్ పనుల కోసం బిడ్‌లు దాఖలు చేసిన పలు సంస్థలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ టెండర్‌లపై ముందుకు వెళ్లాలా? లేదంటే కొత్తగా టెండర్‌లు పిలవాలా? అనే అంశంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. బిడ్ ఫైనలైజేషన్ కమిటీ (బీఎఫ్‌సీ) సమావేశం శుక్రవారం జరగనున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకుంది. టెక్నికల్, ఫైనాన్షియల్ పరిశీలన అనంతరం శానిటేషన్‌లో నాలుగు సంస్థలు అర్హత సాధించాయి. వీటిలో ఏకంగా మూడు సంస్థలు పలు ఆరోపణలను ఎదుర్కొంటుండగా, సెక్యూరిటీ టెండర్‌లో బిడ్ దాఖలు చేసి, ఎల్–1గా నిలిచిన సంస్థ కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. మరోవైపు పెస్ట్ కంట్రోల్ కాంట్రాక్ట్ విభాగంలో సాయి సెక్యూరిటీ అనే సంస్థ అర్హత సాధించగా, టెండర్ ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలోనే సదరు సంస్థపై తిరుపతిలో ఎఫ్ఐఆర్ నమోదైంది. సబ్ కాంట్రాక్ట్ సంస్థకు బ్యాంక్ గ్యారంటీ సొమ్ము తిరిగి ఇవ్వలేదన్నది ఈ ఫిర్యాదు సారాంశం.

మాజీ ఎంపీ గోరంట్లకు రిమాండ్ పొడిగింపు

గుంటూరు లీగల్: మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రెండురోజుల పోలీసు కస్టడీ గురువారంతో ముగిసింది. దీంతో ఆయనను స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి ముందు ప్రవేశపెట్టగా మాధవ్, మరో ఐదుగురికి మే 7 వరకూ రిమాండ్ పొడిగించారు. రెండురోజుల పాటు గోరంట్లను నల్లపాడు పోలీసుస్టేషన్‌లో విచారించారు. ఘటన వెనుక ఎవరు ఉన్నారో చెప్పాలంటూ పలువురు నేతల పేర్లను ప్రస్తావించి, ఒప్పుకోవాలంటూ ఒత్తిడి తెచ్చారు. విచారణ అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేసి, స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్‌ను పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా, మాధవ్ బెయిల్ పిటిషన్ ఈనెల 25న విచారణకు రానుంది.

ఉచితంగా ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్

మంత్రి సవిత ప్రకటన

సాక్షి, అమరావతి: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులందరికీ ఆన్‌లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో గురువారం ఆన్‌లైన్ ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్య యాప్ ద్వారా అందించే ఈ కోచింగ్‌లో నిష్ణాతులైన అధ్యాపకుల బోధన, అన్ని సబ్జెక్టులకు చెందిన మెటీరియల్, పాత డీఎస్సీ ప్రశ్నాపత్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రతి జిల్లాకు ఇద్దరిని నియమించామన్నారు. ఆ ఇద్దరితో వాట్సాప్ గ్రూప్ రూపొందించామని, సాంకేతిక సమస్యలను ఆ గ్రూప్‌లో పేర్కొంటే, వారు పరిష్కరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల సంరక్షణకు చర్యలు : మంత్రి ఫరూక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు కార్యకలాపాలపై వెలగపూడి సచివాలయంలో మంత్రి ఫరూక్ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సి.శ్రీధర్‌తో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. వక్ఫ్ చట్ట సవరణ, తెలంగాణ ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు తదితర అంశాలపై చర్చించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ప్రతి నెలా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

ఇంపాక్ట్ బృందంతో భేటీ

ఇదిలావుండగా, సచివాలయంలో ఇంటర్ మినిస్టీరియల్ ప్లానింగ్ అండ్ కో ఆర్డినేషన్ (ఇంపాక్ట్) బృందంతో మంత్రి ఫరూక్ భేటీ అయ్యారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలకు అనుసంధానంగా ఉన్న నిధులను సమర్థవంతంగా రాబట్టుకునేందుకు కృషి చేస్తామని మంత్రి చెప్పారు.

కాపు అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని కాపు, బలిజ, తెలగ, ఒంటరి అభ్యర్థులకు మెగా డీఎస్సీ–2025 ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌ల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు https://mdfc.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొంత పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 68,795 మంది స్వామిని దర్శించుకున్నారు. 25,382 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.62 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఘనంగా కామాక్షమ్మ జాతర


యలమంచిలి: పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం మేడపాడు గ్రామంలోని బాలం వారి ఇంట కామాక్షమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, గరగల నృత్యాల నడుమ అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద బాలం వీర రాఘవులు దంపతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడపాడు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో సుమారు మూడు వేల మందికి నవకాయ పిండి వంటలతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



యలమంచిలి మండలం మేడపాడు గ్రామంలోని కామాక్షి అమ్మవారి జాతరలో గరగల నృత్యాలు

ఎన్ఎస్‌యూలో ఔషధ వనం ప్రారంభం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలోని హెల్త్ సెంటర్ ప్రాంగణంలో ఔషధ వనాన్ని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ వనంలో సుమారు 70 రకాల ఔషధ మొక్కలు నాటినట్టు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఔషధ మొక్కలు నాటుతామని వెల్లడించారు. ఔషధ వనం అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయుర్వేదిక్ కన్సల్టెంట్ డాక్టర్ చిరంజీవి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలదత్తాత్రేయ, డాక్టర్ శ్వేత, హెల్త్ సెంటర్ బృందాన్ని, ఆయన అభినందించారు.



పది పాసైన విద్యార్థులకు సువర్ణావకాశం

తిరుపతి సిటీ: జిల్లా విద్యార్థులకు నేషనల్ యూనివర్సిటీలో ఇంటర్మీడియెట్ చదివే అవకాశాన్ని తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ కల్పిస్తోంది. పదోతరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కోర్సులో (పాక్ శాస్త్రీ) చేరేందుకు అవకాశం కల్పిస్తూ వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. ఇందులో ఇంగ్లిషు, హిందీ, సంస్కృతం, తెలుగు మాధ్యమాలు ఉంటాయన్నారు. ఇంటర్మీడియెట్ కోర్సుల్లో కంప్యూటర్, గణితం, హిస్టరీ, వ్యాకరణం, సాహిత్యం, జ్యోతిష్యం, పిలాసఫీ, యోగా వంటి సబ్జెక్టుల్లో బోధన ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో ఇంటర్మీడియెట్ కోర్సులు చేరదలుకున్న విద్యార్థులు వచ్చే నెల 3వ తేదీ నుంచి వర్సిటీ వెబ్‌సైట్ www.nsktu.ac.in లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులకు కోసం వర్సిటీలో అకడమిక్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

ట...ట...ట... నిజమౌనా?


• మహేష్ బాబు
• రజనీకాంత్

ఫలానా హీరో-హీరోయిన్ కాంబినేషన్ కుదిరింద'ట'...
ఓ పాట సెట్ కోసం ఐదువందల మందికి పైగా పని చేస్తున్నార'ట'...
ఆ డైరెక్టర్ 60 రోజుల్లోనే సినిమా పూర్తి చేయాలనుకుంటున్నాడ'ట'...
ఆ స్టార్ హీరో సినిమాలో ఇంకో స్టార్ హీరో విలన్‌గా ఫిక్స్ అయ్యాడ'ట'...
ఇలా సినిమా పరిశ్రమ గురించి రోజుకో 'ట...ట...ట...' అంటూ వార్తలు ప్రచారంలో ఉంటాయి.
మరి... ఈ ప్రచారంలో ఉన్న ఈ 'ట'లు నిజమౌనా? అనేది తెలియాలంటే మాత్రం యూనిట్ చెప్పాల్సిందే.
ఇక ప్రస్తుతం ఆ నోటా ఈ నోటా విహారం చేస్తున్న కొన్ని 'ట'ల గురించి ఓ లుక్కేద్దాం.

హీరో మహేశ్‌బాబు, డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి నిత్యం ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన పంథాకి భిన్నంగా ఈ చిత్రాన్ని అతి వేగంగా పూర్తి చేసేం దుకు రాజమౌళి షూటింగ్ ప్లాన్ చేశారని టాక్. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే హై ఓల్టేజ్


• పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి, చార్మీ

యాక్షన్ అడ్వెంచరస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం పొడవాటి హెయిర్ స్టైల్, గెడ్డంతో ఉన్న మహేశ్ లుక్స్ సోషల్ మీడియాలో ట్రెండ్‌గా మారాయి. ఇప్పటికే హైదరాబాద్, ఒడిశాలోని కోరాపుట్‌లో రెండు షెడ్యూల్స్‌ని మెరుపు వేగంతో పూర్తి చేసిన రాజమౌళి మూడవ షెడ్యూల్‌కి సిద్ధం అయ్యారు. ఇందుకోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ని సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సెట్ కోసం దాదాపు 550 మంది పని చేస్తున్నారని టాక్. ఈ సెట్‌లో త్వరలోనే ఓ భారీ సాంగ్‌ని చిత్రీకరించనున్నారట రాజమౌళి. ఈ పాట సినిమాలో హైలైట్ అవుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు కూడా గత కొన్నాళ్లుగా వినిపిస్తున్నాయి. ఈ వార్తలపై స్పష్టత రావాలంటే చిత్రబృందం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

రజనీకాంత్‌కి విలన్‌గా...

రజనీకాంత్ నటించిన 'వేట్టయాన్' సినిమాలో మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్ ఓ కీలక పాత్ర చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. అయితే ఈ చిత్రంలో ఫాహద్‌ది పాజిటివ్ క్యారెక్టర్. ఒక రకంగా చెప్పాలంటే రజనీ పాత్రకు హెల్ప్‌ఫుల్‌గా ఉండే పాత్ర. అయితే ఇప్పుడు రజనీకాంత్‌కి విలన్‌గా మారారట ఫాహద్. ఏ సినిమాలో అంటే 'జైలర్ 2'లో అని సమాచారం. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో వచ్చిన 'జైలర్' మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో 'జైలర్ 2' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఫాహద్‌ని విలన్‌గా ఎంపిక చేశారని టాక్. ఇటీవల కేరళలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభమైంది. తదుపరి షెడ్యూల్‌లో ఫాహద్ పాల్గొంటారట. అప్పుడు ఈ చిత్రంలో ఫాహద్ విలన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్రనిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించాలని అనుకుంటోందని సమాచారం.


• ఫాహద్ ఫాజిల్

సూర్య-కీర్తి మళ్లీ కుదిరేనా?

సూర్య-కీర్తీ సురేష్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారా? అంటే అవుననే అంటోంది తమిళ పరిశ్రమ. ఈ ఇద్దరూ జంటగా 'తానా సేంద కూట్టమ్' (2018) అనే చిత్రంలో నటించారు. మళ్లీ ఇప్పుడు ఈ కాంబినేషన్‌లో సినిమా రూపొందనుందనే ప్రచారం జరుగుతోంది. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో సూర్యకి జోడీగా కీర్తీ సురేష్ నటించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందనున్న ఈ చిత్రానికి '796 సీసీ' అనే టైటిల్ అనుకుంటున్నారట. 'సార్, లక్కీ భాస్కర్' వంటి బ్యాక్ టు బ్యాక్ హిట్ చిత్రాల తర్వాత వెంకీ అట్లూరి తెరకెక్కించనున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో, ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంలో సూర్యకు జోడీగా కీర్తీ సురేష్‌ను ఎంపిక చేశారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరి... ఈ వార్తలపై స్పష్టత రావాలంటే వేచి చూడాలి.


• కీర్తీ సురేష్


• సూర్య

తమిళ దర్శకుడితో...

హీరో కల్యాణ్ రామ్ జోరు మీదున్నారు. ఆయన హీరోగా నటించిన 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీ ఈ నెల 18న విడుదలై, హిట్‌గా నిలిచింది. తన తర్వాతి చిత్రాన్ని తమిళ దర్శకుడు గిరీశాయతో చేయనున్నారట కల్యాణ్ రామ్. తెలుగులో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విజయ్ దేవరకొండ 'అర్జున్ రెడ్డి' చిత్రాన్ని తమిళంలో 'ఆదిత్య వర్మ' పేరుతో రీమేక్ చేశారు గిరీశాయ. ఈ సినిమా కోలీవుడ్‌లోనూ హిట్‌గా నిలిచింది. కాగా వైష్ణవ్ తేజ్ హీరోగా నటించిన 'రంగ రంగ వైభవంగా' (2022) సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమయ్యారు గిరీశాయ. తాజాగా కల్యాణ్ రామ్ కోసం ఓ కథని సిద్ధం చేశారట ఆయన. యాక్షన్ డ్రామా నేపథ్యంలో రొటీన్ ఫార్ములాకు భిన్నంగా సాగే ఈ కథ కల్యాణ్ రామ్‌కి కూడా నచ్చిందట. దీంతో తన తర్వాతి మూవీని గిరీశాయ దర్శకత్వంలో చేయనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీ తర్వాత 'బింబిసార 2' చేస్తారనే ప్రచారం సాగింది. అయితే డైరెక్టర్ వశిష్ఠ ప్రస్తుతం చిరంజీవి హీరోగా 'విశ్వంభర' సినిమా తెరకెక్కిస్తున్నారు. దీంతో 'బింబిసార 2' మొదలయ్యేందుకు మరికొంత సమయం పట్టనుంది. ఈలోపు గిరీశాయ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు కల్యాణ్ రామ్ ఆసక్తిగా ఉన్నారని టాక్. ఇక కల్యాణ్ రామ్, గిరీశాయ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

అరవై రోజుల్లో...

డైరెక్టర్ పూరి జగన్నాథ్ స్టైలే వేరు. సినిమాలను జెట్ స్పీడ్‌లో తెరకెక్కిస్తారనే పేరుంది ఆయనకి. ఎంత పెద్ద సినిమా అయినా మూడు నాలుగు నెలల్లోనే చిత్రీకరణ పూర్తి చేస్తుంటారు. అయితే తన తాజా చిత్రాన్ని కేవలం అరవై రోజుల్లోనే పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట పూరి. ఆయన దర్శకత్వంలో రూపొందనున్న తాజా చిత్రంలో విజయ్ సేతుపతి హీరోగా నటించనున్నారు. ఈ చిత్రంలో టబు కీలక పాత్రలో నటించనున్నారు. కాగా ఈ మూవీకి 'బెగ్గర్' అనే టైటిల్ అనుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. పూరి సొంత నిర్మాణ సంస్థ పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించనున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి బిచ్చగాడి పాత్రలో కనిపించనున్నారట. అందుకే 'బెగ్గర్' అనే టైటిల్‌ను లాక్ చేశారని టాక్. మే లేదా జూన్‌లో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రాన్ని కేవలం అరవై రోజుల్లో పూర్తి చేయాలన్నది పూరి జగన్నాథ్ ఆలోచన అట. ఎందుకంటే వరుస సినిమాలతో బిజీగా ఉన్న విజయ్ సేతుపతి 'బెగ్గర్'ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పూరీని కోరారట. అందుకు తగ్గట్టు జెట్ స్పీడ్‌లో షూటింగ్ పూర్తి చేసేందుకు షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నారట పూరి జగన్నాథ్.


• గిరీశాయ
• కల్యాణ్ రామ్

రీమేక్ చిత్రంతో...

వైవిధ్యమైన కుటుంబ కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు రాజశేఖర్. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన ఆయన తర్వాతి సినిమా ఏంటి? అన్నదానిపై క్లారిటీ లేదు. ఆయన హీరోగా నటించిన చివరి చిత్రం 'శేఖర్'. ఆయన భార్య జీవిత దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2022 మే 20న విడుదలైంది. ఆ తర్వాత నితిన్ హీరోగా నటించిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్' (2023) సినిమాలో కీలక పాత్రలో కనిపించారు రాజశేఖర్. ఆ చిత్రం విడుదలై ఏడాదిన్నర దాటినా రాజశేఖర్ తర్వాతి సినిమాపై ఇప్పటివరకూ అధికారిక ప్రకటన లేదు. ఇదిలా ఉంటే... తమిళంలో ఘన విజయం సాధించిన 'లబ్బర్ పందు' సినిమాని తెలుగులో రీమేక్ చేసేందుకు రాజశేఖర్ సన్నాహాలు చేస్తున్నారని టాక్. తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వం వహించిన 'లబ్బర్ పందు' చిత్రం గత ఏడాది సెప్టెంబరు 20న తమిళంలో రిలీజై, సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ మూవీని తెలుగులో రీమేక్ చేసేందుకు హక్కులు కొనుగోలు చేశారట రాజశేఖర్. పెళ్లీడుకి వచ్చిన కూతురు ఉన్న ఒక వ్యక్తికి క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఆ అమ్మాయిని ప్రేమించే అబ్బాయికి కూడా క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్, ప్రేమ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం కోలీవుడ్‌లో హిట్‌గా నిలిచింది. ఈ మూవీని తెలుగు నేటివిటీకి తగ్గట్లుగా కథ, కథనంలో మార్పులు చేసి, రీమేక్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట రాజశేఖర్. మరి... ఈ వార్తల్లో వాస్తవం ఏంటన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాలి.


• రాజశేఖర్

- దేరంగుల జగన్ మోహన్



• శ్రుతీహాసన్

ఎన్టీఆర్‌తో స్పెషల్ డ్యాన్స్?

ఎన్టీఆర్‌తో స్పెషల్ డ్యాన్స్ చేయనున్నారట శ్రుతీహాసన్. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా, మలయాళ నటుడు టొవినో థామస్ విలన్‌గా నటిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా, ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని, ఈ పాటకు శ్రుతీహాసన్ అయితే బాగుంటారని దర్శకుడు ప్రశాంత్ నీల్ ఆలోచిస్తున్నారట. ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో వచ్చిన 'సలార్' మూవీలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన విషయం తెలిసిందే. అలాగే ఎన్టీఆర్ హీరోగా నటించిన 'రామయ్యా వస్తావయ్యా' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటించారు శ్రుతీహాసన్. మరి... ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్ మూవీలోని శ్రుతి స్పెషల్ సాంగ్ చేస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇదిలా ఉంటే... ప్రస్తుతం 'డ్రాగన్' చిత్రీకరణ కర్ణాటకలో జరుగుతోంది. ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారని తెలిసింది. మూడు రోజుల క్రితం మొదలైన ఈ షెడ్యూల్ మే రెండో వారం వరకు జరుగుతుందని తెలిసింది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని గతంలో వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కానీ, ఈ సినిమా ఏప్రిల్‌లో రిలీజ్ కావొచ్చనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్.

మైత్రీకి గ్రీన్ సిగ్నల్?

నయనతార, కీర్తీ సురేష్ వంటి వారు రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్లుగా నటిస్తూనే, వీలైనప్పుడల్లా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేస్తున్నారు. కానీ కథానాయిక సాయిపల్లవి మాత్రం ఈ ట్రాక్‌లో కాస్త స్లోగా ఉన్నారనుకోవాలి. హీరోయిన్‌గా బిజీగా ఉంటున్న సాయి పల్లవి 'గార్గి' అనే డిఫరెంట్ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేశారు. 2022లో విడుదలైన ఈ సినిమా తర్వాత మరో లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్‌కి సాయి పల్లవి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందని తెలుస్తోంది. ఓ సీనియర్ రచయిత ఓ పవర్‌ఫుల్ స్టోరీ రెడీ చేశారని, మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్‌కు ఈ కథ నచ్చిందని, ఈ సినిమాలోని మెయిన్ లీడ్ కోసం సాయిపల్లవిని సంప్రదించారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. మరి... సాయిపల్లవి మరో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ప్రస్తుతం హిందీలో 'రామాయణ' చిత్రంతో బిజీగా ఉన్నారు సాయిపల్లవి. అలాగే ఆమె నటించిన హిందీ చిత్రం 'ఏక్ దిన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) విడుదలకు సిద్ధమవుతోంది.


• సాయి పల్లవి

సోదరా... అందరూ చూడొచ్చు

- ఆరతి గుప్తా



''సోదరా' మంచి ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాని యువత, కుటుంబ ప్రేక్షకులు, స్నేహితులు.. ఇలా అందరూ చూడొచ్చు. ఈ సినిమాలో చదువుకున్న అమాయకమైన పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. నా వ్యక్తిత్వానికి దగ్గరగా ఉండే పాత్రను ఈ సినిమాలో చేశాను'' అని ఆరతి గుప్తా అన్నారు. సంపూర్ణేష్ బాబు, సంజోష్ హీరోలుగా నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో చంద్ర చగంలా నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక ఆరతి గుప్తా మాట్లాడుతూ–''చండీగఢ్‌లో పుట్టి పెరిగిన నేను ముంబయ్‌లో స్థిరపడ్డాను. బాలీవుడ్‌లో కొన్ని చిత్రాల్లో నటించాను. తెలుగులో 'సోదరా' నా తొలి చిత్రం. నటనకు అవకాశం ఉన్న పాత్రను ఇచ్చిన మోహన్‌గారికి థ్యాంక్స్. సంపూర్ణేష్, సంజోష్ సెట్‌లో ఉంటే ఎంతో ఎనర్జీ ఉంటుంది. నిర్మాత చంద్రగారు బాగా సపోర్ట్ చేశారు. ఇక్కడ స్థిరపడాలంటే తెలుగు నేర్చుకోవాలి.. అందుకే నేర్చుకుంటున్నాను. నటనకు ఆస్కారం ఉన్న సినిమాలకే నా మొదటి ప్రాధాన్యత. హీరోల్లో అల్లు అర్జున్‌గారంటే చాలా ఇష్టం. ఆలియాభట్ జర్నీ, ఆమె చేసిన పాత్రలు నాలో ప్రేరణను నింపాయి. తెలుగు సినిమాలో టైమ్ పంక్చువాలిటీ నాకు బాగా నచ్చింది. అలాగే ప్రతి ఆర్టిస్టును సమానంగా చూడటం చాలా సంతోషంగా అనిపించింది'' అన్నారు.

కంపెనీల లాభాలు ఫర్వాలేదు

- ఆదాయంలో వృద్ధి పరిమితమే
- టెలికం, రిటైల్‌లో బలమైన పనితీరు
- క్యూ4పై క్రిసిల్ రేటింగ్స్ అంచనా



ముంబై: భారత కంపెనీల ఆదాయ వృద్ధి ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో (2024–25 క్యూ4) ఫ్లాట్‌గా 5–6 శాతం స్థాయిలో ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అదే సమయంలో లాభదాయకత విస్తరిస్తుందని పేర్కొంది. కంపెనీల నిర్వహణ మార్జిన్లు 8 శాతం స్థాయిలో ఉంటాయని.. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే ఇది 0.60 శాతం అధికమని తెలిపింది. ఎన్ఎస్ఈ మార్కెట్ విలువలో 50 శాతం వాటా కలిగిన 400 కంపెనీల ఖాతాలను క్రిసిల్ రేటింగ్స్ విశ్లేషించింది. వినియోగ ఆధారిత రంగాలు ఆదాయ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపింది. కన్స్యూమర్ డిస్క్రిషినరీ ఉత్పత్తులు, సేవలు, స్టెపుల్ సర్వీసెస్ విభాగాల్లో ఆదాయం 8–9 శాతం మేర పెరుగుతుందని పేర్కొంది. ''ముఖ్యంగా టెలికం సేవల కంపెనీల ఆదాయం 15 శాతం పెరుగుతుంది. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో టారిఫ్‌లను గణనీయంగా పెంచడం, ప్రీమియం 5జీ ప్లాన్లను ప్రవేశపెట్టడం ఇందుకు మద్దతుగా నిలుస్తుంది. రిటైల్ రంగంలో ఆదాయం 17 శాతం వృద్ధి చెందుతుంది. ముఖ్యంగా వ్యాల్యూ ఫ్యాషన్, ఫుడ్, గ్రోసరీ విభాగాల్లో డిమాండ్ బలంగా ఉంది. స్టోర్ల నెట్‌వర్క్ విస్తరణ కూడా ఇందుకు మద్దతునిస్తుంది''అని క్రిసిల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పూషన్ శర్మ తెలిపారు.

ఆదాయాల్లో వృద్ధి..

- క్యూ4లో ఆటోమైబైల్ రంగం ఆదాయం 6 శాతం పెరగొచ్చు. ప్యాసింజర్ వాహన విక్రయాలు ఊపందుకోవడం, ఎగుమతుల వాటా పెరగడం అనుకూలిస్తుంది.
- ఎఫ్ఎంసీజీ రంగం ఆదాయం 4–6 శాతం మేర పెరుగుతుంది. విక్రయాల్లో స్తబ్దత నేపథ్యంలో కంపెనీలు ధరలను పెంచడం ఇందుకు మద్దతునిస్తుంది. పట్టణ వినియోగంలో స్తబ్దత నెలకొంటే, గ్రామీణ వినియోగం బలంగా ఉంది.
- ఎగుమతుల ఆదాయం 4% పెరుగుతుంది. ఐటీ సేవల ఆదాయం 2–3% మేర పెరగొచ్చు. ఫార్మాస్యూటికల్స్ ఆదాయం 8% పెరుగుతుంది.
- వ్యవసాయ రంగంలో ఎరువులు తదితర కంపెనీల ఆదాయం 17–19% స్థాయిలో వృద్ధి చెందొచ్చు. వేసవిలో సాగు స్థిరంగా ఉండడం, మెరుగైన దిగుబడులు, ఖరీఫ్‌లో వరికి మంచి ధరలు పలకడం వినియోగాన్ని పెంచుతాయి.
- నిర్మాణ అనుబంధ రంగాల్లో ఆదాయం కేవలం 1–2 శాతమే పెరగొచ్చు. ఏడాది వ్యాప్తంగా చౌక స్టీల్ దిగుమతులతో ధరలు తక్కువగా ఉండడాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది. ప్రభుత్వం దిగుమతులపై సుంకాలు పెంచిన తర్వాత ధరల్లో పెరుగుదలను గుర్తు చేసింది.

వీటి మార్జిన్లు ప్లస్

- ఫార్మాస్యూటికల్స్, విద్యుత్, కన్స్యూమర్ డిస్క్రిషినరీ, టెలికం సేవల్లో మార్జిన్లు విస్తరించొచ్చు.
- ఆటోమొబైల్, ఐటీ సేవలు, ఎఫ్ఎంసీజీ, సిమెంట్, స్టీల్ కంపెనీల మార్జిన్లు తగ్గొచ్చు.
- అల్యూమినియం ధరలు పెరగడంతో ఆటోమొబైల్ రంగ కంపెనీల మార్జిన్లు ఒక శాతం తగ్గొచ్చు.
- ఐటీ కంపెనీల మార్జిన్లు 0.40 శాతం మేర క్షీణించొచ్చు. ఎఫ్ఎంసీజీ రంగ కంపెనీల మార్జిన్లు 0.50–1 శాతం మధ్య తగ్గొచ్చు. పామాయిల్, టీ, ఎండు కొబ్బరి చిప్పల ధరలు పెరగడాన్ని కారణంగా క్రిసిల్ రేటింగ్స్ నివేదిక పేర్కొంది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'అక్షయ తృతీయ వేడుక' ఆఫర్లు

ముంబై: అక్షయ తృతీయ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ 'అక్షయ తృతీయ వేడుక' పేరుతో ఆరు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. బంగారం ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.250 తగ్గింపు, పాత బంగారం ఆభరణాల మార్పిడిపై గ్రాముకు రూ.75 అదనంగా, వజ్రాల విలువపై క్యారెట్‌కు రూ.12,500 తగ్గింపు ఇస్తుంది. అన్‌కట్ డైమండ్ విలువపై 10% తగ్గింపు, వెండి వస్తువులు, కాలిపట్టీలపై 25% తయారీ ఛార్జీలు, వెండి ఆభరణాలపై ఎంఆర్‌పీపై 10% డిస్కౌంట్ అందిస్తుంది. ''అక్షయ తృతీయ రోజున ప్రజలు బంగారం నాణేలు కొనడాన్ని సంప్రదాయంగా భావిస్తారు. వారి నమ్మకాన్ని గౌరవించేందుకు బంగారం కొనుగోలుపై సున్నా వేస్టేజ్ ఛార్జీలను అందిస్తున్నాము. ప్రతి ఒక్కరూ ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని, తమ ఇళ్లలోకి లక్ష్మీ దేవిని స్వాగతించాలి'' జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. తమిళనాడు, పాండిచ్చేరిలో 'అక్షయ తృతీయ కొండట్టం', కర్ణాటకలో 'అక్షయ తృతీయ సంభ్రమ' పేర్లతో ఇవే ఆఫర్లు అందిస్తుంది.

రియల్టీలోకి రూ.2.29 లక్షల కోట్లు

- 2022–2024లో వచ్చిన పెట్టుబడులు
- రూ.57,600 కోట్లతో ముంబై టాప్
- సీఐఐ–సీబీఆర్ఈ నివేదిక వెల్లడి



ముంబై: రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెట్టుబడుల పట్ల సంస్థాగత ఇన్వెస్టర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ రంగం 2022–24 మధ్యకాలంలో (మూడేళ్లలో) 26.7 బిలియన్ డాలర్ల (రూ.2.29 లక్షల కోట్లు) ఈక్విటీ పెట్టుబడులను అందుకున్నట్టు సీఐఐ–సీబీఆర్ఈ సంయుక్త నివేదిక తెలిపింది. ఇందులో పావు శాతం అంటే 6.7 బిలియన్ డాలర్లను (రూ.57,600 కోట్లు సుమారు) ముంబై నగరం ఆకర్షించడం గమనార్హం. ఇక ముంబైతో పాటు ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు ఈ మూడు మార్కెట్లోకి వచ్చిన పెట్టుబడులు 16.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. మొత్తం రియల్ ఎస్టేట్ రంగంలోకి 2022–24 మధ్య వచ్చిన పెట్టుబడుల్లో 62 శాతాన్ని ఈ మూడు నగరాలు దక్కించుకున్నాయి. పెట్టుబడి శ్రేణికి సంబంధించిన ప్రాజెక్టులు ప్రధానంగా ఈ నగరాల్లో కేంద్రీకృతమై ఉండడం, బలమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్య మానవ వనరుల లభ్యత, రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా సంఘటితంగా మారుతుండడం ఈ మూడు నగరాలకు అనుకూలిస్తున్నట్టు ఈ నివేదిక వివరించింది.

భూమి అభివృద్ధిపైనే ఎక్కువ..

భూమి అభివృద్ధి ప్రాజెక్టులు 2022–24 మధ్య 44 శాతం మేర ఈక్విటీ పెట్టుబడులను ఆకర్షించినట్టు, ఆ తర్వాత ఆఫీస్ నిర్మాణ ఆస్తుల్లోకి 32 శాతం వచ్చినట్టు సీఐఐ–సీబీఆర్ఈ నివేదిక వెల్లడించింది. ఇక గత మూడేళ్లలో 10 శాతం మేర ఈక్విటీ పెట్టుబడులు (3 బిలియన్ డాలర్లు) టైర్–2 పట్టణ రియల్ ఎస్టేట్‌లోకి వచ్చినట్టు తెలిపింది. ''భారత రియల్ ఎస్టేట్ రంగం కొత్త వృద్ధి పథంలోకి అడుగు పెట్టింది. బలమైన మూలధన పెట్టుబడులు, అభివృద్ధికి భూముల లభ్యత ఇందుకు మద్దతునిస్తున్నాయి'' అని సీబీఆర్ఈ భారత చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజిన్ తెలిపారు. ఆఫీస్ అసెట్స్, నివాస గృహ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు బలమైన సెంటిమెంట్ ఉండడం అన్నది స్థిరమైన వినియోగ డిమాండ్‌కు నిదర్శనంగా పేర్కొన్నారు. దేశ రియల్ ఎస్టేట్ రంగం మరింత సంస్థాగతంగా మారుతున్నట్టు సీఐఐ పశ్చిమ ప్రాంత చైర్మన్ రిషి కుమార్ బగ్లా తెలిపారు. దీంతో ఈ రంగం మరింత పారదర్శకతతో, అంతర్జాతీయ ఇన్వెస్టర్ల అంచనాలను అందుకుంటున్నట్టు చెప్పారు. ఈ రంగం మరింత సంస్థాగతంగా, నియంత్రితంగా మారితే అప్పుడు అంతర్జాతీయ ఫండ్స్ పెద్ద ఎత్తున పెట్టుబడులతో ముందుకు వస్తాయన్నారు.

రైతులకు దన్నుగా 'రా మార్కెట్'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రైతులకు పంట వేసే దశ నుంచి విక్రయించుకునే వరకు తోడ్పాటు అందించేలా అంకుర సంస్థ రా మార్కెట్ (ఆర్‌ఏ మార్కెట్) ఏర్పాటైంది. రైతాంగానికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం నుంచి పంటలు వేయడంలో సాంకేతిక సలహాలు, వివిధ ముడి సరుకులు, సాధనాలను అందించేందుకు, పంట సేకరణకు గ్రామాల స్థాయిలో ఉచిత ఫ్రాంచైజీలను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు పి. శివ తెలిపారు. ఇందుకోసం నాబార్డ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ మొదలైన వాటితో జట్టు కట్టినట్లు వివరించారు. తమ విధానాలతో పంట వ్యయాలు సుమారు 30 శాతం తగ్గుతాయని, దిగుబడులు దాదాపు 50 శాతం వరకు పెరగగలవని, వివరించారు. గ్రామంలోనే పంటను కొనుగోలు చేసి, నగరాల్లోని సూపర్‌మార్కెట్లులాంటి కొనుగోలుదారులకు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. తొలి ఫ్రాంచైజీని జూన్ రెండున ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

కెనరా, ఇండియన్ బ్యాంక్ రుణ రేట్ల తగ్గింపు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను (ఆర్ఎల్ఎల్ఆర్) పావు శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. దీంతో ఇండియన్ బ్యాంక్ గృహ రుణ రేటు 8.15 శాతం నుంచి 7.90 శాతానికి దిగొచ్చింది. వాహన రుణ రేటు 8.50 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గింది. రుణ రేట్లను తగ్గించడానికి అదనంగా ప్రాసెసింగ్ చార్జీలను సైతం ఇండియన్ బ్యాంక్ తగ్గించింది. డాక్యుమెంటేషన్ చార్జీని సున్నా చేసింది. తాజా సవరణ తర్వాత గృహ రుణ రేటు 7.90 శాతం నుంచి, వాహన రుణ రేటు 8.20 శాతం నుంచి ప్రారంభం అవుతున్నట్టు కెనరా బ్యాంక్ తెలిపింది.

మార్కెట్లోకి కేటీఎం 390 ఎండ్యూరో ఆర్ మోటర్‌సైకిల్

ధర రూ. 3,36,500



హైదరాబాద్: ఆఫ్–రోడ్ సామర్థ్యాలున్న కేటీఎం 390 ఎండ్యూరో ఆర్ మోటర్‌సైకిల్‌ను కేటీఎం ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 3,36,500 (ఢిల్లీ ఎక్స్‌షోరూం)గా ఉంటుంది. రోజువారీ ప్రయాణాలతో పాటు ఆఫ్–రోడ్ అడ్వెంచర్లకు కూడా ఇది అనువైనదిగా ఉంటుందని బజాజ్ ఆటో ప్రెసిడెంట్ మాణిక్ నాంగియా తెలిపారు. ఇందులో తేలికపాటి, పొందికైన 399సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్, 4.2 అంగుళాల టీఎఫ్‌టీ డ్యాష్‌బోర్డ్, ఆకర్షణీయమైన బాడీవర్క్, గ్రాఫిక్స్ తదితర ఫీచర్లు ఉన్నాయని వివరించారు.

వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు డౌన్

క్యూ4లో 2.4 బిలియన్ డాలర్లకు పరిమితం

న్యూఢిల్లీ: దేశీయంగా ఈ కేలండర్ ఏడాది(2025) తొలి త్రైమాసికంలో వెంచర్ క్యాపిటల్(వీసీ) పెట్టుబడులు త్రైమాసికవారీగా బలహీనపడ్డాయి. ఈ జనవరి–మార్చి (క్యూ1)లో 2.4 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గత కేలండర్ ఏడాది(2024) చివరి త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో నమోదైన 2.6 బిలియన్ డాలర్లతో పోలిస్తే స్వల్పంగా క్షీణించాయి. వెంచర్ పల్స్ పేరిట కేపీఎంజీ రూపొందించిన నివేదిక ప్రకారం ప్రస్తుత రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు ప్రతికూల ప్రభావం చూపాయి. ఈ బాటలో రెండో త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లోనూ వీసీ పెట్టుబడులు కొంతమేర నెమ్మదించే వీలున్నట్లు నివేదిక పేర్కొంది. అయితే పటిష్ట స్థూల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో దీర్ఘకాలిక ఔట్‌లుక్ సానుకూలంగానే ఉన్నట్లు అభిప్రాయపడింది. ఈ కాలంలో దేశీయంగా అధిక విలువల కారణంగా స్టాక్ మార్కెట్లు సైతం దెబ్బ తిన్నట్లు ప్రస్తావించింది. అయితే ఇటీవల మార్కెట్లు కొంతమేర రికవర్ అయినప్పటికీ పరిస్థితులు 2024 చివరి త్రైమాసికంలో కనిపించినంత ఆశావహంగా లేనట్లు తెలియజేసింది.



నిబంధనలొక్కటే కాపాడలేవు..
మీరూ జాగ్రత్తగా ఉండాలి

చిన్న ఇన్వెస్టర్లకు బీఎస్ఈ సీఈవో రామమూర్తి సూచన



న్యూఢిల్లీ: పెట్టుబడుల విషయంలో నియంత్రణ నిబంధనలు మాత్రమే మదుపరులను కాపాడలేవని, ఇన్వెస్టర్లు కూడా తప్పకుండా తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని బీఎస్ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి తెలిపారు. స్వంతంగా విషయాలను ఆకళింపు చేసుకోకుండా, వాళ్లూ వీళ్లు చెప్పిన మాటల మీద ఆధారపడి ఇన్వెస్ట్ చేసే ధోరణి మంచిది కాదని వ్యాఖ్యానించారు. 'కూరగాయలు కొనుక్కునేటప్పుడు ముందుగానే చాలా జాగ్రత్తగా చూసుకుంటారు. కానీ మీ జీవితకాల ఆదాయాన్ని పెట్టుబడి పెట్టేటప్పుడు మాత్రం ఎవరో చెప్పిన మాటలు విని ముందూ, వెనుకా చూసుకోకుండా ఇన్వెస్ట్ చేస్తారు. అలా చేయొద్దు. మీకు అర్థమైనదే ట్రేడ్ చేయండి. ఏం ట్రేడ్ చేస్తున్నారో అర్థం చేసుకోండి. లేకపోతే సమస్యలు తప్పవు. మిమ్మల్ని మీరు కాపాడుకోదల్చుకోకపోతే ఎన్ని నిబంధనలున్నా ఏవీ మిమ్మల్ని కాపాడలేవు. కాబట్టి అలర్టుగా ఉండండి' అని రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కలకత్తా చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా హెచ్చరించారు. మార్కెట్‌పై అవగాహన లేని రిటైల్ ఇన్వెస్టర్లు పెట్టుబడుల కోసం మ్యుచువల్ ఫండ్ మార్గాన్ని ఎంచుకోవడం శ్రేయస్కరమని సూచించారు. అప్పుడు కూడా థీమ్యాటిక్ ఫండ్స్ జోలికి వెళ్లకుండా విస్తృత సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే మ్యుచువల్ ఫండ్లు లేదా లార్జ్ క్యాప్ ఫండ్లను ఎంచుకోవడం మంచిదని పేర్కొన్నారు. కెరియర్ ప్రారంభించిన తొలినాళ్ల నుంచే పెట్టుబడులు పెట్టడాన్ని అలవర్చుకోవాలని మహిళలు, యువతకు రామమూర్తి సూచించారు. నియంత్రణ సంస్థలు, స్టాక్ ఎక్స్ఛేంజీలు ఎంత అప్రమత్తంగా ఉన్నా కొన్ని ఎస్ఎంఈ లిస్టింగ్‌లలో అవకతవకలు జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమని పేర్కొన్నారు. ఐపీవో పత్రాల్లో అనుమానాస్పద అంశాలను పసిగట్టేందుకు ఏఐ, లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్‌ను బీఎస్ఈ ట్రయల్ ప్రాతిపదికన ఉపయోగిస్తోందని రామమూర్తి చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-4-2025

విశాఖ	425–00
చిత్తూరు	450–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	410–00
విజయవాడ	420–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

బోర్డు సమావేశాలు

రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ, టాటా టెక్నాలజీస్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఆర్‌బీఎల్ బ్యాంక్, డీసీబీ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, మోతీలాల్ ఓస్వాల్ ఫిన్‌సర్వ్, పూనావాలా ఫిన్‌కార్ప్, ఎల్అండ్‌టీ ఫైనాన్స్, అతుల్ లిమిటెడ్, హిందుస్థాన్ జింక్, రామ్‌కో సిమెంట్, ఎన్‌డీటీవీ, సీపీడీఎల్.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	819.35	3.17
ULTRACEMCO	12,175.00	1.89
GRASIM	2,730.50	1.67
DRREDDY	1,204.90	1.59
CIPLA	1,554.00	1.32

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDUNILVR	2,324.00	-4.12
BHARTIARTL	1,846.10	-1.89
EICHERMOT	5,632.00	-1.88
ICICIBANK	1,401.00	-1.64
ETERNAL	236.8	-1.02

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,930
ఎన్ఎస్ఈ	1,08,519
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,45,780
ఎఫ్ఐఐ	+ 8,250
డీఐఐ	- 535

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.63 (రాత్రి 11.30కు)	$ 66.12 (క్రితం ముగింపు)
బ్రెంట్	62.89 (రాత్రి 11.30కు)	$ 62.27 (క్రితం ముగింపు)

మార్చి త్రైమాసిక ఫలితాలు

ఏసీసీ లాభం నేలచూపు

- క్యూ4లో రూ. 751 కోట్లు
- షేరుకి రూ. 7.5 డివిడెండ్



న్యూఢిల్లీ: సిమెంట్ తయారీ దిగ్గజం ఏసీసీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతంపైగా క్షీణించి రూ. 751 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 943 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 7.5 డివిడెండ్ ప్రకటించింది. సిమెంట్ అమ్మకాల ఆదాయం మాత్రం 11 శాతం ఎగసి రూ. 5,686 కోట్లకు చేరింది. రెడీమిక్స్ కాంక్రీట్ ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 420 కోట్లను తాకింది. దీంతో మొత్తం టర్నోవర్ 12 శాతం మెరుగుపడి రూ. 6,067 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 13 శాతం పెరిగి రూ. 5,515 కోట్లుగా నమోదయ్యాయి. ఈ కాలంలో అమ్మకాల పరిమాణం 14 శాతం పుంజుకుని 11.9 మిలియన్ టన్నులను తాకింది. వెరసి ఒక క్వార్టర్‌కు కంపెనీ చరిత్రలోనే అత్యధిక అమ్మకాలు సాధించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 3 శాతం వృద్ధితో రూ. 2,402 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం 12 శాతం బలపడి రూ. 22,835 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.8% లాభంతో రూ. 2,068 వద్ద ముగిసింది.

సైయెంట్ డివిడెండ్ రూ. 14



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ సైయెంట్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 186 కోట్ల లాభం ప్రకటించింది. క్రితం క్యూ4లో ఇది రూ. 197 కోట్లు. ఆదాయం రూ. 1,861 కోట్ల నుంచి రూ. 1,909 కోట్లకు చేరింది. 2024–25కి గాను రూ. 5 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై కంపెనీ రూ.14 తుది డివిడెండ్ ప్రకటించింది. డీఈటీ వ్యాపార విభాగంలో సుమారు 371 కోట్ల డాలర్ల విలువ చేసే 24 భారీ కాంట్రాక్టులు దక్కించుకున్నట్లు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ కృష్ణ బోదనపు తెలిపారు. కొత్తగా సెమీకండక్టర్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇది ప్రధానంగా ఏఐ ఆధారిత టెక్నాలజీ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెడుతుందని తెలిపారు. ఇక డీఈటీ (డిజిటల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ) విభాగం టెక్నాలజీ సర్వీసులు, ఇంజినీరింగ్ కార్యకలాపాలపై, డీఎల్ఎం వ్యాపార విభాగం ఇంజినీరింగ్ ఆధారిత ప్రోడక్ట్ తయారీపై ఫోకస్ పెడుతుందని వివరించారు. డిమాండ్‌పరంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ తాము మెరుగైన పనితీరు కనపర్చినట్లు చెప్పారు. సమీప భవిష్యత్తులో కొంత అనిశ్చితి నెలకొన్నా సవాళ్లను అధిగమించేందుకు కస్టమర్లతో కలిసి పని చేస్తున్నట్లు కృష్ణ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం వరకు ఈ పరిస్థితి కొనసాగవచ్చన్నారు.

లారస్ ల్యాబ్స్ లాభం 3 రెట్లు అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో అమ్మకాల ఊతంతో ఔషధ రంగ సంస్థ లారస్ ల్యాబ్స్ నికర లాభం మూడు రెట్లు పెరిగి రూ. 234 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో లాభం రూ. 76 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 1,440 కోట్ల నుంచి రూ. 1,720 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం రూ. 161 కోట్ల నుంచి రూ. 358 కోట్లకు పెరిగింది. ఆదాయం రూ. 5,041 కోట్ల నుంచి రూ. 5,554 కోట్లకు చేరింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా సీడీఎంవో సేవలు అందిస్తూ, మెరుగైన ఫలితాలు సాధించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ చావా తెలిపారు. పెద్ద క్లయింట్లతో భాగస్వామ్యాలను మరింత పటిష్టం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ బోర్డు రూ. 2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ. 0.80 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

గురువారం బీఎస్ఈలో లారస్‌ల్యాబ్స్ షేరు స్వల్పంగా క్షీణించి రూ. 647.15 వద్ద ముగిసింది.

అదానీ ఎనర్జీ లాభం హైజంప్

క్యూ4లో రూ. 714 కోట్లు



న్యూఢిల్లీ: విద్యుత్ ప్రసార రంగ దిగ్గజం అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 87 శాతం జంప్‌చేసి రూ. 714 కోట్లకు చేరింది. ఇందుకు రూ. 148 కోట్ల వన్‌టైమ్ ఆదాయం సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 381 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 36 శాతం ఎగసి రూ. 6,596 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 4,855 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు రూ. 4,359 కోట్ల నుంచి రూ. 5,412 కోట్లకు పెరిగాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 103 శాతం దూసుకెళ్లి రూ. 2,427 కోట్లను తాకింది. పన్ను సంబంధ రూ. 469 కోట్ల రాక కారణంగా లాభం పెరిగింది. మొత్తం ఆదాయం 42 శాతం వృద్ధితో రూ. 24,447 కోట్లకు చేరింది. ఏడు ప్రాజెక్టులతో కలిపి మొత్తం 15 ప్రాజెక్టుల ఆర్డర్ బుక్ రూ. 59,936 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.5 శాతం లాభంతో రూ. 962 వద్ద ముగిసింది.

పెర్సిస్టెంట్ సిస్టమ్స్ లాభం అప్

క్యూ4లో రూ. 396 కోట్లు



ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం పెర్సిస్టెంట్ సిస్టమ్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 396 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 315 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 25 శాతం ఎగసి రూ. 3,242 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 2,591 కోట్ల టర్నోవర్ అందుకుంది. నిర్వహణ లాభ మార్జిన్లు 14.5 శాతం నుంచి 15.6 శాతానికి బలపడ్డాయి. అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో 2 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధించగలమని భావిస్తున్నట్లు కంపెనీ సీఎఫ్‌వో వినీత్ టి. పేర్కొన్నారు. ఈ కాలంలో 51.75 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్ కుదుర్చుకుంది. కంపెనీ 700 మంది ఉద్యోగులను జత కలుపుకోవడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 24,594కు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు నామమాత్ర నష్టంతో రూ. 5,158 వద్ద ముగిసింది.

నెస్లే ఇండియా లాభం డౌన్

- క్యూ4లో రూ. 873 కోట్లు
- షేరుకి రూ. 10 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా గత ఆర్థిక సంవత్సరం(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతంపైగా క్షీణించి రూ. 873 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 934 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం వృద్ధితో రూ. 5,448 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 5,254 కోట్ల అమ్మకాలు సాధించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 10 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 3,208 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2025 జులైలో పదవీ విరమణ చేయనున్న చైర్మన్, ఎండీ సురేష్ నారాయణన్ స్థానే 2025 ఆగస్ట్ 1 నుంచి మనీష్ తివారీ ఎండీగా బాధ్యతలు చేపట్టేందుకు బోర్డు అనుమతించినట్లు నెస్లే ఇండియా వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో నెస్లే ఇండియా షేరు బీఎస్ఈలో 1 శాతం క్షీణించి రూ. 2,413 వద్ద ముగిసింది.

గెలిచి నిలిచేనా!

నేడు చెన్నై సూపర్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక పోరు

ఓడిన జట్టు 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి అవుట్!

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



జడేజా ధోని



నితీశ్ కుమార్ రెడ్డి

చెన్నై: ఈ ఐపీఎల్ సీజన్‌లో పరాజయలతో సతమతమవుతోన్న గత ఏడాది రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)... ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) మధ్య నేడు కీలక మ్యాచ్ జరగనుంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా మాజీ చాంపియన్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ సీజన్‌లో ఇరు జట్లు ఎనిమిదేసి మ్యాచ్‌లు ఆడి... 2 విజయాలు, 6 పరాజయాలతో నాలుగేసి పాయింట్లు ఖాతాలో వేసుకున్నాయి. పట్టికలో సన్‌రైజర్స్ తొమ్మిదో స్థానంలో ఉండగా... చెన్నై సూపర్ కింగ్స్ అట్టడుగున పదో స్థానంలో కొనసాగుతోంది. ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే మిగిలిన అన్నీ మ్యాచ్‌ల్లోనూ విజయం తప్పనిసరి అయిన నేపథ్యంలో... ఇరు జట్లకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. చెన్నై జట్టు ఈ ఏడాది కనీస ప్రదర్శన కనబర్చలేక ఇబ్బంది పడుతుంటే... బ్యాటర్ల వైఫల్యంతో హైదరాబాద్ మూల్యం చెల్లించుకుంటోంది. ఇరు జట్లకు మరో ఆరేసి మ్యాచ్‌లు మిగిలి ఉండగా... అన్నీ మ్యాచ్‌ల్లో విజయాలు సాధిస్తేనే సులువుగా ప్లే ఆఫ్స్‌కు చేరే చాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో... స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉన్న పిచ్‌పై హైదరాబాద్‌ను పడగొట్టి ముందంజ వేయాలని ధోనీ సారథ్యంలోని చెన్నై భావిస్తోంది. మరోవైపు బ్యాటింగ్ లోపాలను సరిచేసుకొని తిరిగి భారీ స్కోర్లతో విజృంభించాలని ఎస్ఆర్‌హెచ్ చూస్తోంది. బుధవారమే హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ముంబై చేతిలో ఓటమి మూటగట్టుకున్న రైజర్స్... 48 గంటలు తిరిగేసరికి చెన్నైతో మ్యాచ్‌కు రెడీ అయింది. మరి ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శనతో పరాజయాలతో సహవాసం చేస్తున్న ఇరు జట్లలో విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి!

తీవ్ర ఒత్తిడిలో ధోనీ సేన...

సాధారణంగా చెపాక్‌లో మ్యాచ్ అంటే... చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగడం పరిపాటి. అయితే ఈ సీజన్‌లో మాత్రం ఫలితాలు అందుకు భిన్నంగా వస్తున్నాయి. ధోని సేన స్పిన్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతుంటంతో ఆ జట్టుకు పరాజయాలు తప్పడం లేదు. కోల్‌కతాతో మ్యాచ్‌లో అయితే చెన్నై మరీ నాసిరకం ఆటతీరు కనబర్చింది. క్రీజులో నిలవడమే తెలియదన్నట్లు బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. రుతురాజ్ గైక్వాడ్ గాయంతో జట్టుకు దూరమవడంతో... జట్టు పగ్గాలు అందుకున్న ధోని కూడా సీఎస్‌కే రాత మార్చలేకపోతున్నాడు. టాపార్డర్‌లో ధాటిగా ఆడే బ్యాటర్ లేకపోవడం... మిడిలార్డర్‌లో మునుపటి మెరుపులు లోపించడం... ధోని స్వేచ్ఛగా భారీ షాట్‌లు ఆడలేకపోవడం... ప్రత్యర్థి స్పిన్నర్లు విజృంభిస్తున్న చోట చెన్నై బౌలర్లు నామమాత్ర ప్రదర్శన కనబర్చడం... వెరసి చెన్నై తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టుకు కాస్త ఆశ ఏదైనా ఉంది అంటే... అది యువ ఆటగాడు ఆయుశ్ మాత్రే మెరుపులే. గత మ్యాచ్ ద్వారానే ఐపీఎల్ అరంగేట్రం చేసిన 17 ఏళ్ల మాత్రే... ముంబై పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ 15 బంతుల్లో 32 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. ఆంధ్ర ఆటగాడు షేక్ రషీద్ భారీ ఇన్నింగ్స్ ఆడాలని భావిస్తుండగా... రచిన్ రవీంద్రలో నిలకడ కొరవడింది. మిడిలార్డర్‌లో జడేజా, దూబే, విజయ్ శంకర్ కీలకం కానున్నారు. ఓవర్టన్, పతిరణ, ఖలీల్ అహ్మద్, నూర్ అహ్మద్, అశ్విన్, జడేజాతో బౌలింగ్ మెరుగ్గా ఉంది.

> **400**
>
> టి20ల్లో ధోనికి ఇది 400వ మ్యాచ్. ఈ మార్క్ చేరుకున్న నాలుగో భారత ప్లేయర్‌గా అతడు నిలవనున్నాడు. రోహిత్ శర్మ (456), దినేశ్ కార్తీక్ (412), విరాట్ కోహ్లి (407) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

ఏవీ ఆ మెరుపులు!

సీజన్ ఆరంభ పోరులోనే దాదాపు మూడొందల పరుగులతో బీభత్సం సృష్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆ తర్వాత లయ కోల్పోయింది. పంజాబ్ కింగ్స్‌పై భారీ లక్ష్యాన్ని ఛేదించి తిరిగి గాడిన పడింది అనుకుంటే... పాత పాటే పునరావృతం చేస్తోంది. గత రెండు మ్యాచ్‌లను ముంబైతోనే ఆడిన సన్‌రైజర్స్ కనీస ప్రతిఘటన లేకుండానే వరాజయం పాలైంది. రైజర్స్ ఓటముల సంఖ్య కన్నా... ఆరెంజ్ ఆర్మీ ఆడుతున్న తీరే అభిమానులను కలవరపెడుతోంది. పిచ్, పరిస్థితులతో సంబంధం లేకుండా క్రీజులోకి వచ్చిన ప్రతి ఒక్కరూ భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నించి వెనుదిరగడం... జట్టు ఆలోచన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ నిలకడ కొనసాగించలేకపోతుండగా... ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్ పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో క్లాసెన్‌పై అధిక భారం పడుతోంది. అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ నుంచి టీమ్ మేనేజ్‌మెంట్ మరింత ఆశిస్తోంది. దూకుడుకు మారుపేరుగా నిలిచిన రైజర్స్... ఇప్పుడు అదే తొందరపాటులో వికెట్లు కోల్పోయి చతికిలబడుతోంది. ఇక చెన్నైలో రైజర్స్‌కు మంచి రికార్డు లేదు. చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై ఆరెంజ్ ఆర్మీ ఒక్కసారి కూడా విజయం సాధించలేదు. కమిన్స్, షమీ, హర్షల్ పటేల్, జీషన్ అన్సారీ ఇషాన్ మలింగతో కూడిన బౌలింగ్ బృందం ఎలాంటి అద్భుతాలు చేయలేకపోతోంది. 'అభిషేక్, హెడ్ విఫలమవుతున్నప్పుడు ఇతర ఆటగాళ్లు బాధ్యత తీసుకోవాల్సిన అవసరముంది. ఈ సీజన్‌లో అదే కొరవడింది. భాగస్వామ్యాలు నమోదు చేయడంలో మా ఆటగాళ్లు విఫలమవుతున్నారు' అని సన్‌రైజర్స్ కోచ్ వెటోరీ అన్నాడు.

తుది జట్లు (అంచనా)

సన్‌రైజర్స్ హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, హర్షల్ పటేల్, జైదేవ్ ఉనాద్కట్, జీషన్ అన్సారీ, ఇషాన్ మలింగ.

చెన్నై సూపర్ కింగ్స్: ధోని (కెప్టెన్), రచిన్ రవీంద్ర, షేక్ రషీద్, ఆయుశ్ మాత్రే, రవీంద్ర జడేజా, శివమ్ దూబే, విజయ్ శంకర్, జేమీ ఓవర్టన్, అశ్విన్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్, పతిరణ.

'మళ్లీ నా సమయం వచ్చింది'



భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి

పుణే: క్లాసికల్ ఫార్మాట్‌లో మెరుగైన ప్రదర్శన చేయడం ఆనందంగా ఉందని... భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి పేర్కొంది. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి హంపి విజేతగా నిలిచింది. 9 రౌండ్ల పాటు జరిగిన ఈ టోర్నీలో చైనా గ్రాండ్‌మాస్టర్ జు జినెర్‌తో కలిసి హంపి 7 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. అయితే నల్లపావులతో ఎక్కువ గేమ్‌లు ఆడినందుకు హంపికి టైటిల్ దక్కింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ స్పందిస్తూ... 'క్లాసికల్‌లో మెరుగైన ప్రదర్శన చేయక చాలా రోజులైంది. గతేడాది మొత్తం ఈ ఫార్మాట్‌లో నా తడబాటు సాగింది. దీంతో ఎన్నో పరాజయాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అందుకే ఇందులో టైటిల్ గెలవడం ఆనందాన్ని పెంచింది. ర్యాపిడ్ వరల్డ్ టైటిల్ గెలిచినప్పటి నుంచి నా ఆటతీరు మెరుగైంది. తిరిగి నా టైమ్ వచ్చినట్లు అనిపిస్తోంది. రెండోసారి ర్యాపిడ్ టైటిల్ సాధించిన అనంతరం నాలో కొత్త ఉత్తేజం వచ్చింది. చిన్నప్పుడు ఆడిన ఆటకు ఇప్పుడు ఆడుతున్న ఆటకు చాలా తేడా ఉంది. ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దానికి తగ్గట్లు మనం కూడా మారాలి. నాకంటే దాదాపు 20 ఏళ్లు చిన్నదైన ప్రత్యర్థితో పోటీపడి గెలవడం బాగుంది' అని వెల్లడించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ సంయమనం కోల్పోని 38 ఏళ్ల హంపి... క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపిక గురించి పెద్దగా ఆలోచించడం లేదని చెప్పింది. ప్రస్తుతానికి అమెరికా, నార్వేలో జరగనున్న టోర్నీలపైనే దృష్టి పెట్టినట్లు వెల్లడించింది. సాధారణంగా దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులను పడగొట్టే హంపి... తాజా టోర్నీలో మాత్రం ఆచితూచి ఆడింది. వివాదాలకు దూరంగా ఉండే... హంపికి సరైన సపోర్టింగ్ వ్యవస్థ ఉంటే మరిన్ని ఫలితాలు సాధిస్తుందని పుణే గ్రాండ్‌మాస్టర్ అభిజీత్ కుంటే అభిప్రాయపడ్డాడు. కెరీర్‌లో లెక్కకు మిక్కిలి టైటిల్స్ గెలిచిన హంపి క్యాండిడేట్స్ ప్రపంచ టైటిల్ మాత్రం ఒడిసి పట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో అభిజీత్ మాట్లాడుతూ.. 'హంపీ చాలా చక్కగా ఆడుతోంది. ఆమె ఆటలో ఆత్మవిశ్వాసం ఎక్కువ. చాలా ప్రశాంతంగా తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది. కానీ ప్రపంచ టైటిల్ సాధించేందుకు ఇదొక్కటే సరిపోదు. నిష్ణాతులైన బృందం ఆమెకు తోడ్పాటు అందించాలి. ఇప్పుడు ఆమె ఆట తీరు బాగలేదని కాదు కానీ... బలమైన మెంటారింగ్ అవసరం' అని అన్నాడు.

క్రీడాభివృద్ధికి 'కార్పొరేట్' సహకారం అవసరం

> **క్రీడా సమాఖ్యల తీరు మారాల్సిందే**
>
> - అథ్లెట్ల సౌకర్యార్థం డిజీలాకర్
> - క్రీడాకారులకు మెరుగైన ఉద్యోగావకాశాలు
> - కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



న్యూఢిల్లీ: భారత్‌లో క్రీడల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థల ఆర్థిక సహకారాన్ని కోరతామని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. భారత్‌లో క్రీడల సంస్కృతి పెరిగేందుకు, అథ్లెట్ల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మనదేశంలో ప్రతీ క్రీడాంశానికి ప్రత్యేక ఎక్సలెన్సీ కేంద్రం (సీఓఈ) ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు ఒనగూరే ప్రయోజనాలెన్నో ఉన్నాయన్నారు.

ఎక్సలెన్సీలతో ఎంతో మేలు

'ప్రతి క్రీడ కోసం ప్రత్యేకంగా అధునాతన సదుపాయాలతో ఒలింపిక్ సెంటర్ లేదంటే ఎక్సలెన్సీ కేంద్రం నిర్మించాలనేదే నా లక్ష్యం. వచ్చే పదేళ్లలో ఇలాంటి కేంద్రాల ద్వారా ప్రతిభావంతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అప్పుడు క్రీడా ప్రగతే మారుతుంది. ఇందుకోసం ప్రముఖ కార్పొరేట్ సంస్థల సహకారాన్ని కోరతాం. వారి నిధులతో ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో ఎక్సలెన్సీలను నిర్మించే యోచనలో ఉన్నాం. ప్రస్తుతం దేశంలో ఉన్న 23 జాతీయ ఎక్సలెన్సీ కేంద్రాలన్నీ ప్రభుత్వానివే! భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) ఆధ్వర్యంలోనే ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నాం. మనకన్నా చిన్న దేశాలు ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తున్నాయి. జపాన్, ఆస్ట్రేలియా, అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాల మోడల్‌ను అధ్యయనం చేశాం. మన ఎక్సలెన్సీలకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు, ప్రైవేట్ భాగస్వామ్యం కూడా తోడవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది.

వర్గపోరును సహించం

జాతీయ క్రీడా సమాఖ్యల పంథా మారాల్సిందే. ఏ సమాఖ్య అయినా సరే తమ ఆట, అథ్లెట్‌లకు సంబంధించిన అంశాలపైనే దృష్టి పెట్టాలి. క్రీడేతర అంశాలకు, వివాదాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా సమాఖ్యలో వర్గపోరును ఎట్టిపరిస్థితుల్లోనూ సహించం. దీని వల్ల ఆ క్రీడకు, అథ్లెట్‌కు వాటిల్లే నష్టమెంటో మాకు తెలుసు. కాబట్టి సమాఖ్యలన్నీ కూడా ఆయ క్రీడాకారుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ, వెన్నంటే తోడ్పాటు తదితర అంశాలను గుర్తుంచుకొని వ్యవహరించాలి. వర్గపోరుతో అథ్లెట్ల ప్రయోజనాల్ని దెబ్బతీసే సమాఖ్యల తీరును ఎంతమాత్రం ఉపేక్షించం.

ఐక్య కార్యచరణ సమితి అవసరం

భారత్ ఇదివరకు 2030 కామన్వెల్త్ క్రీడలకు బిడ్ వేసింది. దీనికి ముందే 2036 ఒలింపిక్స్ కోసం ప్రాథమిక దశలో ఆసక్తి వ్యక్తీకరణ బిడ్‌ను దాఖలు చేసింది. ఇలా మన సత్తా, సాధన సంపత్తిని అంతర్జాతీయ క్రీడా సమాఖ్యల ముందు గట్టిగా విశదీకరించేందుకు, లేదంటే ఏదైనా సమస్య తలెత్తితే పరిష్కరించుకునేందుకు ఒక ఐక్య కార్యచరణ సమితి అవసరం ఎంతో ఉంది. మన రెజ్లింగ్ సమాఖ్యకు అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య సమస్యలెదురయ్యాయి. ఐక్య సమితి ఉంటే మన వాదన వినిపించొచ్చు.

ప్రత్యేక డిజీలాకర్

ఆటగాళ్లు వారి ప్రదర్శనలు, వాళ్లకు అవసరమైన పత్రాలు, దరఖాస్తులు ఇకపై డిజిటలైజ్ చేస్తాం. అంటే ప్రతిదానికి వేర్వేరు పత్రాలు, దరఖాస్తులు అవసరముండవు. ఆటగాళ్ల ఘనతల్ని ప్రత్యేక డిజీలాకర్‌లో భద్రబరిచే కార్యక్రమాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తాం. ప్రతి జాతీయ క్రీడా సమాఖ్య విధిగా డిజీలాకర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సిందే. అయితే ఒలింపిక్ పతక విజేతలకు దరఖాస్తులు, పత్రాలు వ్యక్తిగతంగా డిజీలాకర్‌లో నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రపంచం యావత్తు చూసిన పతక విజేతల ఘనత ప్రత్యేకంగా లిఖించాలా?

కొండంత భరోసాగా ఉద్యోగాలు

క్రీడలను కెరీర్‌గా ఎంచుకొని కఠోరంగా శ్రమించి పతకాలు తెచ్చే క్రీడాకారులకు ఉద్యోగ భరోసా కూడా లభిస్తోంది. 25 వేల పైచిలుకు క్రీడకారులు వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులయ్యారు. ఈ స్థిరమైన ఆర్థిక భరోసా వల్ల ఆటగాళ్లు మరింత క్రీడల్లో రాణించేందుకు, రాటుదేలేందుకు, నాణ్యమైన శిక్షణ పొందెందుకు దోహదపడుతుంది.



దెకాథ్లాన్ ఈవెంట్ ముగిశాక సహచరులతో తేజస్విన్ (ఎడమ వైపు నుంచి ఏడో వ్యక్తి)

డెకాథ్లాన్ చాంప్ తేజస్విన్



తేజస్విన్

కొచ్చి: జాతీయ సీనియర్ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ మీట్‌లో పురుషుల డెకాథ్లాన్ ఈవెంట్‌లో ఢిల్లీకి చెందిన తేజస్విన్ శంకర్ స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. పది క్రీడాంశాల (100 మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్, 400 మీటర్లు, 110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్, జావెలిన్ త్రో, 1500 మీటర్లు) సమాహారమైన డెకాథ్లాన్‌లో తేజస్విన్ మొత్తం 7603 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో ఆసియా చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాన్ని (7527 పాయింట్లు) కూడా అధిగమించాడు. ఈ ఫలితంతో వచ్చే నెలలో దక్షిణ కొరియాలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో తేజస్విన్ డెకాథ్లాన్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు. యమన్‌దీప్ (రిలయెన్స్; 7226 పాయింట్లు) రజతం, జశ్బీర్ నాయక్ (ఒడిశా; 7156 పాయింట్లు) కాంస్యం సాధించారు. అయితే వీరిద్దరూ ఆసియా చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాన్ని అందుకోలేకపోయారు. పురుషుల ట్రిపుల్‌జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును సమం చేసి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. తమిళనాడుకు చెందిన ప్రవీణ్ ఫెడరేషన్ కప్‌లో జీఎస్‌డబ్ల్యూకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 23 ఏళ్ల ప్రవీణ్ 17.37 మీటర్ల దూరం దూకి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ప్రపంచ చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాన్ని (17.22 మీటర్లు) కూడా ప్రవీణ్ అధిగమించాడు. మహిళల లాంగ్‌జంప్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన శైలి సింగ్ బంగారు పతకాన్ని దక్కించుకుంది. శైలి 6.64 మీటర్ల దూరం దూకి 2002 నుంచి అంజూ జార్జి (6.59 మీటర్లు) పేరిట ఉన్న మీట్ రికార్డును బద్దలు కొట్టింది.



శైలి సింగ్

మెయిన్ 'డ్రా'కు దియా



ట్యునిస్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ట్యునిష్ కంటెండర్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణి దియా చిటాలె మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 107వ ర్యాంకర్ దియా చిటాలె 6-11, 11-9, 5-11, 11-2, 12-10తో ఎలీనా జహారియా (రొమేనియా)పై విజయం సాధించింది. భారత్‌కే చెందిన సుతీర్థ ముఖర్జీ, తనీషాలకు మాత్రం నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో సుతీర్థ 11-8, 3-11, 12-10, 10-12, 11-9తో ఈసీ హరాక్ (టర్కీ) చేతిలో, తనీషా 9-11, 7-11, 8-11తో లీనా హొచార్ట్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయారు. శుక్రవారం మొదలయ్యే మెయిన్ 'డ్రా'లో మహిళల సింగిల్స్‌లో మనిక బత్రా, ఆకుల శ్రీజ, యశస్విని, దియా... పురుషుల సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్, సత్యన్ జ్ఞానశేఖరన్, మానవ్ ఠక్కర్ బరిలో ఉన్నారు.

సెమీస్‌లో సమృద్ధి



అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. బాలుర విభాగంలో ముగ్గురు నెల్సన్ (55 కేజీలు), అభిజీత్ (61 కేజీలు), లక్షయ్ ఫొగాట్ (64 కేజీలు)... బాలికల విభాగంలో ఇద్దరు ప్రిన్సీ (52 కేజీలు), సమృద్ధి షిండే (55 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాలను ఖరారు చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో సమృద్ధి ఆర్ఎస్‌సీ (రిఫరీ స్టాప్స్ ద కంటెస్ట్) పద్ధతిలో ఉక్రెయిన్ బాక్సర్ సెనియా సవీనాను ఓడించగా... ప్రిన్సీ 5-0తో యెవా కుబనోవా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. బాలుర విభాగంలో నెల్సన్ ఆర్ఎస్‌సీ పద్ధతిలో వాంగ్ షెంగ్ యాంగ్ (చైనీస్ తైపీ)పై, అభిజీత్ 5-0తో బుర్హనోవ్ (కిర్గిస్తాన్)పై, లక్షయ్ 5-0తో లైత్ అజైలత్ (జోర్డాన్)పై గెలుపొందారు.

త్రుటిలో తప్పించుకున్నారు..

ఒకరు ప్లాన్ చేంజ్ చేసుకున్నారు.. మరొకరికి గుర్రపు స్వారీ దొరకలేదు.. ఇంకొందరైతే ఘటనకు కొద్దిసేపటి నుంచే అక్కడి నుంచి వెళ్లిపోయారు. పహల్గాం ఉగ్రదాడినుంచి త్రుటిలో తప్పించుకున్న పర్యాటకులు ఒక్కొక్కరిదీ ఒక్కో అనుభవం. దాడి భయానక పరిస్థితులను, క్షతగాత్రులకు సాయం చేయడానికి, సురక్షితంగా బయటపడేయడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టిన స్థానికుల ప్రయత్నాలను వారు గుర్తు చేసుకున్నారు.



పహల్గాంలో మంగళవారం ఉగ్రదాడి జరిగిన ప్రాంతంలో జవాన్ల పహారా

భయంతో నిద్రపట్టలేదు..

'అక్కడికి వెళ్లడానికి.. బైసారన్ లోయకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న సిటీ ట్యాక్సీ స్టాండ్ దగ్గర మేం ఉండగా గందరగోళం ప్రారంభమైంది. ప్రజలు కేకలు వేస్తూ పరుగులు తీస్తున్నారు. ఏం జరుగుతుందో మాకు అర్థం కాలేదు. ఆ తరువాత దాడి గురించి తెలిసింది. స్థానికుల సలహా మేరకు ఓ హోటల్‌ను సంప్రదించడంతో వారు వాహనాన్ని పంపి మమ్మల్ని అక్కడినుంచి తీసుకెళ్లారు. మేం తిరిగి వెళ్తుండగా అంబులెన్సులు, మిలిటరీ వాహనాలు పరుగులు పెట్టడం కనిపించింది. నా ఎనిమిదేళ్ల కొడుకు చాలా భయపడ్డాడు. మాట్లాడలేకపోయాడు. ఆ భయం రాత్రంతా కొనసాగింది. నిద్రకూడా పట్టలేదు. వెంటనే ప్రయాణాన్ని కుదించుకుని తిరిగి వచ్చేశాం.'అని ఆ భయానకమైన రోజును గుర్తు చేసుకున్నారు పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీకి చెందిన చంచల్ డే. దాడి జరిగిన సమయంలో ఆయన కుటుంబంతో కలిసి కశ్మీర్ పర్యటనలో ఉన్నారు. ''నేను మళ్లీ కశ్మీర్‌కు వెళ్లను. అక్కడికి వెళ్లాలన్న ఆలోచన వచ్చినా పునరాలోచిస్తాను. ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వం. నా ఆలోచన మాత్రం మా భద్రత గురించే'అని వారితో పాటు పర్యటనకు వెళ్లొచ్చిన డే మరదలు బసంతి తెలిపారు.

ప్లాన్ మారి ప్రాణాలతో బయటపడ్డాం..

మహారాష్ట్రలోని అకోలాకు చెందిన విశాల్ సంగోకర్, అతని భార్య దాడి జరిగిన రోజే బైసారన్‌ను సందర్శించాలనుకున్నారు. అదృష్టవశాత్తు వారి ప్లాన్ ఒక రోజు ముందుకు మారింది. 22న దాడి జరగగా, 21న అంటే ఒక రోజు ముందుగానే బైసారన్‌లో పర్యటించారు. ''ఒక రోజు ముందుగా వెళ్లడం మా అదృష్టం. లేకపోతే మేం కూడా బాధితుల్లో ఉండేవాళ్లం. మేం వెళ్లిన రోజు కూడా కొంత అసౌకర్యానికి గురయ్యాం. చుట్టుపక్కల ఎలాంటి సెక్యూరిటీ లేదు''అని పహల్గాం అనుభవాలు పంచుకున్నారు సంగోకర్. ప్రస్తుతం శ్రీనగర్‌లో ఉన్న వీరు త్వరలోనే అకోలాకు రానున్నారు.

డ్రైవర్ తన ఇంట్లో ఆశ్రయం కల్పించారు..

ధారశివ్ జిల్లాకు చెందిన రెండు కుటుంబాలు కూడా ఏప్రిల్ 22న సంఘటనా స్థలానికి మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ''అప్పటిదాకా ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకస్మిక దాడితో దిగ్భ్రాంతికి గురయ్యాం. 'ఏదో సమస్య ఉంది. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోదాం'అని స్థానికుడైన మా డ్రైవర్ మజీద్‌ఖాన్ చెప్పారు. మమ్మల్ని తీసుకెళ్లి వాళ్లింట్లో ఆశ్రయం కల్పించారు. మజీద్ మమ్మల్ని అప్రమత్తం చేయకుంటే పరిస్థితి మరోలా ఉండేది''అంటూ ఆనాటి వాతావరణాన్ని వారు గుర్తు చేసుకున్నారు.

గుర్రం దొరక్క ప్రాణాలు దక్కాయి..

సాంగ్లీకి చెందిన సంతోష్ జగ్దాలే కుటుంబం ఊహించని ట్విస్ట్‌తో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. దాడి జరిగిన రోజు ఉదయం వారు పహల్గాం వెళ్లాల్సి ఉంది. స్వారీ చేయడానికి గుర్రాలు దొరకలేదు. దీంతో బదులుగా సందర్శనకు మరొక ప్రదేశానికి వెళ్లారు. ''మేం తిరిగి వచ్చేసరికి దాడి జరిగింది. ఎక్కడ చూసినా సైన్యమే. సంతోష్ జగ్దాలే అనే పేరున్న పుణేకి చెందిన మరో వ్యక్తి చనిపోయాడు. దీంతో మా బంధువుల్లో భయాందోళనలు పెరిగి ఫోన్స్ చేశారు. నేను బతికే ఉన్నానని నిర్ధారించుకుని నెమ్మదించారు'అని సంతోష్ వివరించారు.

ప్రాణాలు కాపాడిన మటన్ రోగన్ జోష్..

కేరళలోని కొచ్చికి చెందిన 11 మంది సభ్యుల కుటుంబాన్ని మటన్ రోగన్ జోష్ ప్రాణాలతో బయటపడేసింది. వారి కుటుంబం ఏప్రిల్ 19న కశ్మీర్ చేరుకుంది. గుల్మార్గ్, సోన్మార్గ్ అందాలను ఆస్వాదిస్తూ రెండు రోజులు గడిపారు. బిజీ షెడ్యూల్ కారణంగా రెండు రోజుల పాటు మధ్యాహ్న భోజనం చేయలేదు. దీంతో.. బైసారన్ మైదానానికి వెళ్లడానికి ముందు ఏదైనా తినాలనుకున్నారు. ఆ రోజు ఉదయం కొంచెం ఆలస్యంగా బయలుదేరారు. రెండు రోజులుగా ఏం తినకపోవడంతో, కేవలం 15 నిమిషాల దూరంలో ఉన్న బైసారన్ చేరుకునే ముందు ఏదైనా తిందామని రోడ్డు పక్కన ఫుడ్‌స్టాల్ దగ్గర ఆగారు. మటన్ రోగన్ జోష్ ఉప్పగా ఉండటంతో తాజాగా చేయమని రెస్టారెంట్ సిబ్బందిని అడిగారు. తిని, బైసారన్‌కు తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించేపట్టికి గంట ఆలస్యమైంది. బైసారన్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉండగా గందరగోళం నెలకొంది. గుర్రాలు, ట్యాక్సీలు కిందకు వస్తున్నాయి. ప్రజలు కేకలు వేస్తున్నారు. స్థానిక భాష తెలియకపోవడంతో ముందుకు వెళ్దాం అనుకున్నారు. డ్రైవర్ స్థానికుడు కావడంతో ఎందుకైనా మంచిదని ఆరా తీశాడు. దాడి జరిగిందని, అప్పటికే భద్రతా బలగాలు రంగంలోకి దిగాయని సమాచారం తెలిసింది. వారికి ధైర్యం చెప్పిన డ్రైవర్ వెంటనే వాహనాన్ని వెనక్కి తిప్పాడు. క్షేమంగా హోటల్‌కు చేర్చాడు.

లేటైతే ప్రాణాలు పోయేవి..

నాందేడ్‌కు చెందిన కృష్ణ, సాక్షిల ప్రాణాలను ఓ పదిహేను నిమిషాలు కాపాడాయి. ఉగ్రవాదులు కాల్పులు జరపడానికి 15 నిమిషాల ముందే ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. తాము క్షేమంగా ఉన్నామని వివరిస్తూ వారు షేర్ చేసిన వీడియో వైరల్ అవుతోంది. ప్రస్తుతం తిరుగు ప్రయాణానికి విమాన టిక్కెట్ల కోసం ఎదురుచూస్తున్నారు. అస్సాంలోని బొంగైగావ్‌కు చెందిన బిశ్వజిత్ ఛటర్జీ కుటుంబం కూడా ఇలాగే ప్రాణాలు కాపాడుకుంది. గౌహతి మీదుగా ఏప్రిల్ 17న శ్రీనగర్‌కు చేరుకున్నవారు 19 వరకు గుల్మార్గ్‌లో ఉన్నారు. 20న పహల్గాంకు వచ్చారు. 20, 21 తేదీల్లో చాలా సరదాగా గడిపారు. 22వ తేదీన దాడి జరగడానికి రెండు గంటల ముందే బైసారన్ నుంచి వారు వెళ్లిపోయారు. వారు మరో ప్రదేశాన్ని సందర్శిస్తుండగా దాడి వార్త తెలిసింది. కాస్త ఆలస్యమైతే ఏమయ్యేదన్న ఆలోచన వస్తేనే భయమేస్తుందని వారు చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

నిర్భయంగా స్వేచ్ఛగా..



పహల్గాం విషాదం తర్వాత కూడా గురువారం జమ్మూకశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం గుల్మార్గ్‌లోని గొండోలా కేబుల్ కార్ స్టేషన్ వద్ద బారులు తీరిన పర్యాటకులు

దాడిని తీవ్రంగా ఖండించిన అరబ్ దేశాలు

ప్రధాని మోదీకి మాక్రాన్, మెలోనీ ఫోన్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రమూకలు 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉదంతాన్ని ఇరాక్, జోర్డాన్, ఖతార్ తదితర అరబ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు సంఘీభావం ప్రకటించిన ఈ దేశాలు, మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించాయి. యూరప్ దేశాల సమాఖ్య ఈయూ కూడా దారుణాన్ని ఖండించింది. భారత్‌కు సంఘీభావం తెలిపింది. లక్ష్యమేదైనా, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అందరూ ఖండించాల్సిందేనని స్పష్టం చేసింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. దేశ భద్రత, స్థిరత్వానికి భంగం కలిగించే ఇటువంటి శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అదేవిధంగా, పహల్గాం దాడి నేపథ్యంలో ప్రధాని మోదీకి గురువారం ఇటలీ ప్రధానమంత్రి మెలోనీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఫోన్ చేసి మాట్లాడారు. మృతుల కుటుంబాలకు వారు సానుభూతి తెలిపారు. అమాయకులను దారుణంగా పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకల పైశాచికాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మెలోనీ, మాక్రాన్‌లకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారని, దాడికి కారకులైన వారిని చట్టం ముందు నిలబెడతామని చెప్పారని విదేశాంగ శాఖ తెలిపింది.

బాధిత కుటుంబాలకు రూ.కోటి: బీఎస్ఈ

న్యూఢిల్లీ: పహల్గాం ఘటనలో అసువులు బాసిన వారి కుటుంబాలకు సాయంగా రూ.కోటి అందజేయనున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి(ఎన్ఎస్ఈ) చీఫ్ ఆశిష్‌కుమార్ చౌహాన్ గురువారం ప్రకటించారు. మృతుల కుటుంబాల సానుభూతి తెలిపిన ఆయన, రూ. కోటి మొత్తాన్ని వీరి వారసులకు అందజేస్తామన్నారు. అదేవిధంగా, పహల్గాం మృతుల కుటుంబాలకు సాయంగా రూ.5 లక్షలు ఇస్తామని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు.

నేడు కశ్మీర్‌కు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం జమ్మూకశ్మీర్ వెళ్లనున్నారు. పహల్గాం ఉగ్ర దాడి బాధితులను ఆయన పరామర్శించనున్నారు. అనంతనాగ్ వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్న బాధితులతో రాహుల్ మాట్లాడతారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. అమెరికా పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని తిరిగి వచ్చిన రాహుల్ గురువారం సీడబ్ల్యూసీ భేటీలో పాల్గొన్నారని తెలిపాయి. అనంతరం అఖిల పక్ష సమావేశంలోనూ ఆయన పాలుపంచుకున్నారు.

జమ్మూకశ్మీర్‌కు వెళ్లకండి

పహల్గాం ఉగ్రదాడి తర్వాత పౌరులకు అమెరికా హెచ్చరిక

న్యూయార్క్/వాషింగ్టన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో అమెరికా తమ పౌరులకు కొత్త ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ఉగ్రవాదుల దాడితో అశాంతి నెలకొనడంతో జమ్మూకశ్మీర్‌కు వెళ్లొద్దని పౌరులను హెచ్చరించింది. సాయుధ ఘర్షణలకు అవకాశం ఉన్నందున భారత్-పాక్ సరిహద్దుకు 10 కిలోమీటర్ల పరిధిలోకి వెళ్లొద్దని తమ పౌరులను కోరింది. ''కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడులు, హింసాత్మక పౌర అశాంతి నెలకొనే అవకాశం ఉంది. తూర్పు లద్దాఖ్, రాజధాని లేహ్ మినహా.. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లొద్దు. భారత్- పాక్ మధ్య నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి హింస సర్వసాధారణం. కశ్మీర్ లోయలోని పర్యాటక ప్రదేశాలు శ్రీనగర్, గుల్మార్గ్, పహల్గాంలలో కూడా అశాంతి ఉంటుంది''అని ట్రావెల్ అడ్వైజరీలో యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ పేర్కొంది.

రాణా పిటిషన్‌ను కొట్టేసిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడి కేసులో కీలక నిందితుడు తహవ్వుర్ రాణాకు కోర్టులో చుక్కెదురైంది. కుటుంబసభ్యులతో మాట్లాడుకునే అవకాశం కల్పించాలంటూ ఇతడు పెట్టుకున్న అర్జీపై గురువారం ప్రత్యేక కోర్టు జడ్జి చందర్ జిత్ సింగ్ విచారణ చేపట్టారు. తన క్షేమ సమాచారంపై కుటుంబసభ్యులు ఆందోళన చెందుతారని రాణా పేర్కొన్నాడు. కుటుంబసభ్యులతో మాట్లాడటం తన ప్రాథమిక హక్కని వాదించాడు. అయితే, కేసు విచారణ కీలక దశలో ఉందని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) తెలిపింది. అవకాశమిస్తే అతడు ముఖ్య సమాచారాన్ని కుటుంబసభ్యులతో పంచుకునే అవకాశముందని తెలిపింది. అందుకే, రాణాకు ఎలాంటి అవకాశం ఇవ్వరాదని తెలిపింది. ఇరు వర్గాల వాదనల అనంతరం రాణా పిటిషన్‌ను కొట్టివేస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

మీ కార్లు మాకు అవసరం లేదు

- 25శాతం సుంకాలు పెంచుతాం
- కెనడాకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: కెనడా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే కార్లపై ప్రస్తుతం ఉన్న 25 శాతం సుంకాన్ని మరింత పెంచనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. బుధవారం ఓవల్ కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కెనడాపై 25శాతం సుంకాలున్నాయని, కార్ల సుంకాలు మరింత పెంచుతానని చెప్పారు. కెనడా కార్లు అమెరికాకు అక్కర్లేదని, తమ కార్లను తామే తయారు చేసుకుంటామని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికాకు దిగుమతయ్యే ఆటోమొబైల్స్‌పై ట్రంప్ 25 శాతం సుంకం విధించిన తరువాత, కెనడా-యుఎస్-మెక్సికో వాణిజ్య ఒప్పందం ప్రకారం ఉత్పత్తి అయ్యే వాహనాలకు పాక్షిక మినహాయింపు ఉంది. ఇప్పుడు వాటికీ పెరిగే అవకాశం ఉంది.

28 మంది పాలస్తీనియన్లు మృత్యువాత

డెయిర్ అల్-బలాహ్: ఇజ్రాయెల్ సైన్యం గురువారం గాజా వ్యాప్తంగా యథేచ్ఛగా సాగించిన దాడుల్లో కనీసం 28 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు మహిళలు, చిన్నారులు ఉన్నట్లు ఆరోగ్య విభాగం తెలిపింది. జబాలియాలోని పోలీస్ స్టేషన్‌పై జరిగిన దాడిలో 9 మంది చనిపోయారని వెల్లడించింది. అయితే, ఇక్కడ ఇస్లామిక్ జిహాద్ మిలిటెంట్ గ్రూప్, హమాస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నడుస్తోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఖాన్‌యూనిస్‌పై జరిగిన మూడు వేర్వేరు దాడుల్లో ఒక మహిళ, ముగ్గురు చిన్నారులు సహా ఏడుగురు మృతి చెందారు. సెంట్రల్ గాజాపై జరిగిన మరో దాడిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు అసువులు బాశారు.

శాంతిస్థాపనే లక్ష్యంగా సిమ్లా ఒప్పందం

పహల్గాంలో హేయమైన ఉగ్రదాడి తర్వాత సింధూ నదీజలాల ఒప్పందం అమలును నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించాక అందుకు ప్రతీకార నిర్ణయంగా పాకిస్తాన్ రెచ్చగొట్టే నిర్ణయం తీసుకుంది. ఇరు దేశాల మధ్య సమస్యల పరిష్కారంలో మూడో దేశం జోక్యం చేసుకోవద్దనే ప్రధాన అజెండాగా రూపుదిద్దుకున్న సిమ్లా ఒప్పందం నుంచి పక్కకు జరుగుతున్నట్లు పాక్ ప్రకటించింది. దీంతో దశాబ్దాలుగా రావణకాష్టంగా రగలిపోతున్న కశ్మీర్ అంశంలో ఇకపై అమెరికా వంటి సంపన్న దేశాలు పెద్దమనిషిలా దూరిపోయి అంశాన్ని మరింత జటిలం చేసే ప్రమాదముందనే సంకేతాలు వినవస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు సిమ్లా ఒప్పందంలో ఏమేం అంశాలు ఉన్నాయి?. వాటి ప్రాధాన్యత ఏమిటి? అనే చర్చ ఇప్పుడు మొదలైంది.

1972లో సాకారం..

తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా విమోచన పొందడంలో భారత ప్రమేయాన్ని తీవ్రంగా తప్పుబడుతూ భారత్‌పైకి పాకిస్తాన్ దాడికి తెగించడం తదనంతర పరిణామాలతో 1971 యుద్ధం జరిగింది. 1971లో భారత్, పాక్‌ల మధ్య యుద్ధం ముగిశాక శాంతిస్థాపనే లక్ష్యంగా ఒక ఒప్పందానికి ఇరుదేశాలు మొగ్గుచూపాయి. ఉద్రిక్త పరిస్థితులను తగ్గించుకుని, సాధారణ పరిస్థితులు నెలకొనడమే లక్ష్యంగా ఒక ఒప్పందానికి ఇరుదేశాలు పచ్చజెండా ఊపాయి. పొరుగు దేశ సరిహద్దు ప్రాంతాన్ని ఆక్రమిస్తూ నియంత్రణ రేఖను ఇష్టమొచ్చినట్లు ఏకపక్షంగా మార్చకూడదనే కట్టుబాటుతో ఈ ఒప్పందం చేసుకున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా పట్టణంలో 1972 జూలై రెండో తేదీన నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్తాన్ అధ్యక్షుడు జుల్ఫి కర్ అలీ భుట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. యుద్ధం ముగిసిన వెంటనే శాంతిస్థాపనకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ఇరుదేశాలు తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంగా ఈ ఒప్పందం పేరొందింది. ఇకపై పొరుగుదేశాలుగా పరస్పర సహకారం, సామరస్యంతో మెలుగుతామని ఆనాడు ఇరుదేశాలు ప్రతినబూనాయి.

ఒప్పందంలో ఏమేం ఉన్నాయి?

భవిష్యత్తులో సరిహద్దుసహా మరే అంశంలోనైనా మనస్పర్థలు తలెత్తినా, వివాదాలు చెలరేగినా మూడో దేశానికి లేదా అంతర్జాతీయ సంఘంలో ఫిర్యాదుచేయకుండా రెండు దేశాలు మాత్రమే కూర్చుని మాట్లాడుకోవాలని సిమ్లా ఒప్పందంలో పేర్కొన్నారు. మూడో దేశం జోక్యాన్ని ఈ ఒప్పందం నివారిస్తోంది. 1971లో యుద్ధం సమయంలో సరిహద్దు దాటి ముందుకు చొచ్చుకురావడం, మరి కొన్ని చోట్ల భూభాగాన్ని కోల్పోవడం వంటి ఘటనలు జరిగాయి. ప్రస్తుతం తమ అధీనంలోని భూభాగాలను తమవిగా పేర్కొంటూ, యథాతథ స్థితిని కొనసాగించాలంటూ దానినే నియంత్రణ రేఖగా ఇరుదేశాలు అంగీకరించాయి. ఈ నియంత్రణ రేఖను ఏకపక్షంగా మార్చడానికి వీలులేదు. యుద్ధం వేళ చాలా మంది పాకిస్తానీ సైనికులను భారత బలగాలు బంధించాయి. ఈ ఒప్పందంలో భాగంగా వారందరినీ విడిచిపెట్టారు. పాకిస్తాన్ సైతం బంగ్లాదేశ్ సాధించిన సార్వభౌమత్వాన్ని అధికారికంగా గుర్తించింది. బంగ్లాదేశ్‌తోనూ పరస్పర గౌరవం పాదుకొల్పడమే లక్ష్యంగా ఈ అంశాన్నీ సిమ్లా ఒప్పందంలో చేర్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఒప్పందం ప్రభావం ఎంత ?

ఈ ఒప్పందం కారణంగా తదనంతరకాలంలో ఇరు దేశాల మధ్య పొరపొచ్చాలు వచ్చిన ప్రతిసారీ ఈ రెండు దేశాలే సమస్యలను పరిష్కరించుకున్నాయిగానీ మరే ఇతర దేశాన్ని మధ్యవర్తిగా ఆహ్వానించలేదు. చర్చలు రెండు దేశాల మధ్యే పరిమితం కావడంతో వేగంగా సంప్రతింపులు సాధ్యమయ్యాయి. మెరుగైన పరిష్కారం సాధ్యమైంది. కశ్మీర్‌లో నియంత్రణ రేఖనే వాస్తవాధీన రేఖగా అప్పటి నుంచి కొనసాగింది. దీంతో ఆనాటి నుంచి ఎలాంటి సరిహద్దు ఆక్రమణ ఘటనలు జరగలేదు. ఇలా ఈ ఒప్పందం భూభాగాల వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించింది. దౌత్యపరంగా సంబంధాల కొనసాగింపునకు ఈ ఒప్పందం సుసాధ్యం చేసింది. ఇరుదేశాల మధ్య విశ్వాసం పెంచే ప్రయత్నాలు ఈ ఒప్పందం కారణంగానే జరిగాయి. అయితే ఇరువైపులా కాల్పుల విరమణ ఒప్పందం వంటివి తరచూ ఉల్లంఘనకు గురవడం ఒక్కటే ఈ ఒప్పందం మనుగడకు సవాల్‌గా నిలిచింది. తాజాగా పాకిస్తాన్ ఈ ఒప్పందం నుంచి తప్పుకుంటే కశ్మీర్ అంశంపై పాక్ అనుకూల దేశాలు మధ్యవర్తులుగా బయల్దేరే ప్రమాదముంది. అప్పుడు కశ్మీర్ మా ఇద్దరికి మాత్రమే సంబంధించిన అంశం అనే భారత వాదన అంతర్జాతీయ వేదికలపై కాస్తంత బలహీనపడే అవకాశముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



కేంద్రం ఆదేశాల నేపథ్యంలో గురువారం అటారీ-వాఘా వద్ద సరిహద్దు గుండా భారత్ నుంచి తిరిగి వెళ్తున్న పాక్ పౌరులు



అటారీ-వాఘా బోర్డర్ పోస్ట్ వద్ద బారికేడ్లు అడ్డుగా ఉంచి డేగకళ్లతో పహారా కాస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు



అటారీ-వాఘా బోర్డర్ చెక్ పోస్ట్ వద్ద పాక్‌లోకి అనుమతి నిరాకరించడంతో వెనుదిరుగుతున్న భారత పౌరులు

గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి

- పహల్గాం ఘటనకు పాకిస్తానే సూత్రధారి
- సీడబ్ల్యూసీ తీర్మానం..మృతులకు ఘన నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ముమ్మాటికీ భావోద్వేగాలను రెచ్చగొట్టే చర్యేనని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రకటించింది. ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండించింది. ''ఈ ఘటనకు పాకిస్తానే సూత్రధారి. ఈ ఉగ్రవాద చర్య మన గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి హిందువులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంది. ఇటువంటి తీవ్రమైన రెచ్చగొట్టే చర్యలను, సీమాంతర ఉగ్రవాదాన్ని సమష్టిగా, దృఢసంకల్పంతో ఎదుర్కోవాలని పునరుద్ఘాటిస్తున్నాం'' అంటూ సీడబ్ల్యూసీ పేర్కొంది. గురువారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ అత్యవసర సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకతోపాటు, కేసీ వేణుగోపాల్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు ఒక క్షణం మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన సీడబ్ల్యూసీ, అనంతరం ఉగ్రవాద దాడిని ఖండిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది.

నిఘా వైఫల్యాలపై విశ్లేషణ అవసరం..

ప్రభుత్వ నిఘా వైఫల్యాన్ని ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ఎత్తి చూపింది. 'పహల్గాం మూడంచెల భద్రతా వ్యవస్థ కలిగి ఉండే శత్రుదుర్భేధ్యమైన అత్యంత భద్రత కలిగిన ప్రాంతం. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఒక కేంద్రపాలిత ప్రాంతం. అలాంటి ప్రాంతంలో ఇంతటి తీవ్ర దాడి చోటుచేసుకుంది. ఈ సమయంలో నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపై సమగ్ర విశ్లేషణ చేపట్టాల్సిన అవసరం విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఎంతో అవసరం. బాధిత కుటుంబాలకు నిజంగా న్యాయం జరిగే ఏకైక మార్గం ఇదే'అని సీడబ్ల్యూసీ పేర్కొంది. ''లక్షలాది మంది పాల్గొనే అమర్‌నాథ్ యాత్రకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. చేయాలి. పర్యాటకంపై ఆధారపడ్డ కశ్మీర్ ప్రజల జీవనోపాధిని కాపాడాలి'' అని కేంద్రానికి సూచించింది.

రాజకీయ ప్రయోజనాలొద్దు..

ప్రజల్లో విభజన బీజాలు నాటేందుకు పహల్గాం దాడిని బీజేపీ అధికారిక, అనుకూల సోషల్ మీడియా వేదికలు వాడుకోవడం దారుణమని సీడబ్ల్యూసీ తెలిపింది. కాగా, పహల్గాం దాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించేందుకు శుక్రవారం పార్టీ శ్రేణులు అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో క్యాండిల్‌మార్చ్ నిర్వహిస్తాయని అనంతరం కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

కీవ్‌పై రష్యా భీకర దాడి.. 9 మంది మృతి

దాడులు ఆపాలని పుతిన్‌ను కోరిన ట్రంప్

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా విరుచుకుపడింది. గురువారం రష్యా ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లతో కీవ్ దద్దరిల్లింది. దాదాపు 11 గంటల పాటు కొనసాగిన దాడుల్లో 9 మంది చనిపోగా 70 మందికి పైగా గాయపడ్డారు. హెచ్చరిక సైరన్ల మోతల మధ్యే కీవ్ వాసులు రాత్రంతా బాంబు షెల్టర్లలోనే గడిపారు. గతేడాది జూలై తర్వాత కీవ్ లక్ష్యంగా రష్యా చేపట్టిన అతిపెద్ద దాడి ఇదేనని పరిశీలకులు అంటున్నారు. కాగా, శాంతి యత్నాలు వేగం పుంజుకుంటున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.దక్షిణాఫ్రికాలో ఉన్న అధ్యక్షుడు జెలెన్‌స్కీ దాడుల విషయం తెలిసిన వెంటనే పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని స్వదేశానికి చేరుకున్నారు. కీవ్‌తోపాటు ఇతర ప్రాంతాలే లక్ష్యంగా రష్యా 66 క్రూయిజ్, బాలిస్టిక్ మిస్సైళ్లను, నాలుగు నాలుగు క్షిపణులను, 145 షహీద్ డ్రోన్లను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. దాడుల కారణంగా పెద్ద సంఖ్యలో భవనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నారని పేర్కొంది. భవనాలు మంటల్లో చిక్కుకున్నాయని తెలిపింది. కీవ్‌లో రెండంతస్తుల భవనం నేలమట్టం కాగా సమీప భవనాలు దెబ్బతిన్నాయి.

వ్లాదిమిర్, ఆపండి..!

రష్యా దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. దాడులను వెంటనే ఆపాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కోరారు. 'కీవ్‌పై దాడులు కొనసాగించడం ఏమాత్రం బాగోలేదు. దాడులకిది సరైన సమయం కాదు, ఆ అవసరం లేదు. వ్లాదిమిర్, ఆపండి! ఈ యుద్ధంతో వారానికి కనీసం 5 వేల మంది సైనికులు చనిపోవడమో, గాయపడటమో జరుగుతోంది. శాంతి ఒప్పందం కుదుర్చుకుందాం రండి'అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా అర్థించారు. కాగా, ఉక్రెయిన్‌లోని పౌర నివాస ప్రాంతాలే లక్ష్యంగా రష్యా చేపడుతున్న దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖండించడం ఇదే మొదటిసారి. క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యాకు వదిలేసి, శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని చేసిన ప్రతిపాదనను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తిరస్కరించడంపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాత్రం..శాంతి యత్నాలు మానేసి దాడులు కొనసాగిస్తున్న రష్యాపైనే కాల్పుల విరమణ ఒప్పందం ఆధారపడి ఉందని తేల్చి చెబుతున్నారు. అయితే, ఇరు పక్షాలు అంగీకారానికి రాని పక్షంలో యుద్ధాన్ని నిలువరించి, శాంతిని నెలకొల్పేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను వదిలేస్తామని అమెరికా సీనియర్ అధికారులు హెచ్చరించారు.

బుద్ధుడి శిష్యులకు బోధించిన సారాన్ని ఏమంటారు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

పురుషార్థాలు

హిందూ సమాజ వ్యవస్థలో ప్రతి వ్యక్తికీ పురుషార్థాలు మార్గదర్శక సూత్రాలుగా వ్యవహరిస్తాయి. పురుషార్థాలు 4. అవి..

ధర్మం, అర్థం, కామం, మోక్షం.

ధర్మం

హిందూ జీవనంలో ధర్మం అనే భావానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ధర్మం అనే పదం సంస్కృతంలోని 'ధృ' అనే ధా తువు నుంచి వచ్చింది. 'ధృ' అంటే కలిపి ఉంచు, నిలబెట్టు అని అర్థం. ధర్మం మానవుడి ప్రవర్తనను క్రమబద్ధం చేస్తుంది. సమాజానికి ఏది ఆమోద యోగ్యమో, దానికి అనుగుణంగా వ్యక్తి జీవించాలి. నీతి, నిజాయతీ, నైతిక ప్రవర్తన గురించి ధర్మం చెబుతుంది. 'ధర్మం'అనే పదాన్ని అనేక సందర్భాల్లో అనేక అర్థాల్లో వాడారు.

ఐతరేయ బ్రాహ్మణం: విశ్వానికంతటికీ మూలం ధర్మం. ప్రజలు మార్గదర్శకత్వం కోసం ధర్మం గురించి బాగా తెలిసిన వ్యక్తి వద్దకు వెళతారు. ధర్మం వల్ల దుష్టత్వాన్ని పారద్రోలవచ్చు. ప్రతిదీ ధర్మం మీదే ఆధారపడి ఉంది. అందువల్ల ధర్మం అత్యుత్తమ సుగుణం.

మహాభారతం: ప్రజల్లో శక్తి, ప్రభావం కలగడానికి ధర్మాన్ని వివరించారు. ధర్మం అహింసతో కూడింది, దృఢమైంది. అది ప్రపంచాన్ని నిలబెడుతుంది. సృష్టిలోని ఏ జీవికీ హాని చేయకుండా ఉండేది కచ్చితంగా ధర్మం.

వైశేషిక సూత్రాలు: భౌతిక లాభం, ఆధ్యాత్మిక సుగుణం దేని నుంచి కలుగుతాయో అదే ధర్మం.

మహానారాయణోపనిషత్తు: జగత్ అంతటికీ మూలం ధర్మం. ధర్మాన్ని శ్రద్ధగా పాటించేవారిని ప్రజలు ఆశ్రయిస్తారు. ధర్మం ద్వారా పాపాలను పోగొట్టుకుంటారు. ధర్మం అత్యంత సుగుణం. 'సు' అంటే మంచి అని అర్థం. గుణం అంటే లక్షణం అని అర్థం.

జైమిని ప్రకారం: వేదాలు సూచించే, ఆశించే ఫలితం లేదా ఆశయమే ధర్మం.

మనుస్మృతి ప్రకారం: పక్షపాత బుద్ధితో కాకుండా, నీతి నిజాయతీలతో రాగద్వేషాలను వీడి మనసా, వాచా, కర్మణా జీవించే పవిత్ర జీవన విధానమే ధర్మం. ప్రతి వస్తువుకు గమనించదగ్గ నైసర్గిక ధర్మం ఉంటుంది.

» మానవుడు ఆచరించాల్సిన ధర్మాలను గురించి యాజ్ఞవల్క్యుడు తొమ్మిది ధర్మ సుగుణాలను వివరించాడు. అవి.. అహింస, నిర్మలత్వం, నీతి, పరిశుభ్రత, ఇంద్రియ నిగ్రహం, దానం, ఆత్మనిగ్రహం, ప్రేమ, సహనం

» ఈ తొమ్మిది ధర్మగుణాల్లో మొదటి ఆరు ధర్మగుణాలు సమాజ మనుగడకు, మిగతా మూడు ధర్మాలు వ్యక్తి సత్ప్రవర్తనకు తోడ్పడతాయి.

ధర్మం లక్షణాలను కింది విధంగా గ్రహించవచ్చు.

1. ప్రజల శ్రేయస్సు కోసం ధర్మం ఉంది.
2. ఇతరులకు హాని చేయరాదు అనే భావం ఇందులో ఉంది.
3. ధర్మం వ్యక్తి నడవడిక నియమాలను, జీవన విధానాన్ని సూచిస్తుంది.
4. ధర్మం ఆనందానికి మూలం
5. ఏకీకృతం చేయడానికి ధర్మం ఉపకరిస్తుంది.
6. ధర్మం కర్తవ్యాన్ని సూచిస్తుంది.
7. ధర్మం సామాజిక విలువలకు, సాంస్కృతిక ప్రమాణాలకు ప్రతీకగా ఉంటుంది.

» హిందూ సామాజిక వ్యవస్థలో ధర్మం అత్యంత ఉన్నతమైంది, ఉత్కృష్టమైంది.

అర్థం

దీన్నే సంపద, ఐశ్వర్యం అంటారు. సంపద వల్ల శారీరక సుఖం కలుగుతుంది. అంటే వ్యక్తి అవసరాలను తీర్చడానికి అర్థం ఉపయోగపడుతుంది. కౌటిల్యుడి 'అర్థశాస్త్రం' అర్థం విలువను వివరించింది. ధనాన్ని అక్రమ మార్గాల ద్వారా సంపాదించరాదు. అర్థం ఎక్కువ చలామణిలో ఉండటంవల్ల వ్యక్తులు, సమాజం అభివృద్ధి జరుగుతుంది.

కామం

కామం అంటే కోరిక. ఇంద్రియ వాంఛలను తృప్తి పరచుకోవడం కామం. గృహస్థాశ్రమంలో వ్యక్తికి కామం సహజం. కామం కేవలం శారీరక వాంఛలకు మాత్రమే పరిమితం కాదు. నృత్యం, సంగీతం, నటన కళారూపాలు మొదలైన వాటిలో కూడా కోరిక ఉంది. కామం వివాహానికి, సంతాన ప్రాప్తికి మూలం. ధర్మంతో కూడిన కామం అంగీకార యోగ్యం. కాబట్టి ప్రతి వ్యక్తీ కామాన్ని క్రమబద్ధం చేసుకోవాలి. ద్విజులలో సంతానో త్పత్తికి మాత్రమే కామాన్ని ఉద్దేశించారు.

ధర్మం, అర్థం, కామాలను త్రివర్గాలు అని పిలుస్తారు. పురుషార్థాలలో కామానికి తక్కువ ప్రాధాన్యమిచ్చి ధర్మానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

మోక్షం

ప్రతి హిందువు తుది లక్ష్యం మోక్ష సాధన. మోక్షం అంటే 'ఆత్మను పరమాత్మలో మిళితం చేయడం'. మోక్షసాధన అంటే ప్రతి వ్యక్తి ఆత్మ సాక్షాత్కారం లేదా అంతరంగిక ఆధ్యాత్మికతను సాధించడం. ధర్మ, అర్థ, కామ పరిపూర్ణత ఇందులో ఉంటుంది. కర్మం, జ్ఞానం, భక్తి అనే మూడు మార్గాల ద్వారా మోక్షం లభిస్తుంది. భగవద్గీతలో మోక్షాన్ని పరాగతిగా వర్ణించారు.

బౌద్ధ సంగీతులు

బౌద్ధ సంగీతి	కాలం	నగరం	రాజు	అధ్యక్షుడు	కారణం	ప్రాధాన్యం
మొదటి సంగీతి	క్రీ.పూ.483 (బుద్ధుడు మరణించిన వెంటనే)	రాజగృహం	అజాతశత్రువు	మహాకశ్యప	బుద్ధుడి బోధనలను గ్రంథస్తం చేయడానికి	ఆనందుడు 'వినయ', ఉపాలి 'సుత్త' అనే పీటికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు.
రెండో సంగీతి	క్రీ.పూ.383	వైశాలి	కాలాశోకుడు	సభాకమి	బౌద్ధమతంలో విభేదాలను పరిష్కరించడానికి	బౌద్ధమతం థేరవాదులు(మార్పు కోరని వారు), మహాసాంఘికులు(మార్పు కోరే వారు)గా చీలిపోయింది.
మూడో సంగీతి	క్రీ.పూ.250	పాటలీ పుత్రం	అశోకుడు	మొగలిపుత్రతిస్స	బౌద్ధమతానికి సంబంధించిన అనేక విషయాలను చర్చించడానికి	అభిదమ్మ పీఠికను సంకలనం చేశారు.
నాలుగో సంగీతి	క్రీ.శ. 1వ శతాబ్దం	కుందలవనం కశ్మీర్	కనిష్కుడు	వసుమిత్రుడు	18 శాఖల మధ్య ఐక్యత సాధించడానికి	బౌద్ధమతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

బౌద్ధమతం

గౌతమబుద్ధుడు రుమిందై గ్రామ సమీపంలోని లుంబినివనంలో జన్మించాడు. అతడి తండ్రి కపిలవస్తు పాలకుడైన శుద్ధోదనుడు, తల్లి మహామాయ. గౌతమబుద్ధుడి అసలు పేరు సిద్ధార్థుడు. గౌతమబుద్ధుడు పుట్టిన ఏడు రోజులకే అతడి తల్లి మహామాయ మరణించింది. సవతితల్లి మహా ప్రజాపతి గౌతమి పెంచడంతో అతడికి గౌత ముడిగా పేరొచ్చింది. బుద్ధుణ్ని పెంచిన 'గౌతమి ప్రజాపతి' బౌద్ధమతంలో తొలి సన్యాసిని. బుద్ధుడి భార్య యశోధర, కుమారుడు రాహు లుడు.

బుద్ధుడు తన 29వ ఏట ఒక వృద్ధుణ్ని, ఒక వ్యాధిగ్రస్తుణ్ని, ఒక సన్యాసిని, ఒక శవాన్ని చూశాడు. వీటిని చూసిన బుద్ధుడు కలత చెంది ఇల్లు వదిలి జ్ఞానాన్వేషణకు బయల్దేరాడు. సంరక్షకుడైన చెన్న సహాయంతో 'కంఠక' అనే గుర్రం మీద బుద్ధుడు బయల్దేరాడు. దీన్నే మహా భినిష్క్రమణ అంటారు. జ్ఞానాన్వేషణలో భాగంగా బుద్ధుడు రెండేళ్లపాటు వైశాలిలో అలారక లామ వద్ద ధ్యాన విధానాన్ని నేర్చుకున్నాడు. రాజగృహంలో ఉద్రక(ఉద్దక) వద్ద కొన్ని రోజులు శిష్యరికం చేశాడు. గురువుల వద్ద తనకు కావాల్సిన సమాధానం లభించలేదు. దీంతో ముక్తి కోసం 15 రోజులు ఉపవాసం ఉన్నాడు. గౌతముడు స్పృహ కోల్పోయిన దశలో సుజాత అనే స్త్రీ అతడి ప్రాణాలను కాపాడింది.

గౌతమ బుద్ధుడు బుద్ధగయ వద్ద బోధివృక్షం కింద 49 రోజులు ధ్యానం చేశాడు. ఇక్కడే జ్ఞానోదయం (మహాసంబోధి) పొంది బుద్ధుడయ్యాడు (బుద్ధుడు అంటే తథాగతుడు -నిజాలను తెలుసు కున్న వాడు అని అర్థం). తర్వాత కఠోర ఆహార నియమాలు, సాధనలు చేయకూడదని అన్నీ మధ్యస్తంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. అందుకే బుద్ధుడు ప్రవచించిన మార్గాన్ని మధ్యేమార్గం అంటారు. మధ్యేమార్గం అంటే మనిషి పూర్తిగా సన్యాసిగా కాకుండా, పూర్తిగా భౌతిక కాంక్షలతో కాకుండా స్వీయ నిగ్రహశక్తితో జీవితాన్ని గడపటం. ఈ మార్గాన్ని అనుసరించిన ఏ వ్యక్తయినా అతడి సామాజిక నేపథ్యంతో నిమిత్తం లేకుండా ముక్తి పొందుతాడు.

ఉదా: ఐశ్వర్యానికి, పేదరికానికి మధ్య జీవించడం. బుద్ధుడు సిద్ధాంతాలను ప్రబోధించలేదు. కానీ ఆధ్యాత్మిక వికాసానికి ఒక హేతువాద మార్గాన్ని సూచించాడు. అందుకే బుద్ధుణ్ని అజ్ఞేయ వాది (Agnostic) అని పిలవవచ్చు. బుద్ధుడు సత్య దూరాలైన వేదాలను తిరస్కరించాడు. జంతు బలులను ఖండించి, క్లిష్ట సంస్కారాలను ఎదిరించాడు. హిందూ మతంలోని అసమానత్వం, కొన్ని మత ఛాందస భావాలను ముఖ్యంగా కుల వ్యవస్థను, బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించాడు. అందువల్ల బౌద్ధమతాన్ని మత ఉద్యమంగా కాకుండా ఒక సామాజిక ఉద్యమంగా చూడాలని కొందరి భావన. అందుకే బౌద్ధమతాన్ని రియాక్షనరీ రిలీజియన్ అని పిలుస్తారు.

బుద్ధుడు సారనాథ్‌లోని జింకలవనంలో కొండిన్య, అశ్వజిత్, బద్రుక, మహానామ, కశ్యప/ఉపాలి అనే అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. దీన్నే ధర్మచక్రపరివర్తనం అంటారు. బౌద్ధమత పుట్టుకగా 'సారనాథ్'ను పేర్కొంటారు. బుద్ధుడి శిష్యులకు బోధించిన సారాన్ని పంచశీల అంటారు.

పంచశీల సూత్రాలు..

- అసత్య (అసత్యం పలకరాదు)
- అసతేయ (దొంగతనం చేయరాదు)
- అపరిగ్రహ (ఆస్తిని కూడబెట్టరాదు)
- మత్తుమందులు సేవించరాదు
- వ్యభిచారం చేయరాదు

బుద్ధుడి బోధనలు

1. ఆర్యసత్యాలు
2. అష్టాంగ మార్గం
3. ప్రతిత్య సముత్పాదన (కార్యకారణ సిద్ధాంతం)
4. మధ్యేమార్గం

నిగ్రహశక్తిని కోల్పోయినవారు మానసికంగా బల హీనులయ్యే అవకాశముంది. కాబట్టి నిగ్రహాన్ని నిలబెట్టుకోవడానికి ఆర్యసూత్రాలు (లేదా) ఆర్యసత్యాలు, అష్టాంగ మార్గాన్ని పాటించాలని బుద్ధుడు చెప్పాడు.

బుద్ధుడి ఆర్యసత్యాలు

1. ప్రపంచం మొత్తం దుఃఖమయం
2. కోరికలే దుఃఖాలకు కారణాలు
3. దుఃఖ నిర్మూలనకు కోర్కెలను జయించాలి
4. దుఃఖ నిర్మూలనకు ఏకైక మార్గం అష్టాంగ మార్గం


బుద్ధుడి అష్టాంగ మార్గం:

1. సమ్యక్ ఆలోచన
2. సమ్యక్ వాక్కు
3. సమ్యక్ క్రియ
4. సమ్యక్ జీవనం
5. సమ్యక్ కృషి
6. సమ్యక్ నిశ్చయం
7. సమ్యక్ విశ్వాసం
8. సమ్యక్ దృష్టి

ప్రతిత్య సముత్పాదన: దీన్నే కార్యకారణ సిద్ధాంతం అంటారు. ఇది బుద్ధుడి తత్వం. అంటే కర్మల వల్లే జీవుడు బంధ విముక్తుడు అవుతాడు.

బౌద్ధ సమావేశాలు: బౌద్ధ సమావేశాలనే బౌద్ధ సంగీతులు అంటారు. వినయ, సుత్త, అభిదమ్మ పీఠికలను త్రిపీఠకాలంటారు.

రాంచింగ్ మండలంలో ఉన్న దేశం ఏది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

వ్యవసాయం

ప్రముఖ ఆర్థిక భౌగోళిక శాస్త్రజ్ఞుడు విట్లిసీ కింద సూచించిన వ్యవసాయ వ్యవస్థలను గుర్తించాడు.

- సాంద్ర జీవనాధార వ్యవసాయం
- విస్తార వాణిజ్య వ్యవసాయం
- మిశ్రమ వ్యవసాయం
- వాణిజ్య పండ్ల తోటల సాగు
- మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్
- ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్
- వాణిజ్య పాడి మండలం
- వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)
- పోడు వ్యవసాయం
- సంచార పశు పోషణ

సాంద్ర జీవనాధార వ్యవసాయం

ఆయనరేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాలకు చెందిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమల్లో ఉంది. ఇండియా, చైనా, బ్రెజిల్, థాయ్‌లాండ్, మెక్సికో, ఈజిప్ట్ లాంటి వ్యవసాయ ప్రధాన దేశాల్లోని వ్యవసాయ వ్యవస్థలు ఈ కోవకు చెందినవి. సాంద్ర వ్యవసాయంలో పంటల తీవ్రత అధికం. పెద్ద మొత్తాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు నీటిని వాడతారు. వ్యవసాయ భూకమతాల సగటు పరిమాణం చాలా తక్కువ. జనాభాలో అధిక శాతం ప్రత్యక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడతారు. కాబట్టి వ్యవసాయ భూమిపై ఒత్తిడి అధికం. ప్రధానంగా ఆహార పంటలను పండిస్తారు. జనాభా, జనసాంద్రతలు అధికంగా ఉండటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా దేశీయంగానే వినియోగిస్తారు. మిగులు లేకపోవడంతో ఎగుమతులు అత్యల్పం. వ్యవసాయంలో శ్రామిక శక్తిని అధికంగా వినియోగిస్తారు. సగటు వ్యవసాయ భూమికి దిగుబడులు అధికంగా ఉన్నప్పటికీ, తలసరి దిగుబడులు కనిష్ఠంగా ఉంటాయి. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉంటుంది. ఈ వ్యవసాయ మండలంలో రైతుల ఆదాయాలు స్వల్పంగా ఉంటాయి. రైతులు తమ గృహ అవసరాల ఆధారంగా పంటలను ఎంచుకుంటారు.

విస్తార వాణిజ్య వ్యవసాయం

ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాల్లో విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉంది. వ్యవసాయంపై ఆధారపడే శ్రామిక జనాభా శాతం చాలా తక్కువ. వ్యవసాయం లో యాంత్రీకరణ స్థాయి అధికం. వ్యవసాయ భూకమతాలు చాలా పెద్దవి. ఉదాహరణకు యూఎస్‌ఏలో సగటు భూకమతాల పరిమాణం 1000-1400 హెక్టార్లు. పంటల తీవ్రత సాంద్ర వ్యవసాయ మండలంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.

ప్రపంచ మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మండలంలో పంటలు పండిస్తారు. జనాభా, జనసాంద్రత తక్కువగా ఉండటం వల్ల స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం తక్కువ. మిగులు వ్యవసాయ ఉత్పత్తుల వల్ల పెద్ద మొత్తాల్లో ఎగుమతి చేస్తారు. విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉండే యూఎస్‌ఏ, కెనడా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాలు ప్రపంచంలో ప్రధాన వ్యవసాయ ఎగుమతిదారులు. ఈ మండలాన్ని ప్రపంచ ధాన్యాగారంగా అభివర్ణిస్తారు. ఈ తరహా వ్యవసాయం విస్తారంగా పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకొని ఉంది.

మిశ్రమ వ్యవసాయం

పంటలతోపాటు పశుపోషణ కోసం కూడా వ్యవసాయ భూమిపై ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు. ఈ తరహా వ్యవసాయంలో పంటల నుంచి వచ్చిన రొట్టను, వ్యవసాయ ఉత్పత్తులను పశుగ్రాసంగా వాడతారు. పశువుల మేతకోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లు ఉండవు. అయితే జీవనాధార వ్యవసాయంలా కాకుండా, ఈ మండలంలో వ్యవసాయ పంటలు, పశుపోషణ వాణిజ్య తరహాలో జరుగుతుంది. పశ్చిమ, మధ్య ఐరోపాల్లో వ్యవసాయం ఈ కోవకు చెందింది. ఈ మండలంలో సగటు వ్యవసాయ భూకమతాల పరిమాణం మధ్యస్థంగా (100-200 హెక్టార్లు) ఉంటుంది.

వాణిజ్య పండ్ల తోటల సాగు

మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం. కవోష్ణ వాతావరణం వల్ల ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన పండ్ల తోటలు ఇక్కడ సాగవుతాయి. మధ్యధరా తీరంలోని ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, గ్రీస్, మొరాకో, అల్జీరియా, ట్యునీషియా ప్రాంతాలు, దక్షిణాఫ్రికాలోని కేప్ ప్రాంతం, యూఎస్‌ఏలోని కాలిఫోర్నియా తీరం, మధ్య చిలీ, ఇజ్రాయెల్ తీర ప్రాంతాలు ఈ వ్యవసాయ మండలం కిందకు వస్తాయి. ఈ ప్రాంతాల్లో బత్తాయి, నిమ్మ, ద్రాక్ష, నారింజ, దానిమ్మ లాంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను వాణిజ్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇది పెట్టుబడితో కూడుకున్న వ్యవసాయం. పండ్ల రసాలు, జామ్‌లు, జెల్లీలు, సాస్‌లు, ఎండు పళ్లను ఈ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు. ద్రాక్ష సారాయి తయారీ కూడా పెద్ద పరిశ్రమగా రూపొందింది. ఫ్రాన్స్‌లోని రైన్ లోయ, ఇటలీలోని గెరొన్ బేసిన్ వీటికి ప్రసిద్ధి.

మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్

పారిశ్రామిక విప్లవం తర్వాత ఐరోపా, ఉత్తర అమెరికాల్లో విస్తృత నగరీకరణ జరిగింది. విస్తరిస్తున్న మెట్రోపాలిటన్ నగరాల్లో తాజా కూరగాయలు, పండ్లకు గిరాకీ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో వాయవ్య ఐరోపా, ఉత్తర అమెరికాల్లోని పెద్ద పెద్ద నగరాల సమీపంలో పండ్లు, కూరగాయల సాగు వాణిజ్య పద్ధతిలో ప్రారంభమైంది. రోజూ ఉదయాన్నే ఈ

వ్యవసాయ ప్రాంతాల నుంచి నగరాలకు భారీ ట్రక్కుల ద్వారా తాజా పండ్లు, కూరగాయల రవాణా జరుగుతుంది. అందువల్ల దీన్ని ట్రక్ ఫార్మింగ్ (మార్కెట్ గార్డెనింగ్) అని పిలుస్తారు. ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని నగర జనాభాకు కావాల్సిన తాజా పండ్లు, కూరగాయలను టాస్మానియా దీవి నుంచి బాస్ జలసంధి ద్వారా మర పడవలపై సరఫరా చేస్తారు. అందువల్ల టాస్మానియా దీవిని 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు.

ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్

ఎస్టేట్ ఫార్మింగ్ పద్ధతుల్లో ఉద్యానవన తోటల పెంపకాన్ని వలస పాలనా కాలంలో వలస రాజ్యాలు ప్రారంభించాయి. ఉష్ణమండల ఆయనరేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాల్లోని దేశాల్లో వలస పాలకులు కాఫీ, తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, చెరకు, అరటి పంటలను ఎస్టేట్‌ల రూపంలో సాగు చేయడం ప్రారంభించారు. ఈ రకమైన సాగులో వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా నడిపిస్తారు. ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే యాజమాన్యం కేవలం విధాన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటుంది. సాగు నిర్వహణ కోసం సుశిక్షితులైన, సాంకేతిక అర్హతలు ఉన్న వారిని 'మేనేజర్లు'గా వేతన ప్రాతిపదికన నియమిస్తారు. శ్రామికులను దినసరి లేదా రోజువారీ కూలీ ప్రాతి పదికన వినియోగిస్తారు. లాభాలను ఆశించి ఉత్ప త్తులను ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. ఇప్పటికీ ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కన్పిస్తాయి.

వాణిజ్య పాడి మండలం

వాయవ్య ఐరోపాలోని సమశీతోష్ణ వాతావరణంలో పచ్చిక బయళ్లు విస్తారంగా పెరుగుతాయి. ఈ పరిస్థితులు పశుపోషణకు అనుకూలం, జెర్సీ, ఆరిషైర్, స్విస్‌బ్రౌన్, ఆబర్డన్, హార్ట్‌ఫోర్డ్, ఫ్లెచ్‌విక్ లాంటి మేలి రకం పాడి పశువుల జాతులకు ఈ ప్రాంతాలు నిలయాలు. పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టి ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని వాడుతూ పాడి పశువులను పెంచుతారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా పచ్చిక బయళ్లను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలోని యూకే, డెన్మార్క్, బెల్జియం, నెదర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్ దేశాల నుంచి పెద్ద మొత్తాల్లో పాడి వస్తువులు ఉత్తర అమెరికా, యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవు తున్నాయి. డెన్మార్క్‌ను Butter House of Europe గా అభివర్ణిస్తారు. కొపెన్‌హెగెన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ విమానాల ద్వారా వెన్నను ప్రపంచం నలుమూలలకు ఎగుమతి చేస్తారు.

వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)

పశ్చిమ యూఎస్‌ఏలోని రాకీ పర్వత ప్రాంతం, అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వే దేశాలు రాంచింగ్ (Ranching) మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో మాంసం ఉత్పత్తి కోసం పశువులను పెంచుతారు. పశుపోషణ కోసం ప్రత్యేకంగా పచ్చిక బయళ్లను నిర్వహిస్తారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా మొక్కజొన్నను పండిస్తారు. బాగా లావెక్కిన పశువులను యాంత్రిక వధ శాలల్లో సంహరించి, మాంసాన్ని యంత్రాల సహాయంతో శుద్ధి చేసి ప్యాక్ చేస్తారు. మాంసం శుద్ధి, ప్యాకింగ్ ఒక పెద్ద పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వేల నుంచి శుద్ధి చేసిన మాంసాన్ని యూఎస్‌ఏకు ఎగుమతి చేస్తారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కూడా రాంచింగ్ అమల్లో ఉంది.

సంచార పశు పోషణ

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల నుంచి కొన్ని ఆదిమ తెగల సమాజాల్లో ఇప్పటికీ సంచార పశుపోషణ, సంచార వ్యవసాయం అమల్లో ఉంది. ఈశాన్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని 'జూమింగ్'గా పిలుస్తారు. మధ్య భారతదేశంలో 'బేవార్' అని, కేరళలో 'పొనమ్' అని పిలుస్తున్నారు. సంచార వ్యవసాయం బ్రెజిల్ (రోకా), మలేషియా (లడాంగ్) లలో కూడా అమల్లో ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉండే వ్యవసాయ విధానం ఏది?
   1) సాంద్ర జీవనాధార వ్యవసాయం
   2) విస్తార వాణిజ్య వ్యవసాయం
   3) మిశ్రమ వ్యవసాయం 4) పైవేవీ కాదు
2. Butter House of Europeగా పేరొందిన దేశం ఏది?
   1) ఆస్ట్రేలియా 2) చిలీ
   3) దక్షిణాఫ్రికా 4) డెన్మార్క్
3. పండ్ల తోటల సాగుకు అనువైన శీతోష్ణస్థితి ఉన్న ప్రాంతం ఏది?
   1) వాయవ్య ఐరోపా 2) పశ్చిమ ఆఫ్రికా
   3) మధ్యధరా ప్రాంతం4) తూర్పు ఐరోపా
4. 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా పేరొందిన ప్రాంతం ఏది?
   1) టాస్మానియా 2) న్యూసౌత్‌వేల్స్
   3) క్వీన్స్‌లాండ్ 4) విక్టోరియా
5. మధ్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
   1) జూమింగ్ 2) పొనమ్
   3) బేవార్ 4) ఏదీకాదు
6. కింద సూచించిన పంటల్లో చల్లటి వాతావరణంలో పండించే పంట ఏది?
   1) కొబ్బరి 2) రబ్బరు
   3) తేయాకు 4) చెరకు
7. దేశంలో వాణిజ్య పద్ధతుల్లో అత్యధికంగా పూలను ఎగుమతి చేస్తోన్న రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) తమిళనాడు
   3) తెలంగాణ 4) కర్ణాటక
8. కింది వాటిలో రాంచింగ్ మండలంలో ఉన్న దేశం ఏది?
   1) ఉరుగ్వే 2) కెనడా
   3) లాత్వియా 4) శ్రీలంక
9. ఏ దేశాన్ని ఆదర్శంగా తీసుకొని భారత్‌లో సహకార రంగంలో పాడి సహకార సంఘాలను స్థాపించారు?
   1) బ్రెజిల్ 2) నెదర్లాండ్స్
   3) ఇజ్రాయెల్ 4) డెన్మార్క్

సమాధానాలు

1) 1 2) 4 3) 3 4) 1
5) 3 6) 3 7) 4 8) 1
9) 4

దేశం	ఎస్టేట్లు	పెట్టుబడి పెట్టిన దేశం
శ్రీలంక	తేయాకు	బ్రిటన్
మలేషియా	రబ్బరు	బ్రిటన్
ఇండోనేషియా	రబ్బరు, చెరకు,	డచ్
దక్షిణాఫ్రికా	చెరకు	డచ్, బ్రిటన్
బ్రెజిల్	కాఫీ	పోర్చుగల్
ఫిలిప్పీన్స్	కొబ్బరి	యూఎస్‌ఏ
కరేబియన్ దీవులు	చెరకు, అరటి	యూఎస్‌ఏ
పశ్చిమ ఆఫ్రికా	కొకురా	ఫ్రాన్స్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఎండీసీ లిమిటెడ్‌లో 179 అప్రెంటిస్‌లు

దంతెవాడ(ఛత్తీస్‌గఢ్)లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎండీసీ), బైలడిల ఐరన్ ఓర్ మైన్‌లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 179.
» **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్‌లు-130, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-16, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు-13.
» **విభాగాలు:** సీవోపీఏ, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, మెకానిక్(డీజిల్), కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఇన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 08.05.2025, 09.05.2025, 10.05.2025, 11.05.2025, 12.05.2025, 13.05.2025, 15.05.2025, 16.05.2025, 17.05.2025, 18.05.2025.
» **ఇంటర్వ్యూ వేదిక:** ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, బీఐవోఎం, బచేలి కాంప్లెక్స్, దంతెవాడ, ఛత్తీస్‌గఢ్.
» **దరఖాస్తు విధానం:** ట్రేడ్/ గ్రాడ్యుయేట్/ టెక్నికల్ అప్రెంటిస్ అభ్యర్థులు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://www.nmdc.co.in/

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీలో మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలో ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్(కంపెనీ అఫైర్స్)-01, అసిస్టెంట్ మేనేజర్(కంపెనీ అఫైర్స్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐసీఎస్ఐలో సభ్యత్వంతో పాటు ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.04.2025 నాటికి మేనేజర్‌కు 37 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 30 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జేజీఎం/ హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.05.2025.
» **వెబ్‌సైట్:** https://ircon.org/

చౌమొహల్లా ప్యాలెస్ నిర్మాణాన్ని పూర్తి చేసిందెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాన్యుమెంట్స్ ఆఫ్ అసఫ్ జాహీ పీరియడ్

అసఫ్ జాహీలు 17వ శతాబ్దంలో మధ్యాసియా ప్రాంతం నుంచి భారతదేశానికి వచ్చి మొగల్ సామ్రాజ్యంలో ఉన్నత పదవులు అలంకరించారు. కుతుబ్‌షాహీల పతనం తర్వాత 1687–1724 వరకు హైదరాబాద్ నగరం మొగలుల ఆధీనంలో ఉంది. మొగల్ గవర్నర్ ఔరంగబాద్ నుంచి పరిపాలన చేపట్టాడు. చార్మినార్ వద్ద కుతుబ్‌షాహీలు నిర్మించిన అనేక కట్టడాలను మొగల్ సైన్యం నాశనం చేసింది. మరాఠాల దాడుల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు మొగలులు 1724లో నగరం చుట్టూ గోడల నిర్మాణాన్ని ప్రారంభించారు. మొగల్ గవర్నరైన మీర్ ఖమ్రుద్దీన్ నిజాం ఉల్ ముల్క్ 1724లో హైదరాబాద్‌లో 'అసఫ్‌జా' వంశాన్ని స్థాపించాడు. అసఫ్‌జాల నిర్మాణాలు హైదరాబాద్ నగర రక్షణ గోడలతోనే ప్రారంభమయ్యాయి. మీర్ ఖమ్రుద్దీన్ నిజాం-ఉల్-ముల్క్ ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్ రాజ్యాన్ని పరిపాలించాడు. 1740 నాటికి హైదరాబాద్ చుట్టూ రక్షణ గోడల నిర్మాణం పూర్తైంది. 1908లో మూసీ నదికి వచ్చిన వరదల వల్ల మొదటిసారిగా రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కొన్ని ద్వారాలు మాత్రమే ఉండగా, అవి కూడా అవసాన దశలో ఉన్నాయి.

డాబిర్‌పుర ద్వారం

హైదరాబాద్ చుట్టూ 17 ద్వారాలను నిర్మించారు. అందులో ముఖ్యమైన డాబిర్‌పుర ద్వారాన్ని 1724–40 మధ్య కాలంలో నిర్మించారు. హైదరాబాద్ రాజ్యంలోని పండితుల్లో ఒకరైన అబుస్ సమద్ డాబిర్-ఉల్-ముల్క్ పేరును ఈ ద్వారానికి పెట్టారు. 1750 నాటికి హైదరాబాద్ నగరం 2.25 లక్షల జనాభాతో దేశంలోనే ఎక్కువ జనాభా ఉన్న నగరంగా ఆవిర్భవించింది.

1763 తర్వాత అసఫ్ జాహీల కట్టడాల నిర్మాణం ఊపందుకుంది. అసఫ్ జాహీల కాలంలో నిర్మించిన కట్టడాల్లో పాయెగా సమాధులు, సైదానిమా సమాధి, చౌమొహల్లా ప్యాలెస్, పురానా హవేలి, బేగం బజార్, రేమండ్ సమాధి, గన్‌ఫౌండ్రి, బ్రిటిష్ రాజప్రతినిధి కోట, హైకోర్టు భవనం, ఆర్ట్స్ కాలేజీ భవనం, దివాన్ దేవిడీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి భవనం ముఖ్యమైనవి.

1748లో మీర్ ఖమ్రుద్దీన్ అసఫ్‌జా లాడ్ బజార్‌లో షాహీ జీలుఖానా ద్వారాన్ని నిర్మించాడు. ఈ నిర్మాణంలో రాజస్థానీ శైలిని వాడి పందిళ్లు, కిటికీలను నిర్మించారు. మలి మొగలుల శైలిలో తోరణాలు, ముఖద్వారాన్ని నిర్మించారు. 1724-40 మధ్య కాలంలో నిర్మించిన హైదరాబాద్ నగర కోటల్లో భాగంగా అలియాబాద్ సరాయిని మొదటి అసఫ్‌జా నిర్మించాడు. పాత నగర రక్షణ కోట భాగాలను ఇప్పటికీ అలియాబాద్ పరిసర ప్రాంతాల్లో చూడవచ్చు.

రెండో అసఫ్‌జా కాలంలోని నిర్మాణాలు

1795లో మన్సీ రేమండ్ సహాయంతో ఫిరంగుల తయారీ పరిశ్రమను గన్‌ఫౌండ్రి పేరుతో అబిడ్స్ వద్ద నిజాం అలీఖాన్ నిర్మించాడు. గన్‌ఫౌండ్రి నిర్మాణంలో ఇటుకలు, మోర్టార్‌ను వాడారు.

మన్సీ రేమండ్ సమాధి

రెండో నిజాం రాజు నిజాం అలీఖాన్ సైన్యంలో ముఖ్యమైన ఫ్రెంచ్ అధికారి మన్సీ రేమండ్. ప్రజలు ఇతణ్ని ముసారాముడని పిలిచేవారు. ఇతడి పేరు మీద ముసారాంబాగ్ నిర్మాణం జరిగింది. 1798లో మన్సీ రేమండ్ మరణించాడు. ఇతడి సమాధిని యురోపియన్ శైలిలో 28 పిల్లర్లతో ముసారాంబాగ్ వద్ద నిర్మించారు. ఈ నిర్మాణంలో ఊదారంగు గ్రానైట్ రాయిని వాడారు.

పాయెగా (పాయిగా) సమాధులు

వీటి నిర్మాణాన్ని 1786లో ప్రారంభించారు. పాయిగా సమాధులను షమ్స్-ఉల్-ఉమ్రా సమాధులని కూడా అంటారు. హైదరాబాద్ రాజ్యంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులు పాయెగాలు. నిజాం అలీఖాన్ కాలంలో 1760 నుంచి 1803 వరకు షమ్స్-ఉల్-ఉమ్రా సర్వసైన్యాధ్యక్షుడిగా పనిచేశాడు. పాయెగా సమాధుల నిర్మాణంలో మొగల్, మూరిష్ శైలులను వాడారు. ఈ సమాధుల నిర్మాణంలో సున్నం, మోర్టార్‌ను ఉపయోగించారు. ఈ సమాధుల్లో రేఖాగణిత చిత్రాలు, పూలమొక్కల డిజైన్లు, పందిరి నిర్మాణాలు చూడవచ్చు.

పురానా హవేలి

రెండో నిజాం కాలంలో పురానా హవేలి నిర్మాణం ప్రారంభమైంది. పురానా హవేలి ప్రాంతాన్ని రుకును-ఉద్-దౌలా నుంచి నిజాం అలీ తీసుకొని తన కుమారుడైన సికిందర్ జా కోసం హవేలి (అంతఃపురం)ని నిర్మించాడు. ఈ హవేలిలోని ప్రధాన భవనాన్ని 18వ శతాబ్దం నాటి యురోపియన్ శైలిలో నిర్మించారు. పురానా హవేలి



U ఆకారంలో ఉంటుంది. ప్రధాన భవనానికి రెండు వైపులా దీర్ఘచతురస్రాకారంలో ఒకదానికొకటి సమాంతరంగా ఈ భవనాలను నిర్మించారు. ఈ హవేలిలో ప్రపంచంలోనే అతిపెద్ద దుస్తుల అల్మారాను ఏర్పాటు చేశారు. సికిందర్ జా కొన్ని రోజులు ఇక్కడ నివసించి తర్వాత కిల్వత్ మహల్‌కు మారాడు. సికందర్ జా ఈ హవేలిని వదిలి పెట్టడం వల్ల పురానా హవేలి అని పేరొచ్చింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ పురానా హవేలిలో మ్యూజియంను ఏర్పాటు చేశాడు. పురానా హవేలిలోని అద్దాల భవనం చీని ఖానా (చైనా నుంచి తెచ్చిన అద్దాలతో నిర్మించిన భవనం) చెప్పుకోదగింది.

సికిందర్ జా (1803-1829) కాలంలోని నిర్మాణాలు

నిజాం రాజు సైన్య సహకార సంధిపై సంతకం చేసిన తర్వాత బ్రిటిషర్లు హైదరాబాద్‌లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ రాజప్రతినిధి అధికార నివాసాన్ని సుల్తాన్ బజార్‌లో నిర్మించారు. 1803లో జాన్ శామ్యూల్ రస్సెల్ రెసిడెన్సీ భవన డిజైన్ (ప్రణాళిక)ను రూపొందించాడు. 1803-04లో రెసిడెన్సీ భవన నిర్మాణం పూర్తైంది. ఆ సమయంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ రాజప్రతినిధిగా జేమ్స్ అకిలీస్ కిర్క్‌పాట్రిక్ ఉన్నాడు. ఈ నిర్మాణంలో యురోపియన్ శైలి కన్పిస్తుంది. ఈ భవనంలోని ప్రధాన కేంద్ర బ్లాక్‌ను జార్జియన్ శైలిలో నిర్మించారు. ఈ శైలిని అమెరికా అధ్యక్ష భవనమైన శ్వేతభవనంలో చూడవచ్చు. బ్రిటిష్ రాజప్రతినిధి నివసించే కోట ప్రాంతం వల్ల దానికి కోఠి అనే పేరొచ్చింది. ప్రస్తుతం ఈ భవనంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉమెన్స్ కాలేజీని నిర్వహిస్తున్నారు. 1803-29 మధ్య కాలంలో సికిందర్ జా వద్ద మిలటరీ అధికారిగా పనిచేసిన జామ్ సింగ్ కార్వాన్‌లో రాజస్థానీ శైలిలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

నాసిరుద్దౌలా (1829-57) కాలంలో నిర్మాణాలు

1839లో చాదర్‌ఘాట్ వద్ద మూసీనదిపై వంతెన నిర్మించారు. 1840-50 మధ్య కాలంలో సికింద్రాబాద్‌లో సెయింట్ మేరీ క్యాథడల్‌ను డేనియల్ మర్ఫి నిర్మించాడు. 1845లో హైదరాబాద్ రాజ్య పేష్కర్ రాజా చందులాల్ ఆల్వాల్ ప్రాంతంలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

భగవాన్ దాస్ గార్డెన్

భగవాన్ దాస్ గుజరాత్‌కు చెందిన వైశ్యుడు. ఇతడు కార్వాన్ వద్ద భగవాన్ దాస్ గార్డెన్ పెవిలియన్ నిర్మించాడు. రెండు అంతస్తుల ఈ భవనంలో ఆర్కేడ్ వరండాలు, బాల్కనీలను టిప్పు ప్యాలెస్ తరహాలో నిర్మించారు. ఈ గార్డెన్‌లో మొగల్, గుజరాతీ శైలిలో మేలు రకం టేకుతో చెక్క స్తంభాలు, పందిళ్లు, కిటికీలను నిర్మించారు.

అఫ్జల్-ఉద్-దౌలా కాలంలో నిర్మాణాలు (1857-69)

1857-61 మధ్య నయాపూల్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మించారు.

చౌమొహల్లా ప్యాలెస్

పర్షియా భాషలో చౌ అంటే నాలుగు అని అర్థం. అరబిక్ భాషలో మొహల్లా అంటే మహల్. చౌమొహల్లా అంటే నాలుగు మహల్‌లు ఉన్న ప్రాంతమని అర్థం. 1750లో సలాబత్‌జంగ్ చౌమొహల్లా ప్యాలెస్‌కు పునాది వేశాడు. 1869లో అఫ్జల్‌ద్దౌలా బహదూర్ చౌమొహల్లా నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని షా మహల్ తరహా లో చౌమొహల్లా ప్యాలెస్‌ను నిర్మించారు. ఈ ప్యాలె స్‌లో రెండు ప్రాంగణాలు ఉన్నాయి. ఉత్తర, దక్షిణ ప్రాంగణాల్లో సొగసైన రాజభవనాలు, గొప్ప రాజ దర్బారు హాలు, ఫౌంటెన్లు, తోటలు ఉన్నాయి. ఉత్తర ప్రాంగణంలో బారా ఇమామ్ ఉంది. ఇందులో తూర్పువైపు పొడవైన కారిడార్, దాని పక్కనే విశాలమైన గదులు ఉన్నాయి. గతంలో పరిపాలన కోసం ఈ గదులను ఉపయోగించారు. దక్షిణ ప్రాంగణంలో నాలుగు మహల్‌లు ఉన్నాయి. అవి అఫ్జల్ మహల్, మహతబ్ మహల్, తన్యిత్ మహల్, అఫ్తాబ్ మహల్. వీటిలో అఫ్తాబ్ మహల్ అందమైంది. ఈ మహల్ ఉన్న గడియా రాన్ని కిల్వత్ గడియారం అంటారు. చౌమొహల్లాలోని దర్బారు హాల్లో అతి ముఖ్యమైన అధికారులను నిజాం రాజులు కలుసుకునేవారు. ఈ దర్బా రులో పురాతన రాత ప్రతులు, పుస్తకాలను ఉంచారు. ఆరో నిజాం గౌర వార్థం రోషన్ మహల్‌ను ఉత్తర ప్రాంగణంలో నిర్మించారు. కిల్వత్ మహల్‌లోని అతిగొప్ప నిర్మాణం గ్రాండ్ దర్బారు హాలు. ఇందులో మొగల్ శైలిలో గుమ్మటాలు (డోమ్‌లు), తోరణాలు నిర్మించారు. గోడలను పర్షియన్ శైలిలో అలంకరించారు. గ్రాండ్ దర్బారులో నిజాం రాజు సింహాసనం తక్త్-ఇ-నిషాన్‌ను ఉంచారు. దర్బారు హాలు ఫ్లోర్ అంతటినీ స్వచ్ఛమైన పాలరాయితో నిర్మించారు. 19 బెల్జియన్ క్రిస్టల్ షాండ్లియర్‌లను గ్రాండ్ దర్బారులో ఏర్పాటు చేశారు. నిజాం రాజు లు తమ రాజకీయ, మత సమావేశాలు, పండుగలను గ్రాండ్ దర్బారులో నిర్వహించేవారు. 1906లో వేల్స్ రాకుమారుడు భారత్ వచ్చినప్పుడు అతడి గౌరవార్థం గ్రాండ్ దర్బారులో విందు ఏర్పాటు చేశారు.

మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911) కాలంలో నిర్మాణాలు

1874లో తొలి రైల్వేలైన్‌ను హైదరాబాద్ నుంచి వాడి వరకు బ్రాడ్‌గేజ్ నిర్మించారు. 1886లో బ్రిటిషర్లు చార్మినార్‌ను రక్షించాల్సిన కట్టడాల జాబితాలో చేర్చారు.

హజ్రత్ సైదానిమా సాహెబా సమాధి

మీర్ మహబూబ్ అలీఖాన్ ప్రభుత్వంలో ఉన్నతాధికారి అబ్దుల్ హక్ దిలేర్ జంగ్ తన తల్లి సైదానిమా సాహెబా మరణానంతరం హుస్సేన్ సాగర్ వద్ద ఆమె సమాధి నిర్మించారు. ఈ సమాధిని రెండు అంతస్తులుగా నిర్మించారు. గ్రాండ్ ఫ్లోర్‌లోని తోరణాలు, అలంకరణలు మొగల్ శైలిలో ఉన్నాయి. మొదటి అంతస్తు, గుమ్మటాన్ని కుతుబ్ షాహీల వాస్తుకళ లేదా శైలిలో నిర్మించారు. ఛాత్తాబజార్‌లో సాలార్‌జంగ్-1 పేరు మీద దివాన్ దేవిడిని నిర్మించారు. ఇందులో మొగల్ శైలిలో రెండు ముఖద్వారాలు, అర్ధచంద్రాకార తోరణాలను నిర్మించారు.

అసెంబ్లీ భవనం

మీర్ మహబూబ్ అలీఖాన్ 40వ జన్మదినాన్ని పురస్కరించుకొని 1905లో టౌన్‌హాల్ నిర్మాణాన్ని ప్రారంభించి 1923లో పూర్తి చేశారు. దీన్ని పర్షియన్, రాజస్థానీ శైలిలో నిర్మించారు. తర్వాతి కాలంలో నిజాం ప్రభుత్వం ఈ హాలును శాసనసభగా మార్చింది.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-1948) కాలంలో నిర్మాణాలు

1866లో రాజ కుటుంబీకులు, భూస్వాముల కోసం అఫ్జల్‌గంజ్‌లో 30 పడకల ఆసుపత్రిని నిర్మించారు. 1908లో మూసీనదికి వచ్చిన వరదల వల్ల ఈ ఆసుపత్రి ధ్వంసమైంది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ రూ. 20 లక్షల వ్యయంతో నూతన ఆసుపత్రి భవనాన్ని అఫ్జల్‌గంజ్‌లో నిర్మించాడు. ఆయన పేరుమీద ఈ ఆస్పత్రికి ఉస్మానియా జనరల్ ఆసుపత్రిగా నామకరణం చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని ఇండో-సార్సనిక్ శైలిలో నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి విన్సెంట్ జెరొమ్ ఏస్చ్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశాడు. ఇతడు నగర ఉన్నత పాఠశాల, హైదరాబాద్ రైల్వేస్టేషన్, హైకోర్టు భవనాలను కూడా రూపొందించాడు.

కింగ్ కోఠి ప్యాలెస్

1911లో కమల్ ఖాన్ తన సొంత అవసరాల కోసం సుల్తాన్‌బజార్ ప్రాంతంలో నూతన ప్యాలెస్‌ను నిర్మించాడు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు ఈ ప్యాలెస్ నచ్చింది. దాంతో కమాల్ ఖాన్ వద్ద నుంచి ప్యాలెస్‌ను పొందాడు. ఉస్మాన్ అలీఖాన్ ఒక ఫర్మానా ద్వారా ఆ ప్రాంతానికి కింగ్ కోఠి అని నామకరణం చేశాడు. ఈ ప్యాలెస్‌లో మూడు ప్రధాన భవనాలు ఉన్నాయి. పశ్చిమ భాగంలో ఉన్న భవనాన్ని నజరి బాగ్ అని పిలుస్తారు. ప్రస్తుతం ప్యాలెస్ తూర్పు భాగంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు.

బషీర్‌బాగ్ ప్యాలెస్

పాయెగా వంశానికి చెందిన ఆస్మాన్ జా బషీర్-ఉద్-దౌలా ఫతేమైదాన్ వద్ద బషీర్‌బాగ్ ప్యాలెస్‌ను నిర్మించాడు.

సిటీ కాలేజీ

1895లో మీర్ మహబూబ్ అలీఖాన్, మదరసా దార్-ఉల్-ఉలూమ్ అనే మొదటి సిటీ స్కూల్‌ను ప్రారంభించాడు. తర్వాతి కాలంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ దాన్ని విస్తరించాడు. ప్రస్తుతం ఉన్న సిటీ కాలేజీ భవనానికి ఈ స్కూల్‌ను 1921లో మార్చారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ 16 ఎకరాల స్థలంలో ఇండో-సార్సనిక్ శైలిలో సిటీ కాలేజీని రెండు అంతస్తులుగా నిర్మించాడు.

మొజంజాహీ మార్కెట్

1935లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన రెండో కుమారుడైన మొజంజా పేరు మీద మొజంజాహీ మార్కెట్‌ను నిర్మించాడు. దీన్ని పూర్తిగా రాళ్లతో నిర్మించారు. దీనికి ఒక మూలన మినార్‌ను నిర్మించి, అందులో ఒక గడియారాన్ని పొందుపర్చారు.


A computer-intensive problem runs on..



Bank Exams

COMPUTER AWARENESS

CLASSIFICATION OF COMPUTERS



DIGITAL COMPUTER

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.

(i) CLASSIFICATION BASED ON PURPOSE:

General purpose computers: These are designed to perform a range of tasks. They have the ability to store numerous programs, but lack in speed and efficiency.

Specific purpose computers: These are designed to handle a specific problem or to perform a specific task. A set of instructions is built into the machine.

(ii) CLASSIFICATION BASED ON SIZE AND PERFORMANCE WISE:

EMBEDDED COMPUTERS

It is a computer system with a dedicated function within a larger mechanical or electrical system, often with real-time computing constraints. Embedded systems are commonly found in consumer, cooking, industrial, automotive, medical, commercial and military applications such as microwave ovens, washing machines and dishwashers, include embedded systems to provide flexibility, efficiency and features.

MICRO COMPUTER OR PERSONAL COMPUTER

- **Desktop Computer:** a personal or micro-mini computer sufficient to fit on a desk.
- **Laptop Computer:** a portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.
- **Palmtop Computer/ Digital Diary /Notebook /PDAs:** a hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.
- **Workstations**

A terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a "server" or "mainframe."

- **Mini Computer**

It is a midsize computer in size and power, minicomputers lie between workstations and mainframes in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.

- **Mainframe Computer**

A very large and expensive computer capable of supporting hundreds, or even thousands, of users simultaneously. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. These are mainly used servers in banks.

- **Super Computer**

The fastest and most powerful type of computer Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations, nuclear energy research, and petroleum exploration.

ANALOG COMPUTER

An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical, or hydraulic quantities to model the problem being solved

Hybrid Computer (Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

MODEL BITS

1. The product of two binary numbers (1011) and (1001) is____
   1) 1011001 2) 1010100
   3) 1100011 4) 100110
   5) None of these
2. MS -DOS is usually supplied on a
   1) Hard disk
   2) floppy disk or diskettes
   3) CD ROM 4) Cartridge tape
   5) None of these
3. When a key is pressed on the keyboard, which standard is used for converting the keystroke into the corresponding bits?
   1) EBCDIC 2) ASCII
   3) ANSI 4) ISO
   5) None of these
4. A thing present in real world in physical form is called ____
   1) DBMS 2) Keywords
   3) Modulation 4) Entity
   5) None of these
5. Programming language built into user programs such as Word and Excel are known as____?
   1) 4GLs
   2) Visual programming languages
   3) Object-oriented languages
   4) Macro languages
   5) None of these
6. A program that generally has more user-friendly interface than a DBMS is called a ____?
   1) form 2) repository
   3) back end 4) front end
   5) None of these
7. Antivirus software is an example of____
   1) a security utility
   2) an operating system
   3) business software
   4) an office suite
   5) None of these
8. System software is the set of programs that enables your computer's hardware devices and ____ software to work together.
   1) application 2) processing
   3) utility 4) management
   5) None of these
9. In a ring topology, the computer in possession of the______ can trasmit data.
   1) packet 2) token
   3) access method 4) data
   5) None of these
10. A computer-intensive problem runs on a ____.
    1) supercomputer
    2) mainframe 3) server
    4) super PC 5) None of these
11. The term _____ designates equipment that might be added to a computer system to enhance its functionality.
    1) peripheral device
    2) system add-one
    3) disk pack
    4) digital device
    5) None of these
12. A collection of interrelated files in a computer is a _____.
    1) file manager 2) field
    3) database 4) record
    5) None of these
13. When installing _____, the user must copy and usually decompress program files from a CD-ROM or other medium to the hard disk.
    1) programming software
    2) applications software
    3) applications hardware
    4) system hardware
    5) None of these
14. ____is the ability of an operating system to control the activities of multiple programs at the same time.
    1) Multitasking 2) Streamlining
    3) Multiuser 4) Simulation
    5) None of these
15. Which of the following computer language is a mathematically oriented languages used for scientific problems?
    1) FORTRAN 2) COBOL
    3) LISP 4) PROLOG
    5) APPLE
16. Which of the following terms is just the connection of personal networks that can be joined together?
    1) Virtual private network
    2) Internet 3) Intranet
    4) Extranet 5) None of these
17. For large network which topology is used?
    1) Star 2) Ring
    3) Bus
    4) Mesh 5) None of these
18. A special high-speed line used by large corporations to support digital communications is known as:
    1) Satellite/ Air connection service lines
    2) Cable modems
    3) Digital subscriber lines
    4) T1, T2, T3 and T4 lines
    5) None of the above
19. A language that refers to the way people think mathematically is called as ____
    1) Functional language
    2) Cross-platform language
    3) Event driven programming language
    4) Object oriented language
    5) None of these
20. When you are typing the text in a document, you would need to hit the enter key at the end of every ______.
    1) line 2) sentence
    3) paragraph 4) word 5) file
21. _____ displays each slide of the PPT as a thumbnail and is used to re-arrange them.
    1) Slide Show 2) Slide Display
    3) Slide Design
    4) Slide Layout
    5) Slide Sorter
22. If you want to find the Paste Special option, you would use the Clipboard group on the tab of PowerPoint _____
    1) Home
    2) Slideshow
    3) Page Layout
    4) Design
    5) Insert
23. In a pull down menu if you see that a command appears faded, it means that _____
    1) the command is not applicable to this document
    2) the command is not accessible at the moment
    3) there are no keystrokes equivalent to those commands.
    4) None of these
    5) All of these

KEY

1) 3	2) 2	3) 3	4) 4	5) 2
6) 4	7) 1	8) 1	9) 2	10) 1
11) 1	12) 3	13) 2	14) 1	15) 1
16) 3	17) 4	18) 4	19) 1	20) 3
21) 5	22) 1	23) 2		